మంగళవారం
29•1•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 214
• పేజీలు : 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



మంచుదుప్పట్లో రాచకొండ

రంగారెడ్డి, యాదాద్రి జిల్లాల పరిధిలోని రాచకొండ ప్రాంతం లోయలు, సెలయేర్లు, ఎత్తయిన గుట్టలు, పచ్చదనంతో చూడముచ్చటగా ఉంటుంది. వీటికి పొగమంచు తోడైతే ఇంకేముంది..! చూడటానికి రెండు కండ్లూ చాలవు. ఊటీని తలపిస్తున్న ఈ అపురూప దృశ్యం సోమవారం ఉదయం ఆవిష్కృతమైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి చలిగాలులు తోడవటంతో ఈ ప్రాంతంలో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. ఇదే ఇప్పుడు పర్యాటకులకు ఆనందాన్ని పంచుతున్నది. అత్యంత సమీపానికి వెళ్తేగాని గుట్టలు కనిపించనంతగా మంచుదుప్పటి కప్పేస్తున్నది. నెమళ్లు పురివిప్పి ఆడుతుండగా, పక్షుల కువకువలు చెవులకు ఇంపుగా అనిపిస్తున్నాయి. ఇవన్నీ రాచకొండ గుట్టల్లోని చారిత్రక కట్టడాలకు కొత్త అందాలను తెచ్చిపెట్టగా, మంచాల, ఆరుట్ల, చాంద్‌ఖాన్‌గూడ, తిప్పాయిగూడ లోయ ప్రాంతాలు కనువిందు చేస్తున్నాయి. యువత కేరింతలు కొడుతూ ఈ ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నది.

– హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ

• పంచాయతీ పోరు



సోమవారం యాదగిరిగుట్ట మండలం మాసాయిపేటలో ఎమ్మెల్యే గొంగిడి సునీత నిర్వహించిన పంచాయతీ ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న గ్రామస్థులు

రేపే తుదివిడుత

గ్రామాల్లో ముగిసిన ప్రచారం

మూడో విడుతలో ఎన్నికలు జరుగాల్సినవి **4116**

ఏకగ్రీవమైన పంచాయతీలు **577**

నామినేషన్లు దాఖలుకానివి **10**

రేపు పోలింగ్ జరిగేవి **3,529**

పల్లెల్లో కొనసాగిన తనిఖీలు

రూ.5.79 లక్షల విలువైన మద్యం స్వాధీనం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు తుది దశకు చేరుకున్నాయి. బుధవారం జరుగనున్న మూడో విడుత ఎన్నికలకు ప్రచారం సోమవారం ముగిసింది. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానున్నది. పోలింగ్‌కు 44 గంటల ముందు ప్రచారాన్ని నిర్వహించరాదని, కరపత్రాల పంపిణీ చేయరాదని ఎన్నికలసంఘం ఆదేశాలివ్వడంతో పంచాయతీ అభ్యర్థులు ప్రచారాన్ని ముగించారు. మూడో విడుత పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ఎన్నికల పరిశీలకులు, ఎన్నికల నియమావళి అధికారుల బృందాలు తనిఖీలు చేపట్టాయి.

3,529 గ్రామాలకు పోలింగ్

మూడోవిడుతలో మొత్తం 4116 గ్రామాల్లో ఎన్నికలు జరుగాల్సి ఉండగా, 577 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మరో 10 గ్రామాల్లో

మిగతా 9వ పేజీలో

పగలే ఇగం!

కొనసాగిన ద్రోణుల ప్రభావం • తగ్గిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు • రాష్ట్రంలో పెరిగిన చలి తీవ్రత

పలుచోట్ల తోడైన చిరుజల్లులు • నిర్మల్‌లో 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత • మరో రెండ్రోజులు ఇదే వాతావరణం



అకాల వర్షానికి రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కొదురుపాకలో నేలకొరిగిన మక్కజొన్న

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ప్రత్యేక ప్రతినిధి/ సిటీబ్యూరో/నిర్మల్ అర్బన్:

గత మూడ్రోజులుగా కారుమబ్బులు కమ్ముకోవడంతో రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గాయి. అకాల వర్షాల జోరు తగ్గినా.. గరిష్ఠ ఉష్ణోగ్రతలు నాలుగు నుంచి ఐదు డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోవడంతో రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. నిర్మల్‌లో పది డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. తూర్పు విదర్భ, దాని పరిసర ప్రాంతాలపై ఏర్పడిన ఉపరితల ద్రోణి, ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక నుంచి తెలంగాణ మీదుగా ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఆది, సోమవారాల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు పడ్డాయి. అల్పపీడన ద్రోణి మంగళవారం పూర్తిగా బలహీనపడుతుందని, బుధవారం నుంచి దీని ప్రభావం ఉండదని, రాష్ట్రంలో పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. అయితే, మంగళ, బుధవారాల్లో ఉదయం దట్టమైన పొగమంచు ఆవరించి ఉంటుందన్నారు. మరోవైపు రాష్ట్రంలో కురిసిన అకాలవర్షాలకు దాదాపు 4వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని అధికారులు ప్రాథమికంగా అంచనావేశారు. అయితే ఈ నష్టం మరింత ఉంటుందని క్షేత్రస్థాయి వార్తలనుబట్టి తెలుస్తున్నది.

వాననీటిలో పంట ఉత్పత్తులు

మిర్చి, కందులు, వేరుశనగ, సోయాబీన్ వంటి పంట ఉత్పత్తులు వర్షపు నీటిలో తడిసిముద్దయ్యాయి. కల్లాలు, మార్కెట్ యార్డులకు వచ్చిన సుమారు 3300 ఎకరాల పంట ఉత్పత్తులు వర్షాలకు దెబ్బతిన్నట్టు అధికారులు గుర్తించారు. అలాగే దాదాపు 700 ఎకరాల్లో చేలల్లోనే ఉన్న పంటకు కూడా నష్టంవాటిల్లినట్టు రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనావేసింది. కరీంనగర్, పెద్దపల్లి, వనపర్తి, రాజన్న-సిరిసిల్ల జిల్లాల్లో నష్టం అధికంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. వరినాట్లు ఇటీవలే పడటంతో ఈ వర్షాలతో పెద్దగా దెబ్బతినలేదు. అయితే మక్కజొన్న పంట మాత్రం దెబ్బతిన్నది. వర్షం తీవ్రతకు లేత కంకులు విరిగిపోయినట్టు అధికారులు గుర్తించారు. వాణిజ్యపంట అయిన మిర్చి కల్లాల్లో తడిసింది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో కొన్నిచోట్ల కల్లాల్లోని మిర్చి.. వర్షపునీటికి కొట్టుకుపోయింది. మార్కెట్ యార్డులలో విక్రయానికి తీసుకువచ్చిన కందులు, వేరుశనగ పంట ఉత్పత్తులు కూడా తడిసిపోయాయి. కొన్నిచోట్ల కంది

మిగతా 9వ పేజీలో

పంటలు ముంచిన వాన

- నాలుగువేల ఎకరాల్లో నష్టం
- వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా
- క్షేత్రస్థాయిలో మరిన్ని ఎకరాల్లో నష్టం!
- తడిసిన మిర్చి, పత్తి, మక్కజొన్న, వేరుశనగ

కంటివెలుగు @ 100 రోజులు

ఇప్పటివరకు 1,38,88,710 మందికి పరీక్షలు

రాష్ట్రంలో 8,382 గ్రామాల్లో వైద్య శిబిరాలు పూర్తి

3



ప్రతిపైసకూ లెక్కుండాలి

రానున్న ఐదేండ్లను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్ ఉండాలి

అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రతి పైసకూ లెక్కుండాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. వచ్చే ఐదేండ్లలో బడ్జెట్ స్వరూప స్వభావాలు ఎలా ఉంటాయన్న అంశాన్ని దృష్టిలో ఉంచుకొని అంచనాలు రూపొందించాలని సూచించారు. శాసనసభలో ప్రవేశపెట్టనున్న మధ్యంతర బడ్జెట్‌పై సీఎం కేసీఆర్ ఆర్థికశాఖ అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. గత తొమ్మిది నెలలుగా రాష్ట్రానికి సొంతపన్నుల ద్వారా వచ్చిన రాబడి, కేంద్రం నుంచి

మిగతా 2వ పేజీలో

కొలువుల జాతర

కొత్త ఏడాదిలో నిరుద్యోగులకు శుభవార్త

- 119 కొత్త బీసీ గురుకులాల్లో నియామకాలు
- 4,322 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ ఆమోదం
- 2019-20 విద్యాసంవత్సరంలో 2,537 పోస్టులు భర్తీ చేయనున్న ప్రభుత్వం
- విడుతలవారీగా మరో 1,785 పోస్టులు భర్తీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:



ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో 2019-20 విద్యా సంవత్సరంలో కొత్తగా ప్రారంభించనున్న 119 మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల విద్యాలయాల్లో(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్) బోధన, బోధనేతర సిబ్బందిని భర్తీ చేసేందుకు 4,322 పోస్టులకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి కే రామకృష్ణారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీటిలో రెగ్యులర్ పోస్టులు 3,717(బోధన సిబ్బంది పోస్టులు 3,689, సంస్థ ప్రధాన కార్యాలయంలో 28), 605 ఔట్‌సోర్సింగ్ పోస్టులు(బోధన సిబ్బంది పోస్టులు 595, సంస్థ ప్రధాన కార్యాలయంలో 10 పోస్టులు) ఉన్నాయి. బోధన సిబ్బంది పోస్టులు మొత్తం 3,689(రెగ్యులర్) ఉండగా, 2019-20 విద్యాసంవత్సరంలో 1,904 పోస్టులను, సంస్థ ప్రధాన కార్యాలయలోని 28 రెగ్యులర్ పోస్టులను భర్తీ చేస్తారు. ఔట్‌సోర్సింగ్‌లో మొత్తం 605 పోస్టులను కూడా ఈ ఏడాదే భర్తీ చేస్తారు. మిగిలిన బోధనా సిబ్బంది పోస్టులను విడుతలవారీగా భర్తీ చేయనున్నట్టు ఉత్తర్వుల్లో

మిగతా 2వ పేజీలో

ఎస్సై పోస్టుల భర్తీకి హైకోర్టు పచ్చజెండా

సింగిల్ జడ్జి బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దుచేసిన ద్విసభ్య ధర్మాసనం

నియామక ప్రక్రియ కొనసాగించేందుకు అనుమతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్‌ఎల్పీఆర్బీ) చేపట్టిన ఎస్సై పోస్టుల భర్తీకి అడ్డంకులు తొలిగిపోయాయి. నియామక ప్రక్రియను నిలిపివేయాలంటూ గతంలో సింగిల్ జడ్జి బెంచ్ జారీచేసిన ఉత్తర్వులను హైకోర్టు సోమవారం రద్దుచేసింది. పోస్టుల భర్తీని కొనసాగించవచ్చని స్పష్టంచేసింది. అభ్యర్థుల మార్కులు అందరికీ తెలిసేలా ప్రచురించాలన్న పిటిషనర్ల విజ్ఞప్తిని తిరస్కరించింది. రాష్ట్ర ప్రభుత్వం 2018 మే 31న 16,925 కానిస్టేబుల్, 1,217 ఎస్సై పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసింది. ప్రిలిమినరీ రాతపరీక్ష నిర్వహించి ఫలితాలు విడుదల చేసింది. ఫిజికల్ టెస్టులకు షెడ్యూల్ సైతం విడుదల చేసింది. అయితే ప్రిలిమినరీ పరీక్షలో ఆరుప్రశ్నలు తప్పుగా ఉన్నాయని, వాటిని తొలిగించాలని పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై సింగిల్ జడ్జి విచారణ చేపట్టి బెంచ్ బుక్‌లెట్ కోడ్-బీలోని ఆరు ప్రశ్నలను

మిగతా 2వ పేజీలో

కృష్ణారావుకు కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం

తెలంగాణ బిడ్డకు అనువాదంలో దక్కిన గౌరవం

ముఖ్యమంత్రి కేసీఆర్ హర్షం



2

ప్రముఖ డోగ్రీ కవయిత్రి పద్మా సచ్‌దేవ్ కవితా సంపుటిని సీనియర్ జర్నలిస్ట్ కృష్ణారావు తెలుగులో 'గుప్పెడు సూర్యుడు – మరికొన్ని కవితలు' పేరుతో అద్భుతంగా అనువదించారని సాహిత్య అకాడమీ ప్రశంసించింది.



4

హైదరాబాద్ ఐఎస్‌బీ భేష్

ఫైనాన్షియల్ టైమ్స్ ర్యాంకింగ్స్‌లో 24వ స్థానం

గతేడాదితో పోల్చితే నాలుగు స్థానాలు మెరుగు

స్టాక్ మార్కెట్ పతనం

బడ్జెట్‌కు ముందు బిగిసిన బేర్స్ పట్టు

సెన్సెక్స్‌కు 369 పాయింట్లు నష్టం

11

కరిగిపోయిన రూ. 1.80 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద



వివరాలు ఆటలో

భారత్ జయకేతనం

న్యూజిలాండ్ గడ్డపై 3-0తో సిరీస్ సొంతం

రాణించిన రోహిత్, కోహ్లీ ▪ మూడో వన్డేలో ఘనవిజయం

మైనార్టీ గురుకులాలు భేష్

- తెలుగు రాష్ట్రాల బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ ఆండ్రూస్ ఫ్లెమింగ్
- బాగ్‌లింగంపల్లిలోని మైనార్టీ గురుకుల పాఠశాల సందర్శన



సోమవారం బాగ్‌లింగంపల్లిలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి కరాటే ఫోజు ఇస్తున్న తెలుగు రాష్ట్రాల బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ అండ్రూస్ ఫ్లెమింగ్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి వేణుగోపాలాచారి, మైనార్టీ గురుకుల పాఠశాల సెక్రటరీ షఫీఉల్లా తదితరులు

రాంనగర్: మైనార్టీ గురుకుల పాఠశాలలు అద్భుతంగా ఉన్నాయని తెలుగు రాష్ట్రాల బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ అండ్రూస్ ఫ్లెమింగ్ అభినందించారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని మైనార్టీ గురుకుల పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కాసేపు విద్యార్థులతో ముచ్చటించారు. బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన కరాటే విన్యాసాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనార్టీ గురుకుల పాఠశాల్లో సౌకర్యాలు చాలా బాగున్నాయన్నారు. గతంలో మైనార్టీ పాఠశాలలను సందర్శించాలని ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్ తనను ఆహ్వానించారని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలలను ఇంత చక్కగా నడిపించడం అందరి సమన్వయంతోనే సాధ్యమన్నారు. విద్యార్థులు కరాటే ప్రదర్శన చూస్తుంటే భవిష్యత్‌లో గొప్ప వారు అయ్యే అవకాశం ఉన్నదని చెప్పారు. సీఎం కేసీఆర్ చదువులకు ఇస్తున్న ప్రాధాన్యం ఆదర్శంగా నిలుస్తున్నదన్నారు. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి వేణుగోపాలాచారి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 500 గురుకులాలను ఏర్పాటుచేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. మైనార్టీ గురుకుల పాఠశాల సెక్రటరీ షఫీఉల్లా మాట్లాడుతూ.. కేసీఆర్ ఆలోచనలకు అనుకూలంగా విద్యార్థులను తీర్చిదిద్దుతామని చెప్పారు. ఇంటర్నేషనల్ నాసా స్పేస్ డెవలప్‌మెంట్ సెమినార్‌లో కూడా తమ విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో బ్రిటిష్ హై కమిషన్ హైదరాబాద్ పొలిటికల్ ఎకానమి అడ్వైజర్ నళిని రఘురాం, మైనార్టీ స్కూల్స్ అధికారులు ఎంఏ రతీఫ్, అంతర్జాతీయ క్రీడాకారిణి సయ్యద్ ఆఫ్ ఫలక్, స్కూల్ ప్రిన్సిపాల్ శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

మూడేండ్లుగా ఒకేచోట ఉన్న ఉద్యోగులను బదిలీ చేయాలి

అధికారులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇవ్వొద్దు

రాష్ట్ర సీఎస్, సీఈవోకు కేంద్ర ఎన్నికల సంఘం లేఖలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: త్వరలో జరుగునున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నియమ నిబంధనలను కచ్చితంగా అమలుచేయాలని, ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీఈవోకు లేఖలు రాసింది. తాజాగా సీఈసీ అన్ని రాష్ట్రాలకు ఎన్నికల్లో అమలు చేయాల్సిన నిబంధనలను వివరిస్తూ లేఖలు రాసింది. ఇందులో పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రభుత్వ అధికారుల బదిలీలు, నియామకాల విషయంలో నిబంధనల ప్రకారంగా స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ఒకేచోట మూడేండ్లకుపైగా పనిచేసిన జిల్లాల్లో అధికారులకు ఎన్నికల విధులు అప్పగించరాదని ఆదేశించింది. సొంత జిల్లాల్లో అధికారులకు పోస్టింగులు ఇవ్వరాదని సూచించింది. 2019 మార్చి 31వరకు ఒకే జిల్లాలో పదవీకాలం మూడేండ్లు పూర్తయిన ఉద్యోగులకు సదరు జిల్లాల్లో పోస్టింగ్ ఇవ్వరాదని లేఖలో పేర్కొన్నది. 2017 మే 31కి ముందు సాధారణ ఎన్నికలు, ఉప ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన జిల్లాల్లో డీఈవోలు, ఆర్వో, ఏఆర్వో, ఎస్ఐలకు తిరిగి పోస్టింగ్ ఇవ్వరాదని ఆదేశించింది. 2019లో లోక్‌సభతోపాటు అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు కూడా సీఈసీ లేఖలు రాసింది.

కేసీఆర్ కిట్ అద్భుతం

- జాతీయ నాణ్యతా ప్రమాణాల తనిఖీ బృందం కితాబు
- కేసీఆర్ కిట్ల పంపిణీపై ఆశ్చర్యం వ్యక్తంచేసిన సభ్యులు
- అవార్డుకు గంగాధర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన బృందం



సోమవారం కరీంనగర్ జిల్లా గంగాధర పీహెచ్‌సీలో కేసీఆర్ కిట్‌ను పరిశీలిస్తున్న జాతీయ నాణ్యతా ప్రమాణాల తనిఖీ బృందం సభ్యులు

గంగాధర: ప్రభుత్వ దవాఖానాల్లో ప్రసవాల సంఖ్యను పెంచడానికి, ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం కలగడానికి సీఎం కేసీఆర్ ఆలోచనా విధానం బాగుందని జాతీయ నాణ్యతా ప్రమాణాల తనిఖీ బృందం ప్రశంసించింది. కరీంనగర్ జిల్లా గంగాధర మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేసిన బృందం సభ్యులు కేసీఆర్ కిట్‌ను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రభుత్వ దవాఖానలో ప్రసవం చేసుకున్న వారికి ఆడపిల్లయితే రూ.13 వేలు, మగ పిల్లాడయితే రూ.12 వేలతో 16 రకాల వస్తువులు అందజేస్తున్నట్టు దవాఖాన సిబ్బంది తెలపడంతో సభ్యులు సీఎం కేసీఆర్ ఆలోచనా విధానాన్ని అభినందించారు. ఈ సందర్భంగా తనిఖీ బృందం సభ్యులు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో పురస్కారం అందజేయడానికి కేంద్ర ప్రభుత్వం ఉత్తమ సేవలు అందిస్తున్న పలు ఆరోగ్య కేంద్రాల్లో సౌకర్యాలు, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించడానికి బృందాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇప్పటికే జిల్లా, రాష్ట్ర స్థాయిలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్న ఆరోగ్య కేంద్రంగా గంగాధరలోని దవాఖానా నిలవడంతో జాతీయస్థాయిలో ఉత్తమ పురస్కారం అందించడానికి పరిశీలించినట్లు చెప్పారు. ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్, ల్యాబ్ సౌకర్యం, సాధారణ పరిపాలన, ప్రసవాల గది, దవాఖానలో పరిశుభ్రత వంటి అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. పరిశీలనలో భాగంగా 70 శాతం మార్కులు సాధించిన ఆరోగ్య కేంద్రం జాతీయ స్థాయి ఉత్తమ పురస్కారానికి ఎంపిక అవుతుందని తెలిపారు. ఎపికైన దవాఖానకు జాతీయ నాణ్యతా ప్రమాణాల గుర్తింపు పత్రంతోపాటు, రూ.3 లక్షల చొప్పున మూడేండ్లు దవాఖానలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రోత్సాహకం అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రాంమనోహర్‌రావు, జాతీయ తనిఖీ బృందం సభ్యులు డాక్టర్ హరికుమార్, డాక్టర్ సునీల్ అరోరా, జిల్లా ప్రోగ్రాం అధికారి రవీందర్, జిల్లా నాణ్యతా ప్రమాణాల అధికారి బాలకృష్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారులు సుజాత, ఉషా, సిబ్బంది పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం

- ఫిబ్రవరి 22న ఓటర్ల జాబితా ప్రకటన
- కేంద్ర ఎన్నికల సంఘం వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ ఎస్కే జోషి



సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సునీల్ అరోరా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సీఎస్ ఎస్కే జోషి, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శాసనసభ ఎన్నికల మాదిరిగానే ప్రశాంతంగా పార్లమెంట్ ఎన్నికలను నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉన్నదని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి తెలిపారు. సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రధనాధికారి సునీల్‌అరోరా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్కే జోషి, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్, డీజీపీ మహేందర్ రెడ్డి, ఆదాయపు పన్నుశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్కే జోషి మాట్లాడుతూ పోలింగ్‌స్టేషన్ల వారీగా గట్టి బందోబస్తు ఏర్పాటుచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎన్నికలను సజావుగా నిర్వహిస్తామని హామీఇచ్చారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా పెంచుతామన్నారు. పోలింగ్ స్టేషన్లలో వసతుల కల్పనలో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉన్నదని, అవార్డు గెలుచుకున్నదని గుర్తుచేశారు. ఓటర్ల జాబితాను ఫిబ్రవరి 22న ప్రకటిస్తామన్నారు. సరిహద్దు రాష్ట్రాల అధికారులతో వచ్చే నెల 5న సమావేశం జరుగనున్నదని వివరించారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించడానికి త్వరలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధి బృందం రాష్ట్రంలో పర్యటిస్తుందన్నారు.

స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలు, ప్రస్తుత పంచాయతీ ఎన్నికలను కట్టుదిట్టమైన భద్రత మధ్య ప్రశాంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇదే స్ఫూర్తితో వచ్చే పార్లమెంట్ ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహిస్తామని భరోసా ఇచ్చారు. ఛత్తీస్‌గఢ్, ఏపీ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో నక్సల్స్ ప్రభావంపై ప్రత్యేక దృష్టిసారించామని, ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎన్నికల్లో మద్యం, ధన ప్రభావాన్ని నిరోధించేందుకు తగిన చర్యలు చేపడుతామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రూ.97 కోట్ల నగదును సీజ్ చేశామని, కేసులు విచారణలో ఉన్నాయని చెప్పారు. అదనపు బలగాలను గతంలో మాదిరిగానే పొరుగు రాష్ట్రాల నుంచి 19వేలు, కేంద్రం నుంచి 276 కంపెనీల సిబ్బందిని కేటాయించాలని విన్నవించారు.

ఓటరు నమోదుకు ఫిబ్రవరి 4వరకు గడువు

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఓటరు నమోదుకు వచ్చే నెల 4వ తేదీ వరకు పొడిగించినట్టు తెలిపారు. ఓటర్ల ముసాయిదా సవరణలో ఇప్పటివరకు 16 లక్షల దరఖాస్తులు వచ్చాయన్నారు. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణకు డీఈవోలు, ఆర్వోలు, ఏఆర్వోలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. శాసనసభ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించామని, ఆదే తరహాలో మరింత మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామని వివరించారు. దివ్యాంగుల ఓటింగ్ విషయంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఈ సేవలకు జాతీయ అవార్డు వచ్చిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు సోమేశ్‌కుమార్, రాజీవ్ త్రివేది, అడిషనల్ డీజీ జితేందర్, ఎన్నికల అధికారులు అమ్రపాలి, సత్యవాణి, ఐటీ అధికారి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ఖర్చు 350 కోట్లు

సీఈవో రజత్‌కుమార్ వెల్లడి

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ఖర్చు రూ.350 కోట్ల వరకు అవుతుందని ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల ఖర్చు కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని, ఇందుకు సంబంధించిన అన్ని ఖర్చులపై నివేదికను రూపొందిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో 2.5 లక్షల మంది సిబ్బంది ఎన్నికల నిర్వహణ విధుల్లో పాల్గొంటారని చెప్పారు. సోమవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల ఖర్చులు, ఏర్పాట్లపై కేంద్ర ఎన్నికల సంఘానికి తెలియజేశామని చెప్పారు. పోలీస్ భద్రతకు సంబంధించి ప్రత్యేక బడ్జెట్‌ను కూడా విడుదల చేశామన్నారు. పోలింగ్‌పై సిబ్బందికి శిక్షణనిచ్చి అసెంబ్లీ ఎన్నికల్లో ఎదుర్కొన్న పలు సమస్యలను అధిగమించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రధానంగా 1950 టోల్‌ఫ్రీ నంబర్‌ను మరింత పటిష్ఠంచేసి అన్ని రకాల ఫిర్యాదులను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ పటిష్ఠంగా ఉన్నదన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

నేడు బయ్యారం ఉక్కుపై కీలక భేటీ

- ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా అధ్యక్షతన కమిటీ సమావేశం
- స్థాపనకు అనుకూలతలపై నివేదిక సమర్పించనున్న మెకాన్ సంస్థ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన అధికారుల కమిటీ కీలక సమావేశం మంగళవారం జరుగనుంది. ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా అధ్యక్షతన జరిగే సమావేశంలో మెకాన్ సంస్థ నివేదికను సమర్పించనుంది. పరిశ్రమ స్థాపన, దీర్ఘకాలంలో సుస్థిరత లక్ష్యంగా ఏ ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటుచేయాలో ప్రభుత్వానికి సిఫార్సు చేయనుంది. రాష్ట్ర విభజన చట్టంలో బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటుచేస్తామని కేంద్రం హామీ ఇచ్చి ఐదేండ్లయినా ఎలాంటి స్పందన లేదు. ప్రధానమంత్రికి, అధికారులకు అనేకమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేదు. గత జూన్ 18న ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై అధ్యయనంచేసి నివేదిక ఇవ్వాల్సిందిగా ప్రభుత్వం ఐదుగురు ఉన్నతాధికారులతో కమిటీని నియమించింది. ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా చైర్మన్‌గా ఉన్న కమిటీలో పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ కన్వీనర్‌గా సింగరేణి కాలరీస్ సీఎండీ శ్రీధర్, గనులశాఖ డైరెక్టర్ బీఆర్వీ సుశీల్ కుమార్, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఎండీ మల్సూరులను సభ్యులుగా నియమించారు. ఈ కమిటీకి ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై అధ్యయనానికి అవసరమైన అధికారులు, సంస్థలను కమిటీ సమావేశాలకు ఆహ్వానించే వెసులుబాటును ఉత్తర్వుల్లో కల్పించారు. కమిటీ 12 అంశాలపై నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం సూచించింది. ఇందులో భాగంగా కమిటీ పలుమార్లు భేటీ అయింది. ఈ సమావేశాలకు జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ(ఎన్ఎండీసీ), రైల్‌వికాస్ నిగం లిమిటెడ్ (ఆర్వీఎన్నెల్), మెకాన్ సంస్థ ప్రతినిధులను ఆహ్వానించారు. ఎన్ఎండీసీ సంస్థకు చెందిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బైలడిల్లా నుంచి ఐరన్ ఓర్‌ను తరలించడానికి ప్రత్యేక రైల్వేలైను అవసరముంటుందని గుర్తించారు. దీనిపై అధ్యయనానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్వీఎన్నెల్ సంస్థకు రూ.2 కోట్లను గత సంవత్సరం ఫిబ్రవరి 6న విడుదల చేసింది. ఈ సంస్థ కూడా నివేదికను అధికారులకు సమర్పించనుంది. ఆయా సంస్థలు నివేదికలను మంగళవారం జరిగే సమావేశంలో సమర్పిస్తాయి.

విభజన చట్టంలో కేంద్రం హామీతో వేచిచూసే ఆలోచనలో రాష్ట్రం

వాటిపై కమిటీ చర్చించి పరిశ్రమ స్థాపనకు అనువైన ప్రాంతంపై నిర్ణయం తీసుకొని ఓ నివేదికను కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖకు పంపించనున్నారు. కేంద్రం నియమించిన టాస్క్‌ఫోర్స్‌కు ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయం కీలకంగా మారనుంది. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అనేకమార్లు బహిరంగంగానే ప్రకటించారు. సింగరేణి, టీఎస్ఎండీసీల ద్వారా సంయుక్తంగా ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయనున్నట్లు కేసీఆర్ వెల్లడించారు. కేంద్రం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తుందా లేదా అనేది ఇంకా నిర్ణయాన్ని వెల్లడించనందున రాష్ట్ర ప్రభుత్వం వేచి చూసే ధోరణిలో ఉంది.

ముహూర్తం



సూర్యోదయం: 6.53 గంటలకు



సూర్యాస్తమయం: 6.06 గంటలకు

విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, కృష్ణపక్షం, నవమి మధ్యాహ్నం 2.43 వరకు, తదుపరి దశమి, నక్షత్రం: విశాఖ మధ్యాహ్నం 3.15 వరకు, తదుపరి అనూరాధ, అమృతఘడియలు: ఉదయం 6.10 నుంచి 7.46 వరకు, రాహుకాలం మధ్యాహ్నం 3.18 నుంచి సాయంత్రం 4.42 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 9.07 నుంచి 9.52 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.21 నుంచి 3.06 వరకు, వర్జ్యం: రాత్రి 7.29 నుంచి 9.05 వరకు.

లోకం పోకడ



మర్యాదగా రిటర్న్ ఇస్తారా? పైసలు తీసుకొని ఓట్లేయకుండా మోసం చేశారని కోర్టులో కేసేయమంటారా?!

సీనియర్ జర్నలిస్టు కృష్ణారావుకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం

- పాలమూరు బిడ్డకు అనువాదంలో దక్కిన గౌరవం



కృష్ణారావు

హైదరాబాద్/మహబూబ్‌నగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ/న్యూఢిల్లీ: పాలమూరు జిల్లాకు సాహిత్యంలో మరో అరుదైన పురస్కారం దక్కింది. ప్రముఖ కవి, ఆంధ్రజ్యోతి అసోసియేట్ ఎడిటర్ అప్పరసు కృష్ణారావుకు కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం లభించింది. మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం వింజమూరు గ్రామానికి చెందిన కృష్ణారావుకు ఈ అవార్డు లభించడంపై ఉమ్మడి పాలమూరు జిల్లా సాహితీవేత్తలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మూడున్నర దశాబ్దాలుగా కృష్ణారావు వివిధ దినపత్రికల్లో జర్నలిస్టుగా కొనసాగుతూ మరో వైపు సాహిత్యానికి సేవలందిస్తూవచ్చారు. ప్రముఖ డోగ్రీ కవయిత్రి పద్మా సచ్ దేవ్ రాసిన కవితలను 'గుప్పెడు సూర్యుడు-మరికొన్ని కవితలు' పేరిట తెలుగులో అనువదించినందుకు కేంద్ర సాహిత్య అకాడమీ సోమవారం ఈ పురస్కారాన్ని ప్రకటించింది. భారతీయ స్త్రీ ఎదుర్కొనే సామాజిక అన్యాయం, సుఖ దుఖాలతో పాటు దేశ విభజన సమయంలో తన తండ్రిని పోగొట్టుకున్న కవయిత్రి మానసిక వేదన ఈ కవితల్లో వ్యక్తీకరించారని, కృష్ణారావు వాటిని తెలుగులోకి అద్భుతంగా అనువదించారని సాహిత్య అకాడమీ ప్రశంసాపత్రంలో పేర్కొన్నది. 1955 లో సురవరం ప్రతాపరెడ్డి రచించిన 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర', 2007లో గడియా రం రామకృష్ణ శర్మ రచించిన 'శతపత్రం ఆత్మకథ' గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు లభించాయి. ఇప్పుడు సీనియర్ జర్నలిస్టు, రచయిత కృష్ణారావు అనువాద రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారంతో పాలమూరుకు మూడోసారి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. కృష్ణారావు గతంలో ఉదయం, ఆంధ్రభూమి, దగార్డియన్, ఆంధ్రప్రదేశ్ టైమ్స్, న్యూఇండియన్ ఎక్స్‌ప్రెస్ దినపత్రికల్లో పనిచేశారు. 'ఇండియా గేట్', 'హీనచరిత్ర', 'ఇంకెవరు', 'ఉన్నట్లుండి', 'ఆకాశం కోల్పోయిన పక్షి' వంటి రచనలు ఆయనకు మంచి పేరును తీసుకొచ్చాయి. కేంద్ర మాజీమంత్రి జైరాంరమేశ్ రాష్ట్ర విభజన, వీపీ ఆర్థిక సంస్కరణలు, ఇందిరాగాంధీపై రాసిన మూడు పుస్తకాలను కృష్ణారావు అనువదించారు. సుప్రసిద్ధ జర్నలిస్టు, ప్రసార భారతి చైర్మన్ ఏ సూర్యప్రకాశ్ ఎమర్జెన్సీపై రచించిన పుస్తకాన్ని తెనుగీకరించారు. కృష్ణారావు ఉత్తమ తెలుగు జర్నలిస్టుగా ప్రతిష్ఠాత్మకమైన ఎన్ఆర్ చందూర్, మోటూరి హనుమంతరావు, తాపీ ధర్మారావు పురస్కారాలను అందుకున్నారు. కవిగా ఆయనకు ఆలూరి బైరాగి పురస్కారం లభించింది. త్వరలోనే ఢిల్లీలో కృష్ణారావు సాహిత్య అకాడమీ అవార్డును అందుకోనున్నారు. కృష్ణారావుకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించడంపై ధ్వని సంస్థ అధ్యక్షుడు జలజం సత్యనారాయణ, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి, పాలమూరు సాహితీ అధ్యక్షుడు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుంటి గోపి హర్షం వ్యక్తంచేశారు.

సీఎం కేసీఆర్ హర్షం



కృష్ణారావుకు కేంద్రం సాహిత్య అకాడమీ అవార్డును ప్రకటించడంపై సీఎం కేసీఆర్ హర్షం వ్యక్తంచేశారు. జర్నలిస్టుగా, కవిగా, రచయితగా సేవలందించిన కృష్ణారావు ఈ అవార్డుకు అర్హుడని సీఎం అభిప్రాయపడ్డారు. పాత్రికేయ వృత్తిలోనూ, సాహిత్య రంగంలోనూ ఆయన మరింత ఎదుగాలని, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఎస్సై పోస్టుల భర్తీకి హైకోర్టు పచ్చజెండా

మొదటిపేజీ తరువాయి...

తొలిగించాలని ఆదేశించింది. ఆ తర్వాతే మెరిట్ జాబితాను సిద్ధంచేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై టీఎస్ఎల్పీఆర్బీ అప్పీల్ చేసింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ తొట్టతిల్ బీ రాధాకృష్ణన్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టి సింగిల్ జడ్జి బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టేసింది. నియామక ప్రక్రియను కొనసాగించవచ్చని తెలిపింది. ప్రశ్నాపత్రంలో ఇచ్చిన ప్రశ్నలు తప్పు అని ఎవరికి వారు సొంత పరిజ్ఞానంతో నిర్ధారించలేరని స్పష్టంచేసింది. ప్రశ్నలను, వాటి ఐచ్ఛికాలను నిపుణులతో కూడిన కమిటీ లేదా బోర్డు రూపొందిస్తాయని తెలిపింది. పరీక్షలో పాల్గొన్న అభ్యర్థుల మార్కులను అందరికీ తెలిసేలా ప్రచురించాలన్న పిటిషనర్ల విజ్ఞప్తిని సైతం ద్విసభ్య ధర్మాసనం తిరస్కరించింది. టీఎస్ఎల్పీఆర్బీ నిబంధనల ప్రకారం ఎవరి వ్యక్తిగత మార్కులు వారు తెలుసుకోవాలని సూచించింది. పరీక్షలో పాల్గొన్న అందరి అభ్యర్థుల మార్కులు ప్రకటిస్తామని నోటిఫికేషన్‌లో ఎక్కడా పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు వెల్లడించలేదని గుర్తుచేసింది. బోర్డు అందుబాటులో ఉంచిన ఆన్‌లైన్ విధానం లేదా ఆర్టీఐ దరఖాస్తు ద్వారా వ్యక్తిగత మార్కులు తెలుసుకోవాలని స్పష్టంచేసింది.

రేపు ట్విట్టర్ లైవ్‌లో ఎంపీ కవిత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత ఈ నెల 30న (బుధవారం)ట్విట్టర్ లైవ్‌లో అందుబాటులో ఉంటారు. బుధవారం మధ్యాహ్నం 1 గంటకు ట్విట్టర్‌లో తన అభిప్రాయాలను పంచుకోనున్నారు. వివిధ వర్గాల నుంచి వచ్చే ప్రశ్నలకు ఆమె సమాధానాలిస్తారు. ట్విట్టర్‌లో #AskMPKavitha హ్యాష్ ట్యాగ్‌పైన ప్రశ్నలను అడుగొచ్చని కవిత సూచించారు.

ప్రతిపైసకూ లెక్కుండాలి

మొదటిపేజీ తరువాయి...

వచ్చిన పన్నుల వాటా, గ్రాంట్లు, ఇతర వివరాలు అడిగి తెలుసుకొన్నారు. సొంత పన్నుల రాబడిలో 19 శాతానికి పైగా వృద్ధిరేటు నమోదు చేసినట్లు అధికారులు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వివరించారు. వివిధ ప్రభుత్వ శాఖల నుంచి వచ్చిన బడ్జెట్ ప్రతిపాదనలను సీఎం పరిశీలించారు. ఈ సమీక్షలో ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావుతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

కొలువుల జాతర

మొదటిపేజీ తరువాయి...

పేర్కొన్నారు. ఈ లెక్కన వచ్చే విద్యాసంవత్సరంలో మొత్తం 2,537 పోస్టులను భర్తీ చేస్తారు. బోధనా సిబ్బందిలో మిగిలిన 1,785 పోస్టులు విడుతల వారీగా భర్తీ కానున్నాయి.

బోధనా సిబ్బంది రెగ్యులర్ పోస్టులు

క్యాటగిరీ	పోస్టుల సంఖ్య	2019-20లో భర్తీచేసేవి
ప్రిన్సిపల్	119	119
జూనియర్ లెక్చరర్	833	--
పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్	833	--
ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్	1,071	1,071
ఫిజికల్ డైరెక్టర్	119	--
ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్	119	119
లైబ్రేరియన్	119	119
క్రాఫ్ట్/ఆర్ట్/మ్యూజిక్ ఇన్‌స్ట్రక్టర్	119	119
స్టాఫ్‌నర్స్	119	119
సీనియర్ అసిస్టెంట్	119	119
జూనియర్‌అసిస్టెంట్ కమ్ టైపిస్ట్	119	119
మొత్తం పోస్టులు	3,689	1,904

ఔట్‌సోర్సింగ్‌లో భర్తీచేసే బోధనా సిబ్బంది

క్యాటగిరీ	పోస్టులు
ఐసీటీ ఇన్‌స్ట్రక్టర్	238
ల్యాబ్ అటెండర్	238
ఆఫీస్ సబార్డినేట్	119
మొత్తం	595

ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్‌లో రెగ్యులర్ పోస్టులు

క్యాటగిరీ	పోస్టులు
డిప్యూటీ సెక్రటరీ	1
అసిస్టెంట్ సెక్రటరీ	2
రీజినల్ కోఆర్డినేటర్	10
సూపరింటెండెంట్	2
సీనియర్ అసిస్టెంట్	8
జూనియర్ అసిస్టెంట్	5
మొత్తం పోస్టులు	28

ఔట్ సోర్సింగ్ పోస్టులు

క్యాటగిరీ	పోస్టులు
డాటాప్రాసెసింగ్ ఆఫీసర్	2
డాటా ఎంట్రీ ఆపరేటర్	4
ఆఫీస్ సబార్డినేట్	4
మొత్తం పోస్టులు	10

మండలి చైర్మన్ ఎన్నిక జూన్ తర్వాతే!

- మార్చి నెలాఖరుతో ముగియనున్న స్వామిగౌడ్ పదవీకాలం
- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇప్పట్లో ఎన్నిక లేనట్టే



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శాసనమండలి చైర్మన్ ఎన్నిక జూన్‌వరకు జరిగే అవకాశాలు కనిపించడంలేదు. మార్చి నెలాఖరుతో ప్రస్తుత చైర్మన్ స్వామిగౌడ్ పదవీకాలం ముగియనున్నది. మార్చి చివరినుంచి కొత్త చైర్మన్ ఎన్నికయ్యేవరకు తాత్కాలిక చైర్మన్ ఉండనున్నారు. కొత్త వారిని ఎన్నుకోవాలంటే మండలి సమావేశాలు జరుగాల్సి ఉంటుంది. ఒకవేళ స్వామిగౌడ్ తిరిగి ఎమ్మెల్సీగా ఎన్నికైనా చైర్మన్‌గా మళ్లీ ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో జూన్‌వరకు మండలి చైర్మన్ ఎవరనే దానిపై సస్పెన్స్ కొనసాగనున్నది. స్వామిగౌడ్ కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుంచి 2013లో గెలుపొందారు. టీఆర్‌ఎస్ శాసనమండలి ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరించారు. 2014 జూలై 2న తెలంగాణ శాసనమండలి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. చైర్మన్‌ను ఎన్నుకోవాలంటే సభ జరుగుతున్న సమయాల్లోనే సాధ్యమవుతుంది. మార్చి మొదటివారంలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్నది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరిలో బడ్జెట్ సమావేశాలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తుచేస్తున్నట్టు సమాచారం. మార్చి చివరినుంచి జూన్‌వరకు తాత్కాలిక చైర్మన్‌తోనే మండలి కొనసాగే అవకాశమున్నది. దీంతో జూన్‌వరకు కొత్త కౌన్సిల్ చైర్మన్ ఎన్నిక ఉండదని అంచనా వేస్తున్నారు.

మహిళా సంక్షేమంలో రాష్ట్రం నంబర్‌వన్

- 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌దే
- ప్రైవేట్ ఉద్యోగుల సంఘం మహిళా విభాగం డైరీ ఆవిష్కరణలో మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామ పం చాయతీ, జీహెచ్‌ఎంసీ, కార్పొరేషన్ల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నా రు. మహిళా సంక్షేమంలో రాష్ట్రం నంబర్‌వన్‌గా నిలుస్తున్నదని పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సం ఘం మహిళా విభాగం క్యాలెండర్, డైరీని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రైవేట్‌రంగంలో పనిచేస్తున్న మహిళల కోసం సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. కార్యక్రమంలో ప్రైవేట్ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంధం రాములు, మహిళా విభాగం అధ్యక్షురాళ్లు ప్రభారెడ్డి, గీతాంజలి, వర్కింగ్ ప్రెసిడెంట్ అనిత, ప్రధాన కార్యదర్శి తులసి, కోశాధికారి శ్రావణిరెడ్డి, ఉపాధ్యక్షురాలు లక్ష్మి, జాయింట్ సెక్రటరీలు శ్రీదేవి, గీత, కార్యదర్శి విజయకుమారి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు దీప్యారావు పాల్గొన్నారు.



సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం మహిళా విభాగం డైరీని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

జిల్లాకేంద్రాలకు మాస్టర్‌ప్లాన్లు సిద్ధం

- కొత్తగా నాలుగింటికి రూపకల్పన చేసిన డీటీసీపీ
- యాదాద్రి, నిజామాబాద్‌కూ మాస్టర్‌ప్లాన్ రెడీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో హైదరాబాద్ మినహా అన్ని జిల్లా కేంద్రాలకు మాస్టర్‌ప్లాన్లు సిద్ధమయ్యాయి. ఇప్పటికే 26 జిల్లా హెడ్‌క్వార్టర్లకు మాస్టర్‌ప్లాన్లు ఉండగా, నాగర్‌కర్నూల్, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, మహబూబాబాద్ జిల్లాల ముసాయిదా బృహత్ ప్రణాళిక (డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్)లను డీటీసీపీ (డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించింది. ప్రతి జిల్లా కేంద్రం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందాలన్న మాజీ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు మాస్టర్‌ప్లాన్ల ఏర్పాటులో డీటీసీపీ ముందంజ వేసింది. నిజామాబాద్ పట్టణ ముసాయిదా బృహత్ ప్రణాళికను కూడా ఇటీవల ప్రభుత్వానికి డీటీసీపీ సమర్పించింది. అందోల్-జోగిపేట్ ముసాయిదా బృహత్ ప్రణాళికను వారంలోపు ప్రభుత్వానికి సమర్పించడానికి ప్రణాళికలు రచిస్తున్నది. యాదాద్రికి తుది మాస్టర్‌ప్లాన్‌ను డీటీసీపీ రూపొందించి ప్రభుత్వానికి సమర్పించింది. సుమారు 104.58 కిలోమీటర్ల విస్తీర్ణంలో వైటీడీఏ (యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ) ప్రాంతంలో ఏడు రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. 2035 నాటికి సుమారు 1.26 లక్షల జనాభాను దృష్టిలో పెట్టుకుని యాదాద్రి మాస్టర్‌ప్లాన్‌కు రూపకల్పన చేసింది. సాంస్కృతిక కళాసౌరభాలు ప్రతిబింబించేలా చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం.

కంటివెలుగు @ 100 రోజులు

- ఇప్పటివరకు 1,38,88,710 మందికి పరీక్షలు
- రాష్ట్రంలో 8,382 గ్రామాల్లో వైద్య శిబిరాలు పూర్తి



సోమవారం కొత్తగూడెంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలోని పౌరులెవరూ కంటిచూపు కోల్పోకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ కంటివెలుగు వైద్య శిబిరాల నిర్వహణ సోమవారం వందరోజులకు చేరింది. ఉచితంగా కంటి పరీక్షలు, మందులు, కండ్లద్దాలు అందజేస్తుండటంతో నిరుపేదలకు ఈ కార్యక్రమం వరంగా మారింది. గ్రామీణ, పట్టణప్రాంతాల్లో పరీక్షలు చేయించుకునేందుకు ప్రజలు భారీగా తరలివస్తున్నారు. ఈ బృహత్తర కార్యక్రమంపై ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కంటివెలుగులో ఇప్పటివరకు 1,38,88,710 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. గత ఏడాది ఆగస్టు 15న కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి సోమవారంవరకు రాష్ట్రవ్యాప్తంగా 8,382 గ్రామాలు, మున్సిపాలిటీలు, జీహెచ్‌ఎంసీ పరిధిలో 730 వార్డుల్లో కంటి వైద్య శిబిరాల నిర్వహణ పూర్తయింది. ఇప్పటివరకు కంటి వెలుగులో 1,38,88,710 మందికి పరీక్షలు చేయగా.. 21,20,614 మందికి రీడింగ్ అద్దాలను అందజేశారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 90,284 మందికి కంటి పరీక్షలు చేశారు.

ఏండ్లనాటి సమస్యకు పరిష్కారం



ఎన్నో ఏండ్లుగా కంటి సమస్యతో బాధపడుతున్నా. కంటివెలుగు శిబిరాల గురించి తెలుసుకుని ఇక్కడికి వచ్చా. కండ్లద్దాలు అవసరమని గుర్తించి ఇచ్చారు. ఏండ్లనాటి సమస్య వెంటనే పరిష్కారమైంది. ప్రభుత్వం ఉచితంగా కంటివెలుగు శిబిరాలు నిర్వహించడం అభినందనీయం.

-పుష్పలత, కొత్తగూడెం

కంటి సమస్య తీరింది

చాలాకాలంగా కంటి సమస్యతో బాధపడుతున్నా. ఆర్థిక స్థోమత లేకపోవడంతో ప్రైవేటు వైద్యం చేయించుకోలేదు. ప్రభుత్వం కంటి వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నదని తెలిసి ఇక్కడకు వచ్చా. వైద్య సిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించి కంటిసమస్యకు పరిష్కారం చూపారు.

- గొల్లపల్లి మనోహర, మేదరబస్తీ, కొత్తగూడెం

కంటి వైద్యశిబిరాల్లో సేవలు పొందినవారి సంఖ్య

క్యాటగిరీ	సోమవారం	మొత్తం శిబిరాల్లో
పరీక్షలు చేయించుకున్నవారు	90,284	1,38,88,710
రీడింగ్ అద్దాలు పొందినవారు	6,992	21,20,614
ప్రత్యేక అద్దాలకు ప్రతిపాదన	6,703	16,47,216
కంటి సమస్యలపై రెఫరల్	5,208	8,60,992

రైతుబంధు, రైతుబీమాతో మేలు

- యూరియా వంటి ఎరువులకు సబ్సిడీ అవాంఛనీయం
- నిత్యావసర సరుకుల చట్టం రద్దుచేయాలి లేదా రైతులను మినహాయించాలి
- రైతులు లాబీగా ఏర్పడి డిమాండ్ల సాధనకు పాలకపక్షాలపై ఒత్తిడి తేవాలి
- కేంద్ర ప్లానింగ్ కమిషన్ మాజీ వైస్‌చైర్మన్ మాంటెక్ సింగ్ అహ్లువాలియా



సోమవారం హైదరాబాద్‌లో కన్సార్టియం ఆఫ్ ఇండియన్ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'రైతుల జాతీయ ఎజెండా 2019-2029' అనే సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర ప్లానింగ్ కమిషన్ మాజీ వైస్‌చైర్మన్ మాంటెక్ సింగ్ అహ్లువాలియా

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

యూరియా వంటి ఎరువులపై సబ్సిడీ ఇవ్వడం వాంఛనీయం కాదని, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు అన్నదాతలకు మేలుచేస్తాయని కేంద్ర ప్లానింగ్ కమిషన్ మాజీ వైస్‌చైర్మన్ డాక్టర్ మాంటెక్‌సింగ్ అహ్లువాలియా చెప్పారు. కొన్ని అవాంఛనీయమైన సబ్సిడీలను నిలిపివేసి పాడి మార్కెట్‌ను రెగ్యులేట్ చేయాలని, రైతు పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం ప్రధానమని అన్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో రైతులంతా సంఘటితమై అమలుకు నోచుకొనేలా 10 నుంచి 12 ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం ముందుంచాలని సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని గోల్కొండ హోటల్‌లో కన్సార్టియం ఆఫ్ ఇండియన్ ఫార్మర్స్ అసోసియేషన్ (సీఐఎఫ్‌ఏ) ఆధ్వర్యంలో 'రైతుల జాతీయ ఎజెండా 2019-2029' అనే అంశంపై జరిగిన సదస్సులో అహ్లువాలియా ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. రైతుల ప్రగతికి ప్రతిబంధకంగా మారిన నిత్యావసర సరుకుల చట్టాన్ని (ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్) రద్దుచేయాలని, లేదా రైతులను మినహాయించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో వ్యవసాయ రంగం అన్ని రాజకీయ పార్టీల మ్యానిఫెస్టోల్లో ప్రధాన అంశంగా నిలుస్తుందని, రైతులు కొన్ని పనికొచ్చే డిమాండ్లనే మ్యానిఫెస్టోలోచేర్చేలా కృషిచేయాలని సూచించారు. రైతులు లాబీగా ఏర్పడి రాజకీయపార్టీలు, ప్రభుత్వాలు వ్యవసాయరంగ ప్రగతికి కీలకమైన నిర్ణయం తీసుకొనేవిధంగా ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు.

ప్రత్యేక స్టాండింగ్ కమిటీని నియమించాలి

యూరియా వంటి ఎరువులపై సబ్సిడీ మంచిది కాదన్న అహ్లువాలియా.. యూరియా చౌకగా లభించడం వల్ల పంటపొలాల్లో విరివిగా వాడుతున్నారని, ఫలితంగా భూసారం కోల్పోవడం వంటి అనర్థాలు జరుగుతున్నాయని వివరించారు. దానికి బదులు రైతులకు నేరుగా నగదు బదిలీ వంటి ఆలోచన చేయాలని సూచించారు. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు రైతులకు మేలుచేస్తాయన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వాలు ఇచ్చిన హామీల అమలుకు ప్రత్యేక స్టాండింగ్ కమిటీని నియమించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ చర్యలు వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించే విధంగా లేవని చెప్పారు. వ్యవసాయ రాబడి గతంలో జీడీపీలో 17 శాతం ఉండగా.. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో అది 12 శాతానికి తగ్గిందని వివరించారు. సీఐఎఫ్‌ఏ ప్రధాన సలహాదారు పీ చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు నేరుగా ప్రయోజనం చేకూర్చే రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాలు సత్ఫలితాలిస్తున్నాయన్నారు. సదస్సులో పలువురు రైతు ప్రతినిధులు తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుబంధు పథకాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో ఆర్థికవేత్త చంద్రశేఖర్ అయ్యర్, సీఐఎఫ్‌ఏ అధ్యక్షుడు ఆర్వీ గిరి, ప్రధానకార్యదర్శి బొజ్జా దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నర్సరీలకు 25 కోట్లు

- కొత్త చట్టంతో సిద్ధమవుతున్న అభివృద్ధి ప్రణాళికలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీల పాలకవర్గాలు కొలువుదీరడంతో కొత్త పంచాయతీరాజ్ చట్టం అమలుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో అభివృద్ధి ప్రణాళికలు తయారుచేశారు. సర్పంచ్‌లకు వారి అధికారాలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి పంచాయతీని పచ్చగా ఉండే విధంగా కొత్త చట్టంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పలు మార్గదర్శకాలు రూపొందించారు. ప్రతి ఇంటికి ఆరు మొక్కలు తప్పనిసరిగా పంపిణీచేసేలా పంచాయతీల పాలకవర్గాలకు ఈ చట్టంలో స్పష్టంగా సూచించారు. దీనికోసం ప్రతి పంచాయతీలో నర్సరీ ఏర్పాటుచేయాలని, అన్నిరకాల పండ్ల మొక్కలను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఇందులోభాగంగా గ్రామాల్లో నర్సరీల ఏర్పాటుకు పంచాయతీరాజ్‌శాఖ నుంచి సెర్ప్‌కు నిధులు విడుదలచేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. పంచాయతీరాజ్‌శాఖ నుంచి ప్రతి గ్రామంలో నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకం, ఉపాధి కూలీలకు చెల్లింపులు, ఇతరత్రా అవసరాల కోసం రూ. 25 కోట్లు విడుదలచేశారు.



ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం ఆరేపల్లిలో కొత్తగా ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు, పోలీసులు

చెక్‌పోస్టుల్లో సాయుధ బలగాలు

- కలప అక్రమరవాణా నిరోధానికి గట్టి చర్యలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 24 కొత్త చెక్‌పోస్టులు

నిర్మల్ / ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కలప అక్రమ రవాణాపై అటవీశాఖ అధికారులు నిఘాపెంచారు. చెక్‌పోస్టుల సంఖ్యపెంచి సాయుధులైన పోలీసు బలగాలతో పహారా కాస్తున్నారు. కొత్తగా ఆదిలాబాద్ జిల్లాలో ఆరు, నిర్మల్ జిల్లాలో ఏడు, కుమ్రంభీంఆసిఫాబాద్ జిల్లాలో ఏడు, మంచిర్యాల జిల్లాలో నాలుగుచోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటుచేస్తున్నారు. వీటిలో ఆదిలాబాద్ జిల్లాలో ఆరు చెక్‌పోస్టులు ప్రారంభమయ్యాయి. మిగతావి నేడో, రేపో ప్రారంభంకానున్నాయి. ఇప్పటివరకు ఉన్న చెక్‌పోస్టుల్లో ఒక అటవీశాఖఅధికారి (ఎఫ్‌ఎస్వో/బీట్ ఆఫీసర్)తో పాటు ప్రైవేటు వాచర్ ఉండేవారు. ఇకపై ఇద్దరు సాయుధ పోలీసులతోపాటు ఇద్దరు అటవీశాఖ అధికారులు, ఇద్దరు ప్రైవేటు వాచర్లు రెండు షిఫ్టుల్లో ముగ్గురు చొప్పున విధులు నిర్వహిస్తారు. కలప అక్రమరవాణా ఎక్కువగా జరిగే ప్రాంతాలు, ముల్తానీలు ఉన్న చోట అవసరాన్నిబట్టి సాయుధ పోలీసులు, అటవీశాఖ సిబ్బందిని అదనంగా నియమిస్తున్నారు. జిల్లాకు రెండు చొప్పున ఫ్లయింగ్‌స్క్వాడ్‌లను ఏర్పాటుచేస్తున్నారు. ఇందులోనూ సాయుధ పోలీసులు ఇద్దరు, ఎఫ్‌ఎస్వో, బీట్ ఆఫీసర్లు ఉంటారు. మరోవైపు అన్ని చెక్‌పోస్టుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఇకపై చెక్‌పోస్టుల్లో సిబ్బంది పనితీరును ఉన్నతాధికారులు పరిశీలించనున్నారు. 'జిల్లాలో కొత్తగా ఆరు చెక్‌పోస్టులను ఏర్పాటుచేశాం. పోలీసులు, అటవీశాఖ అధికారుల సమన్వయంతో స్మగ్లింగ్ జరుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇచ్చోడ, నేరడిగొండ ప్రాంతాల్లో రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటుచేశాం. చెక్‌పోస్టుల పనితీరుపై నిరంతరం పర్యవేక్షిస్తున్నాం'అని ఆదిలాబాద్ డీఎఫ్‌వో ప్రభాకర్ తెలిపారు.

కవిత చొరవతో స్వదేశానికి..

- ఇరాక్ నుంచి ఇండ్లకు చేరుకోనున్న 15 మంది బాధితులు
- సంప్రదింపులు మొదలు టికెట్లదాకా బాధ్యత తీసుకున్న ఎంపీ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంకాని దేశంలో ఇక్కట్లు పడుతున్నవారు తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత చొరవతో సురక్షితంగా స్వదేశానికి చేరుకోనున్నారు. భారత ప్రభుత్వ ఉన్నతాధికారుల సహాయ సహకారాలు పొందడంతోపాటు ఇరాక్‌లో ఇక్కట్ల నుంచి విముక్తిచేసేవరకు ఆమె విశేష కృషి ఫలితంగా బాధితులు తమ కుటుంబసభ్యులను కలుసుకోనున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన కాటం మహేందర్‌రెడ్డి, వేల్పూర్ రాజేందర్, దారెడ్డి రాజు, లాడె రాజేందర్, కాటం లక్ష్మణ్, మెల్ల ప్రభాకర్, గుండ్ల భూమేశ్వర్, గానోజి కృష్ణాంకర్, శ్రీరాం లింబాద్రి, పుల్లా సాయన్న, గొల్ల గంగన్న, అలూర్ గంగారెడ్డి, కొర్రా రవీందర్, బానోత్ చతుర్‌సింగ్, బానోత్ వినోద్ ఇరాక్‌లోని ఎర్బిల్ నగరానికి ఉపాధికోసం వెళ్లారు. వారిని ఏజెంట్ మోసం చేశాడు. సరైన అనుమతులు, ఉద్యోగ ప్రక్రియ లేకపోవడంతో వసతి, భోజనం కోసం బాధితులు ఇక్కట్లు పడ్డారు. తమ ఆవేదనను ఎంపీ కవితకు తెలియజేశారు. ఈ నేపథ్యంలో వారిని స్వదేశానికి రప్పించేందుకు కేంద్ర విదేశాంగశాఖ, తెలంగాణ రాష్ట్ర ఎన్నారై వ్యవహారాలశాఖతో సమన్వయం చేసుకొన్న ఎంపీ కవిత.. ఇరాక్ రాయబార కార్యాలయంతో సంప్రదించి బాధితులను స్వదేశానికి రప్పించే ప్రక్రియ పూర్తిచేశారు. తదుపరి దశలో వారికి ఎర్బిల్ నుంచి ఢిల్లీ వచ్చేందుకు విమాన టికెట్లు, అక్కడి నుంచి స్వగ్రామానికి చేరేందుకు రైలు టికెట్లు ఏర్పాటుచేశారు. బాధితులు మంగళవారం తమ స్వగ్రామానికి చేరుకోనున్నారు. ఎంపీ కవిత చొరవతో బాధితుల కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తున్నది.

కలప స్మగ్లర్లు వణకాలి

- 54 చెక్‌పోస్టులు ఏర్పాటుచేయాలి
- సాయుధబలగాలతో నిఘాపెట్టాలి
- అటవీ నేరగాళ్లను కఠినంగా శిక్షించాలి
- వీడియోకాన్ఫరెన్స్‌లో సీఎస్ జోషి



అడవుల రక్షణపై సోమవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ జోషి. చిత్రంలో డీజీపీ మహేందర్‌రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, అటవీశాఖ అధికారులు ఉన్నారు.

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కలప స్మగ్లర్లు అడవిలోకి వెళ్లాలంటే భయపడేలా కఠినంగా వ్యవహరించాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆదేశించారు. ఒక్క చెట్టు కొట్టకుండా, కలప దుంగలు తరలిపోకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వెంటనే రాష్ట్రవ్యాప్తంగా 54 చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి పోలీసు, అటవీ అధికారులు మోహరించాలని ఆదేశించారు. అడవుల రక్షణ, కలప స్మగ్లింగ్ నివారణపై సీఎస్ ఎస్కే జోషి సోమవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో రాష్ట్రవ్యాప్తంగా పోలీస్, అటవీశాఖలకు చెందిన అన్నిహోదాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్కే జోషి మాట్లాడుతూ పర్యావరణపరంగా తెలంగాణ రాష్ట్రం సుసంపన్నంగా ఉండాలని, ప్రతీ పౌరుడికి నాణ్యమైన జీవితాన్ని ఇవ్వడానికి వీలుగా వాతావరణాన్ని కల్పించాలని సీఎం కేసీఆర్ సంకల్పించారని చెప్పారు. అడవుల రక్షణ, సామాజికవనాలను పెంచడమే ప్రాధాన్య అంశంమని ముఖ్యమంత్రి స్పష్టంచేశారని వివరించారు. అడవుల రక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు. అడవులున్న జిల్లాల్లో వెంటనే 54 చెక్‌పోస్టులను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల్లో అటవీశాఖతో పాటు సాయుధులైన పోలీసు బలగాలు ఉండాలని స్పష్టంచేశారు. అటవీ నేరగాళ్ల సమాచారం అందించినవారికి రివార్డు ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. అటవీనేరాలకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించడానికి వీలుగా ప్రస్తుత అటవీచట్టాలకు పదునుపెట్టాలని సూచించారు. ఫిబ్రవరి ఆరో తేదీవరకు జిల్లాల వారీగా అటవీరక్షణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధంచేయాలని ఆదేశించారు.

స్మగ్లర్లకు జియోట్యాగింగ్

అటవీనేరాల అదుపునకు తమశాఖ తరపున పూర్తి సహకారం ఉంటుందని డీజీపీ మహేందర్‌రెడ్డి చెప్పారు. అటవీశాఖ అధికారులకు పోలీసులు అందుబాటులో ఉంటారని తెలిపారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ ఎస్పీ, డీఎఫ్‌వో బృందంగా ఏర్పడి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పదే పదే అటవీనేరాలకు పాల్పడేవారికి జియోట్యాగింగ్ చేస్తామని చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే అటవీసిబ్బందిని ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి కార్యాలయం ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి హెచ్చరించారు. ఆదిలాబాద్ జిల్లాలో ముల్తానీలను కలప స్మగ్లింగ్‌నుంచి దూరం చేయడానికి పునరావాసం కల్పిస్తామని చెప్పారు. పోలీసుల సమన్వయంతో అటవీనేరాల అదుపునకు తీసుకుంటున్న చర్యలను అటవీశాఖ పీసీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఝా వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అటవీ, పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, పీసీసీఎఫ్(ఐటీ)రఘువీర్, అడిషనల్ పీసీసీఎఫ్ మునీంద్ర, డోబ్రియాల్, అడిషనల్ డీజీపీ జితేందర్, ఐజీలు నాగిరెడ్డి, స్టీఫెన్‌రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన కలప స్వాధీనం

మాచారెడ్డి: కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం బంజపల్లి పరిధిలోని మంగళ్‌తండాలో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను సోమవారం స్వాధీనం చేసుకున్నట్టు ఎఫ్‌ఆర్వో అంబర్‌సింగ్ తెలిపారు. విశ్వసనీయమైన సమాచారం మేరకు దాడి చేయగా ముగ్గురు ఇండ్లల్లో నిల్వ ఉంచిన కలపతోపాటు ముగ్గురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న కలప విలువ రూ.లక్ష వరకు ఉంటుందని తెలిపారు.


ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు

- మార్చి 28 తుది గడువు.. ఏప్రిల్ 28న అర్హత పరీక్ష
- బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ నోటిఫికేషన్ జారీ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నేరుగా డిగ్రీ అభ్యసించేందుకు అర్హత పరీక్ష-2019 నోటిఫికేషన్ విడుదలైంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు తుదిగడువు మార్చి 28గా నిర్ణయించారు. ఏ స్టడీసెంటర్ నుంచైనా బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సుల్లో చేరేందుకు యూనివర్సిటీ అవకాశం కల్పించింది. ఇంటర్మీడియట్ పాసై, 2019 జూలై ఒకటి నాటికి 18 ఏండ్లు నిండినవారు మూడేండ్ల డిగ్రీలో నేరుగా ప్రవేశం పొందవచ్చు. ఇంటర్ విద్యార్హత లేనివారు www.braouonline.inలో దరఖాస్తు చేసుకొని, పరీక్షాకేంద్రాన్ని ఎంచుకోవాలి. రూ.300 పరీక్ష ఫీజును ఆన్‌లైన్‌లో లేదా ఫ్రాంచైజీ సెంటర్లలో రూ.310 చెల్లించి రసీదు తీసుకొవచ్చు. ఏప్రిల్ 28న ప్రవేశాలకు అర్హత పరీక్ష ఉంటుంది.

పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు మృతి

- తిరుపతిలో జాతీయసదస్సుకు హాజరైన వెంకటేశ్వర్లు
- తిరుమల క్యూలైన్‌లో ఉండగానే గుండెపోటు
- స్విమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస



వెంకటేశ్వర్లు(ఫైల్)

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: రాష్ట్ర పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ డాక్టర్ దాస్యం వెంకటేశ్వర్లుయాదవ్ (58) గుండెపోటుతో తిరుపతిలో మృతి చెందారు. తిరుపతిలో వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలో జాతీయ సదస్సుకు డాక్టర్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సదస్సు అనంతరం సోమవారం తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లిన ఆయన.. క్యూలైన్‌లో నిల్చున్న సమయంలో గుండెపోటుకు గురయ్యారు. వెంటనే ఆయనను తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. నగరంలోని మన్సూరాబాద్‌లో నివసిస్తున్న ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె అమెరికాలో డాక్టర్‌గా పనిచేస్తూ, వారంక్రితమే హైదరాబాద్‌కు వచ్చారు. కుమారుడు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. వెంకటేశ్వర్లు అస్వస్థతకు గురై, దవాఖానలో చేరిన విషయం తెలియగానే ఆయన కుమార్తె, అల్లుడు హైదరాబాద్ నుంచి విమానంలో తిరుపతి బయలుదేరి వెళ్లారు. భార్య, కుమారుడు ప్రత్యేక వాహనంలో తిరుపతి వెళ్లారు. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం భీమారం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు 1985లో నడిగూడెం పశువైద్యశాలలో డాక్టర్‌గా ఉద్యోగంలో చేరారు. అనంతరం ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్షల్లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా నియామకమై జగిత్యాలలో పనిచేశారు. ఈ ఏడాది అక్టోబర్‌లో పదవీ విరమణ చేయాల్సి ఉన్నది. వెంకటేశ్వర్లు గతంలో అనేక హోదాల్లో పనిచేశారు. ఐక్యరాజ్యసమితి ఆహార, అగ్రికల్చర్ ఆర్గనైజేషన్‌లో ఢిల్లీ కేంద్రంగా రెండేండ్లపాటు సేవలందించారు. రాష్ట్రప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన గొర్రెల పంపిణీ, బర్రెలు, ఆవుల పంపిణీ పథకాలు విజయవంతం కావడంలో వెంకటేశ్వర్లు విశేషంగా కృషిచేశారు. వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని మంగళవారం హైదరాబాద్‌కు తీసుకురానున్నట్లు తోటి అధికారులు వెల్లడించారు. వెంకటేశ్వర్లు మృతి పట్ల స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, రైతు సమన్వయ సమితి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, గొర్రెలు, మేకల కార్పొరేషన్ చైర్మన్ రాజయ్య, డైరెక్టర్ డాక్టర్ వీ లక్ష్మారెడ్డి, పలువురు వెటర్నరీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మృతుడు కాదు.. అతడే హంతకుడు

- మధ్యప్రదేశ్‌లో ఆరెస్సెస్ కార్యకర్త హత్య కేసులో వీడిన మిస్టరీ
- తన పొలంలో పనిచేసే వ్యక్తిని హత్యచేసి.. తానే చనిపోయినట్లు డ్రామా
- డీఎన్ఏ పరీక్షతో గుట్టురట్టు


హిమ్మత్ పాటిదార్

రత్లాం (మధ్యప్రదేశ్): వారం రోజుల క్రితం మధ్యప్రదేశ్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన ఆరెస్సెస్ కార్యకర్త హిమ్మత్ పాటిదార్ 'హత్య' కేసులో మిస్టరీ వీడింది. ఊరిలో అప్పులు పెరిగిపోవడం, జీవిత బీమా సొమ్మును అప్పనంగా కాజేయాలనే కుట్రతోనే హిమ్మత్ ఈ హత్య డ్రామా ఆడినట్లు దర్యాప్తులో వెలుగుచూసింది. తన వ్యవసాయ క్షేత్రంలో పనిచేసే మదన్ మాలవ్యను హిమ్మత్ హత్యచేసి, అది తన శవమేనని ప్రజల్ని నమ్మించాడు. మృతుడి ముఖం గుర్తుపట్టకుండా కాల్చివేశాడు. అతడి దేహానికి తన దుస్తులు, బూట్లు తొడిగాడు. తన గుర్తింపుకార్డులు, ఇతర వస్తువుల్ని అక్కడే వదిలేసి, తనను ఎవరో హత్య చేసినట్లు ఊరి ప్రజలను హిమ్మత్ నమ్మించాడు. అయితే, మృతుడి శరీర ఆనవాళ్లకు డీఎన్ఏ పరీక్ష నిర్వహించడంతో హిమ్మత్ కుట్ర రట్టయింది. జనవరి 23న మధ్యప్రదేశ్‌లోని రత్లాం గ్రామంలో ఈ దారుణం చోటుచేసుకున్నది. అయితే, హత్య జరిగిన ముందు రోజు నుంచి హిమ్మత్ పొలంలో పనిచేసే మదన్ మాలవ్య కనిపించకపోవడంతో పోలీసులు ఈ దిశగా దర్యాప్తు ప్రారంభించారు. హత్య జరిగిన ప్రాంతంలో అణువణువు పరిశీలించగా ఒకచోట అతడి దుస్తులు, బూట్లు కనిపించాయి. మృతుడి ఒంటిపై ఉన్న లో దుస్తుల్ని గుర్తించి అతడు మాలవ్యవేనని కుటుంబసభ్యులు చెప్పారు. రూ.20 లక్షల జీవిత బీమా సొమ్మును కాజేసేందుకే హిమ్మత్ ఈ డ్రామా ఆడినట్లు పోలీసులు గుర్తించారు. పరారీలో ఉన్న హిమ్మత్ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. ఈ సందర్భంగా ఆరెస్సెస్, బీజేపీ నిజస్వరూపం మరోసారి బట్టబయలైందని మధ్యప్రదేశ్ హోంమంత్రి బాలా బచ్చన్ విమర్శించారు.

జియో నుంచి రైల్ యాప్

- టికెట్ల బుకింగ్, క్యాన్సిలేషన్‌కు వెసులుబాటు



న్యూఢిల్లీ: దేశీయ దిగ్గజ టెలికం సంస్థ రిలయన్స్ జియో తమ జియోఫోన్, జియోఫోన్-2 వినియోగదారుల కోసం జియోరైల్ యాప్‌ను ప్రారంభించింది. డెబిట్/క్రెడిట్ కార్డులు లేదా ఈ-వాలెట్లను ఉపయోగించి రైలు టికెట్లను బుక్‌చేసుకోవడం, రద్దు చేసుకోవడంతోపాటు పీఎన్ఆర్ స్టేటస్‌ను తెలుసుకునేందుకు ఈ యాప్ వీలు కల్పిస్తుంది. రైళ్ల సమాచారాన్ని, వాటి సమయాలను, మార్గాలను, సీట్ల లభ్యత తదితర వివరాలను కూడా ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చని రిలయన్స్ జియో వెల్లడించింది. జియో యాప్ స్టోర్‌లో లభ్యమయ్యే ఈ కొత్త యాప్ సాయంతో తత్కాల్ టికెట్లను కూడా బుక్‌చేసుకోవచ్చు. ఐఆర్‌సీటీసీ ఖాతా లేని వినియోగదారులు సైతం ఈ యాప్ ద్వారా ఖాతా తెరిచి టికెట్లను బుక్‌చేసుకునేందుకు వీలుంటుంది. ముున్ముందు ఈ యాప్ ద్వారా పీఎన్ఆర్ స్టేటస్ చేంజ్ అలర్ట్స్, లొకేట్ ట్రెయిన్, ఫుడ్ ఆర్డరింగ్ లాంటి ఇతర సేవలను కూడా అందజేయాలని భావిస్తున్నట్టు రిలయన్స్ జియో వివరించింది.

చైనా హక్కుల న్యాయవాదికి జైలు

- నిరసన వ్యక్తం చేసిన మానవ హక్కుల సంస్థలు


వాంగ్ క్వాన్‌జాంగ్

బీజింగ్: దేశ ద్రోహం అభియోగాలపై చైనాకు చెందిన ప్రముఖ మానవ హక్కుల న్యాయవాది వాంగ్ క్వాన్‌జాంగ్‌కు ఆ దేశ కోర్టు నాలుగున్నరేండ్ల జైలు శిక్ష విధించింది. రాజకీయ కార్యకర్తలు, భూ నిర్వాసితుల తరఫున వాంగ్(42) వాదనలు వినిపించేవారు. కమ్యూనిస్ట్ పాలకుల విధానాలను విమర్శించే న్యాయవాదులను లక్ష్యంగా చేసుకుని ఆ దేశ ప్రభుత్వం 2015లో చేపట్టిన అణచివేత చర్యల సమయంలో వాంగ్ అదృశ్యమయ్యారు. '709 క్రాక్‌డౌన్'గా పిలిచే ఈ చర్య ద్వారా ప్రభుత్వం 200 మందికి పైగా న్యాయవాదులు, మానవ హక్కుల కార్యకర్తలను అదుపులోకి తీసుకుంది. 2016 జనవరిలో వాంగ్‌పై దేశద్రోహం అభియోగాలు మోపారు. అభియోగాలు రుజువు కావడంతో ఆయనకు నాలుగున్నరేండ్ల జైలు శిక్ష విధిస్తున్నట్లు తియాంజిన్ కోర్టు సోమవారం తీర్పు చెప్పింది. రెండేళ్ల నిర్బంధం తర్వాత గతేడాది డిసెంబర్ 26న కోర్టు తలుపులు మూసివేసి ఆయనపై విచారణ చేపట్టారు. దేశ రహస్యాలకు సంబంధించినది కాబట్టి ప్రజలకు అనుమతి లేదని నాడు కోర్టు వివరణిచ్చింది. వాంగ్ నిర్బంధంపై ఆయన భార్య లీ వెంజు తీవ్రంగా పోరాడుతున్నారు. గత ఏప్రిల్‌లో తియాంజిన్‌లో వాంగ్‌ను నిర్బంధించిన ప్రదేశం వరకు సుమారు 100 కిమీ మార్చ్ నిర్వహించారు. గత డిసెంబర్‌లో ఆమెతోపాటు మరో ముగ్గురు గుండు కొట్టించుకుని నిరసన వ్యక్తం చేశారు. వాంగ్‌కు జైలు శిక్ష విధించడంపై మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇది తీవ్ర అన్యాయమని పేర్కొంది.

దక్షిణాదిపై కమలనాథుల గురి!

యూపీలో జరిగే నష్టాన్ని దక్షిణాది రాష్ట్రాలతో పూడ్చుకోవడానికి తీవ్ర కసరత్తు

వరుస పర్యటనలతో ప్రధాని మోదీ బిజీబిజీ

ఈ ప్రాంతంలో ఎక్కువ స్థానాలు గెలుచుకునేందుకు వ్యూహం



న్యూఢిల్లీ, జనవరి 28: భారత రాజకీయాలకు దక్షిణాది మరో ఉత్తర్‌ప్రదేశ్ కానున్నదా? ప్రధానమంత్రి నరేంద్రమోదీ వరుస పర్యటనల ఆంతర్యమిదేనా? వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో దక్షిణాదిలో వీలైనన్నీ ఎక్కువ సీట్లు గెలిచి తన సత్తా చాటాలని కమలనాథులు కదన కుతూహలంతో ఉన్నారా? అంటే రాజకీయ విశ్లేషకులు అవుననే చెబుతున్నారు. గడిచిన రెండు వారాల్లో తమిళనాడులో వరుసగా రెండు సార్లు ప్రధాని నరేంద్రమోదీ పర్యటించడం, కేరళ పర్యటనకు ప్రధాని, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా తరుచూ వెళ్తుండడం ఇందుకు బలాన్ని చేకూర్చుతున్నది.

దక్షిణాదిలో బలం అంతంతే..!

2014లో ఉత్తర్‌ప్రదేశ్‌లో అత్యధిక స్థానాలు (మొత్తం 80 సీట్లలో 71) సాధించి కేంద్రంలో అధికారాన్ని కైవసం చేసుకున్న బీజేపీ.. ఈ సారి యూపీలో తమ సీట్లకు భారీ గండి పడే అవకాశాలు ఉన్న దృష్ట్యా దక్షిణాది రాష్ట్రాలపై దృష్టిసారించింది. దక్షిణాదిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి ఉన్నాయి. వీటిలో మొత్తం 130 సీట్లు ఉన్నాయి. ఇందులో కర్ణాటకలో మాత్రమే బీజేపీ బలంగా ఉంది. గతంలో అధికారం కూడా చేపట్టింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఆ రాష్ట్రంలోని మొత్తం 28 స్థానాల్లో 18 చోట్ల బీజేపీ విజయం సాధించింది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ రాష్ట్రంలో అతి పెద్ద పార్టీగా అవతరించింది. మిగతా దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం బీజేపీ పరిస్థితి దారుణంగా ఉంది. గడిచిన లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో ఒక స్థానంలో గెలుపొందగా, తమిళనాడులో పొత్తు వల్ల రెండు చోట్ల విజయం సాధించింది. కేరళలో అసలు ఖాతానే తెరువలేదు. ఏపీతో తెలుగుదేశం పార్టీతో పొత్తు కుదుర్చుకొని రెండు స్థానాల్లో గెలిచింది.

అన్నాడీఎంకేతో కలిసి బరిలోకి

ఈసారి తమిళనాడులో అధికార అన్నాడీఎంకేతో కలిసి బీజేపీ పోటీచేయనున్నట్లు విశ్లేషకుల అంచనా. గత లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 39 స్థానాల్లో 37 చోట్ల అన్నాడీఎంకే ఘన విజయం సాధించింది. మిగిలిన రెండు చోట్ల బీజేపీ గెలిచింది. ఇటీవల వరుసగా మోదీ తమిళనాడులో పర్యటిస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్నారు. అయితే, తన ప్రసంగంలో ఆయన ఎక్కడ కూడా ప్రాంతీయ పార్టీలను పల్లెత్తు మాట కూడా అనడం లేదు. ప్రధానంగా కాంగ్రెస్, కమ్యూనిస్టులపైనే విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఇక, తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ స్థాపించిన పార్టీ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉంది. ప్రధాని మోదీకి, రజనీకి సత్సంబంధాలు ఉన్న నేపథ్యంలో ఈ రెండు పార్టీల మధ్య పొత్తు పొడిచినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

కేరళలో కలిసివచ్చిన శబరిమల వివాదం

కేరళలో శబరిమల వివాదం బీజేపీకి కలిసి వచ్చిందనే చెప్పుకోవాలి. అయ్యప్ప ఆలయంలోకి అన్ని వయస్సుల మహిళలను అనుమతిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఊపందుకున్నాయి. సుప్రీంకోర్టు తీర్పును అమలుచేసేందుకు అధికార ఎల్డీఎఫ్ ప్రయత్నించడం మెజార్టీ హిందువుల ఆగ్రహానికి కారణమైంది. ఈ పరిణామాలను ఆరెస్సెస్, వీహెచ్‌పీ, బీజేపీ తమకు అనుకూలంగా మల్చుకున్నాయన్న వాదనలు ఉన్నాయి. గతంలో ఎన్నడూలేనంతగా కేరళలో బీజేపీ బలపడిందని తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. హిందువుల ఓట్ల ఏకీకరణ దిశగా సంఘ్‌పరివార్ గట్టిగా కృషిచేస్తున్నది. ఇటీవల త్రిస్సూర్, తిరువనంతపురం, కొచ్చిల్లో వరుసగా పర్యటించిన మోదీ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టులపై తీవ్ర విమర్శలు చేశారు. ఇదే సమయంలో ఇస్రో మాజీ శాస్త్రవేత్త నంబి నారాయణ్‌ను గూఢచారి నెపంతో తీవ్ర అవమానాలకు గురిచేశారంటూ కాంగ్రెస్‌పైనా దుమ్మెత్తిపోశారు.

నాపై మతాన్ని పులుముతున్నారు

అమెరికా అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న తులసీ గాబర్డ్ మండిపాటు



వాషింగ్టన్: తనకు, తన మద్దతుదారులకు మతం రంగు పులిమి తమపై హిందూ జాతీయవాదులన్న ముద్ర వేస్తున్నారని డెమోక్రటిక్ పార్టీ తరఫున అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీ పడుతున్న తులసీ గాబర్డ్ మండిపడ్డారు. అమెరికా కాంగ్రెస్‌కు ఎన్నికైన తొలి హిందూ మహిళగా పేరొందిన తులసి 2020లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తానని ఈ నెల 11న ప్రకటించారు. తాను భారత ప్రధాని మోదీని కలుసుకున్న సంగతిని భూతద్దంలో చూపి తనపై మతం ముద్ర వేస్తున్నారన్నారు. మాజీ అధ్యక్షుడు ఒబామా, మాజీ మంత్రి హిల్లరీ, ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్ కూడా మోదీని కలుసుకున్నారని గుర్తు చేశారు. మరోవైపు అమెరికా అధ్యక్ష బరిలో నిలిచేందుకు పోటీపడుతున్న మరో భారత సంతతి మహిళ, సెనేటర్ కమలాహారిస్ ఆదివారం ప్రచారాన్ని ప్రారంభిస్తూ ట్రంప్ విధానాలను దుయ్యబట్టారు. గతంలో ఎన్నడూలేని విధంగా దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతున్నదన్నారు.

ఆఫ్ఘన్‌లో అమెరికా, తాలిబన్ల మధ్య శాంతి ఒప్పందం

వాషింగ్టన్: 17 ఏండ్లుగా యుద్ధంతో ఛిద్రమైన ఆఫ్ఘనిస్థాన్‌లో శాంతి స్థాపనకు అమెరికా, తాలిబన్లు సూత్రప్రాయంగా అంగీకరించినట్టు న్యూయార్క్‌టైమ్స్ పత్రిక తెలిపింది. ముసాయిదా ఒప్పందం ప్రకారం.. ఆఫ్ఘన్ నేలను ఉగ్రవాదుల స్థావరం కాకుండా చూస్తామని, కాల్పుల విరమణ పాటిస్తామని, చర్చలకు వస్తామని తాలిబన్లు తెలుపగా, తమ సైనిక దళాలను ఉపసంహరిస్తామని అమెరికా తెలిపిందని వెల్లడించింది. ఆఫ్ఘన్‌లో శాంతి స్థాపన ముసాయిదా తమ వద్ద ఉందని, అది ఒప్పందంగా మారాల్సి ఉందని అమెరికా ప్రతినిధి తెలిపారు.

'ఐఆర్‌సీటీసీ' కేసులో లాలూకు బెయిల్

ఆయన భార్య రబ్రీదేవి, కుమారుడు తేజస్వి యాదవ్‌లకు కూడా..



న్యూఢిల్లీ: ఆర్జేడీ అధినేత, బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట లభించింది. ఐఆర్‌సీటీసీ కుంభకోణం కేసులో లాలూ, ఆయన భార్య రబ్రీదేవి, కుమారుడు తేజస్వి యాదవ్‌లకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.లక్ష వ్యక్తిగత పూచికత్తుపై వారికి ప్రత్యేక కోర్టు జడ్జి అరుణ్ భరద్వాజ్ సోమవారం బెయిల్ మంజూరు చేశారు. జనవరి 19న వారికి కోర్టు మధ్యంతర బెయిల్‌ను పొడిగించిన విషయం తెలిసిందే. ఆ గడువు సోమవారంతో ముగిసింది. రెండు ఐఆర్‌సీటీసీ హోటళ్ల నిర్వహణను అక్రమంగా ప్రైవేట్ సంస్థలకు అప్పగించారన్న ఆరోపణలపై సీబీఐ వారిపై దర్యాప్తు జరుపుతున్నది. దాణా కుంభకోణం కేసులో దోషిగా తేలడంతో 2017 నుంచి లాలు జైలు శిక్ష అనుభవిస్తున్నారు.


సోమవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి తన కుమారుడి వివాహానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రిక అందజేస్తున్న తెలంగాణ రాష్ట్ర విద్య, సంక్షేమ, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్ఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్ నాగేందర్‌గౌడ్


సోమవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి తన కుమార్తె వివాహానికి రావాల్సిందిగా ఆహ్వానిస్తున్న దుబ్బాక మాజీ ఎమ్మెల్యే భీంరెడ్డి కుమారుడు సిద్ధిరామ్‌రెడ్డి


సోమవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి తన కుమారుడి వివాహానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రిక అందజేస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌మిశ్రా

హైదరాబాద్ ఐఎస్‌బీ భేష్

ఫైనాన్షియల్ టైమ్స్ ర్యాంకింగ్స్‌లో 24వ స్థానం

గతేడాదితో పోల్చితే 4 స్థానాలు మెరుగు


హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఫైనాన్షియల్ టైమ్స్ (లండన్) గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్-2019లో హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) 24వ స్థానంలో నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన ఈ ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి టాప్ 25లో ఉన్నది ఒక్క ఐఎస్‌బీనే కావడం గమనార్హం. ఇక్కడ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీపీ)ను ప్రధానంగా అందజేస్తున్నారు. కాగా, గతేడాదితో పోల్చితే ఈసారి ఐఎస్‌బీ నాలుగు స్థానాలు మెరుగుపడింది. నిరుడు 28వ స్థానంలో ఉన్నది. ఇండియన్ బిజినెస్ స్కూల్స్‌లో మొత్తం 900 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా, వీరిలో 34 శాతం మహిళా విద్యార్థినులున్నారు. ప్రపంచంలోని ఏ బిజినెస్ స్కూల్స్‌లోనూ ఇంతగా లేరు. కాగా, ఐఎస్‌బీ హైదరాబాద్‌తోపాటు ఇండియన్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)-కోల్‌కతా, బెంగళూరు స్కూల్స్ ర్యాంకులు మెరుగయ్యాయి. ఐఐఎం కోల్‌కతా స్థానం 78 నుంచి 49కి మెరుగైతే, ఐఐఎం బెంగళూరు స్థానం 35 నుంచి 34కు మెరుగైంది. అయితే ఐఐఎం అహ్మదాబాద్ స్థానం మాత్రం నిరుడుతో పోల్చితే 16 స్థానాలు దిగజారి 47కు పడిపోయింది.

18 ఏండ్లలోనే గణనీయమైన వృద్ధి

ప్రైవేట్ రంగ బిజినెస్ స్కూలైన ఐఎస్‌బీకి దేశంలో రెండు క్యాంపస్‌లున్నాయి. అందులో ఒకటి హైదరాబాద్‌లో ఉంటే, మరొకటి పంజాబ్‌లోని మొహాలీలో ఉన్నది. 2001లో ప్రారంభమైన ఐఎస్‌బీ.. గడిచిన 12 ఏండ్లలో మాత్రం అత్యంత వేగంగా అభివృద్ధిని సాధించింది. ముఖ్యంగా అనేక విజయాలతో టాప్ గ్లోబల్ ఎంబీఏ కార్యక్రమాల్లో మంచి ర్యాంక్ సాధిస్తూ ఆసియా స్కూల్స్‌లోనే హైదరాబాద్ ఐఎస్‌బీ అగ్రస్థానంలో దూసుకుపోతున్నది. గ్లోబల్ బిజినెస్ స్కూల్స్ కలిగి ఉండే ఏఏసీఎస్‌బీ, ఈక్విస్ గుర్తింపు పొందిన వాటిలో ఐఎస్‌బీ ఒకటి.

ఉత్తమ ర్యాంకింగ్స్‌కు కారణాలివే

ఫైనాన్షియల్ టైమ్స్ ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో ఐఎస్‌బీ మెరుగైన ర్యాంక్ సాధించేందుకు అనేక కారణాలు కలిసొచ్చాయి. ఐఎస్‌బీ పూర్వ విద్యార్థుల వేతనాల్లో పెరుగుదల 187 శాతం ఉండటం, ఇండియన్ బిజినెస్ స్కూల్స్‌ల్లోనే అత్యధికంగా మహిళా విద్యార్థినులను తీసుకుంటుండటం, గ్రాడ్యుయేషన్ పూర్తయిన మూడు నెలల్లోపే కొత్త విద్యార్థులను తీసుకోవడం వంటి కారణాలతో మెరుగైన ర్యాంకింగ్ సాధించింది. ఇవీగాక వేతనాలు, సాధించిన లక్ష్యాలు, కెరీర్ సర్వీసెస్ విజయం, డబ్బు విలువ, పూర్వ విద్యార్థుల సిఫారసు, విద్యా సంస్థ సక్రమమైన అభివృద్ధి వంటి కారణాలు ఉత్తమ ర్యాంకింగ్‌కు దోహదపడ్డాయి.


"ప్రపంచ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు, పరిశోధనల కొనసాగింపు, మెరుగైన నిర్వహణ వంటి లక్ష్యాలతో ఇండియన్ బిజినెస్ స్కూల్‌ను ఏర్పాటుచేశాం. సంస్థను స్థాపించి 18 ఏండ్లు గడుస్తోంది. 12 ఏండ్లుగా ఉత్తమ ప్రదర్శనను కనబరుస్తున్నది. తాజాగా దేశం గర్వించేలా ఫైనాన్షియల్ టైమ్స్ గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమైన ర్యాంకును సాధించింది.

- రాజేంద్ర శ్రీవాత్సవ, ఐఎస్‌బీ డీన్

ఐఎస్‌బీలో గ్రాడ్యుయేషన్ చేయాలంటే కనీసం రెండేండ్లు ఉద్యోగం చేసిన అనుభవం ఉండాలి. చాలామంది విద్యార్థులు ఐదేండ్లు ఉద్యోగం చేసిన అనంతరం ఐఎస్‌బీలో అడ్మిషన్ పొందుతున్నారు. ఐఎస్‌బీలో గ్రాడ్యుయేషన్ చేయక ముందుతో పోల్చితే.. పూర్తి చేసిన మూడేండ్ల తర్వాత సగటున ఐఎస్‌బీ పూర్వ విద్యార్థులు పొందుతున్న వేతనాలు అత్యధికంగా ఉంటున్నాయి. ఒక్క 2019 సంవత్సరానికి సంబంధించి చూస్తే.. ఏడాదికి రూ. 1,56,000 డాలర్లు వేతనంగా తీసుకుంటుండడం గమనార్హం.

ఐఎస్‌బీ సాధించిన విజయాలు గణాంకాల్లో..

ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ప్రారంభం నాటి నుంచి ఇప్పటివరకు ఏటా తన ర్యాంకింగ్స్‌ను మెరుగుపర్చుకుంటున్నది. ఫైనాన్షియల్ టైమ్స్ ప్రకటించిన ర్యాంకింగ్స్ ప్రకారం.. 2015 సంవత్సరంలో 33వ స్థానంలో నిలువగా, ప్రస్తుతం అది 24వ స్థానానికి చేరుకుని.. దేశంలోని బిజినెస్ స్కూల్స్‌లో అగ్రస్థానంలో నిలిచింది. గత ఏడాది 28వ స్థానంలో ఉండగా, నాలుగు స్థానాలు మెరుగుపడింది. ఐఎస్‌బీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన మూడేండ్ల అనంతరం పూర్వ విద్యార్థుల వేతనాలు 2015 సంవత్సరంలో 131 శాతం పెరుగుదల ఉండగా, 2019కి వచ్చేసరికి 187 శాతం పెరుగుదల కనిపిస్తున్నది. ఐఎస్‌బీ విద్యార్థులు 2015 సంవత్సరంలో ఏడాదికి 1,26,000 డాలర్లు వేతనంగా తీసుకోగా, 2019 సంవత్సరంలో 1,56,000 డాలర్లను వేతనంగా పొందుతున్నారు. ఇక గతేడాదితో పోల్చుకుంటే ఇదీ ఏడు వేల డాలర్లు అధికంగా ఉంది.

'విదేశీ విద్య' దరఖాస్తులకు గడువు ఫిబ్రవరి 20

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విదేశీ విద్యానిధి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 20 వరకు గడువు విధించినట్టు క్రిస్టియన్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ ఏహెచ్ఎన్ కాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పథకం కింద విదేశాల్లో విద్యనభ్యసించే ఒక్కో విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షల ఆర్థికసాయం అందిస్తుందని పేర్కొన్నారు.

వీఆర్వో పోస్టుల వెబ్ ఆప్షన్లకు మరో అవకాశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వీఆర్వో పోస్టుల భర్తీలో భాగంగా వెబ్‌ఆప్షన్లకు మరోసారి అవకాశం కల్పించామని టీఎస్‌పీఎస్సీ తెలిపింది. గతంలో వెబ్‌ఆప్షన్లు పెట్టుకోనివారు, ఉన్న ఆప్షన్ల సవరణ కోసం మంగళవారం నుంచి 31 వరకు నమోదు చేసుకోవచ్చని, వెబ్‌సైట్లో లింక్ ఇచ్చామని సోమవారం పేర్కొన్నది. ఇప్పటికే సరైన ఆప్షన్లు ఇచ్చినవారు మళ్లీ దరఖాస్తు చేసుకోవద్దని, ఒకవేళ పెట్టుకుంటే.. పాత ఆప్షన్లు వర్తించవని వెల్లడించింది.

వెబ్‌సైట్లో పలు పోస్టుల ఇంటర్వ్యూల జాబితా

డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌లోని రేడియోలజికల్ ఫిజిక్స్, ఫిజిసిస్ట్ పోస్టులకు ఫిబ్రవరి 1న తమ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. అర్హుల వివరాలను వెబ్‌సైట్లో పొందుపరిచామని పేర్కొన్నది.


షూ పాలిషింగ్ యూనిట్

ఎస్సీలకు మొబైల్ షూ పాలిషింగ్ యూనిట్లు

కుటుంబపోషణకు చర్మకార వృత్తిపై ఆధారపడ్డ ఎస్సీలకు రాష్ట్ర ప్రభుత్వం మొబైల్ షూ పాలిషింగ్ యూనిట్లు ఇవ్వనున్నది. రాష్ట్రంలోనే తొలిసారిగా హైదరాబాద్ జిల్లాను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపికచేసింది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 20 యూనిట్లను జిల్లాకు కేటాయించారు. వీటి పనితీరు బాగుండి ఆదాయం మెండుగా ఉంటే మరో 30 యూనిట్లను ఇవ్వనున్నారు. హైదరాబాద్‌లో 50 యూనిట్లు విజయవంతంగా నడిస్తే.. దశలవారీగా రాష్ట్రమంతటా అమలుచేయనున్నారు. ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ ఇవ్వనుండగా, మరికొంత మొత్తాన్ని బ్యాంకు రుణంగా సమకూర్చనున్నది. త్వరలో ఆశావాహుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు.

-నమస్తే తెలంగాణ, హైదరాబాద్ సిటీబ్యూరో

రైతులకు తాయిలాల ప్రకటనలో జాప్యం



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల ముంగిట రైతులను ప్రసన్నం చేసుకొనేందుకు వారికోసం కొన్ని తాయిలాలు ప్రకటించాలని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఆ మేరకు నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్నది. రైతుల సమస్యల పరిష్కారంపై నిర్ణయాలు తీసుకొనేందుకు సోమవారం కేంద్ర క్యాబినెట్ సమావేశమవుతున్నదని ఆదివారం వార్తలు వెలువడ్డాయి. కానీ సోమవారం క్యాబినెట్ భేటీ జరుగలేదు. చిన్న, సన్నకారు రైతులు ఎదుర్కొంటున్న ఆదాయ లోటు సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ చేసిన ప్రతిపాదనలపై చర్చను మంత్రివర్గ సమావేశం ఎజెండాగా నిర్ణయించారు. వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు కొన్ని దీర్ఘకాల, స్వల్పకాల పరిష్కారాలను కూడా వ్యవసాయ శాఖ సిఫారసు చేసినట్టు తెలిసింది. అయితే ఈ పరిష్కారాలు భారీ వ్యయంతో కూడుకున్నవైనందున, వాటిపై సమగ్రంగా చర్చించి ఆ తరువాత నిర్ణయించాలని ప్రభుత్వం భావించినట్టు తెలుస్తున్నది. పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందే ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్యాకేజీ ప్రకటిస్తుందని ఆ శాఖ మంత్రి రాధామోహన్‌సింగ్ సూచనప్రాయంగా తెలిపారు.

శబరిమల తరహాలో అయోధ్యనూ తేల్చాలి

- సుప్రీంకోర్టుకు కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ సూచన
- 70 ఏండ్లుగా కోర్టుల్లో అయోధ్య వివాదం పెండింగ్‌లో ఉన్నదని వ్యాఖ్య



పాట్నా: సుప్రీంకోర్టులో అయోధ్య భూవివాద కేసు విచారణ నెమ్మదిగా సాగుతున్నదని కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. శబరిమల ఆలయ వివాదంపై (అన్ని వయస్సుల మహిళలను అనుమతినిస్తూ తీర్పు) ఇచ్చినట్లే అయోధ్య అంశంపైనా 'సాహసోపేత నిర్ణయం తీసుకోవాలి' అని సోమవారం మీడియాతో అన్నారు. ఒక పౌరుడిగా ఈ వ్యాఖ్య చేస్తున్నానని, కేంద్ర మంత్రిగా కాదని తెలిపారు. అయోధ్య వివాదంపై మంగళవారం జరుగాల్సిన రాజ్యాంగ ధర్మాసనం విచారణ ఒక న్యాయమూర్తి లేక వాయిదా పడటంపై మంత్రి ఈ విధంగా స్పందించారు. శబరిమల దేవాలయం అంశంతోపాటు అర్బన్ నక్సల్స్, కర్ణాటకలో గతేడాది అసెంబ్లీ ఎన్నికల తర్వాత పొత్తు దరిమిలా తలెత్తిన అనిశ్చితిపైనా సుప్రీంకోర్టు రాత్రి వేళల్లో జోక్యం చేసుకున్న సంగతిని రవిశంకర్ గుర్తు చేశారు. కానీ అయోధ్య మాత్రం ఆ విధంగా సర్వోన్నత న్యాయస్థానం ఎందుకు వెళ్లలేకపోతున్నదో అర్థం కావడం లేదన్నారు. రాజ్యాంగ పరిధిలోనే అయోధ్యలో రామ మందిరం నిర్మాణం జరుగుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా కూడా చెప్పారని రవిశంకర్ ప్రసాద్ గుర్తు చేశారు. 70 ఏండ్లుగా వివాదం న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్నదని చెప్పారు. అలహాబాద్ హైకోర్టు తీర్పు చెప్పడానికి 60 ఏండ్లు పట్టిందన్నారు. అలహాబాద్ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణ సుప్రీంకోర్టులో పదేండ్లుగా పెండింగ్‌లో ఉన్నదని అన్నారు.

నేడు విద్యార్థులతో ప్రధాని 'పరీక్ష పే చర్చ'


- హాజరు కానున్న 2000 మంది విద్యార్థులు



న్యూఢిల్లీ: త్వరలో వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం 'పరీక్ష పే చర్చ 2.0' కార్యక్రమంలో విద్యార్థులతో ఇష్టాగోష్టిగా ముచ్చటించనున్నారు. ఈ కార్యక్రమంలో 2,000 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. పరీక్షలకు సంబంధించిన అంశాలు, ఒత్తిడిని అధిగమించేందుకు విద్యార్థులు తీసుకోవాల్సిన చర్యలను ప్రధాని సూచిస్తారు. రష్యా, నైజీరియా, ఇరాన్, నేపాల్, కువైట్, దోహా, సౌదీ అరేబియా, సింగపూర్‌లలోని భారత సంతతి విద్యార్థులతోనూ ఇష్టాగోష్టిగా చర్చిస్తారు. గతేడాది ఢిల్లీతోపాటు దేశ రాజధాని ప్రాంతం పరిధిలోని విద్యార్థులు మాత్రమే ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గతేడాది 162 మందికి ఉరిశిక్షలు

- 18 ఏండ్ల తర్వాత ఇదే గరిష్ఠం



న్యూఢిల్లీ: దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని దిగువ న్యాయస్థానాలు గతేడాది వివిధ కేసుల్లో 162 మంది దోషులకు ఉరిశిక్ష విధించాయి. గత 18 ఏండ్లలో ఇది అత్యధికమని ఢిల్లీలోని న్యాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన 'భారత్‌లో ఉరిశిక్షలు: వార్షిక గణాంకాలు 2018' నివేదిక పేర్కొంది. అత్యధికంగా మధ్యప్రదేశ్‌లోని కోర్టులు 22 మందికి ఉరిశిక్ష విధిస్తూ తీర్పు చెప్పాయి. వీటిలో ఎక్కువగా 12 ఏండ్లలోపు బాలికలపై లైంగిక దాడుల కేసులే ఉన్నాయి. తర్వాతి స్థానాల్లో ఉన్న మహారాష్ట్రలో 16, కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్‌లలో 15 మందికి చొప్పున ఉరిశిక్షలు ఖరారయ్యాయి. అయితే 11 కేసుల్లో ఉరిశిక్షలను యావజ్జీవ జైలుశిక్షగా సుప్రీంకోర్టు సవరించింది. 2012లో జరిగిన ఢిల్లీ గ్యాంగ్ రేప్ (నిర్భయ) కేసులో ముగ్గురు దోషులకు దిగువ కోర్టు విధించిన మరణ దండనను సుప్రీంకోర్టు ధ్రువీకరించింది. మొత్తమ్మీద గత నెలాఖరు నాటికి 426 మంది ఖైదీలు ఉరిశిక్ష కోసం వేచి చూస్తున్నారు.

12వ తరగతి వరకు ఉచిత విద్య!

- 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయింపు
- విద్యాహక్కు చట్టం పరిధిని పెంచే యోచన
- ఎన్నికల వేళ మోదీ సర్కార్ మరో వరం!



న్యూఢిల్లీ, జనవరి 28: లోక్‌సభ ఎన్నికల ముంగిట కేంద్ర ప్రభుత్వం పేదలకు అనుకూలమైన మరో నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తున్నది. బాలలు ఉచితంగా విద్యను పొందే హక్కును 12వ తరగతి వరకు పొడిగించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు తెలిసింది. 'బాలలు ఉచిత, నిర్బంధ విద్యను పొందే హక్కు (ఆర్టీఈ) చట్టం, 2009ను పొడిగించే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. ఈ విషయంలో తీసుకొనే నిర్ణయాన్ని తెలియజేస్తాం' అని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి (హెచ్చార్డీ) శాఖ విద్య హక్కుల కార్యకర్త అశోక్ అగర్వాల్‌కు రాసిన లేఖలో పేర్కొంది. ప్రస్తుతం విద్యా హక్కు చట్టం ఆరు నుంచి 14 ఏండ్ల లోపు బాలలకు ఒకటి నుంచి 8వ తరగతి వరకు వర్తిస్తున్నది. ఈ చట్టం ప్రకారం అన్ని ప్రైవేట్ పాఠశాలలు (మైనారిటీ విద్యా సంస్థలు మినహా) 25 శాతం సీట్లను పేద విద్యార్థుల కోసం కేటాయించాలి. విద్యా హక్కు చట్టం పరిధిని పెంచాలన్న ప్రతిపాదనను పాలకులు ఏడేండ్ల క్రితమే అటకెక్కించారు. యూపీఏ సర్కార్ అధికారంలో ఉన్నప్పుడే 2012లో విద్యా హక్కు చట్టం పరిధిని విస్తరించాలని కేంద్ర విద్యా సలహా మండలి (సీఏబీఈ) సిఫారసు చేసింది. అయితే విద్యా హక్కు చట్టం పరిధిని విస్తరించే ప్రతిపాదన ఏదీ లేదని గత ఏడాది మార్చిలో హెచ్‌ఆర్డీ శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ పార్లమెంట్‌లో చెప్పారు. కానీ లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతుండడంతో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి విద్య, ఉద్యోగాలలో 10 శాతం రిజర్వేషన్ కల్పించిన ప్రభుత్వం ఇప్పుడు విద్యా హక్కు చట్టం పరిధిని కూడా పెంచాలని ఆలోచిస్తున్నది. ఢిల్లీ హైకోర్టు అడ్వకేట్ కూడా అయిన అశోక్ అగర్వాల్ గత నవంబర్‌లో అఖిలభారత తల్లిదండ్రుల అసోసియేషన్ తరపున హెచ్చార్డీ మంత్రి ప్రకాశ్ జవదేకర్‌కు ఒక లేఖ రాస్తూ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు 8వ తరగతి చదివిన తరువాత బడి మానేయాల్సి వస్తున్నదని తెలిపారు. ఆర్టీఈ చట్టం ప్రకారం 8వ తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తున్న పాఠశాలలు ఆ తరువాత విద్యార్థులను ఫీజు కట్టాలని లేదా స్కూలు వదిలి వెళ్లిపోవాలని ఒత్తిడి చేస్తున్నాయని తెలిపారు. దీంతో 8వ తరగతి వరకూ ఉచితంగా ప్రైవేట్ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంలో చదువుకున్న విద్యార్థులు ఆ తరువాత 9వ తరగతి కోసం ప్రభుత్వ పాఠశాలల్లో చేరాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉచితంగా విద్యనందించాలన్న లక్ష్యం నెరవేరటం లేదని తెలిపారు. అందువల్ల విద్యార్థులకు ఉన్నత విద్య పూర్తయ్యేంత వరకు ఉచిత విద్యనందించాలని కోరారు.

పేదలందరికీ కనీస ఆదాయం

లోక్‌సభ ఎన్నికల ముంగిట కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ సంచలన ప్రకటన

తమ ప్రభుత్వం ఏర్పాటైతే ప్రతి పేదవాడికీ కనీస మొత్తంలో ఆదాయం కల్పిస్తామని వెల్లడి

దేశంలో ఆకలి, పేదరికం లేకుండా చేస్తామని వ్యాఖ్య



'కిసాన్ అబ్‌హార్ సమ్మేళన్'లో నాగలి చేతబట్టిన రాహుల్ గాంధీ, ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బఘేల్

న్యూఢిల్లీ, జనవరి 28: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశంలోని ప్రతి పేదవాడికీ కనీస ఆదాయం కల్పిస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. 1971 లోక్‌సభ ఎన్నికల్లో తన నాయనమ్మ ఇందిరాగాంధీకి ఘన విజయం అందించిన 'గరీబీ హఠావో' (పేదరిక నిర్మూలన) నినాదాన్ని ప్రతిధ్వనిస్తూ ఆయన ఈ హామీని ప్రకటించారు. ఛత్తీస్‌గఢ్‌లో 15 ఏండ్ల తర్వాత తిరిగి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు ముఖ్యంగా రైతులకు కృతజ్ఞత తెలిపేందుకు సోమవారం రాయ్‌పూర్‌లో నిర్వహించిన 'కిసాన్ అబ్‌హార్ సమ్మేళన్' కార్యక్రమంలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, మరో నాలుగు రోజుల్లో మోదీ సర్కారు కేంద్ర తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో రాహుల్ గాంధీ కీలక హామీని ప్రకటించారు. 'కాంగ్రెస్ పార్టీ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నది. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటైతే కనీస ఆదాయ హామీని అమలుపరుస్తాం. దీని ద్వారా దేశంలోని ప్రతి పేదవాడు కనీస ఆదాయాన్ని పొందుతారు. ఇక దేశంలో ఆకలి, పేదరికం ఉండబోదు' అని రాహుల్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఈ హామీని అమలు చేస్తామని ఆయన ప్రకటించారు. ఈ నిర్ణయం చరిత్రాత్మకమని కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం కొనియాడారు. అట్టడుగు వర్గాల జీవితాల్లో ఇది కీలక మలుపు కానుందని పేర్కొన్నారు. 'లక్షలాది మంది సోదరులు, సోదరీమణులు పేదరికంలో మగ్గుతుంటే మనం నవభారతాన్ని నిర్మించలేం' అని రాహుల్ అనంతరం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. '2019లో అధికారంలోకి వస్తే ఆకలి, పేదరికాన్ని నిర్మూలించేందుకు ప్రతి పేదవాడికి కనీస ఆదాయం కల్పించేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది. ఇది మా విజన్, హామీ' అని ట్వీట్ చేశారు. రాయ్‌పూర్ సభలో రాహుల్ మాట్లాడుతూ.. ప్రపంచంలో ఏ ప్రభుత్వమూ చేయనిది కాంగ్రెస్ ప్రభుత్వం చేయబోతున్నదని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం 15 మంది బడా పారిశ్రామికవేత్తలకు రూ.3.5 లక్షల కోట్ల రుణాలను రద్దు చేసిందని, అయితే రైతు రుణాలను మాత్రం మాఫీ చేయడం లేదని మండిపడ్డారు. రాఫెల్ ఒప్పందం ద్వారా అనిల్ అంబానీకి కేంద్రం రూ.30 వేల కోట్ల లబ్ధి చేకూర్చిందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం రెండు రకాల భారత్‌లను నిర్మించేందుకు యత్నిస్తున్నదని ఆరోపించారు. మొదటిది.. పారిశ్రామికవేత్తలకు రుణాల రద్దు, రాఫెల్ కుంభకోణం, అనిల్ అంబానీ, నీరవ్ మోదీ, విజయ్ మాల్యా, మెహుల్ చోక్సీలతో కూడినది అని చెప్పారు. ఈ భారతంలో మీకు రుణాలు కావాలంటే రుణాలు లభిస్తాయి, రాఫెల్ కాంట్రాక్టులు దక్కుతాయి, నీరు, భూమి, కరెంటు అన్నీ లభిస్తాయి అని వ్యాఖ్యానించారు. ఇక రెండో భారతం పేద రైతులదని, ఇక్కడ ఏమీ దక్కవని చెప్పారు. ఇక్కడ 24 గంటలూ మన్‌కీ బాత్ మాత్రమే వినిపిస్తుందని పరోక్షంగా ప్రధాని మోదీ మాసాంతపు మన్‌కీబాత్‌ని ఉద్దేశిస్తూ విమర్శించారు. కార్యక్రమంలో పలువురు రైతులకు ఆయన రుణమాఫీ పత్రాలను అందజేశారు.

గోవా ఆడియో టేపులు అసలైనవే

'రాఫెల్ ఒప్పందానికి సంబంధించి గోవా ఆడియో టేపులు విడుదల చేసి 30 రోజులయింది. ఎఫ్ఐఆర్‌కు గానీ, విచారణకు గానీ ఇప్పటికీ ఆదేశించలేదు. ఆ మంత్రిపైనా చర్యల్లేవు. ఆ టేపులు అసలైనవేనని సుస్పష్టం. ప్రధాని మోదీపై అధికారం చలాయించగల కీలక రాఫెల్ పత్రాలు గోవా సీఎం పారికర్ వద్ద ఉన్నాయి' అని రాహుల్ సోమవారం ట్వీట్ చేశారు. రాఫెల్ ఒప్పంద పత్రాలన్నీ తన వద్ద ఉన్నాయని సీఎం పారికర్ తనతో చెప్పారని గోవా మంత్రి విశ్వజిత్ రాణే వేరొకరితో చెబుతున్నట్లుగా ఉన్న ఆడియో టేపులను ఈ నెల మొదటివారంలో కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన విషయం తెలిసిందే.

వందల హామీల్లో ఇదొకటి: బీజేపీ

రాహుల్ హామీపై బీజేపీ విమర్శలు గుప్పించింది. అమలుకు నోచుకోని వందల హామీల్లో ఇదొకటని కేంద్రమంత్రి రవిశంకర్‌ప్రసాద్ ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చినప్పటికీ ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతు రుణాలను మాఫీ చేయలేదని చెప్పారు. తాజా హామీ కూడా అలాంటిదేనన్నారు. కాంగ్రెస్ 58 ఏండ్లు కేంద్రంలో అధికారంలో ఉందని, ఇప్పటివరకు వేల హామీలు ఇచ్చిందని పేర్కొన్నారు. వాటిని అమలు చేసి ఉంటే, దేశం మరోలా ఉండేదన్నారు. రాహుల్ హామీ ఆలోచన లేకుండా తీసుకున్న నిర్ణయమని చెప్పారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హద్దు మీరుతున్నారు

- అదుపులో పెట్టుకోకపోతే సీఎం పీఠం నుంచి వైదొలుగుతా
- కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి హెచ్చరిక



బెంగళూరు: కర్ణాటక సీఎం హెచ్‌డీ కుమారస్వామి తమ సంకీర్ణ ప్రభుత్వ భాగస్వామి కాంగ్రెస్‌కు నేరుగా ఘాటు హెచ్చరిక చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను అదుపులో పెట్టుకోకుంటే సీఎం పదవి నుంచి వైదొలిగేందుకు సిద్ధమని సోమవారం తెలిపారు. తన దృష్టిలో ఇప్పటికీ సిద్ధరామయ్యే సీఎం అని కర్ణాటక మంత్రి సీ పుట్టరంగశెట్టి వ్యాఖ్యానించడంతో కుమారస్వామి ఈ హెచ్చరిక చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హద్దుమీరుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తన వ్యవహారం కాదని, హద్దుమీరి ప్రవర్తిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఆ పార్టీయే అదుపులో పెట్టాలన్నారు. దీనిపై మాజీ సీఎం, కాంగ్రెస్ నేత సిద్ధరామయ్య స్పందిస్తూ.. రాష్ట్రంలోని సంకీర్ణ ప్రభుత్వంలో సమస్యేమీ లేదని, పరిస్థితిని చక్కదిద్దేందుకు కుమారస్వామితో మాట్లాడుతానని మీడియాతో చెప్పారు. 'సమస్యను సృష్టిస్తున్నది మీడియానేనని మండిపడ్డారు. కుమారస్వామి నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా అభివృద్ధి జరుగ లేదని సిద్ధరామయ్య వర్గం ఎమ్మెల్యేలు ఆదివారం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన విషయం విదితమే. తన దృష్టిలో ఇప్పటికీ సిద్ధరామయ్యే సీఎం అని పుట్టరంగశెట్టి పేర్కొనగా.. సీఎంగా సిద్ధరామయ్యకు మరో ఐదేండ్లు అవకాశమి చ్చి ఉంటే నిజమైన అభివృద్ధి జరిగేదని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఎస్టీ సోమశేఖర్ అన్నారు.

శివసేన బీజేపీకి పెద్దన్న: సంజయ్‌రౌత్



ముంబై: ఇటీవల పరస్పరం విమర్శలు చేసుకున్న కమలనాథులు, శివసైనికులు లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో కలిసి వెళ్తామన్న సంకేతాలు ఇస్తున్నారు. మహారాష్ట్రలో తాము బీజేపీకి 'పెద్దన్న' వంటి వారమని, ఆ హోదా అలాగే కొనసాగుతుందని శివసేన నేత సంజయ్ రౌత్ అన్నారు. ఈ వ్యాఖ్యపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ స్పందిస్తూ, శివసేనతో పొత్తు బీజేపీకి ఇష్టమేనని, అయితే తాము అందుకు తహతహలాడటం లేదన్నారు. శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రేతో భేటీ తర్వాత సంజయ్‌రౌత్ మీడియాతో మాట్లాడుతూ, పొత్తుపై బీజేపీ నుంచి ఏ ప్రతిపాదన రాలేదని చెప్పారు. తమతో పొత్తు పెట్టుకోవాలనుకునే వారు ఇప్పటికే చర్చలు ప్రారంభించారని అన్నారు.

దేశ రక్షణకు కఠిన నిర్ణయాలు

- ప్రధాని మోదీ వెల్లడి



సోమవారం ఢిల్లీలో ప్రధాని మోదీకి గౌరవవందనం సమర్పిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

న్యూఢిల్లీ, జనవరి 28: రక్షణరంగంలో కొన్ని దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న యుద్ధ విమానాల కొనుగోలు, ఆధునీకరణకు సంబంధించిన ప్రాజెక్టులు తమ ప్రభుత్వ హయాంలో కార్యరూపం దాల్చాయని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో దేశ భద్రత కోసం అవసరమైతే కఠిన నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఎన్సీసీ క్యాడెట్లను ఉద్దేశించి ప్రధాని మాట్లాడుతూ, భారత్ శాంతి కోసం పాటుపడే దేశమని, అయితే దేశ భద్రత కోసం ఎటువంటి చర్యలు తీసుకోవడానికైనా వెనుకాడబోదని పేర్కొన్నారు. నవ భారతంలో అవినీతికి చోటు ఉండరాదని, అవినీతికి పాల్పడే వారిని వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. నవ భారతంలో కర్మయోగులకు (పనుల ద్వారా తమను తాము రుజువు చేసుకొనేవారికి) అవకాశాలు, గౌరవం లభిస్తాయని చెప్పారు. 'మీ కుటుంబ నేపథ్యం, మీ ఆర్థిక స్థితి మీ భవిష్యత్తును నిర్దేశించలేదు.. మీ నైపుణ్యం, కఠోర శ్రమ, ఆత్మవిశ్వాసం మాత్రమే మీకు సానుకూల ఫలితాలనిస్తాయి' అని ఉద్బోధించారు. ఓవైపు రాఫెల్ ఒప్పందం విషయంలో విమర్శలు ఎదుర్కొంటున్న ప్రధాని, తమ ప్రభుత్వ హయాంలోనే క్షిపణులు, యుద్ధ ట్యాంకులు, హెలికాప్టర్లు దేశంలో తయారవుతున్నాయని చెప్పారు. దేశ రక్షణ, భద్రత కోసం గత నాలుగున్నరేండ్లలో ఎన్నో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. భూ ఉపరితలం నుంచి, జలాంతర్గాముల నుంచి, యుద్ధ విమానాల నుంచి బాంబులు, అణు క్షిపణులను ప్రయోగించగల సైనికశక్తి ఉన్న అతి కొద్ది దేశాల సరసన ఇప్పుడు భారత్ కూడా చేరిందని చెప్పారు. దేశాభివృద్ధిలో ఎన్సీసీ క్యాడెట్ల పాత్రను ప్రశంసించిన మోదీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వచ్చే ఎన్నికల్లో భారీ సంఖ్యలో ఓటు వేసేలా ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

ముస్లిం మహిళ వెంటపడ్డం తప్ప సాధించిందేమిటి?

కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు గుండూరావుపై కేంద్రమంత్రి అనంత్‌కుమార్ హెగ్డే వ్యాఖ్యలు



బెంగళూరు: కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి అనంత్ కుమార్ హెగ్డే, కర్ణాటక రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దినేశ్ గుండురావు మధ్య ట్విట్టర్ వార్ నడుస్తున్నది. బీజేపీ తరఫున ఉత్తర కన్నడ నుంచి ఐదుసార్లు ఎంపీగా ఎన్నికైన హెగ్డే ఆదివారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. హిందూ మహిళను తాకిన చేయిని నరికివేయాలని ఆయన ప్రజలను కోరారు. ఈ వ్యాఖ్యలను గుండూరావు ఖండించారు. కేంద్ర మంత్రిగా హెగ్డే రాష్ట్రానికి ఏం సాధించారని ప్రశ్నించారు. దీంతో హెగ్డే.. గుండూరావు భార్యను వివాదంలోకి లాగారు. ముస్లిం మహిళ వెంటపడడమే పీసీసీ అధ్యక్షుడు సాధించినది అని ఎద్దేవా చేశారు. గుండూరావు భార్య టబు ముస్లిం మతం వారు. హెగ్డే వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన గుండూరావు... ఆయనకు సభ్యత లేదని మండిపడ్డారు. బహుశా ఆయన హిందూ పవిత్ర గ్రంథాల నుంచి ఏమీ నేర్చుకున్నట్లు లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ బీజేపీ ఎంపీలు ప్రతాప్ సింహా, శోభా కరండ్లజే.. గుండూరావు మతాంతర వివాహంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తాను రాజకీయాలకు దూరమని, దయచేసి రాజకీయ వివాదాల్లోకి తనను లాగొద్దని గతంలోనే టబు అభ్యర్థించారు. హెగ్డే వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ స్పందిస్తూ.. ఆయన వ్యాఖ్యలు ప్రతీ భారతీయుడికి నగుబాటు అని, కేంద్రమంత్రి పదవికి హెగ్డే తగని వ్యక్తి అని పేర్కొన్నారు.

మొక్కుబడిగానే.. అంబేద్కర్‌కు భారతరత్న

- నిండు మనసుతో ఇవ్వలేదు
- అగ్రకులాలకే ఈ పురస్కారాన్ని ఎక్కువగా ఇస్తున్నారు
- వంచిత్ బహుజన్ అఘాదీ సభలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ





థానే: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు నిండుమనసుతో కాక మొక్కుబడిగా భారతరత్న అవార్డును ఇచ్చారని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. మహారాష్ట్రలోని కల్యాణి జిల్లాలో సోమవారం ఆయన వంచిత్ బహుజన్ అఘాదీ (వీబీఏ) సభలో ప్రసంగిస్తూ.. దేశంలోని దళితులు, ఆదివాసీలు, ముస్లింలు, పేదలు, అగ్రవర్ణాలు, బ్రాహ్మణులకు మొత్తం ఎన్ని భారతరత్న అవార్డులు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. 70 ఏండ్లుగా అణచివేతకు గురైనవారంతా పాలకులపై తిరగబడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎంఐఎంతోపాటు అంబేద్కర్ మనుమడు ప్రకాశ్ అంబేద్కర్ నేతృత్వంలోని భరిపా బహుజన్ మహాసంఘ్ (బీబీఎం) వంచిత్ బహుజన్ అఘాదీని ఏర్పాటు చేశాయి. దేశానికి కావలసింది కాపలాదారు కాదని, సంరక్షకుడని పరోక్షంగా ప్రధాని మోదీని విమర్శించిన అసద్.. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీని 'జంధ్యధారి'గా పేర్కొన్నారు. రాహుల్, మోదీతోపాటు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్, ఎన్సీపీ అధినేత శరద్ పవార్ లాంటి నేతలతో ఒరిగేదేమీ ఉండదని, ప్రకాశ్ అంబేద్కర్ లాంటి నేతల సారథ్యంలోని పార్టీలతో మాత్రమే పేదలకు, దళితులకు న్యాయం అందుతుందన్నారు. భారతరత్న అవార్డుకు మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీతోపాటు ఆరెస్సెస్ నేత, సామాజిక ఉద్యమకారుడు నానాజీ దేశ్‌ముఖ్, ప్రముఖ సంగీత దర్శకుడు భూపేన్ హజారికా ఎంపికైన విషయం విదితమే.

'నిర్జీవం'గా నాసా 'అపార్చునిటీ'!

వాషింగ్టన్: అరుణగ్రహంపై 15 ఏండ్లుగా సంచరిస్తూ అక్కడి సమాచారం చేరవేసిన నాసా 'అపార్చునిటీ రోవర్' ఏడు నెలలుగా పనిచేయడం లేదని శాస్త్రవేత్తలు తెలిపారు. గతేడాది జూన్ 10 నుంచి ఏ సంకేతాలు లేవన్నారు. అంగారక గ్రహం చుట్టూ లేచిన దుమ్ము తుఫాన్ వల్ల రోవర్‌పై మట్టి పేరుకోవడంవల్లే సూర్యరశ్మి అందక దానిలోని సౌరశక్తితో పనిచేసే బ్యాటరీలను చార్జింగ్ చేసుకోలేకపోయిందంటున్నారు. రోవర్‌ను పనిచేయించేందుకు 600కుపైగా ప్రయత్నాలు చేశామని, అవేవీ ఫలించక అది 'నిర్జీవం'గా మారిందని నిర్ధారణకు వచ్చామన్నారు.

మైకు లాగితే.. దుపట్టా ఊడింది

- మహిళా కార్యకర్తపై 'సిద్దూ' దౌర్జన్యం
- అభినవ దుశ్శాసనుడిగా అభివర్ణించిన బీజేపీ



మహిళ నుంచి మైక్ లాక్కుంటున్న సిద్ధరామయ్య

బెంగళూరు, జనవరి 28: కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇబ్బందుల్లో చిక్కుకున్నారు. సోమవారం మైసూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే యతీంద్ర (సిద్ధరామయ్య కుమారుడు)పై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన జమలార్ అనే కాంగ్రెస్ మహిళా కార్యకర్త (జిల్లా పంచాయతీ మాజీ సభ్యురాలు) నుంచి మైకును లాక్కునేందుకు సిద్ధరామయ్య ప్రయత్నించడంతో ఆమె దుపట్టా ఊడిపోవడం వివాదానికి దారితీసింది. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత యతీంద్ర మళ్లీ ఇప్పుడే కనిపిస్తున్నారని ఆమె ఫిర్యాదు చేసింది. దీంతో ఇబ్బందికి గురైన సిద్ధరామయ్య.. తన కుమారుడు తరచుగా నియోజకవర్గంలో పర్యటిస్తున్నట్టు చెప్పారు. అయితే అందులో నిజం లేదని విభేదించిన ఆ మహిళ అక్కడ ఉన్న బల్లను పదేపదే గట్టిగా చరచడంతో సిద్ధరామయ్య సహనాన్ని కోల్పోయారు. ఆమె చేతిలోని మైకును లాక్కునేందుకు ప్రయత్నించడంతో మైకుతోపాటు దుపట్టా కూడా ఊడి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో సిద్ధరామయ్యను 'అభినవ దుశ్శాసనుడు'గా బీజేపీ అభివర్ణించింది. ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించి కర్ణాటక పోలీసులకు లేఖ రాయనున్నట్టు జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మ తెలిపారు.

ఆమె నా సోదరి లాంటిది: సిద్ధరామయ్య

అయితే ఈ ఘటన అనుకోకుండా జరిగిందని, ఆ మహిళ తన సోదరి లాంటిదని, ఆమె పట్ల తనకు ఎటువంటి దురుద్దేశం లేదని సిద్ధరామయ్య పేర్కొన్నారు.

సిద్దూ పెద్దన్న లాంటివారు: జమలార్

అనంతరం జమలార్ విలేకరులతో మాట్లాడుతూ.. సిద్ధరామయ్య తనకు పెద్దన్న లాంటివారని, ఆయన తనను కొట్టినా బాధపడేదాన్ని కాదన్నారు. ఆయనను కలిసేందుకు ఎన్నిసార్లు ప్రయత్నించినా కుదరకపోవడంతో పరుషంగా మాట్లాడాల్సి వచ్చిందన్నారు.

కేవీ స్కూళ్లలో సంస్కృత శ్లోకాల పఠనంపై అభ్యంతరం

- రాజ్యాంగ ధర్మాసనానికి సిఫార్సు చేసిన సర్వోన్నత న్యాయస్థానం



న్యూఢిల్లీ, జనవరి 28: కేంద్రీయ విద్యాలయాల్లో (కేవీ స్కూళ్లలో) విద్యార్థులు సంస్కృత, హిందీ శ్లోకాలు, పద్యాలు పఠించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన రిట్ పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం సోమవారం వాదనలు విన్నది. విద్యార్థులను శాస్త్రీయంగా తీర్చిదిద్దాల్సిన విద్యా సంస్థల్లో దేవుడిపై ఆధారపడే తత్త్వాన్ని పెంపొందిస్తున్నారని, రాజ్యాంగంలోని అధికరణ 19 కల్పిస్తున్న భావప్రకటనా స్వేచ్ఛను ఇది హరించడమేనని ఆరోపిస్తూ జబల్‌పూర్ వాసి, న్యాయవాది వినాయక్ షా ఈ పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ రోహింటన్ ఎఫ్ నారిమన్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం సోమవారం ఈ పిటిషన్‌పై వాదనలు విన్నది. కేంద్రం తరుపున సొలిసిటర్ జనరల్ (ఎస్‌జీ) తుషార్ మెహతా తన వాదనలు వినిపించారు. పాఠశాలలో ఉదయం ప్రార్థన సందర్భంగా విద్యార్థులు 'అసతోమా సద్గమయా' అనే సంస్కృత శ్లోకం పఠిస్తారని, అంటే దీనర్థం అందరికీ మతబోధ చేస్తున్నట్లు కాదని తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. 'ఇది సార్వజనీన వాస్తవం. అన్ని గ్రంథాలు, మతాలు అంగీకరించిందే. ఈ శ్లోకం సంస్కృతంలో ఉండడం వల్లే మతపరమైన ముద్ర వేస్తున్నారు. మరి, క్రిస్టియన్ మిషనరీ పాఠశాలల్లో విద్యార్థులు 'హానెస్టీ ఈజ్ ద బెస్ట్ పాలసీ' అని ఆలపిస్తారని, ఇది కూడా మతపరమైనదేనా?' అని మెహతా ప్రశ్నించారు. కానీ, అసతోమా సద్గమయా శ్లోకాన్ని నేరుగా ఉపనిషత్తుల్లోంచి స్వీకరించారని జస్టిస్ నారిమన్ పేర్కొన్నారు. అయితే, సుప్రీంకోర్టు అధికారిక చిహ్నంలో కూడా భగవద్గీత నుంచి తీసుకున్న శ్లోకం ఉందని ఎస్‌జీ మెహతా గుర్తుచేశారు. సుప్రీంకోర్టులో ప్రతి న్యాయమూర్తి వెనకాల ఉన్న చిహ్నంలో 'యతో ధర్మస్తతో జయ' అని ఉంటుందని, ఎక్కడ ధర్మం ఉంటే అక్కడ జయం ఉంటుందని దీని అర్థం అని చెప్పారు. అనంతరం ఈ వివాదాన్ని విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి సిఫార్సు చేశారు.



మోదీ ప్రభుత్వం భారత సైనికుల సంక్షేమం కోసం నిత్యం ఆలోచిస్తున్నది. సైనికుల 'వన్ ర్యాంక్, వన్ పింఛన్' విధానానికి కట్టుబడి ఉన్నది. కానీ కాంగ్రెస్ నేతలు 'ఓఆర్‌ఓపీ' అంటే 'ఓన్లీ రాహుల్, ఓన్లీ ప్రియాంక'గా వ్యవహరిస్తున్నారు.

అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు

భారత క్రికెట్‌లోకి అసమాన ప్రతిభ వస్తున్నది. శుబ్‌మన్ గిల్, పృథ్వీ షా లాంటివారు అద్భుత నైపుణ్యం ఉన్నవారు. అండర్ 19 జట్టుకు ఆడేటప్పుడు నాకు గిల్‌కు ఉన్న నైపుణ్యంలో పది శాతం కూడా లేదు. ఇలాంటివారికి అవకాశం కల్పించి భారత క్రికెట్‌ను ఉన్నత శిఖరాలకు తీసుకుపోవాలి.

విరాట్ కోహ్లీ, భారత క్రికెట్ కెప్టెన్




చరిత్రలో నేడు



1905
భారీ నిరసనల మూలంగా కార్మికుల పని పరిస్థితులు మెరుగు కోసం సంస్కరణలు చేపట్టిన రష్యా చక్రవర్తి నికోలస్ 2.

1925
బ్రిటిష్ లిబరల్ పార్టీ నాయకుడిగా డేవిడ్‌లాయిడ్ జార్జ్ ఎన్నిక.





1979
పాట్రీషియా హర్స్ట్ ఏడేండ్ల జైలుశిక్షను రెండేండ్లకు తగ్గించిన అమెరికా అధ్యక్షుడు జిమ్మీ కార్టర్.

నేపాల్‌లోని జాతీయ వైద్య బిల్లులో సవరణలు చేయాలంటూ ప్రముఖ వైద్యుడు కేసీ ఆమరణ నిరాహార దీక్ష సాగిస్తున్నారు. నేపాల్‌లో వైద్య విద్య అధ్వాన్నంగా ఉన్నప్పుడు, డాక్టర్ కేసీ ఈ వ్యవస్థను చక్కదిద్దడానికి అవిశ్రాంతంగా పోరాడుతున్నారు. ఆయన అహింసాయుత పోరాటం వల్ల అనేక సంస్కరణలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో జాతీయ వైద్య విద్య బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే వైద్య విద్యను లాభాపేక్ష రహితంగా, సంఘ సేవా లక్ష్యమైందిగా మార్చడం ఇంకా జరుగలేదు. కేసీ డిమాండ్ల పట్ల ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించాలి.

ది హిమాలయన్ టైమ్స్

బంగ్లాదేశ్ మాజీ ఆర్థిక మంత్రి షా కిబ్రియా హత్య కేసు విచారణ పదేండ్లు దాటినా ముగియకపోవడం మన దేశ ప్రమాణాల ప్రకారం కూడా చాలా జాప్యమైనట్టు లెక్క. సాధారణ విచారణలు ఏండ్ల కొద్దీ సాగుతున్నాయనే సత్వర విచారణకు 2015లో ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటుచేశారు. కానీ ఈ విచారణ కూడా ముందుకు సాగడంలేదు. కొంతకాలం న్యాయమూర్తి సెలవుపై వెళ్లారు. ఇప్పుడు కొత్త న్యాయమూర్తి వచ్చాడంటున్నారు. కానీ 2016 నవంబర్ నుంచి ఒక్క సాక్షిని విచారించలేదు.

ది డైలీ స్టార్

బాబు రాజకీయం!

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తన అవకాశవాదంతో మరోసారి ఆంధ్ర ప్రజలకు కనువిందు చేస్తున్నారు! తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో చెట్టపట్టాలేసుకు తిరిగిన చంద్రబాబు ఏపీలో మాత్రం విడిగా పోటీ చేస్తారట. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఈ రెండు పార్టీలు విడిగానే పోటీపడుతాయి. అంతవరకు సరే, జాతీయస్థాయిలో మాత్రం కలిసి పనిచేస్తూనే ఉంటాయట! చంద్రబాబు ఢిల్లీ వెళ్లి రాహుల్‌గాంధీని కలుసుకున్న తెల్లారే, కాంగ్రెస్ పార్టీ విడిగా పోటీ చేస్తున్నామని ప్రకటించింది. విడిగా పోటీ చేయడానికి సైద్ధాంతిక వైరుధ్యమో, ఇతరత్రా గొడవలో ఏమీ లేవు. మిత్రపక్షాలుగా కొనసాగుతుండగానే, విడిగా పోటీచేయడం ఎందుకనే ప్రశ్న తలెత్తడం సహజం. 'ప్రజాభీష్టం' మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని చంద్రబాబు చెబుతున్నారు. తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ పార్టీ చంద్రబాబుతో కలిసి పోటీచేయాలని ప్రజలు కోరుకున్నారా? ఇప్పుడు ఏపీలో విడిగా పోటీచేయాలని చంద్రబాబు కోరుకుంటున్నారా లేక ప్రజలు చెప్పారా! తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి టీడీపీ పొత్తు అవసరం లేదు. అది బాబు అవసరం కనుక ఇక్కడ కలిసి పోటీచేశారు. ఏపీలో బలహీనంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి మరో పార్టీ పొత్తు అవసరం. కానీ కాంగ్రెస్ పార్టీ చేత బాబు విడిగా పోటీ చేయిస్తున్నారు. చంద్రబాబు చెప్పినదానికి రాహుల్ బాబు తలూపుతున్నారు! తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు కాంగ్రెస్ పెద్దలు తాము అధికారానికి వస్తే, ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించారు. ఏపీ ఎన్నికల్లోనూ చంద్రబాబు గిరి గీస్తే దాటడంలేదు. దీన్నిబట్టి కాంగ్రెస్ అధిష్ఠానంపై చంద్రబాబు ప్రభావం ఎంత ఉన్నదో తెలుస్తున్నది.

చంద్రబాబుకు అంత దమ్ము ఉంటే, కేంద్ర నిధుల ఖర్చు విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలె. ఈ ఐదేండ్లలో తాను రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి చేశారో బహిరంగ చర్చ పెట్టాలె. హైదరాబాద్‌ను నిర్మించానని చెప్పుకుంటున్న చంద్రబాబు ఈ ఐదేండ్లలో తాను నిర్మించిన అమరావతి నగర అపురూప సౌందర్యాన్ని వీక్షించవలసిందిగా ప్రజలను కోరవచ్చు. ఇదేమీ చేయకుండా, కుయుక్తుల ద్వారా, ప్రత్యర్థులపై బురద చల్లడం ద్వారానే గెలువాలనుకుంటున్నారు. ప్రజలు ఒకసారి నమ్మవచ్చు గానీ ప్రతిసారి నమ్మరు.

చంద్రబాబు ఢిల్లీ వెళ్లి రాహుల్‌ను కలిసిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హంగామా మొదలైంది. ఏపీ అంతటా దాదాపు 200 మంది కన్వీనర్లను నియమిస్తామని, బస్సు యాత్ర చేపడుతామని తాము చేయబోమే హడావుడినంతా కాంగ్రెస్ పార్టీ వివరించింది. ఎంత అట్టహాసం ప్రదర్శించినా కాంగ్రెస్ పార్టీ బలపడేది ఏమీ లేదు. అయినా చంద్రబాబు చెప్పినట్టల్లా చేయకతప్పదు. కులాలు, వర్గాలు, ఇతర నినాదాల పేరుతో పార్టీలు పెట్టించి, ప్రత్యర్థుల ఓట్లు చీల్చడంలో టీడీపీ లాబీ ఘనత వహించింది. అవసరమైతే తమపైనే విమర్శలు చేయించుకుంటూ చిన్నా చితక పార్టీలను, నాయకులను నడిపించడం, అవసరమైనప్పుడు వారితో ఎన్నికల సమయానికి మద్దతు పలికించడం వంటి టక్కుటమారా విద్యలు టీడీపీ లాబీకి అలవాటే. కాంగ్రెస్ పార్టీ చంద్రబాబుతో పొత్తు పెట్టుకోకుండా 125 అసెంబ్లీ స్థానాలకు, 25 లోక్‌సభ సీట్లకు పోటీకి దిగుతామని వెల్లడించింది. తెలంగాణలోనే ఎంపీ స్థానాలకు తగిన నాయకులు దొరుకక, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన నాయకులనే దింపాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తున్నది. ఇక ఈ పార్టీకి ఏపీలో ఎంతటి నాయకులున్నారో తెలిసిందే. కాంగ్రెస్ పార్టీకి గత ఎన్నికల్లో ఒక్కసీటు కూడా రాలేదు. అయినా సరే, ఏదో హడావుడి చేస్తూ ప్రతిపక్ష పార్టీ ఓట్లను ఎంతో కొంత చీల్చాలనేది చంద్రబాబు ఎత్తుగడ. గత ఎన్నికల్లో రాష్ట్రం అనాథ అయిందంటూ, ఆంధ్ర ప్రజల్లో ఆత్మన్యూనతాభావం పెంచి, తన వంటి సీనియర్ నాయకుడు ముఖ్యమంత్రిగా ఉంటే తప్ప దిక్కులేదని విపరీత ప్రచారం చేయించుకొని అత్తెసరు మెజార్టీతో నెగ్గాడు. ఇప్పుడు కాంగ్రెస్‌తో సహా అనేకమంది నాయకులను, పార్టీలను గోదాలోకి దింపి గందరగోళం సృష్టించడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నాడు.

తన వైఫల్యాన్ని ఇతరులపై రుద్దడం చంద్రబాబు నేర్చిన మరో విద్య! ఏపీ ముఖ్యమంత్రిగా సమర్థుడైన నాయకుడు ఉండకూడదని కేసీఆర్ కోరుకుంటున్నారనేది చంద్రబాబు విమర్శ. ఏపీలో అసమర్థ పాలన ఉండాలనేదే కేసీఆర్ అభిమతమైతే చంద్రబాబే కొనసాగాలని కోరుకుంటారు. చంద్రబాబు సమర్థత ఏ పాటిదో తెలువనిది ఎవరికి? వాజపేయి హయాంలో బీజేపీ పల్లకి మోసింది చంద్రబాబే. ఇంతకాలం మోదీని భుజాలపై మోసిందీ ఇదే బాబు. కానీ ఇప్పుడు, తన ప్రత్యర్థులంతా మోదీకి మద్దతుదారులని అంటున్నదీ ఈ చంద్రబాబే. తాను సమర్థుడైన ముఖ్యమంత్రే అయితే మోదీని మోస్తున్నప్పుడే, ప్రత్యేక హోదా ఎందుకు ఇప్పించుకోలేకపోయారు. మోసపోయామని ఇప్పుడు గాయి పెట్టడం సమర్థతా? తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ తాను నాలుగేండ్లుగా రాష్ట్రాన్ని ఎట్లా అభివృద్ధి చేశారో బహిరంగ సభల్లో వివరించారు. తన పాలనపై ప్రతి ఊరిలో చర్చించుకోవలసిందిగా ప్రజలకు బహిరంగంగా పిలుపు ఇచ్చారు. చంద్రబాబుకు అంత దమ్ము ఉంటే, కేంద్ర నిధుల ఖర్చు విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలె. ఈ ఐదేండ్లలో తాను రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి చేశారో బహిరంగ చర్చ పెట్టాలె. హైదరాబాద్‌ను నిర్మించానని చెప్పుకుంటున్న చంద్రబాబు ఈ ఐదేండ్లలో తాను నిర్మించిన అమరావతి నగర అపురూప సౌందర్యాన్ని వీక్షించవలసిందిగా ప్రజలను కోరవచ్చు. ఇదేమీ చేయకుండా, కుయుక్తుల ద్వారా, ప్రత్యర్థులపై బురద చల్లడం ద్వారానే గెలువాలనుకుంటున్నారు. ప్రజలు ఒకసారి నమ్మవచ్చు గానీ ప్రతిసారి నమ్మరు.

జనగళం

ఏటా ప్రకటించాలె

దేశంలో అత్యుత్తమ పౌర పురస్కారమైన 'భారత రత్న'ను ఈ ఏడాది ముగ్గురికి ప్రకటించారు. అయితే 'పద్మ' పురస్కారాలు ఇచ్చినట్లే 'భారత రత్న' పురస్కారాన్ని కూడా ప్రతి ఏటా ఇవ్వాలె. 2001 తర్వాత 2009 లో, 2015లో, ఇప్పుడు 2019లో ఈ పురస్కారాన్ని ప్రకటించారు. 1990 వరకు ఈ పురస్కారాన్ని ప్రకటించలేదు. 'భారత రత్న' ప్రతి ఏటా ఇవ్వడం ద్వారా దేశం కోసం త్యాగంచేసిన విశిష్ట వ్యక్తులను గౌరవించుకోవచ్చు. అమరవీరుడైన భగత్‌సింగ్, హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్, అంతరిక్ష యాత్రికుడు రాకేశ్ శర్మ, జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు వంటివారికి భారతరత్న పురస్కారం ప్రధానం చేసినట్లయితే అర్థవంతంగా ఉంటుంది. ఈ దిశగా కేంద్రం ఆలోచించాలె.

- ఎం.రాంప్రదీప్

అవగాహన కల్పించాలె

రోజురోజుకు రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. అతివేగం, మద్యం తాగి వాహనాలు నడుపడం వల్లనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నా వాహనదారుల్లో మార్పు రాకపోవడం బాధాకరం. రవాణా శాఖాధికారులు, పోలీసులు వాహనదారుల్లో అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

- తోట చంద్రశేఖర్, ముత్తారం, పెద్దపల్లి జిల్లా

ఖాళీలను భర్తీ చేయాలె

అనారోగ్యం,ప్రమాదాల కారణంగా తీవ్రంగా గాయపడి ఎంతో మంది ప్రభుత్వ దవాఖానల్లో చేరుతున్నారు. అయితే వీరిలో చాలామందికి వివిధ కారణాలతో సరైన వైద్యసాయం అందటం లేదు. ఈ క్రమంలో కొంతమంది రోగులు ఆస్పత్రిలోనే తనువు చాలిస్తున్నారు. ప్రభుత్వ దవాఖానల్లో అవసరమైన స్థాయిలో డాక్టర్లను, సిబ్బందిని భర్తీచేయాలి. సరైన వైద్యసిబ్బంది ఉంటే నిరుపేద రోగులకు మెరుగైన వైద్యం అందుతుంది.

- అనిల్ బోనాల, బేగంపేట్, హైదరాబాద్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్ నెం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

నీరు



ఎం.దానకిశోర్, (ఐఏఎస్)

నీటి పొదుపు అత్యవసరం

ఏటా కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకు గోదావరి, కృష్ణానదుల్లో నీరు చేరుతున్నప్పటికీ, ఆ నీళ్లన్నీ కేవలం హైదరాబాద్ నగరానికి పరిమితం కాదు. ఆ నీళ్లలో పక్క రాష్ట్రాలకు వాటా ఉన్నది. పరిశ్రమలకు, పంట కాల్వలకు కూడా ఈ నీళ్లల్లో వాటా ఉన్నది. ఇవన్నీ పోను హైదరాబాద్ నగరానికి ప్రతిరోజూ 440 మిలియన్ గ్యాలన్ల నీరు అవసరం.

వర్షం నీళ్లల్లో తడుస్తూనే.. వర్షాలు రావాలని, ఉరుములు ఉరమాలని, చెరువులు నిండాలని పంటలు పండాలని గంతులేసిన నాటి రోజులు తలచుకుంటేనే ఆ ఆనందం వర్ణనాతీతం. ఊళ్లోని బావు లు, చెరువులు, కుంటలు వర్షాలకు నిండుకుండల్లా ఉండేవి. కాలువల్లో నీరు ఎప్పుడూ ప్రవహిస్తుండేది. ఎటుచూసినా పంటలు పచ్చగా ఉండేవి. ఊళ్లో పశు సంపద గణనీయంగా ఉండేది. ఉదయం వెళ్లిన కోళ్లు, మేకలు, ఆవులు, బర్రెలు సాయంత్రం వేళల్లో గుంపులుగుంపులుగా ఇళ్లల్లోకి చేరేవి. ప్రతి ఇంట్లో పాలు, పెరుగు సమృద్ధిగా ఉం డేది. ఇవన్నీ ఎలా సాధ్యమయ్యాయి. నాటిరోజుల్లో ప్రజలు ఎందుకు ఇంత ఉల్లాసంగా ఉన్నారంటే, అది కేవలం వర్షాలు సమృద్ధిగా కురువడమే కారణం. వర్షాలు కురిస్తే చెరువులు నిండుతాయి. బావుల్లో నీరుంటుంది. నదుల్లో ప్రవాహ వేగం ఉంటుంది. పొలాలకు నీరు చేరుతుంది. పంటలు సమృద్ధిగా పండుతాయి. పల్లె ప్రజలకు చేతినిండా పని ఉంటుంది. అందరూ కడుపునిండా అన్నం తింటారు. మరిప్పుడవన్నీ లేవా ? అంటే.. ఉన్నాయి. కానీ, కాలక్రమంలో తగ్గిపోతున్నాయి. ఏటా కురి సే వర్షపాతం తగ్గిపోయింది. భూగర్భ జలాలపైనా ఒత్తిడి పెరిగిపోయిం ది. ఫలితంగా యురేనియంతో కలుషితమైన నీటితో ప్రజలు పలు దేశాల్లో జబ్బులబారిన పడుతున్నారు. దేశంలో 60 కోట్ల మంది నీటి కరువును ఎదుర్కొంటున్నారని, 40 శాతం మంది భూమిపై ఉన్న కలుషిత జలాలను వాడటం వల్ల ఏటా రెండు లక్షల మంది రోగాల బారిన పడుతున్నారని, 2030 నాటికి మరో 40 శాతం మందికి అసలు తాగుదామంటే నీటి అవకాశం కూడా ఉండదని, ఈ సంక్షోభం 2050 నాటికి తీవ్రంగా ఉంటుందని ఇటీవల జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో వక్త లు అభిప్రాయపడ్డారు. 2020 నాటికి బెంగళూర్, చెన్నై, హైదరాబాద్ లతో సహా మరో 21 నగరాల్లో భూగర్భ జలాలు బాగా పడిపోతాయని, ఇందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు చెప్పారు. నీటి నిర్వహణలో గుజరాత్, మధ్య ప్రదేశ్ రాష్ట్రాలు కొద్దిగా ముందంజలో ఉంటే, ఉత్తరాఖండ్, మేఘాలయ లాంటి రాష్ట్రాలు బాగా వెనుకబడి ఉన్నాయని, భవిష్యత్ తరానికి నీటిని సంరక్షించుకోవాలని నీతి ఆయోగ్ అభిప్రాయపడింది. భూగర్భ జలాలు 2002 నుంచి 2016 మధ్యలో ఏటా 10-25 మిల్లీ మీటర్ల లోతుకు వెళ్లిపోవడం, సరాసరి వర్షపాతం కూడా తగ్గిపోవడం వల్ల రాబోయేరోజుల్లో వర్షపు నీటిని రక్షించుకోవడం మినహా మరో మార్గం లేదని తేల్చి చెప్పారు. ఇటీవలే కేప్‌టౌ న్ పట్టణంలో తీవ్ర నీటి కరువు ఏర్పడితే మనిషికి రోజుకు 25 లీటర్ల రేషన్ విధానాన్ని ప్రవేశపెట్టారు.

హైదరాబాద్ మహానగరానికి మనం గోదావరి, కృష్ణా నదుల నుంచి నీళ్లను పెద్దపెద్ద పైపుల ద్వారా తీసుకొని వస్తున్నాం. సుమారు కోటి ముప్ఫై లక్షల మందికి నిత్యం మంచి నీటిని అందించే బాధ్యత హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల మండలి వారిది. నీటిని సరఫరా చేయడమే కాదు, నీటిని ఎలా పొదుపు చేసుకోవాలనే విషయంలో కూడా వాటర్ వర్క్స్ బోర్డు అధికారులు కృషి చేస్తున్నారు. గతంలో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, సింగూర్, మంజీరాల నుంచి ఇచ్చే మంచి నీరు దశాబ్దకాలంగా కృష్ణానది నుంచి, ఆ తర్వాత గోదావరి నుంచి తీసుకొని వస్తున్నాం. పెద్దపెద్ద పైపుల ద్వారా వందల కిలోమీటర్ల దూరం నుంచి తీసుకొని వస్తున్న ఈ నీటిలో 40 శాతం వృథాగా పోతున్నాయి. ప్రధాన పైపులైన్లలో ఏర్పడే లీకేజీలతో 5 శాతం వరకు వృథాగా పోతే, మిగితా 35 శాతం నీరు మానవ తప్పిదాల వల్లనే అనేది గ్రహించాలి. ఇంట్లో నల్లా తిప్పగానే వస్తున్న ఈ నీళ్లు ఎక్కడివి, ఎక్కడినుంచి వస్తున్నాయి, వాడిన ఈ నీళ్లు తిరిగి ఎక్కడికి వెళ్తున్నాయని ఆలోచించాలి. ఇళ్లల్లో నల్లాలు ఓపెన్ చేసి ఊళ్లకు వెళ్లడం, ఇంటిపైన ఉండే ఓవర్‌హెడ్ ట్యాంకర్లలో నీళ్లు నిండిపోయి పై నుంచి ఏకధారగా నీళ్లు రోడ్డు మీద వృథాగా పోవడం, పైపులతో కార్లను, బండ్లను కడుగడం,అదే పైప్‌తో చెట్లకు నీళ్లను పట్టడం, ఇంటి ఫ్లోరింగ్‌ను పైపులతోనే కడుగడం అన్నీ చేస్తుంటాం. దీంతో నీరు ఎంత వృథా అవుతుందో ఊహించాల్సిందే.

ఏటా కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకు గోదావరి, కృష్ణానదుల్లో నీరు చేరుతున్నప్పటికీ, ఆ నీళ్లన్నీ కేవలం హైదరాబాద్ నగరానికి పరిమితం కాదు. ఆ నీళ్లలో పక్క రాష్ట్రాలకు వాటా ఉన్నది. పరిశ్రమలకు, పంట కాల్వలకు కూడా ఈ నీళ్లల్లో వాటా ఉన్నది. ఇవన్నీ పోను హైదరాబాద్ నగరానికి ప్రతి రోజూ 440 మిలియన్ గ్యాలన్ల నీరు అవసరం. విలువైన ఈ నీటిని చాలామంది వృథా చేస్తున్నారు. దినచర్యలో చేసే చిన్నపాటి మార్పులతో ప్రతి కుటుంబం రోజుకు 300 లీటర్ల నీటిని ఆదా చేయవచ్చు. 'ప్రతి నీటి బొట్టు ప్రగతికి మెట్టు' 'నీటిని సంరక్షిద్దాం.. కరవును తరిమికొడుదాం' నినాదాలతో ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహించింది. అంతకుముందే, నగరంలో సుమారు 250 కార్యాలయాల్లో ఇంకుడుగుంతలను ఏర్పాటుచేసింది. వాటర్ వర్క్స్ పరిధి ఔటర్ రింగ్‌రోడ్ వరకు ఉన్నందున 14 మంది స్వచ్ఛంద సంస్థల సభ్యులతో అవగాహనా సదస్సులను పెద్ద ఎత్తున నిర్వహించింది. 1750 కాలనీల్లో 21 వేల ఇండ్లను సందర్శించి ఎక్కడైతే ఇంకుడు గుంతలు లేవో, అక్కడ వారికి వీలైతే స్వచ్ఛంద సంస్థలే నిర్మించి ఇవ్వడం లేదా సాంకేతిక సలహాలివ్వడం చేశారు. నిర్మించిన ప్రతి ఇంకుడు గుంతను జియో ట్యాగ్ చేయడమైనది. ఇంకా, 2కే, 5కే, 10కే రన్ వంటి కార్యక్రమాలను ఏర్పాటుచేసి నీటి పొదుపులో యువతను భాగస్వామ్యం చేశాం. పెద్ద ఎత్తున ఉద్యోగులు పనిచేసే పోలీస్, ఆర్మీ లాంటి శాఖల్లో వాటర్ వర్క్స్ పలు చైతన్య కార్యక్రమాలు నిర్వహించింది. నీటి పొదుపుపై ముఖ్యంగా 16 ఏండ్ల లోపు యువతకు అర్థం కావడానికి జల వారసత్వం పేరుతో తాత -మనువడు సంఘాలను నగరం నలుమూలలా సుమారు 1000 ఏర్పాటుచేశాం. నీటి సంరక్షణా చర్యల్లో ప్రధానంగా ప్రతి వర్షపు నీటిచుక్కను తిరిగి భూమిలోకి ఇంకింప చేసేవిధంగా ప్రతి ఇంటిలో, పరిసర ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి వంద చదరపు మీటర్ల ఇంటిపై 20 మి.మీ. వర్షం పడితే 2000 లీటర్ల వర్షపు నీటిని ఆదా చేయవచ్చు.

వర్షాకాలం ప్రారంభం నాటికి ప్రతి ఇళ్లూ, కాలనీ, అపార్ట్‌మెంట్‌లో ఇంకుడు గుంత లు నిర్మించుకోవాలి. పెద్ద ఏరియా ఉండే దవాఖానలు, పాఠశాలలు, కళాశాలలు, సినిమా థియేటర్లు, కార్పొరేట్ కార్యాలయాలు అన్నీ కూడా వారి ఏరియాకు తగ్గట్లుగా ఇంకుడు గుంతలు నిర్మించుకున్నట్లయితే ప్రతి వర్షపు నీటిచుక్క అక్కడే ఇంకిపోతుంది. ఆ నీరే తిరిగి భూమిలోకి చేరుకోవడం వల్ల ఆ పరిసర ప్రాంతాల్లో ఎప్పటికీ నీటి కరువుండదు. ఈ చైతన్యంతో ప్రతి పౌరుడూ మసులుకున్నప్పుడే నీటి కొరతను అధిగ మించగలం. భవిష్యత్‌తరాలకు తరగని వనరుగా నీటిని అందించగలం

'రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ థీమ్ పార్క్'.. ఇదొక అద్భుతమైన ఆలోచన. ఏడాది కింద నాటి ఐటీ శాఖామాత్యులు కేటీఆర్ మాట్లాడుతూ 'జలం-జీవం'పై చర్చించారు. సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో నీటి ప్రాధాన్యంపై, హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరా తీరుతెన్నులపైన వివరించారు. తక్షణ స్పందనగా హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ జలం-జీవంపై ఎన్నో కార్యక్రమాలను రూపొందించి ప్రజల్లో నీటి పొదుపుపై విస్తృతంగా అవగాహన కల్పించింది. ఈ నేపథ్యంలోనే ఏర్పాటైంది 'రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ థీమ్ పార్క్'. దేశంలోనే రెండవ హార్వెస్టింగ్ థీమ్ పార్క్‌గా హైదరాబాద్‌లో ఏర్పాటైన ఈ పార్క్ వెనుక కేటీఆర్ సూచనలు, సలహాలున్నాయి. బెంగళూర్‌లో మొదటి పార్క్‌ను అక్కడి ప్రభుత్వం దశాబ్దకాలం కిందటు ఏర్పాటుచేసింది. రెండవ పార్క్‌గా హైదరాబాద్‌లో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ థీమ్ పార్క్‌ను కేవలం మూడునెలల కాలంలో హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 51లో ఒకటిన్నర ఎకరాల స్థలంలో ఏర్పాటుచేసి అనేక మార్గాల్లో నీటి పొదుపు తెలియచేసే విధంగా తీర్చిదిద్దడం జరిగింది. 2018, అక్టోబర్ 18న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, ప్రిన్సిపల్ సెక్రెటరీ అరవింద్‌కుమార్‌లతో ప్రారంభమైన ఈ పార్క్‌ను గత మూడు నెలల్లో వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 750 మంది విద్యార్థులు సందర్శించారు. ఈ పార్క్ విషయం తెలిసి తమిళనాడు వాటర్ వర్క్స్ అధికారుల బృందం, కాన్పూర్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు, ఫ్రాన్స్ బోర్డాక్స్ యూనివర్సిటీ రీసెర్చ్ విద్యార్థులు సందర్శించారు. 39 పద్ధతుల్లో వర్షపు నీటిని ఎలా సంరక్షించుకోవాలో ఈ పార్క్‌లో నమూనాలను ఏర్పాటుచేశాం. నీరెంత అమూల్యమైందో బావి ఎండిపోయేవరకు తెలియదనే పలురకాల సూక్తులతో నీటి విలువను ఈ పార్క్‌లో వివరించాం. వర్షాకాలం ప్రారంభం నాటికి ప్రతి ఇళ్లూ, కాలనీ, అపార్ట్‌మెంట్‌లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి. పెద్ద ఏరియా ఉండే దవాఖానలు, పాఠశాలలు, కళాశాలలు, సినిమా థియేటర్లు, కార్పొరేట్ కార్యాలయాలు అన్నీ కూడా వారి ఏరియాకు తగ్గట్లుగా ఇంకుడు గుంతలు నిర్మించుకున్నట్లయితే ప్రతి వర్షపు నీటిచుక్క అక్కడే ఇంకిపోతుంది. ఆ నీరే తిరిగి భూమిలోకి చేరుకోవడం వల్ల ఆ పరిసర ప్రాంతాల్లో ఎప్పటికీ నీటి కరువుండదు. ఈ చైతన్యంతో ప్రతి పౌరుడూ మసులుకున్నప్పుడే నీటి కొరతను అధిగమించగలం. భవిష్యత్‌తరాలకు తరగని వనరుగా నీటిని అందించగలం.

(వ్యాసకర్త: జీహెచ్‌ఎంసీ కమిషనర్, ఎం.డి., జలమండలి)

సూత్రబద్ధమైన సంకీర్ణాలే మేలు

జాతీయం



సిద్ధార్థ భాటియా

వ్యక్తి ప్రాధాన్యంపై ఆధారపడిన ప్రభుత్వాలు, లేదా ఒక ప్రధాన పార్టీ ఆధిపత్యంతో ఏర్పడిన ప్రభుత్వాలు నియంతృత్వ పోకడలకు పోతున్న పరిస్థితులే కనిపిస్తున్నాయి. వీటికన్నా సంకీర్ణ ప్రభుత్వాలే నయమనే స్థితి ఉన్నది. మరికొన్ని నెలల్లో సాధారణ ఎన్నికలు సమీపిస్తున్నవేళ ఇలాంటి చర్చ దేశవ్యాప్తంగా జోరుగా సాగుతున్నది. మరోవైపు ప్రధానిగా నరేంద్ర మోదీ కాకపోతే మరెవరు? రాహుల్ గాంధీయా! అన్నది కూడా చర్చనీయాంశమవుతున్నది. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ ఇలాంటి చర్చలు జోరందుకుంటున్నాయి. ఇదే సమయంలో మోదీ తనదైనశైలిలో అధ్యక్ష తరహా ప్రచారసరళితో తాను తప్ప మరో నేత ప్రత్యామ్నాయంగా ఎవరూ లేరన్న విషయాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకుపోతున్నారు. కుటుంబపాలనలో భాగంగా రాహుల్‌కు అధికారం అప్పగించటం తప్ప మరోదారి లేదా అన్నది ముందుకు వస్తున్నది.

విషాదమేమంటే.. సిద్ధాంతాలపై ఆధారపడి పాలన సాగించే పార్టీ కనిపించటం లేదు. బీజేపీ కూడా దీనికి అతీతంగా ఏమీ కనిపించటం లేదు. దానిలో కూడా సిద్ధాంతాలు కాకుండా వ్యక్తి ప్రాధాన్యం చుట్టూనే అధికారం తిరుగుతున్నది. ఈ విధమైన చర్చలతో లోతుగా ఆలోచించినప్పుడు ఆసక్తికరమైన విషయాలు ముందుకువస్తున్నాయి. మోదీని తీవ్రంగా వ్యతిరేకించేవారికి కూడా ప్రత్యామ్నాయంగా మరో నేత కనిపించటం లేదు. మోదీకి ప్రత్యామ్నాయంగా ఆలోచించేటప్పుడు మరింత నిరాశాజనకమైన వాతావరణమే కనిపిస్తున్నది. మోదీ హయాంలోనే మునుపెన్నడూ లేని విధంగా రైతాంగం ఢిల్లీ రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయాల్సిన స్థితి ఏర్పడింది. మరోవైపు చిన్న, మధ్య తరహా వ్యాపారవర్గంతో పాటు, కార్పొరేట్ వర్గాలు కూడా మోదీ విధానాల పట్ల వ్యతిరేకతతో ఉన్నట్లు తెలుస్తు న్నది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ పన్నులతో ఏ వర్గమూ సంతోషంగా లేదు. ఆర్థికవ్యవస్థ అతలాకుతలమైంది. ప్రధాని మోదీ తన విధానాలను ఎం తగా సమర్థించుకోజూసినా ప్రజల్లో మాత్రం అసంతృప్తి మెండుగానే ఉన్నది. ఈ నేపథ్యంలో బీజేపీకి మరో ప్రత్యామ్నాయ విధానమంటూ ఏమీ లేని స్థితి ఉన్నది. హిందుత్వ, మందిర నినాదాలు తప్ప మరేదీ వారికి ఆసరాగా నిలిచే పరిస్థితి కనిపించటం లేదు.

రాహుల్‌గాంధీకి కూడా సంకీర్ణ ప్రభుత్వం తప్ప మరో ప్రత్యామ్నాయం కనిపించటం లేదు. ప్రభుత్వ ఏర్పాటుకు కావలసినన్ని సీట్లు సాధించి సంకీర్ణానికి కూడా బీజేపీ సమాయత్తమవుతున్నది. ఇలా చేసినా మోదీనే ప్రధాని రేసులో ముందుంటున్నారు. మోదీని కాదని ప్రధానిగా ఎవరుంటారన్న దానిలో అనేక ప్రశ్నలున్నాయి. మాయావతి, మమతా బెనర్జీ.. ఎవరైనా ఉత్తమమైన ప్రధాని అనదగ్గ స్థితి కనిపించటం లేదు. సంకీర్ణ ప్రభుత్వాలతో గత అనుభవాలన్నీ చేదుగానే ఉన్నస్థితిలో మరోసారి వాటివైపు మొగ్గు కనిపించటం లేదు. కానీ విశాల భారతదేశంలో విభిన్న ప్రాంతాలు, వర్గాల ఆకాంక్షలకు ప్రతిబింబంగా సంకీర్ణమే మేలనే వాదన కూడా ఉన్నది. స్వాతంత్ర్యం తర్వాత మూడు దశాబ్దాలకు కాంగ్రెస్‌ను పక్కనబెట్టి 1977లో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. ఈ క్రమంలో విభిన్న సాంఘిక, ఆర్థిక, సైద్ధాంతిక, కుల, మత వైరుధ్యాలు సంకీర్ణంలో అనైక్యతకు దారి తీసింది.

దేశంలో సంకీర్ణ ప్రభుత్వాల పనితీరు వినాశకరంగా ఉన్నదన్న వాదనలకు, పీవీ నరసింహారావు ప్రభుత్వం ఓ మంచి సమాధానంగా నిలిచింది. మైనార్టీ ప్రభుత్వంగానైనా ఐదేండ్లు కొనసాగింది. పీవీ హయాంలో అనుసరించిన విధానాలు ముఖ్యంగా ఆర్థికపరమైన విధానాలు సంకీర్ణ ప్రభుత్వ పనితీరుకు ప్రశంసలు పొందింది. బీజేపీ కన్నా పీవీ ప్రభుత్వమే ప్రజామోదాన్ని ఎక్కువగా పొందింది. యూపీఏతో పాటు అటల్ బిహారీ వాజపేయి కూడా సంకీర్ణ ప్రభుత్వాలను నడిపారు. వాజపేయి తన సంకీర్ణంలో జయలలిత, మమతా బెనర్జీ లాంటి వారిని కలుపుకొనిపోయారు. యూపీఏ హయాంలో మన్మోహన్‌సింగ్ సీపీఎం లాంటి వామపక్షాన్ని కూడా తనతోపాటు కలిసి నడిచేట్లు ఒప్పించగలిగారు. భారత్ వెలిగిపోతున్నదని వాజపేయి చెప్పుకొచ్చినా ఆయనను 2004లో ప్రజలు ఓడించారు. దీంతో బీజేపీ ఒకరకంగా షాక్‌కు గురైంది. ఆ తర్వాత కాలంలో కాంగ్రెస్ మిత్రపక్షాలుగా ఉన్న పార్టీలతో అవినీతి ఆరోపణలు చుట్టుముట్టడంతో కాంగ్రెస్ కూటమి ఓటమి మూటగట్టుకున్నది.

అయితే మొత్తంగా సంకీర్ణ ప్రభుత్వాలు అనేవి ఏక పార్టీ, వ్యక్తి ఆధిపత్య ప్రభుత్వాల కన్నా చెడ్డవని చెప్పటానికి లేదు. దేవెగౌడ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజానుకూలంగా మెరుగైన స్థితిలోనే పనిచేసింది. ఆర్థికమంత్రి చిదంబరం ఆధ్వర్యంలో ప్రజానుకూల బడ్జెట్లు, విధానాలు ఆచరణలోకి వచ్చాయి. మోదీ నేతృత్వంలో గొప్పనైన రీతిలో ఆర్థిక విధానాలేమీ ప్రజలను సంతోషపెట్టలేదు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ పన్నులు ప్రజలను అభద్రత, ఆందోళనలకు గురిచేశాయి.

మరోవైపు ఓ ఎదురులేని నేతగా ఎదిగినవారు ఎంత నియంతృత్వంగా వ్యవహరిస్తారో మోదీ ఓ ఉదాహరణగా నిలుస్తారు. ఆయన తన సొంత పార్టీలోని , మంత్రివర్గంలోని వారినే ఏ విమర్శలకు వెరువకుండా బయటకు పంపించగలిగారు. ఎమర్జెన్సీ లాంటిది కొంతమంది నిర్ణయాలతోనే ఉనికిలోకి వచ్చిందని తెలియంది కాదు. గత నాలుగున్నరేండ్ల మోదీ పాలన దీన్నే సూచిస్తున్నది. భిన్నాభిప్రాయాలకు తావులేకుండా, ఏకఛత్రాధిపత్యంగా మోదీ వ్యవహరిస్తున్న తీరు ఎమర్జెన్సీని తలపిస్తున్నది. సంకీర్ణంలో చిన్నపార్టీలు, గ్రూపుల బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతాయన్న అపవాదు ఉన్నది. కానీ మోదీ తన మంత్రివర్గ సహచరులను, పార్టీ వారినే పక్కనబెట్టిన తీరును నియంతృత్వానికి నిదర్శనంగానే భావించాల్సి ఉన్నది.

2019 సాధారణ ఎన్నికల వేళ ఒక అర్థవంతమైన సూత్రబద్ధమైన సంకీర్ణమే మేలనే వాదనకు బలం చేకూరుతున్నది. మోదీ అయినా, మరొకరైనా సంకీర్ణాల ధర్మాన్ని, నీతిని పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఆ అర్థంలో వ్యక్తి నియంతృత్వం కన్నా సంకీర్ణాలే మేలని చెప్పకతప్పదు.

(వ్యాసకర్త: 'ది వైర్' సంస్థాపక సంపాదకులు), 'ది వైర్' సౌజన్యంతో..

రాహుల్‌గాంధీకి కూడా సంకీర్ణ ప్రభుత్వం తప్ప మరో ప్రత్యామ్నాయం కనిపించటం లేదు. ప్రభుత్వ ఏర్పాటుకు కావలసినన్ని సీట్లు సాధించి సంకీర్ణానికి కూడా బీజేపీ సమాయత్తమవుతున్నది. ఇలా చేసినా మోదీనే ప్రధాని రేసులో ముందుంటున్నారు. మోదీని కాదని ప్రధానిగా ఎవరుంటారన్న దానిలో అనేక ప్రశ్నలున్నాయి. మాయావతి, మమతా బెనర్జీ.. ఎవరైనా ఉత్తమమైన ప్రధాని అనదగ్గ స్థితి కనిపించటం లేదు. సంకీర్ణ ప్రభుత్వాలతో గత అనుభవాలన్నీ చేదుగానే ఉన్నస్థితిలో మరోసారి వాటివైపు మొగ్గు కనిపించటం లేదు. కానీ విశాల భారతదేశంలో విభిన్న ప్రాంతాలు, వర్గాల ఆకాంక్షలకు ప్రతిబింబంగా సంకీర్ణమే మేలనే వాదన కూడా ఉన్నది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

ఆ పెద్దపులి క్షేమమేనా?

రొట్టెపల్లి శివారులో గతనెలలో గుర్తించిన గ్రామస్థులు

మగ పెద్దపులిగా నిర్ధారించిన అటవీ అధికారులు

ఆ తర్వాత కనిపించని జాడ



రొట్టెపల్లి శివారులో పెద్దపులి అడుగుజాడలు (ఫైల్)

కాసిపేట రూరల్: మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం రొట్టెపల్లి శివారులోని వాగు వద్ద కనిపించి మాయమైన పెద్దపులి క్షేమంగానే ఉన్నదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కాలంలో వేటగాళ్ల ఉచ్చులకు పెద్దపులులు బలవుతున్న ఘటనలు నమోదవుతున్న తరుణంలో.. రొట్టెపల్లి శివారులో ప్రత్యక్షమైన పులి జాడ ఇంతవరకు లభ్యం కాలేదు. దాంతో పలు అనుమానాలకు తావిస్తున్నది. డిసెంబర్ చివరివారంలో గ్రామస్థులు పెద్దపులిని చూసి దాని అడుగులను గుర్తించారు. అటవీ అధికారులకు సమాచారం అందివ్వగా వారు వచ్చి అడుగుజాడల ఆధారంగా మగ పెద్దపులిగా నిర్ధారించారు. అప్పటి నుంచి ఆ పులి అడుగుజాడలు కనిపించకుండా పోయాయి. కవ్వాల్ టైగర్‌జోన్ నుంచి తిర్యాణి వైపుగా పులులు సంచరిస్తున్నాయనీ, అటువైపు వెళ్లి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.

వరంగల్ సెంట్రల్ జైలులో జాబ్ మేళా

శిక్ష పూర్తి చేసుకొని విడుదలైన వారికి ఉపాధి కల్పన

71 మందికి వివిధ కంపెనీల్లో అవకాశం

నయీంనగర్(వరంగల్): విడుదలైన ఖైదీలు సమాజంలో గౌరవంగా జీవించేలా జైళ్లశాఖ చర్యలు చేపట్టింది. వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సోమవారం వరంగల్ సెంట్రల్ జైలులో జాబ్ మేళా నిర్వహించింది. ఈ మేళాలో 12 కంపెనీలు పాల్గొనగా 159 మంది విడుదలైన ఖైదీలు హాజరయ్యారు. కాగా ఇందులో 71 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జైళ్ల శాఖ ఐజీ ఆకుల నర్సింహ మాట్లాడుతూ.. తమ శాఖలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల జైళ్లకు వచ్చే ఖైదీల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతున్నదన్నారు. దీంతో రాష్ట్రంలో ఐదు సబ్ జైళ్లను మూసివేశామన్నారు. జైళ్లశాఖ ప్రస్తుతం రూ.20 కోట్ల ఆదాయంతో ఉన్నదని, ఈ నిధులను ఖైదీల పునరావాసం కోసం వెచ్చిస్తామని తెలిపారు. క్రమశిక్షణ కలిగిన ఖైదీల విడుదలకు త్వరలోనే జీవో తీసుకొచ్చేలా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి నిర్మలాదేవి, వరంగల్ సీపీ విశ్వనాథ రవీందర్, లీగల్ సెల్ అథారిటీ సెక్రెటరీ అనిరోస్ క్రిస్టియన్, జైలు సూపరింటెండెంట్ మురళీబాబు తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ జైలులో జాబ్‌మేళా నిర్వహిస్తున్న దృశ్యం



యాదాద్రి కొండపై జరుగుతున్న పనులపై స్థపతి ఆనందాచారి వేలుతో మాట్లాడుతున్న వైటీడీఏ వైస్ చైర్మన్ జీ కిషన్‌రావు

యాదాద్రి విస్తరణ పనుల్లో వేగం పెంచండి

వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు ఆదేశం

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తేతెలంగాణ: యాదాద్రి ఆలయ విస్తరణ పనులను సకాలంలో పూర్తిచేసేందుకు మరింత వేగం పెంచాలని ఇంజినీర్లు, స్థపతులు, కాంట్రాక్టర్లను వైటీడీఏ వైస్‌చైర్మన్ జీ కిషన్‌రావు ఆదేశించారు. సోమవారం యాదాద్రిలో పనులను పరిశీలించిన తదుపరి నిర్వహించిన సమీక్షలో ఈవో గీత, ఈఈ వసంతనాయక్, స్థపతి ఆనందాచారి వేలు పాల్గొన్నారు.



పెద్దపల్లి జిల్లా రామగుండంలోని సోలార్ ప్లాంటులో ఏర్పాటు చేసిన పీవీ ప్యానెళ్లు


ఆ వెలుగులకు ఐదేండ్లు

- ఆరో వసంతంలోకి రామగుండం సోలార్ ప్లాంటు
- దేశంలోనే నంబర్‌వన్‌గా పేరు
- కొత్త ఏడాదిలో 320 మెగావాట్ల విస్తరణ దిశగా అడుగులు

జ్యోతినగర్: రామగుండంలోని 10 మెగావాట్ల సౌరశక్తి వెలుగులకు నేటితో ఐదేండ్లు నిండాయి. మంగళవారం ఆరో వసంతంలోకి అడుగుపెడుతున్న సోలార్ పవర్ ప్లాంటు.. మరో 320 మెగావాట్ల విస్తరణ దిశగా అడుగులు వేస్తున్నది. 2032 నాటికి లక్షా 20 వేల మెగావాట్ల ఉత్పత్తే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎన్టీపీసీ యాజమాన్యం, అందులో భాగంగా ఇక్కడ మరో 320 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. 2014 జనవరి 29న అప్పటి ఎన్టీపీసీ సీఎండీ అరూప్ రాయ్ ఈ ప్లాంట్‌ను ప్రారంభించగా, దేశంలోనే సోలార్ ప్రాజెక్టుల్లో నంబవర్ స్థానంలో కొనసాగుతున్నది. 2015లో ఎన్టీపీసీ కార్పొరేట్ నుంచి ఉత్తమ ప్లాంటుగా శ్రమశక్తి అవార్డుతోపాటు 2014-15లో ఉత్తమ ప్లాంటుగా విన్నర్ ట్రోఫీ 'స్వర్ణశక్తి అవార్డు', 2016-17కు బెస్ట్ ఆపరేటింగ్ అవార్డు కైవసం చేసుకున్నది. దాదాపు 55 ఎకరాల్లో 44,448 సోలార్ ప్యానళ్లతో విస్తరించిన ఈ ప్రాజెక్టులో రోజుకు సుమారు 40వేల యూనిట్లకు (కిలోవాట్స్‌లో)పైగా విద్యుదుత్పత్తి జరుగుతున్నది. సోలార్ విండ్ విద్యుత్ ప్రాజెక్టులపై దృష్టిపెట్టిన ఎన్టీపీసీ యాజమాన్యం, స్థానికంగా ఉన్న ఎన్టీపీసీ రిజర్వాయర్‌లో 320 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నది. నూతన టెక్నాలజీతో నీటిలో తేలియాడే ఫోటా వోల్టాయిక్ ప్యానెళ్లతో ప్రాజెక్టు నిర్మించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నది. ఇప్పుడున్న 10 మెగావాట్ల సోలార్ ప్లాంటు లోపలే మరో 15 మెగావాట్ల సోలార్ ప్లాంటు నిర్మాణానికి ఇప్పటికే టెండర్ ప్రక్రియ కూడా పూర్తి చేసింది.

చకచకా 'థర్మల్' ప్రాజెక్టు పనులు

టీఎస్‌టీపీపీ పనులు ప్రారంభించి నేటికి మూడేండ్లు పూర్తి



255 మీటర్ల ఎత్తుకు చేరిన చిమ్నీ నిర్మాణం

జ్యోతినగర్: స్వరాష్ట్రంలో రూ.10,598.98 కోట్ల వ్యయంతో రామగుండంలో మొదలు పెట్టిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (టీఎస్‌టీపీపీ) పనులు చకచకా సాగుతున్నాయి. 2016 జనవరి 29న పనులు ప్రారంభించగా నేటికి మూ డేండ్లు గడిచాయి. తెలంగాణ ప్రజా అవసరాల కోసం నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులో ఫేజ్-1 కింద చేపడుతున్న 1,600 మెగావాట్ల నిర్మాణం నిర్ణీత కాలంలో పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం కృషి చేస్తున్నది. బాయిలర్, టర్బైన్ జనరేటర్ సివిల్ పనులు పూర్తికాగా, స్ట్రక్చర్ పనులు ఇటీవలే మొదలయ్యాయి. చిమ్నీ సివిల్ పనుల పూర్తితో 255 మీటర్ల ఎత్తుకు చేరగా, మే 2020లోగా యూనిట్-1 నిర్మాణం, నవంబర్ 2020 నాటికి యూనిట్- 2 నిర్మాణం పూర్తి చేసేందుకు యాజమాన్యం కృషి చేస్తున్నది.

వేగంగా పనులు..

ప్రాజెక్టులోని టర్బైన్ జనరేటర్ పనులు 70 శాతం పూర్తవగా, రెండు యూనిట్ల సివిల్ పనులు చకచకా సాగుతున్నాయి. హెచ్‌పీ, ఐపీ, ఎల్‌పీ టర్బైన్ నిర్మాణంలో ఉండగా, ఎల్పీ కండెన్సరీ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. స్టీమ్ జనరేటర్, బాయిలర్ సివిల్ కూడా దాదాపు పూర్తి కాగా, మెకానికల్ స్ట్రక్చర్ పనులు కూడా ఇటీవలే చేపట్టారు. ఇప్పటికే చిమ్నీ ఎత్తును 255 మీటర్ల దాకా నిర్మించారు. ఇక బీఓపీ (బ్యాలెన్స్ ఆఫ్ ప్లాంట్) పనులు 44 శాతం పూర్తవగా, బొగ్గు దిగుమతి కోసం ట్రాక్ హోపర్ సివిల్ పనులు, వ్యాగిన్ టిప్పులర్ పనులు కొనసాగుతున్నాయి. రైల్వే సైడ్ పనులు నడుస్తున్నాయి. స్విచ్‌యార్డులో జీఐఎస్, కంట్రోల్‌కు సంబంధించి రెండు బిల్డింగ్‌ల నిర్మాణం జరుగుతున్నది. యాష్ డెక్, నీటి సరఫరా, సీహెచ్‌పీ పనులు ముందుకు సాగుతున్నాయి. పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా దక్షిణ భారత దేశంలోనే మొదటిసారిగా అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సూపర్ క్రిటికల్ టెక్నాలజీని ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ఉపయోగిస్తున్నారు. ఇందులో బొగ్గు వినియోగం, వాయు కాలుష్యం భారీగా తగ్గడంతోపాటు గ్రీన్‌హౌస్ వాయువు విడుదల అతి తక్కువగా ఉంటుంది. ఈ ప్రాజెక్టు పనులను గడువు లోగా పూర్తి చేయనున్నారు.



ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు అందుకుంటున్న సూర్యదేవర నాగరాజు

వైరా మండలవాసికి ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు

వైరా, నమస్తే తెలంగాణ: మలేషియాలోని మాషా బయోమెడికల్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఖమ్మం జిల్లా వైరా మండలం సిరిపురానికి చెందిన నాగరాజుకు బయోటెక్నాలజీ స్పెషలైజేషన్ బయాలజీలో ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు లభించింది. కోయంబత్తూరుకు చెందిన నేచర్ సైన్స్ ఫౌండేషన్ ఇన్‌స్టిట్యూట్ 2017-18 సంవత్సరానికి నాగరాజును ఉత్తమ శాస్త్రవేత్తగా ఎంపికచేసింది. సోమవారం చైనాలో నాగరాజుకు అవార్డును ప్రదానం చేశారు.

31లోపు బకాయిలను చెల్లించాలి

ఎన్పీడీసీఎల్ ఆపరేషన్ డైరెక్టర్ నర్సింగరావు సూచన



నర్సింగరావు

కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: విద్యుత్ బకాయిలు ఉన్న వినియోగదారులు ఈ నెల 31 లోపు చెల్లించాలని ఎన్పీడీసీఎల్ ఆపరేషన్ డైరెక్టర్ నర్సింగరావు విజ్ఞప్తి చేశారు. సోమవారం కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రూ.114.13 కోట్ల విద్యుత్ బకాయిలున్నాయనీ, ఇంత పెద్ద మొత్తంలో బిల్లులు బకాయిలు పడటం వల్ల సంస్థ ఇబ్బంది ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడు జెన్న కన్నుమూత



వెంకటేశం (ఫైల్)

నాగిరెడ్డిపేట: కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెదకు చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు జెన్న వెంకటేశం సోమవారం అనారోగ్యంతో కన్నుమూశారు. 1925 ఆగస్టులో జన్మించిన ఆయన పిన్నవయసులోనే స్వాతంత్య్ర పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో జైలు జీవితాన్ని గడిపారు. సోమవారం ఆయన స్వగ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించారు.

ఇద్దరు రెవెన్యూ ఉద్యోగుల సస్పెన్షన్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: విధినిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన ఇద్దరు రెవెన్యూ ఉద్యోగులను సస్పెండ్‌చేస్తూ సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ రజత్‌కుమార్ శైనీ ఉత్తర్వులు జారీ చేశారు. మణుగూరు తహసీల్దార్ కార్యాలయంలో ఎలక్షన్ డీటీగా పనిచేస్తున్న ఎండీ అంజద్‌పాషా, గుండాల మండలంలో ఆర్‌ఐ-2గా విధులు నిర్వహిస్తున్న రాజలింగేశ్వరరావు ఎన్నికల విధులు, భూ రికార్డుల ప్రక్షాళనలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వారిని సస్పెండ్ చేసినట్టు కలెక్టర్ తెలిపారు.

చెల్లి పెండ్లి కోసం చోరీ

కాజీపేట: రైల్లో బెడ్‌రోలర్‌గా పనిచేసే ఓ వ్యక్తి తన చెల్లి పెండ్లి కోసం ఓ ప్రయాణికురాలి వద్ద బంగారు ఆభరణాలు చోరీచేశారు. సోమవారం కాజీపేట రైల్వే పోలీసులు నిందితుడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. జీఆర్పీ ఎస్సై జీతేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నైకి చెందిన శరణ్య అనే మహిళ గత ఏడాది నవంబర్ 25న హైదరాబాద్‌కు వెళ్లేందుకు చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలులో (ఏసీ కోచ్)బయలుదేరారు. రైలు కాజీపేట జంక్షన్ దాటగానే ఆమె హ్యాండ్‌బ్యాగ్ అపహరణకు గురైనట్టు గమనించి రైల్వే పోలీసులకు ఫిర్యాదుచేశారు. బ్యాగ్‌లో రూ.1.20 లక్షల విలువ చేసే 37 గ్రాముల బంగారు ఆభరణాలున్నాయని.. బెడ్ రోలర్‌గా పనిచేస్తున్న వ్యక్తిపై అనుమానం ఉన్నట్టు పోలీసులకు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా బిక్కనూర్‌కు చెందిన ఏసీ కోచ్ బెడ్‌రోలర్ దామిశెట్టి ఉపేందర్ కొద్దిరోజుల నుంచి డ్యూటీకి రావడంలేదని పోలీసులు విచారణలో తేలింది. సోమవారం అతడు కాజీపేట రైల్వే జంక్షన్‌కు రావడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చెల్లి పెండ్లి కోసమే దొంగతనం చేశానని నిందితుడు చెప్పాడని పోలీసులు తెలిపారు. బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకొని.. అతడిని రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

కొనుగోళ్లలో ఇందూరు రికార్డ్

- మహిళా సంఘాల ఆధ్వర్యంలో 27 కొనుగోలు కేంద్రాలు
- సకాలంలో కొనుగోళ్లు.. సత్వరం డబ్బు చెల్లింపులు
- 6,394 మందికి రూ.58.17 కోట్ల చెల్లింపు
- రైతుల విశ్వాసం చూరగొన్న మహిళా సంఘాలు



నిజామాబాద్ జిల్లా ఎడపల్లిలో ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు (ఫైల్)

కమ్మర్‌పల్లి, నమస్తేతెలంగాణ: ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణలో మహిళా సంఘాలు సత్తాచాటాయి. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయడంతోపాటు అంతే వేగంగా డబ్బులు చెల్లించి రైతులు మన్ననలు పొందాయి నిజామాబాద్ జిల్లాలోని మహిళా సంఘాలు. అంతేకాదు ఈ జిల్లాను రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిపారు మహిళా కొనుగోలు కేంద్రం నిర్వాహకులు. గడచిన వానకాలంలో నిజామాబాద్ జిల్లాలోని 27 కొనుగోలు కేంద్రాల ద్వారా ఐకేపీ మహిళా సంఘాల వారు వడ్ల కొనుగోళ్లు నిర్వహించారు. 3,27,781.6 క్వింటాళ్ల వడ్లను ఈ కేంద్రాల ద్వారా కొనుగోలు చేశారు. ఇందులో గ్రేడ్-ఏ రకం ధాన్యం 3,07,028.8 క్వింటాళ్లు, కామన్ రకం ధాన్యం 20,752.8 క్వింటాళ్లు కొన్నారు. రైతులకు సకాలంలో చెల్లింపులు చేయాలన్న లక్ష్యంతో ధాన్యం కొనుగోలు ప్రారంభం నాటి నుంచే ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రైతులకు వారం పది రోజుల్లోపే చెల్లింపులు జరిగేలా శ్రమించారు. ఈనెల 13వ తేదీ వరకు కొనుగోళ్లు పూర్తి చేశారు. చివరి రోజు కొనుగోలు చేసిన వారికి కూడా ఈనెల 24వ తేదీలోగా చెల్లించారు. 6,394 మంది రైతులకు రూ.58.17 కోట్లు చెల్లించి శభాష్ అనిపించుకున్నారు. కొనుగోళ్లు ముగిసిన పది రోజుల్లోనే వందశాతం చెల్లింపులు పూర్తి కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దళారుల దోపిడీకి విరుగుడు..

గ్రామాల్లో వరి దిగుబడులు రాగానే వాలిపోయే దళారులకు వడ్లను విక్రయించుకుంటే కలిగే నష్టాలు రైతులకు అనుభవంలో ఉన్నవే. దళారులు తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా ముందుగా చెల్లింపు చేస్తే క్వింటాల్ ధరలో రెండు శాతం తగ్గించి ఇస్తారు. ఉదాహరణకు గడిచిన వానకాలం వడ్ల కొనుగోలు సమయంలోనే కొన్ని ప్రాంతాల్లో కొందరు రైతులు రూ.1,300 నుంచి రూ.1,500 ధరకే దళారులకు వడ్లు విక్రయించారు. రూ.1,500 ధర లెక్కన చూసినా ఎకరాకు సగటున 27 క్వింటాళ్ల వడ్లు వస్తే ఆ ధాన్యాన్ని దళారికి విక్రయించడం ద్వారా ఆ రైతుకు రెండు శాతం కోత పోనూ చేతికి వచ్చేది ఎకరాకు రూ.39,690 మాత్రమే. ఇక్కడ ఆ రైతుకు కలిగిన నష్టం ఎకరాకు 810 రూపాయలు. ఇదే ధాన్యం మహిళా సంఘాలు నిర్వహించే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతులు ఏ-గ్రేడ్ రకం క్వింటాల్‌కు రూ.1,770 చొప్పున అందుకున్నారు. డబ్బులు కూడా వెంటనే అందుకోవడంతో రైతులకు అన్ని విధాలా మేలు జరిగింది.



ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరిన నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం అంబట్‌పల్లి కాంగ్రెస్ కార్యకర్తలు



టీఆర్‌ఎస్‌లో చేరిన నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ వాసులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

టీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు



మహబూబ్‌నగర్ జిల్లా పెద్దరాజమూర్‌లో టీఆర్‌ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

టీఆర్‌ఎస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయి. సోమవారం వివిధపార్టీల నాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలో టీఆర్‌ఎస్‌లో చేరారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వేణు తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో, లింగాల మండలం అంబట్‌పల్లికి చెందిన 50 మంది ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో, వెల్దండ మండలం చెర్కూర్‌కు చెందిన సర్పంచ్ చెర్క రేవతి రాజశేఖర్, ఉపసర్పంచ్ నర్సింహతోపాటు మరో 300 మంది ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గోళి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో, మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని పెద్దరాజమూర్‌లో వివిధపార్టీలకు చెందిన 15 మంది ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో, నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం రహత్‌నగర్, దేవక్కపేట్ (భీమ్‌నగర్) గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మర్రిగూడేనికి చెందిన 200 కుటుంబాల వారు ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.

2 నుంచి వరంగల్‌లో రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్

హన్మకొండ నమస్తే తెలంగాణ: రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్ -2019 వైజ్ఞానిక ప్రదర్శనను వరంగల్‌అర్బన్ జిల్లా మడికొండలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో వచ్చేనెల 2 నుంచి 4 వరకు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర పరిశోధనా విద్యాశిక్షణసంస్థ (ఎస్‌సీఈఆర్టీ) ప్రొఫెసర్ సురేశ్‌బాబు తెలిపారు. వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్లను సోమవారం రాష్ట్ర ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీ కన్వీనర్లు, కో కన్వీనర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర బృందం ప్రతినిధులు ప్రొఫెసర్ సురేశ్‌బాబు, నరేంద్రకత్రి, ఉమాదేవి మాట్లాడుతూ.. ఇన్‌స్పైర్ మనక్ వైజ్ఞానిక ప్రదర్శనకు 31 జిల్లాల నుంచి 790 ఎగ్జిబిట్లు రానున్నాయని చెప్పారు.

సర్పంచ్ బరినుంచి తప్పించారంటూ మనస్తాపం వివాహిత ఆత్మహత్య

అశ్వారావుపేట: పంచాయతీ ఎన్నికల్లో తనను కాదని ఆడపడుచును సర్పంచ్ అభ్యర్థిగా నిలిపారని మనస్తాపం చెంది ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం ఊట్లపల్లిలో సోమవారం చోటుచేసుకున్నది. మృతిరాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊట్లపల్లికి చెందిన రెక్కా నరేంద్ర, రాణి(26) దంపతులు. వీరికి ఏడాదిన్నర బాబు ఉండగా ప్రస్తుతం రాణి గర్భిణి. ఈనెల 25 జరిగిన రెండో విడుత పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయాలని స్థానిక నాయకులు కొన్నిరోజుల క్రితం ఆమెను కోరారు. ఆ వెంటనే వారు తమ నిర్ణయాన్ని మార్చుకొని రాణి సోదరుడి భార్య అయిన జ్యోజ్ఞకు అవకాశం కల్పించగా ఆమె గెలుపొందింది. జ్యోజ్ఞ గెలువడంతో తీవ్ర మనస్తాపం చెందిన రాణి సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.



మహబూబ్‌నగర్ జిల్లా మన్యంకొండ క్షేత్రంలోని కోనేరులోకి మిషన్‌భగీరథ నీటిని వదిలిన అనంతరం తాగి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

మన్యంకొండ కోనేటికి కృష్ణమ్మ నీరు

మిషన్‌భగీరథ నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ తెలంగాణ చౌరస్తా: మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మన్యంకొండ కోనేటిలోకి సోమవారం ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ మిషన్‌భగీరథ జలాలను విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఏ ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు కృష్ణానీటితో స్నానమాచరించి స్వామివారిని చేసుకునే ఏర్పాట్లు చేయాలని ఆలయచైర్మన్, అధికారులను ఆదేశించారు. జాతరకు వచ్చేభక్తుల కోసం ప్రత్యేకమైన మినీఆర్టీసీ బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తెలంగాణటూరిజం ప్రత్యేకప్యాకేజీలతో ఏర్పాటుచేయాలని, కొండపైన స్వామివారిని విద్యుత్‌దీపాలతో అలంకరించి, బ్రహ్మోత్సవాలకు ప్రచారాలను నిర్వహించాలని సూచించారు. కోనేరులో కృష్ణమ్మ విగ్రహాన్ని ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే చెప్పారు.

గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు

టీఆర్‌ఎస్ ప్రధానకార్యదర్శి బస్వరాజు సారయ్య, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్



జగిత్యాలలో మాట్లాడుతున్న బస్వరాజు సారయ్య

జగిత్యాల, నమస్తే తెలంగాణ: గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలని టీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి జిల్లా ఇంచార్జి బస్వరాజు సారయ్య, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పేర్కొన్నారు. సోమవారం జగిత్యాల భాగ్యరాజ్ ఫంక్షన్‌హాల్‌లో టీఆర్‌ఎస్ మద్దతుతో గెలుపొందిన సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్వరాజ్ సారయ్య మాట్లాడుతూ.. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటారన్నారు. ఎంపీ కవిత జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి ఆహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్ పేర్కొన్నారు. రూ.1200 కోట్లతో జగిత్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని చెప్పారు.

తెలంగాణ చరిత్రను వెలికితీయాలి

- ఇందుకోసం హిస్టారికల్ రిసెర్చ్ సెంటర్ ఏర్పాటుచేయాలి
- ఐసీహెచ్‌ఆర్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ వై సుదర్శన్‌రావు



సుదర్శన్‌రావు

హన్మకొండ, నమస్తే తెలంగాణ: తెలంగాణ చరిత్రను వెలికితీయడానికి తెలంగాణ కౌన్సిల్ ఫర్ హిస్టారికల్ రిసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నదని ఇండియన్ కౌన్సిల్ ఫర్ హిస్టరీ అండ్ రిసెర్చ్ సెంటర్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ వై సుదర్శన్‌రావు సూచించారు. కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర, పర్యాటక విభాగం ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహిస్తున్న తెలంగాణా హిస్టరీ కాంగ్రెస్ నాల్గో వార్షికోత్సవ సదస్సు ముగింపు సమావేశం సోమవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కే పురుషోత్తం అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుదర్శన్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ ఆవిర్భావం అనంతరం తెలంగాణ చరిత్రను వెలికి తీయడానికి అవసరైన పరిశోధనల కోసం పరిశోధనపరిషత్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. మాజీ మంత్రి తక్కళ్లపల్లి పురుషోత్తంరావు మాట్లాడుతూ.. గతానికి, వర్తమానానికి అద్దం పట్టేది చరిత్ర అని, చరిత్రకు ఆది, అంతం ఉండదని అన్నారు.

హెచ్ఎండీఏ ఇంచార్జి కమిషనర్‌గా అరవింద్‌కుమార్



■ జనార్దన్‌రెడ్డిని బదిలీచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హెచ్ఎండీఏ కమిషనర్ డాక్టర్ బీ జనార్దన్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. గతేడాది ఆగస్టు 24న హెచ్ఎండీఏ కమిషనర్‌గా నియమితులైన జనార్దన్‌రెడ్డి.. దాదాపు ఐదు నెలలపాటు సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో ముఖ్యభూమిక పోషించారు. ఈ నెల 14 నుంచి 18వరకు ఆమెరికాలోని డ్యూక్ విశ్వవిద్యాలయం నిర్వహించిన ఈ-గవర్నెన్స్ బెస్ట్ సిటిజెన్-సెంట్రిక్ సర్వీస్ డెలివరీ అంశంపై అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారంరోజులు వ్యక్తిగత సెలవులు తీసుకొన్నారు. ఆయనను బదిలీ చేసిన ప్రభుత్వం.. ఇంచార్జి కమిషనర్‌గా మున్సిపల్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. పర్యటన ముగించుకొని వచ్చిన తర్వాత సాధారణ పాలనశాఖకు రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.



పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అటవీ, పర్యావరణ అనుమతులు లభించడంతో ప్రాజెక్టుకు అన్నిరకాల అడ్డంకులు తొలిగిపోయాయంటూ సోమవారం గన్‌పార్క్‌లో సంబురాలు చేసుకుంటున్న అడ్వకేట్ జేఏసీ నేతలు కొంతం గోవర్ధన్, ఉపేంద్ర తదితరులు

సికింద్రాబాద్‌లో సెట్విన్ బీభత్సం



బేగంపేట: సికింద్రాబాద్ గురుద్వార్ వద్ద సెట్విన్ బస్సు బీభత్సం సృష్టించింది. పార్శిగుట్టకు చెందిన అక్తర్ మహ్మద్ సెట్విన్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం మెహిదీపట్నం వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వస్తున్నాడు. గురుద్వార్ వద్ద బస్సును కుడివైపు మలుపు తీసుకున్న డ్రైవర్ వేగంగా వెళ్లి ఓ ఆటోను, రోడ్డుపై ఉన్న ఇద్దరిని ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా ఫుట్‌పాత్‌ను ఢీకొట్టి ఓ షాపులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ వాలియా, జీడిమెట్లకు చెందిన లోవ రాజు, నవీన్‌కు గాయాలయ్యాయి.

తెలంగాణ ప్రభుత్వం

జిల్లా కలెక్టర్ కార్యాలయము, వనపర్తి

ఫారం-సి నోటిఫికేషన్

భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నెం. 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 సెక్షన్ 11(1) మరియు 10 ఎ వినహాయింపు అనుసరించి (రూల్ 6/12 చూడుము)

ఫైల్ నెం. [illegible]/2400/2018 తేది : 26.11.2018

ప్రజా ప్రయోజనము నిమిత్తం అనగా పాలమూరు రంగా రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం క్రింద ఏదుల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ రూపొందించుట కొరకు వనపర్తి జిల్లా గోపాల్ పేట మండలం యొక్క గ్రామం యొక్క మొత్తం 48.30 1/2 ఎకరాల భూమి అవసరమై ఉన్నదని తెలంగా ప్రభుత్వం / జిల్లా కలెక్టర్ వనపర్తి వారు భావించుచున్నారు.

అందువలన పై తెల్పిన సదరు ప్రాజెక్టు కొరకు వనపర్తి జిల్లా గోపాల్ పేట మండలం యొక్క ఏదుల గ్రామంలో 48.30 1/2 ఎకరాలు విస్తీర్ణం గల భూమి ఈ దిగువ తెల్పిన విధంగా వివరణాత్మక వివరం ప్రకారం స్వాధీనత కొరకు ప్రతిపాదించడమైనదని తెలుపడమైనది.

షెడ్యూలు

1	2	3	4	5	6 పట్టాదారు పేరు	7 అనుభవదారు పేరు	8	9	10	11	12
1	201	పట్టా	మెట్ట	0.02	శివరాజు తండ్రి కృష్ణయ్య	శివరాజు తండ్రి కృష్ణయ్య	201	271	196	202	-
2	192	పట్టా	మెట్ట	0.02	క్యానాని నర్సింగమ్మ భ.రాములు	క్యానాని నర్సింగమ్మ భ.రాములు	185	193	[illegible]	191	-
3	147	పట్టా	మెట్ట	0.03	బోయ పుల్లమ్మ భర్త నర్సింహ్మా	బోయ పుల్లమ్మ భర్త నర్సింహ్మా	148	146	148	148	-
3	148	పట్టా	మెట్ట	1.00	బోయ పుల్లమ్మ భర్త నర్సింహ్మా	బోయ పుల్లమ్మ భర్త నర్సింహ్మా	146	192	[illegible]	149	-
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
35	197	[illegible]	మెట్ట	0.04	కోమ్ము శివుడు తండ్రి ఎల్లయ్య	కోమ్ము శివుడు తండ్రి ఎల్లయ్య	196	[illegible]	[illegible]	178	-
36	121	[illegible]	మెట్ట	2.00	[illegible] భర్త కృష్ణయ్య	[illegible] భర్త కృష్ణయ్య	[illegible]	122	[illegible]	117	-
37	87	పట్టా	మెట్ట	0.01	జయమ్మ భర్త నర్సింహ	జయమ్మ భర్త నర్సింహ	97	269	92	86	-
38	121	[illegible]	మెట్ట	4	వీరపోగా కిష్టయ్య తండ్రి నాగయ్య	వీరపోగా కిష్టయ్య తండ్రి నాగయ్య	[illegible]	122	[illegible]	117	-
39	196	పట్టా	మెట్ట	0.04	మహాదేవమ్మ	మహాదేవమ్మ	193	201	[illegible]	195	-
	మొత్తం విస్తీర్ణం			48.02							

భూసేకరణ పునరావాస మరియు రిసెటిల్మెంట్ (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నెం. 21 ఆఫ్ 2017) పారదర్శకత మరియు పరిహారాన్ని కొరకు హక్కు చట్టం ద్వారా సవరించబడిన విధముగా భూసేకరణ పునరావాసం మరియు రిసెటిల్మెంట్ (తెలంగాణ సవరణ) చట్టం 2013 (కేంద్ర చట్టము నెం. 30/2013)లో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు యొక్క సెక్షన్ 11(1) యొక్క నిబంధనల క్రింద ఇందుకు సంబంధించిన వారందరికీ ఈ ప్రకటన చేయబడినది.

[illegible]

సం/- భూసేకరణ అధికారి రెవిన్యూ మండలాధికారి, వనపర్తి; సం/- సంయుక్త కలెక్టర్, వనపర్తి; సం/- జిల్లా కలెక్టర్, వనపర్తి

DIPR No. : 912LA/PP/Agency/2018-19

చీకటి దొంగ @ 47 చోరీలు

సంపన్న కాలనీలే లక్ష్యంగా దొంగతనాలు

ప్రజల సమాచారంతో పట్టుకున్న రాచకొండ పోలీసులు

ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లావాసిగా గుర్తింపు

రెండు కేజీల బంగారం, ఏడున్నర కేజీల వెండి ఆభరణాలు స్వాధీనం



నిందితులు నటరాజ్, పొలిమెట్ల రాజశేఖర్, వడ్ల కృష్ణచారి, రాయపురు నరేశ్‌చారి



కేసు వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ మహేశ్ భగవత్


హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: సంపన్నుల కాలనీలే లక్ష్యంగా రాత్రిళ్ల మాత్రమే చోరీలకు పాల్పడుతున్న చీకటి దొంగ చిక్కాడు. ఎట్టకేలకు 47 చోరీ కేసుల మిస్టరీ వీడింది. దొంగ నుంచి రెండు కేజీల బంగారం, ఏడున్నర కేజీల వెండి ఆభరణాలను రాచకొండ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రజలిచ్చిన సమాచారంతోనే దొంగను పట్టుకున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పోలీసులు చేపట్టిన 'కమ్యూనిటీ పోలీసింగ్'పై అవగాహన కార్యక్రమం సక్సెస్ అయింది. సంక్రాంతి పండుగ సందర్భంగా చోరీలు జరుగకుండా ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపామని, ప్రజల భాగస్వామ్యంతో కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేశామని రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్ సోమవారం వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే ప్రజలు ఇచ్చిన సమాచారంతో ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా తంగెళ్లమూడి మండలం చిన్న మాలపల్లి గ్రామానికి చెందిన వేముల నటరాజ్‌ను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. కమిషనర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. నటరాజ్ కొంతకాలం కిందట హైదరాబాద్‌కు వచ్చి బంజారాహిల్స్ రోడ్‌నంబర్-10లో నివాసం ఉంటున్నాడు. ఆయుర్వేదిక్ వ్యాపారం, ఆటో డ్రైవర్‌గా పనిచేశాడు. విలాసాలకు అలవాటుపడ్డ నటరాజ్‌కు.. ఈ ఆదాయం సరిపోకపోవడంతో 2005 నుంచి చోరీల బాటపట్టాడు. ఓ టార్చిలైట్, స్క్రూడ్రైవర్ తదితర సామగ్రితో ప్రత్యేకంగా ఏర్పాటుచేసుకున్న టూల్ కిట్ బ్యాగ్‌ను ఎప్పుడూ వెంటపెట్టుకుని తిరుగుతుంటాడు. ఇండ్లకు తాళంవేసి ఉంటేచాలు నిమిషాల్లో విరగొట్టి కొల్లగొడతాడు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు జిల్లాలో అనేక దొంగతనాలు చేసిన నటరాజ్ గతంలో జైలుకు కూడా వెళ్లొచ్చాడు. 2016 నుంచి 2019 వరకు జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 24, కుషాయిగూడలో 13, కీసర పరిధిలో 10.. ఇలా మొత్తం 47 ఇండ్లలో చోరీలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్నాడు. సంక్రాంతి రోజు రాత్రి జవహర్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో తాళంవేసి ఉన్న ఓ ఇంట్లో అలికిడి కావడంతో పక్కింటివారు పోలీసులకు సమాచారం అందించారు. నిమిషాల్లో అక్కడకు చేరుకున్న పోలీసులు నటరాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వేలి ముద్రలను పాపిలాన్ టెక్నాలజీ ద్వారా విశ్లేషించగా, చోరీల చరిత్ర బయటపడింది. అతని నుంచి రెండు కేజీల 10 గ్రా. బంగారం, ఏడున్నర కేజీల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. చోరీ సొత్తును తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న వారిని గుర్తించారు. అందులో పొలిమెట్ల రాజశేఖర్, వడ్ల కృష్ణచారి, రాయపురు నరేశ్ చారిని అరెస్టు చేయగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నారు.

రాత్రి తొమ్మిది దాటితేనే చోరీ

నటరాజ్ 2016 నుంచి 2019 వరకు చేతులకు సాక్సులు, కాళ్లకు షూ ధరించి ఎక్కడా చిక్కకుండా ఒంటరిగానే చోరీలకు పాల్పడుతున్నాడు. 47 ఇండ్లలో చోరీలతో రూ.75 లక్షలు దొంగిలించాడు. చోరీ సొమ్మును తక్కువ ధరకు విక్రయించి వచ్చిన క్యాష్‌తో మస్తీ చేశాడు. రాత్రి 9 గంటల తర్వాత సంపన్న కాలనీల్లో తిరుగుతూ తాళం ఉన్న ఇండ్లలో దోచుకుంటాడని పోలీసు దర్యాప్తులో తెలిసింది. సీసీ కెమెరాలు ఉన్నా రాత్రి సమయాల్లో దృశ్యాలు స్పష్టంగా కనిపించవనే నమ్మకంతోనే దొంగతనాలన్నీ రాత్రిళ్లే చేస్తాడని తేలింది.

చిన్నారుల మోముల్లో చిరునవ్వు

- చాకిరీ నుంచి 325 మంది చిన్నారులకు విముక్తి
- 'ఆపరేషన్ స్మైల్-5'లో పట్టుబడిన బాలబాలికలు
- ముగ్గురు పిల్లలను చదివించేందుకు ముందుకొచ్చిన ఎస్సై, ఏఎస్సై
- సంస్థలపై 14 కేసులు, రూ.6.75 లక్షల జరిమానా వసూలు



హైదరాబాద్ సీపీ అంజనీకుమార్, అదనపు సీపీ శిఖాగోయెల్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఓ బాలుడి నాయనమ్మ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: అపరేషన్ స్మైల్-5లో 325 బాలలను చాకిరీ నుంచి విముక్తి చేశామని సీపీ అంజనీకుమార్ వెల్లడించారు. సోమవారం సీపీ కార్యాలయంలో మీడియాకు అపరేషన్ స్మైల్ వివరాలను వెల్లడించారు. జనవరిలో నగర అదనపు పోలీస్ కమిషనర్ శిఖాగోయెల్ నేతృత్వంలో నగరంలోని 17 డివిజన్లకు 17 బృందాలను ఏర్పాటు చేశామని, బృందానికి ఒక ఎస్సై స్థాయి అధికారి నేతృత్వం వహించగా, అందులో కార్మిక శాఖ అధికారులుకూడా పాల్గొన్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో నాలుగేండ్ల నుంచి జనవరి 1 నుంచి 31 వరకు అపరేషన్ స్మైల్ కొనసాగుతున్నదని చెప్పారు. బడిమానేసి పనులు, భిక్షాటన చేస్తున్న వారు, రోడ్లపై తిరుగుతున్న 18 ఏండ్లలోపు 325 మంది పిల్లలను గుర్తించి అదుపులోకి తీసుకోగా, వీరిలో 11 మంది బాలికలున్నారని పేర్కొన్నారు. 272 మందిని వారి తల్లిదండ్రులకు అప్పగించి, 53 మందిని రెస్క్యూహోంకు తరలించామని, వారి తల్లిదండ్రులను గుర్తించాల్సి ఉందని చెప్పారు. పట్టుబడ్డవారిలో 10 ఏండ్లలోపువారు ఏడుగురు, 11-14 మధ్య వయసువారు 38, 15 నుంచి 18 ఏండ్లలోపువారు 280 మంది ఉన్నారని సీపీ తెలిపారు. వీరంతా చిన్నచిన్న ఫ్యాక్టరీలు బ్యాగులు, గాజులు, బిస్కెట్స్, బేకరీ, ఎలక్ట్రికల్స్, మెకానిక్ షాప్, కంప్యూటర్ వర్క్స్, ఫ్యాబ్రికేషన్స్, వెల్డింగ్ షాప్స్, టిఫిన్ సెంటర్లలో పనిచేస్తున్న వారని చెప్పారు. సంస్థలపై 14 కేసులు నమోదుచేసి, రూ.6,75,365 జరిమానా వసూలు చేసినట్లు తెలిపారు. ఇందులో వంద మంది ఏపీ వారు కాగా, బీహార్, జార్ఖండ్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ర్టాలతోపాటు ఒకరు నేపాల్‌కు చెందిన వారున్నారని వివరించారు. బాలలకు సమాచారం తెలుసుకొనేందుకు దర్పన్ యాప్‌ను ఉపయోగించామని, పట్టుబడ్డవారిలో తిరుమలగిరి మహిళా ఎస్సై రజిని ఇద్దరు పిల్లలను చేరదీసి, చదివించేందుకు తనవంతు సహకారం అందించారని, స్కూల్ యజమాన్యాలు కూడా ముందుకొచ్చి వారికి ఉచిత విద్య అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. గోల్కొండ పోలీస్ స్టేషన్ ఏఎస్సై రఫియుద్దీన్ పదేండ్ల బాలుడిని చేరదీసి స్థానిక పాఠశాలలో చేర్పించారని సీపీ అభినందించారు. పిల్లలకు సంబంధించిన వివరాలతో డాటాబేస్ తయారు చేస్తామని, ఇది కార్మికశాఖతో అనుసంధానమై ఉంటుందని చెప్పారు. ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని, వారిని చేరదీసేందుకు మానవతాదృక్పథంతో ముందుకురావాలని కోరారు. అదనపు సీపీ శిఖాగోయెల్ మాట్లాడుతూ నగరంలో 200 హాట్‌స్పాట్స్‌ను గుర్తించి, కార్మికశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖ సమన్వయంతో తనిఖీలు చేశామని అన్నారు.

బాలల కుటుంబ సభ్యుల్లో ఆనందం

ఎస్సై, ఏఎస్సై ముందుకొచ్చి ముగ్గురు పిల్లలను చదివిస్తుండటంతో ఆ పిల్లల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తంచేశారు. ఆర్థిక ఇబ్బందులతో తమ పిల్లలను చదివించలేకపోయామని చెప్పారు. తన కొడుకు చెప్పిన మాట వినకుండా తిరుగుతున్నాడని, అతనికి నచ్చజెప్పి పోలీసులు చదివిపిస్తున్నారని ఒక బాలుడి నాయనమ్మ తెలుపుతూ, వారికి దేవుని ఆశ్వీరాదం ఉండాలని కాంక్షించారు. పోలీసుల కృషిని పలువురు కొనియాడారు.

కోకాకోలా కార్మిక సంఘం ఎన్నికల్లో..

టీఆర్‌ఎస్కేవీ అనుబంధ సంఘం విజయం

■ అధ్యక్షుడిగా ఎన్నికైన రాంబాబుయాదవ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మౌలాలీలో ఉన్న కోకాకోలా కంపెనీ కార్మిక సంఘం ఎన్నికల్లో టీఆర్ఎస్ కార్మిక విభాగం(టీఆర్ఎస్కేవీ) అనుబంధ సంఘం గెలుపొందింది. సోమవారం యూనియన్ అధ్యక్షుడిగా టీఆర్ఎస్కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ విజయం సాధించారు. టీఎన్‌టీయూసీకి చెందిన ఆర్ రామ్మోహన్‌రావుపై రాంబాబుయాదవ్ విజయంతో.. ఇక్కడ రెండోసారి టీఆర్ఎస్కేవీ అనుబంధ సంఘం గెలుపొందింది. రాంబాబు యాదవ్‌ను కార్మికులు, సంఘం నాయకులు అభినందించారు. సీఎం కేసీఆర్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంతోపాటు 24 గంటల విద్యుత్ సరఫరాతో ఉపాధి అవకాశాలను పెంచారని రాంబాబు పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు.

ఓటర్ జాబితాలో అధికారుల పేర్లు

■ సీసీఎస్‌లో జీహెచ్ఎంసీ ఫిర్యాదు, కేసు నమోదు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఓపీ రావత్, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ పేర్లు ఓటర్ జాబితాలోకి వచ్చిన విషయాన్ని నిగ్గుతేల్చి బాధితులపై చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ.. సీసీఎస్‌ను ఆశ్రయించింది. నాంపల్లి నియోజకవర్గం ఎన్నికల అధికారిగా వ్యవహరించిన మహ్మద్‌ఖాజా ఇంకేసాఫ్‌అలీ సోమవారం సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎన్నికల అధికారి ఫిర్యాదుమేరకు సీసీఎస్ పోలీసులు కేసు నమోదుచేశారు. నాంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఒవైసీనగర్ చిరునామాతో ఓపీ రావత్, రజత్‌కుమార్ పేర్లు ఫొటోలతోపాటు ఓటర్ జాబితాలో నమోదయ్యాయి. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు నిర్వహించిన ఓటర్ నమోదు, సవరణ సమయంలో వీరిరువురి పేర్లు ఓటర్ల జాబితాలో చోటుచేసుకొన్నాయి. ఈ విషయం ఇటీవల వెలుగులోకి రావడంతో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ సీరియస్‌గా తీసుకొని విచారణ జరిపించాలని జీహెచ్ఎంసీ కమిషనర్, గ్రేటర్ హైదరాబాద్ ముఖ్య ఎన్నికల అధికారి దానకిశోర్‌ను ఆదేశించారు. దీంతో జీహెచ్ఎంసీ సర్కిల్-12 డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న నాంపల్లి నియోజకవర్గం ఎన్నికల అధికారి మహ్మద్‌ఖాజా ఇంకేసాఫ్‌అలీ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదుచేశారు.

'గిరి'జనం దరిచేరిన విద్యాప్రగతి

- విద్యతో గిరిజనుల ఆర్థిక ప్రగతికి సర్కారు కృషి
- గిరిజన విద్యకు రూ.3495.63 కోట్లు ఖర్చు
- 408 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏండ్లతరబడి విద్యకు, విజ్ఞానానికి దూరంగా ఉంటున్న గిరిజనుల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నది. వేల కోట్ల ఖర్చుకు వెనుకాడక విద్యను గిరిజనుల దరికిచేర్చి తద్వారా వారి ఆర్థిక ప్రగతికి మార్గం ఏర్పాటు చేసింది తెలంగాణ సర్కారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రత్యేక చొరవతో దేశంలోనే అతిపెద్ద గిరిజన యూనివర్సిటీ తెలంగాణకు దక్కింది. 408 ఎకరాల్లో ములుగు-జాకారం పరిధిలో రూపుదిద్దుకుంటున్నది. మారుమూల తండాల్లో, గిరిజన ప్రాంతాల్లో ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలలను పటిష్ఠం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి నిలిపింది. గిరిజన కుటుంబాలు సామాజిక, ఆర్థిక ప్రగతి సాధించేందుకు చదువు ఎంతో అవసరమని భావించిన సర్కారు గిరిజనుల విద్యాప్రగతికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే నాలుగేండ్లలో గిరిజన గురుకుల విద్యాలయాల నిర్వహణ, విద్యార్థుల ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్, సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ, ఉన్నతవిద్యకు విదేశాలకు వెళ్లిన గిరిజనులకు ఆర్థిక సహాయం, గిరిజన స్టడీ సర్కిళ్ల నిర్వహణకు ప్రభుత్వం రూ.3495.63 కోట్లు ఖర్చు చేసింది. ఏండ్లతరబడి అన్నింటా వెనుకబాటుకు గురైన గిరిజనులను విద్య ద్వారా పురోగతివైపు తీసుకువెళ్లేందుకు తెలంగాణ ఏర్పడిన నాటినుంచి ఇప్పటివరకు ప్రభుత్వం వేల కోట్లు వెచ్చించింది. కేజీ టు పీజీ విద్యా విధానం అమలులో భాగంగా గిరిజన గురుకుల విద్యాలయాలకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరం వరకు ప్రభుత్వం రూ.935.34 కోట్ల బడ్జెట్ కేటాయించింది.

గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని విద్యా సంస్థలు

విద్యాసంస్థ క్యాటగిరీ	సంఖ్య	విద్యార్థులు
ఆశ్రమ పాఠశాలలు	269	75,093
సంక్షేమ వసతిగృహాలు	203	41,286
ప్రాథమిక పాఠశాలలు	1342	27,345
మొత్తం	**1814**	**1,43,724**

గురుకులాల్లో సత్ఫలితాలు

గురుకుల విద్యాలయాల్లో అన్నివిధాల సౌకర్యాలు కల్పించి, నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంపై సర్కారు చూపిన ప్రత్యేకశ్రద్ధతో గడచిన నాలుగేండ్లలో గిరిజన గురుకులాలు సత్ఫలితాలనిచ్చాయి. ప్రభుత్వం చేపట్టిన చర్యలతో ఏటా ఫలితాల్లో పురోగతి సాధిస్తున్నారు.

ఎస్సెస్సీ, ఇంటర్ విద్యార్థుల ఉత్తీర్ణతాశాతం

	ఉత్తీర్ణతాశాతం	
విద్యా సంవత్సరం	ఎస్సెస్సీ	ఇంటర్
2014-15	79.05	84.37
2015-16	81.24	94.41
2016-17	85.56	88.36
2017-18	86.31	87.2

గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు ఆమోదం

రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రత్యేక దృష్టి, టీఆర్ఎస్ పార్టీ ఎంపీల కృషితో తెలంగాణ రాష్ట్రంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. దేశంలోనే అతిపెద్ద గిరిజన యూనివర్సిటీని ములుగులో ఏర్పాటు చేయనున్నారు. ఈ యూనివర్సిటీ దక్షిణ భారతదేశంలోనే మొదటిది కావడం విశేషం. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన గిరిజన విశ్వవిద్యాలయాన్ని ములుగు-జాకారం పరిధిలో ఏర్పాటు చేసేందుకు కేంద్రబృందం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇటీవలే ములుగును సందర్శించి యూనివర్సిటీ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. గిరిజన యూనివర్సిటీ కోసం రాష్ట్ర ప్రభుత్వం అందించిన 408.04 ఎకరాల భూమిచుట్టూ ప్రహరీ నిర్మించేలా అధికారులకు ఆదేశాలు జారీచేశారు. మార్చి మొదటివారం నుంచి నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు.

గిరిజన విద్యాప్రగతికి చేపట్టిన ప్రత్యేక చర్యలు

-గిరిజన గురుకులాల్లో పదోతరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం ప్రతి ఒక్కరికీ రూ.5 వేల నగదు పురస్కారం అందిజేస్తూ విద్యపరంగా వారిని ప్రోత్సహిస్తున్నారు.

నాడు ప్రొఫెసర్.. నేడు సర్పంచ్

- ఎన్ఎస్ఎస్ సేవలతో జాతీయ అవార్డులు సొంతం
- కరీంనగర్ జిల్లా సాంబయ్యపల్లి సర్పంచ్‌గా ఎన్నిక

తార్నాక / చొప్పదండి: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా పనిచేసి ఎందరో విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిన కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని సాంబయ్యపల్లి గ్రామానికి చెందిన ప్రొఫెసర్ కొత్తపెల్లి రామకృష్ణ సర్పంచ్‌గా గెలుపొందారు. ఓయూ ఎన్ఎస్ఎస్ అధికారిగా, హిస్టరీ విభాగాధిపతిగా, హిస్టరీ బీవోఎస్ చైర్మన్‌గా, ఓయూ ఆర్ట్స్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్‌గా 34 ఏండ్లు సేవలు అందించారు. ఎన్ఎస్ఎస్ విభాగం అధిపతిగా ఎంతోమంది విద్యార్థులను సాంఘిక సేవ వైపు మళ్లించారు. సొంతూరులో యువతకు వివిధ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించారు. సత్యసాయి సేవాసమితి ట్రస్టు ద్వారా గ్రామంలో అంబేద్కర్ స్థూపం, వృద్ధులకు దుస్తులతోపాటు విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీచేశారు. రామకృష్ణ ఎన్ఎస్ఎస్ సేవలను గుర్తిస్తూ.. అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ రెండుసార్లు జాతీయ అవార్డును అందజేశారు. ఎన్ఎస్ఎస్ ద్వారా సమాజంలో ఎన్నో సేవలను అందించిన ఆయన.. గత ఏడాది పదవీ విరమణ పొంది గ్రామ సేవచేయాలని నిర్ణయించారు. తాజాగా జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి టీఆర్ఎస్ పార్టీ సహకారంతో 71 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

గ్రామాన్ని ఆదర్శంగా నిలుపుతా



కొత్తగా ఏర్పడిన మా గ్రామపంచాయతీకి సర్పంచ్‌గా గెలుపొందడం ఆనందంగా ఉన్నది. నాపై నమ్మకం ఉంచి సర్పంచ్‌గా గెలిపించిన ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటా. గ్రామంలో అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తా. అభివృద్ధిలో గ్రామాన్ని ఆదర్శంగా నిలిపేందుకు కృషిచేస్తా.

– డాక్టర్ కొత్తపల్లి రామకృష్ణ, సాంబయ్యపల్లి సర్పంచ్



గ్రామ స్వరాజ్యం



పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని చీకటి మామిడి గ్రామంలో మాట్లాడుతున్న ఎంపీ బూర నర్సయ్యగౌడ్

సర్పంచ్ బరిలో వదినామరదళ్లు

- వరంగల్ అర్బన్ జిల్లా కొత్తపల్లి జీపీలో హోరాహోరా



బండారి కల్యాణి, అక్కెపెల్లి సునీత

కమలాపూర్: వరంగల్ అర్బన్ జిల్లా కమలాపూర్ మండలం పరిధిలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీకి జరుగుతున్న స్థానిక ఎన్నికల్లో వదినామరదళ్లు పోటీపడుతుండటం ఆసక్తిని రేకెత్తిస్తున్నది. కమలాపూర్ మండలంలోని కన్నూరు గ్రామ పంచాయతీ నుంచి విడిపోయి కొత్తపల్లి నూతన పంచాయతీగా ఏర్పడింది. కొత్తపల్లి గ్రామంలో 373 మంది ఓటర్లు ఉన్నారు. సర్పంచ్ స్థానం ఎస్సీ మహిళకు రిజర్వ్ అయ్యింది. ఈ క్రమంలో అభ్యర్థులుగా బండారి కల్యాణి, ఆమె వదిన సునీత బరిలో నిలిచారు. వదినామరదళ్లు పోటీపడుతుండటంతో ఎవరికి ఓటేయాలో తెలియక వారి కుటుంబీకులు ఆయోమయానికి గురవుతున్నారు.



నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం భీమారంలో సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్



వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం కొప్పునూరు గ్రామ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జూపల్లి

రేపే తుదివిడుత

మొదటిపేజీ తరువాయి...

నామినేషన్లు దాఖలు కాలేదు. దీంతో ఆఖరివిడుతలో 3,529 గ్రామాలకు బుధవారం పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ గ్రామాల్లో 11,667 మంది సర్పంచ్ అభ్యర్థులు, 27,582 వార్డులకు 73,976 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. మొత్తం 36,729 వార్డులుండగా, 8,959 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. 188 వార్డులకు నామినేషన్లు దాఖలుచేయకపోవడంతో పోలింగ్ జరుగడం లేదు. ఇక రెండోవిడుతలో పోలింగ్ వాయిదాపడిన నిజామాబాద్ జిల్లా జల్లపల్లి, ఆదిలాబాద్ జిల్లా తోషంతండా సర్పంచ్, మూడో వార్డుతో పాటు రంగారెడ్డి జిల్లాలో ఒక వార్డుకు బుధవారం పోలింగ్ నిర్వహిస్తున్నారు.

రూ. 5.79 లక్షల మద్యం సీజ్

మూడోవిడుతలో భాగంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన తనిఖీల్లో రూ.5,79,855 విలువైన మద్యాన్ని పట్టుకున్నట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. రాచకొండ కమిషనరేట్ పరిధిలో రూ.1,39,140, నిజామాబాద్ జిల్లాలో రూ.24 వేలు, రామగుండం కమిషనరేట్ పరిధిలో రూ.1560, ఖమ్మంలో రూ.6,600, కరీంనగర్‌లో రూ.2,11,980, వనపర్తిలో రూ.19,200, మహబూబ్‌నగర్‌లో రూ.31,500, వికారాబాద్‌లో రూ.24 వేలు, రాజన్న సిరిసిల్లలో రూ.9870, భద్రాద్రి కొత్తగూడెంలో రూ.48,300, జయశంకర్ భూపాలపల్లిలో రూ.32వేలు, జగిత్యాల జిల్లాలో రూ.32,205 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 16 మందిపై కేసు నమోదుచేసి, అదుపులోకి తీసుకున్నట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది.

అభివృద్ధికి పట్టంకట్టండి

- టీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేల పిలుపు
- మూడోవిడుత పంచాయతీపోరుకు ఆఖరిరోజు జోరుగా సాగిన ప్రచారం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు పిలుపునిచ్చారు. రాష్ర్టాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరారు. అధికార పార్టీ మద్దతుదారులను గెలిపిస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. మూడోవిడుత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా సోమవారం వివిధ గ్రామాల్లో టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థుల తరపున ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రచారంచేపట్టారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం భీమారంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మునుగోడు మండలంలోని పలుగ్రామాల్లో ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి.. కనగల్, తిమ్మనగూడెంలో నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రచారం చేపట్టారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మాసాయిపేటలో ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, సంస్థాన్ నారాయణపురంలో ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ప్రచారం నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని దేవరకద్ర, చిన్నరాజమూర్, పెద్దరాజమూర్, నాగారం, బస్వాయిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి.. చంద్రవంచ, నాచారం, తోగాపూర్, సర్జఖాన్‌పేట గ్రామాల్లో కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి టీఆర్ఎస్ మద్దతుదారుల తరపున ఇంటింటి ప్రచారం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలోని గ్రామాల్లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల, అలంపూర్ మండలాల్లో అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం, వనపర్తి జిల్లా పానగల్ మండలకేంద్రంలో ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, చిన్నంబావి మండలంలోని కొప్పునూరు, పెద్దమారూర్ గ్రామాల్లో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రచారం నిర్వహించారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని లస్మన్నపల్లి, సోమారం, సైదాపూర్, వెన్కేపల్లి, దుద్దనపల్లి, ఆకునూర్, ఘనపూర్‌లో హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్.. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం, బూడిదంపాడు, మంచుకొండ, రాంక్యాతండా, సూర్యాతండా పంచాయతీల్లో ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ పలు గ్రామాల్లో టీఆర్ఎస్ మద్దతుదారుల ప్రచారంలో పాల్గొన్నారు.



సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురంలో పంచాయతీ ప్రచార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్



పంచాయతీ ఎన్నికల్లో భాగంగా సోమవారం వనపర్తి జిల్లా పానగల్‌లో టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేస్తున్న వనపర్తి ఎమ్మెల్యే నిరంజన్‌రెడ్డి



సోమవారం నల్లగొండ జిల్లా కనగల్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

పగలే ఇగం!

మొదటిపేజీ తరువాయి...

చేన్లు కూడా దెబ్బతిన్నాయని వ్యవసాయాధికారులు వెల్లడించారు. చివరితీతలో ఉన్న పత్తిపంట కూడా అకాలవర్షానికి దెబ్బతిన్నది. వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా ప్రకారం 14 మండలాల్లోని 107 గ్రామాల్లోని 2077 మంది రైతులకు ఈ అకాల వర్షాలు నష్టాలను మిగిల్చాయి. కరీంనగర్ జిల్లాలో నాలుగు మండలాల్లోని 16 గ్రామాల్లో 173.40 హెక్టార్లు, పెద్దపల్లి జిల్లాలోని ఏడు మండలాల పరిధిలోని 23 గ్రామాల్లో 67.28 హెక్టార్లు, వనపర్తి జిల్లాలో 62 గ్రామాల్లో 1,266.60 హెక్టార్లు, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఆరు గ్రామాల్లో 25 హెక్టార్ల పంటకు నష్టం వాటిల్లినట్టు అధికారులు ప్రాథమికంగా అంచనావేశారు. క్షేత్రస్థాయిలో పంట నష్టంపై రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధికారులను ఆరా తీశారు.

భద్రాద్రి జిల్లాలో మిర్చికి భారీ దెబ్బ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం తిప్పనపల్లి, గుర్రాయిగూడెం, రావికంపాడు, పోకలగూడెం, వెంకటియాతండా, బెండాలపాడు, చంద్రుగొండ గ్రామాల్లో సుమారు నాలుగు వేల ఎకరాల్లో మిర్చి పంట దెబ్బతిన్నదని క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడవుతున్నది. 40 వేల క్వింటాళ్ల మిర్చి నీటిపాలైంది. పినపాక మండలం ఏడూళ్లబయ్యారం వెంకట్రావుపేట, చింతల బయ్యారం, సింగిరెడ్డిపల్లి, భూపతిరావుపేట, చర్ల మండలంలోని పలు గ్రామాల్లో మిర్చి పంట దెబ్బతిన్నది. పాల్వంచ మండలం భోజ్యాతండాలో 50 క్వింటాళ్ల మిర్చి కల్లాల్లో తడిసింది. ఇటీవల మిర్చి రేటు బాగా ఉందని, లాభాలు వస్తాయని ఆశిస్తే.. నష్టాలు చవిచూడాల్సి వస్తున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అకాలవర్షంతో పెట్టిన పెట్టుబడి కూడా అందే పరిస్థితిలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా పూత, కాపుదశలో ఉన్న మామిడి తోటలకు నష్టంవాటిల్లింది. పూత రాలిపోవడంతో మామిడి రైతులు ఆందోళనలో ఉన్నారు. ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి పంటకు స్వల్ప నష్టం వాటిల్లింది. అయితే ఆరుతడి పంటలు సాగుచేస్తున్న రైతులకు ఈ అకాల వర్షాలు ఎంతో మేలుచేశాయి. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని పలుగ్రామాల్లో దాదాపు 300 ఎకరాల్లో వేరుశనగ పంటనష్టం జరిగినట్టు మండల వ్యవసాయ అధికారి నరేశ్ తెలిపారు. పెద్దమందడి మండలంలోని ఆయా గ్రామాల్లో 123 మంది రైతులకు చెందిన 469 ఎకరాల్లో వేరుశనగ నష్టపోయినట్టు ఏడీఏ పూర్ణచంద్రారెడ్డి, మండల వ్యవసాయధికారి మల్లయ్య తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో బిజినేపల్లి మండలం మహదేవునిపేట, పోలెపల్లి గ్రామాల్లో 20 ఎకరాల్లో వేరుశనగ పంటకు నష్టం వాటిల్లినట్టు అధికారులు తెలిపారు. మిర్చి పంట కూడా దెబ్బతింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని ముస్కానిపేటతోపాటు పలు గ్రామాల్లో మిర్చి కల్లాల్లో చేరిన నీటిని రైతులు సోమవారం తొలిగించారు. బోయినపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆరెకరాల మక్కజొన్న పంటకు నష్టం జరిగినట్టు ఏవో ప్రణీత తెలిపారు. రెండ్రోజులపాటు కురిసిన వర్షాలకు తోడు ఈదురుగాలులకు మక్కజొన్న నేలపాలైంది. నీలోజిపల్లి, కొదురుపాక, రామన్నపేట, రత్నంపేట గ్రామాల్లో పంట నష్టం జరిగినట్టు అధికారులు తెలిపారు.



వరంగల్ రూరల్ జిల్లా దాసరిపల్లిలో తడిసిన మిర్చిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

రైతులు అధైర్య పడొద్దు ఆదుకుంటాం: ఎమ్మెల్యే పెద్ది

నర్సంపేట రూరల్: వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులు ఏమాత్రం అధైర్య పడొద్దని, ప్రభుత్వపరంగా ఆదుకుంటామని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చెప్పారు. అకాల వర్షాల కారణంగా వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట మండలంలోని దాసరిపల్లి, కమ్మపల్లి, భాంజీపేట, నర్సునాయక్ తండాల్లో దెబ్బతిన్న పంటలను సోమవారం ఆయన వ్యవసాయశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రామాల్లో రైతులు ఆరబోసిన మిర్చి కల్లాలు, తోటలను పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు.

జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం
నిర్మల్	10.0	25.0
కామారెడ్డి	11.0	23.0
రంగారెడ్డి	11.0	26.0
జగిత్యాల	12.0	26.0
రాజన్న సిరిసిల్ల	13.0	24.0
కుమ్రం భీం ఆసిఫాబాద్	13.2	22.8
మంచిర్యాల	13.2	22.8
ఆదిలాబాద్	13.2	22.8
మేడ్చల్ మల్కాజిగిరి	13.5	23.0
హైదరాబాద్	14.0	22.0
వరంగల్ రూరల్	14.0	22.0
జయశంకర్	14.0	24.0
సంగారెడ్డి	15.5	26.0
సిద్దిపేట	15.6	26.9
మెదక్	15.8	29.5
నిజామాబాద్	15.9	23.4
సూర్యాపేట	16.0	24.0
వరంగల్ అర్బన్	16.0	23.0
నాగర్‌కర్నూల్	16.3	26.9
జనగామ	16.5	21.7
యాదాద్రి	16.6	26.9
ఖమ్మం	17.0	24.0
భద్రాద్రి కొత్తగూడెం	17.0	24.0
మహబూబ్‌నగర్	17.0	26.9
నల్లగొండ	17.0	27.0
వనపర్తి	17.2	27.0
కరీంనగర్	17.3	27.6
పెద్దపల్లి	17.6	25.4
వికారాబాద్	17.7	21.7
మహబూబాబాద్	18.2	27.2
జోగుళాంబ గద్వాల	19.6	27.1

చలికాలం

పడిపోయిన పగటి ఉష్ణోగ్రతలు

గత మూడ్రోజులుగా కారుమబ్బులు కమ్ముకోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గాయి. రాత్రి పూట ఉష్ణోగ్రతల్లో పెద్దమార్పు లేకపోయినా గాలిలో తేమపెరిగి చలి తీవ్రత కొనసాగుతున్నది. తూర్పు విదర్భ, దాని పరిసర ప్రాంతాల్లో సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తువద్ద ఏర్పడిన ఉపరితల ద్రోణి, ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక నుంచి తెలంగాణ మీదుగా ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఆది, సోమవారాల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు పడ్డాయి. అల్పపీడన ద్రోణి మంగళవారం పూర్తిగా బలహీనపడుతుందని, బుధవారం నుంచి దీని ప్రభావం ఉండదని, రాష్ట్రంలో పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మంగళ, బుధవారాల్లో ఉదయం దట్టమైన పొగమంచు ఆవరించి ఉంటుందన్నారు. కాగా హిందూ మహాసముద్రం, అండమాన్ నికోబార్ దీవుల మీదుగా ఏర్పడిన ద్రోణి ప్రభావం తెలంగాణపై నామమాత్రమేనని వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. రాయలసీమలో తేలికపాటి వానలు పడవచ్చన్నారు. ఉపరితల ద్రోణి ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, వరంగల్ అర్బన్, రంగారెడ్డి, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు పడ్డాయి. రాబోయే రెండ్రోజులపాటు తెల్లవారుజామున పొగమంచు విపరీతంగా పడుతుందని, రహదారులపై వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం అధికారులు సూచించారు.

వణికిన నిర్మల్ జిల్లా

నిర్మల్ జిల్లాలో మూడ్రోజులుగా చలి తీవ్రంగా ఉన్నది. చలితో కూడి ఈదురుగాలులు వీస్తుండటంతో ప్రజలు వణికిపోతున్నారు. సోమవారం జిల్లాలో 10 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ప్రజలు ఇండ్లనుంచి బయటకు రావటానికి జంకుతున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని బిజినేపల్లి, తిమ్మాజిపేటతోపాటు పలు మండలాల్లో ముసురు వర్షం కురిసింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సోమవారం తెల్లవారుజామున తిమ్మాజిపేట మండలంలో కోడుపర్తి గ్రామంలో షరీఫాబీ అనే మహిళకు చెందిన పాత ఇల్లు కూలిపోయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం మొదలైన ముసురు సోమవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. ఖమ్మంలో వర్షం లేకపోయినప్పటికీ మబ్బులు కమ్ముకున్నాయి. నిర్మల్, కామారెడ్డి తదితర జిల్లాల్లో చల్లని గాలులు వీచాయి.



ఖమ్మం జిల్లా మధిర మండలంలో కల్లాల్లోకి చేరిన వర్షపు నీరు

చలిదుప్పట్లో హైదరాబాద్

అల్పపీడన ద్రోణి ప్రభావం గ్రేటర్ హైదరాబాద్‌పై సోమవారం కూడా కొనసాగింది. రోజంతా ముసురుతో ఆదివారం ప్రజలు వణికిపోగా, సోమవారం చల్లటి గాలులు ఉక్కిరిబిక్కిరి చేశాయి. దీనికి పొగమంచు కూడా తోడవడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందిపడ్డారు. విధులకు వెళ్లాల్సినవారు, పనులమీద బయటకు వచ్చినవారు స్వెటర్లు, జర్కిన్లు, మంకీ క్యాపులు, వెచ్చటి దుస్తుల ధరించి ప్రయాణాలు కొనసాగించారు. సోమవారం ఉదయం 11 గంటలవరకు మంచుతెరలు వీడకపోవడంతో రోడ్లపై వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శివారు గ్రామాల్లో కొన్నిచోట్ల ప్రజలు చలిమంటలు వేసుకొని ఉపశమనం పొందారు.



వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లిలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

టీహబ్ సీఈవోగా రవినారాయణ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీ హబ్ సీఈవోగా రవినారాయణ్ నియమితులయ్యారు. ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ మంగళవారం అధికారికంగా ఆయన పేరును వెల్లడించనున్నారు. టీహబ్‌కు తొలి సీఈవోగా పనిచేసిన జే కృష్ణన్ రాజీనామా చేయడంతో.. కొత్త సీఈవో ఎంపిక అనివార్యమైంది. రవినారాయణ్ గతంలో మైక్రోసాఫ్ట్‌లో డైరెక్టర్‌గా పనిచేశారు. ఇన్ రెసిడెన్స్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా, ఏ12 సంస్థ గ్లోబల్ డైరెక్టర్‌గా సేవలు అందించారు.



సోమవారం నిజాం రాజు వారసుడు ముఫకంజా బహదూర్‌ను కలిసిన వక్ఫ్ బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం. చిత్రంలో ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్ తదితరులు ఉన్నారు

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ భేష్

- నిజాం రాజు వారసుడు ముఫకంజా బహదూర్ హర్షం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వక్ఫ్ ఆస్తులను పరిరక్షించడంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కృషి పట్ల నిజాం రాజు వారసుడు ముఫకంజా బహదూర్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో ప్రిన్స్ ముఫకంజా బహదూర్‌తో తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్ తదితరులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వక్ఫ్ ఆస్తులను కాపాడటానికి తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ముఫకంజాకు సలీం వివరించారు. నిజాం ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిందిగా కోరారని, ఇందుకు సర్కార్‌కు అన్నివిధాలా సహకరిస్తామని హామీ ఇచ్చినట్టు చెప్పారు.

7 మండలాలపై పిటిషన్ కొట్టివేత

- ఎన్నికలు ముగిసినందున జోక్యంచేసుకోలేమన్న సుప్రీంకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన ఏడు మండలాలను డీలిమిటేషన్‌చేస్తూ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) జారీచేసిన ఉత్తర్వులను సవాల్‌చేస్తూ కాంగ్రెస్ నాయకుడు మర్రి శశిధర్‌రెడ్డి దాఖలుచేసిన స్పెషల్‌లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టేసింది. ఎన్నికల కమిషన్ జారీచేసిన ఉత్తర్వులపై పిటిషనర్ గతంలో ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. డీలిమిటేషన్‌చేసే అధికారం ఈసీకి ఉన్నదని పేర్కొంటూ పిటిషనర్ వాదనను అప్పుడు హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా అక్కడకూడా చుక్కెదురైంది. సోమవారం పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణకు నిరాకరిస్తూ, తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసినందున ఈ అంశంలో జోక్యం చేసుకోలేమని స్పష్టంచేసింది.

ప్రశాంతంగా నైతిక విలువల పరీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన నైతికత, మానవ విలువల పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఇంటర్‌బోర్డు సెక్రటరీ తెలిపారు. సోమవారం నిర్వహించిన పరీక్షకు 96.46 శాతం విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. మొత్తం 4,94,529 మంది విద్యార్థులు పేర్లు నమోదుచేసుకోగా 4,77,029 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు.

నమస్తే తెలంగాణ
ఆట
10
[కరీంనగర్]
మంగళవారం 29 జనవరి 2019
WWW.NTNEWS.COM

దివ్యాంగులకు క్రీడలపట్ల ఆసక్తి కల్పించాలి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దివ్యాంగులకు క్రీడల పట్ల ఆసక్తి కల్పించాలని భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా అంది. దివ్యాంగుల కోసం మరిన్ని క్రీడోత్సవాలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సోమవారం బోయిన్‌పల్లిలోని జాతీయ మానసిక వికలాంగుల కేంద్రం(ఎన్‌ఐఎంహెచ్)లో 35వ వార్షిక స్పోర్ట్స్ మీట్‌ను సానియా ప్రారంభించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల్లో మానసిక పరిపక్వతకు క్రీడలు ఎంతగానో ఉపయోగ పడుతాయన్నారు. అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తున్న దివ్యాంగులను మీర్జా అభినందించారు. మానసిక వికలాంగులు మార్చ్‌ఫాస్ట్‌తో అతిథులకు గౌరవ వందనం చేశారు. దివ్యాంగులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నది. అనంతరం జాతీయ మానసిక వికలాంగుల సంస్థ సంయుక్త కార్యదర్శి డోలీ చక్రవర్తి మాట్లాడుతూ కేంద్రం దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. మానసిక వికలాంగుల్లో 21 రకాల వైకల్యాలు ఉన్నట్లు కేంద్రం గుర్తించిందని, వీరి కోసం 8 సంస్థలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఐఎంహెచ్ ఇంచార్జీ డైరెక్టర్ హిమాన్షుదాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

రాయుడు బౌలింగ్‌పై సస్పెన్షన్



దుబాయ్: భారత సీనియర్ క్రికెటర్ అంబటి రాయుడు బౌలింగ్‌పై ఐసీసీ సోమవారం సస్పెన్షన్ విధించింది. ఇక నుంచి అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో బౌలింగ్ చేయవద్దని స్పష్టంగా పేర్కొంది. నిబంధనలకు విరుద్ధంగా బౌలింగ్ చేసిన రాయుడు 14 రోజుల్లోగా పరీక్షలకు హాజరుకాని కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఒక ప్రకటనలో పేర్కొంది. ఈనెల 13న ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే మ్యాచ్‌లో రాయుడు బౌలింగ్ అనుమానాస్పదంగా ఉందని ఐసీసీ వెల్లడించిన సంగతి తెలిసిందే. 'ఐసీసీ నిబంధనలు 4.2 అనుసరించి రాయుడు బౌలింగ్ యాక్షన్‌పై సస్పెన్షన్ విధించడం జరిగింది. 14 రోజుల్లోగా బౌలింగ్ పరీక్షలకు హాజరు కావాల్సి ఉన్నా.. అలా జరుగలేదు. అందుకే నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా లేని కారణంగా అతని బౌలింగ్‌పై వెంటనే నిషేధం విధించాము. నిబంధనలకు లోబడి బౌలింగ్ చేసే వరకు రాయుడిపై సస్పెన్షన్ కొనసాగుతుంది' అని ఐసీసీ పేర్కొంది. తన 49 మ్యాచ్‌ల వన్డే కెరీర్‌లో రాయుడు తొమ్మిది సందర్భాల్లో మాత్రమే బౌలింగ్ చేశాడు.

కివీస్‌నూ కొట్టేశారు!


విదేశాల్లో రాణించలేరనే విమర్శను చెరిపేస్తూ.. వన్డే ప్రపంచకప్ ప్రత్యర్థులకు బలమైన హెచ్చరికలు జారీ చేస్తూ.. ఆస్ట్రేలియా గడ్డపై మొదలుపెట్టిన జైత్రయాత్రను.. న్యూజిలాండ్‌లోనూ కొనసాగించింది భారత్ జట్టు..! పదేండ్ల కిందట తాము ఎలా ఆడామో మరోసారి గుర్తుకు తెస్తూ.. మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే సిరీస్‌ను కైవసం చేసుకుని.. నాలుగేండ్ల కిందట కివీస్ చేతిలో ఎదురైన ఘోర పరాజయాలకు ఘనమైన ప్రతీకారం తీర్చుకుంది టీమ్ఇండియా..! వరల్డ్‌కప్ సన్నాహకాల్లో ఉన్నా.. కచ్చితంగా గెలిచి తీరాలన్నా ఒత్తిడి ఉన్నా.. అవసరానికి తగినట్లుగా ప్రయోగాలు చేస్తూ.. మెగా ఈవెంట్‌కు సరిపోయే తుది కూర్పును దాదాపుగా ఖాయం చేసుకుంది విరాట్‌సేన..! ఓవరాల్‌గా ఒకేసారి అటు ఆసీస్, ఇటు కివీస్‌ను కసిదీరా కొట్టేస్తూ.. మునుపెన్నడూ లేనంత ఫామ్‌తో మెగా ఈవెంట్ కోసం సిద్ధమవుతున్నది.



కోహ్లీ (60)

రోహిత్ (62)

మూడో వన్డేలోనూ భారత్ ఘన విజయం ■ 3-0తో సిరీస్ సొంతం
కోహ్లీ, రోహిత్ అర్ధసెంచరీలు ■ ఆకట్టుకున్న పాండ్యా



షమీ (3/41)

మౌంట్ మాంగనుయ్: బ్యాటింగ్, బౌలింగ్‌లో సమిష్టిగా చెలరేగిన భారత్ జట్టు వరుసగా మూడో విజయాన్ని అందుకుంది. కెప్టెన్ విరాట్ కోహ్లీ (74 బంతుల్లో 60; 6 ఫోర్లు, 1 సిక్స్), వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ (77 బంతుల్లో 62; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధసెంచరీలతో చెలరేగడంతో.. సోమవారం జరిగిన మూడో వన్డేలో టీమ్ఇండియా 7 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై గెలిచింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో రెండు మిగిలి ఉండగానే 3-0తో సొంతం చేసుకుంది. దీంతో ఈ మధ్య సామాజిక మాధ్యమాల్లో విరివిగా కనిపిస్తున్న, వినిపిస్తున్న 'పదేండ్ల చాలెంజ్'ను దిగ్విజయంగా చూపెట్టింది. 2009లో ఇక్కడ సిరీస్ గెలిచిన టీమ్ఇండియా మళ్లీ పదేండ్ల తర్వాత అదే ఫలితాన్ని పునరావృతం చేసింది. 2014లో జరిగిన సిరీస్‌ను మాత్రం 1-4తో చేజార్చుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 49 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటైంది. వెటరన్ రాస్ టేలర్ (106 బంతుల్లో 93; 9 ఫోర్లు) సెంచరీ చేజార్చుకోగా, లాథమ్ (64 బంతుల్లో 51; 1 ఫోర్, 1 సిక్స్) అర్ధసెంచరీతో రాణించాడు. తర్వాత భారత్ 43 ఓవర్లలో 3 వికెట్లకు 245 పరుగులు చేసింది. తొడ కండరాలు పట్టేయడంతో ధోనీ ఈ మ్యాచ్‌లో ఆడలేదు. షమీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

ధవన్ విఫలం..

లక్ష్యం పెద్దది కావడం.. తొమ్మిదో ఓవర్‌లోనే ధవన్ (28) వికెట్ పడటంతో ఆరంభంలో కాస్త గందరగోళం నెలకొంది. దీనికి తోడు కివీస్ పేసర్లు లైన్ అండ్ లెంగ్త్‌కు కట్టుబడటంతో రోహిత్, వన్‌డౌన్ కోహ్లీ కుదురుకోవడానికి సమయం తీసుకున్నారు. ఒక్కసారి నిలదొక్కుకున్నాక ఈ ఇద్దరు స్లో పిచ్‌పై చక్కని స్ట్రోక్స్ ఆడారు. 14వ ఓవర్‌లో సాంట్నర్ బంతిని సిక్స్‌గా మలిచి రోహిత్ తన ఉద్దేశాన్ని స్పష్టం చేశాడు. రెండోఎండ్‌లో కోహ్లీ.. ఫెర్గుసన్, సోధీని లక్ష్యంగా చేసుకుని బౌండరీలు బాదడంతో రన్‌రేట్ పరుగెత్తింది. ఎక్కువగా ఫ్రంట్‌ఫుట్ షాట్లు ఆడిన రోహిత్.. ఫెర్గుసన్ ఓవర్‌లో రెండో సిక్సర్ సంధించి 63 బంతుల్లో 39వ అర్ధసెంచరీ పూర్తి చేశాడు. తర్వాతి ఓవర్‌లో విరాట్ కూడా సిక్సర్ సంధించి 59 బంతుల్లో 49వ అర్ధసెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. రెండో వికెట్‌కు 113 పరుగులు జత చేశాకా 28వ ఓవర్‌లో రోహిత్ ఔటయ్యాడు. రాయుడు (42 బంతుల్లో 40 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) వచ్చి రావడంతోనే మూడు ఫోర్లు బాది దూకుడు చూపెట్టినా.. 13 బంతుల తర్వాత కోహ్లీ వెనుదిరిగాడు. అప్పటికి భారత్ ఇంకా 76 పరుగులు చేయాల్సి ఉంది. ఈ దశలో దినేశ్ కార్తీక్ (38 బంతుల్లో 38 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) అద్భుతమైన ఇన్నింగ్స్‌కు ప్రాణం పోశాడు. అవసరమైనప్పుడల్లా తన మార్క్ షాట్లతో చెలరేగుతూ రాయుడుకు చక్కని సహకారం అందించాడు. బ్రాస్‌వెల్ బౌలింగ్‌లో భారీ సిక్సర్ కొట్టిన రాయుడు క్రమం తప్పకుండా ఫోర్లు బాదుతూ నాలుగో వికెట్‌కు అజేయంగా 77 పరుగులు జత చేసి చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.

టేలర్ పోరాటం..

59 స్కోరుకే 3 కీలక వికెట్లు పడటంతో ఇన్నింగ్స్‌ను నిర్మించే బాధ్యతను టేలర్-లాథమ్ తీసుకున్నారు. స్లో వికెట్‌పై అటాకింగ్ చేసే అవకాశం లేకపోవడంతో నెమ్మదిగా ఆడుతూ టీమ్ఇండియా స్పిన్-పేస్ కాంబినేషన్‌ను సమర్థంగా ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో టేలర్ 71 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. ఈ ఇద్దరు నాలుగో వికెట్‌కు 119 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. అయితే 38వ ఓవర్‌లో చాహల్.. లాథమ్‌ను ఔట్ చేయడంతో కివీస్ వికెట్ల పతనం మొదలైంది. తర్వాతి తన రెండు ఓవర్లలో పాండ్యా (2/45).. నికోలస్ (6), సాంట్నర్ (3)ను పెవిలియన్‌కు చేర్చడంతో కివీస్ స్కోరు 198/6గా మారింది. బ్రాస్‌వెల్ (15) కాసేపు నిలబడినా.. సెంచరీ దిశగా సాగుతున్న టేలర్‌ను 46వ ఓవర్‌లో షమీ బోల్తా కొట్టించాడు. దీంతో ఏడో వికెట్‌కు 24 పరుగుల భాగస్వామ్యం ముగిసింది.

పాండ్యా..సూపర్ క్యాచ్



నిషేధం నుంచి బయటపడి మళ్లీ జట్టులోకి వచ్చిన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఈ మ్యాచ్‌లో స్పైడర్ మ్యాన్ అవతారం ఎత్తాడు. పదునైన బౌలింగ్‌తో పాటు కండ్లు చెదిరే డైవింగ్ క్యాచ్‌తో చెలరేగిపోయాడు. ఇన్నింగ్స్ 17వ ఓవర్‌లో చాహల్ బంతిని కేన్ విలియమ్సన్ (28) ముందుకొచ్చి షాట్ ఆడగా.. ఫార్వర్డ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న పాండ్యా అమాంతం గాలిలో ఎడమవైపు డైవ్ చేస్తూ రెప్పపాటులో అందుకున్నాడు. అంతే ఒక్క క్షణం నిశ్చేష్టుడిగా మారిపోయిన కేన్ నిరాశగా పెవిలియన్‌కు వెళ్లిపోయాడు. ఓపెనర్లు గప్టిల్ (13), మున్రో (7) తొందరగానే ఔట్‌కావడంతో కివీస్ 59 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది.

'నాలో 10 శాతం కూడా లేదు'

శుభ్‌మన్ గిల్‌పై కోహ్లీ ప్రశంసలు

మౌంట్ మాంగనుయ్: యువ క్రికెటర్ శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్ ప్రతిభపై కెప్టెన్ కోహ్లీ ప్రశంసల జల్లు కురిపించాడు. నెట్స్‌లో అతను బ్యాటింగ్ చేస్తున్న తీరు అద్భుతమని కితాబిచ్చాడు. గిల్‌తో పోలిస్తే 19 ఏండ్ల వయసులో తనలో కనీసం 10 శాతం కూడా నైపుణ్యం లేదని ఒప్పుకున్నాడు. 'అత్యుత్తమ ప్రతిభ కలిగిన కుర్రాళ్లు మనకు అందుబాటులోకి వస్తున్నారు. వచ్చిన అవకాశాన్ని పృథ్వీ షా రెండు చేతుల్లా ఒడిసిపట్టుకున్నాడు. ఇప్పుడు గిల్ చాలా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాడు. నెట్స్‌లో అతని బ్యాటింగ్ చూసి ముగ్దుడినయ్యా. నాకు 19 ఏండ్లున్నప్పుడు గిల్ నైపుణ్యంలో సగం కూడాలేదు. కుర్రాళ్లు మంచి ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్నారు. రాబోయే రోజుల్లో వీళ్లు ఇవే ప్రమాణాలు కొనసాగిస్తే భారత క్రికెట్‌కు చాలా ప్రయోజనం చేకూరుతుంది. యువ క్రికెటర్లు ఎదగడానికి అవసరమైన అవకాశాలు ఇస్తూ వాళ్లకు సాయపడటం చాలా సంతోషాన్నిస్తున్నది' అని విరాట్ పేర్కొన్నాడు.

> మేం ఆటోమోడ్‌తో ప్రపంచకప్‌లోకి అడుగుపెడుతాం. ప్రస్తుతానికి జట్టు కూర్పు గురించి పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నాలుగో నంబర్‌లో బలమైన బ్యాట్స్‌మన్ ఉండాలని భావించాం. ఆ స్థానంలో రాయుడు ఆడుతున్న తీరు సూపర్బ్. దినేశ్ కార్తీక్ కూడా మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఏ క్షణమైనా బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉంటాడు. మిడిలార్డర్‌లో ధోనీ బంతిని బాగా బాదుతున్నాడు. ఈ మూడు మ్యాచ్‌లను బట్టి చూస్తే ఇక బ్యాటింగ్ బాధలు తీరినట్లే. ఆసీస్ టూర్‌లో ఊపిరి సలుపలేదు. కాబట్టే ఇప్పుడు విశ్రాంతికి వెళ్తున్నా. ఎలాగూ సిరీస్ గెలిచాం కాబట్టి మరింత హాయిగా గడుపొచ్చు. ప్రస్తుతం టీమ్ అంతా ఆటోమోడ్‌లో ఉంది. చివరి రెండు వన్డేలు కూడా గెలుస్తామన్న నమ్మకం ఉంది. రాయుడు, కార్తీక్ చేసిన ప్రతి పరుగును చప్పట్లతో స్వాగతించాం. హార్దిక్ రాకతో జట్టులో సమతుల్యం వచ్చింది. అతను తల దించుకునే ఉన్నాడు. కానీ జట్టుకు ఏం అవసరమో అది చేసి చూపించాడు. ఈ రోజు బాధ్యతగా అతను ఆడిన తీరు అమోఘం. శుభ్‌మన్, విజయ శంకర్ వంటి యువ ప్రతిభావంతులు జట్టుతో చేరడం చాలా ఆనందాన్నిస్తున్నది. కుర్రాళ్లకు మరిన్ని అవకాశాలు ఇచ్చి వాళ్ల సేవలను మరింతగా వినియోగించుకోవాలి.
>
> - విరాట్ కోహ్లీ

నీషమ్, ఆస్లీకి పిలుపు

మౌంట్ మాంగనుయ్: ఇప్పటికే సిరీస్ చేజార్చుకున్న న్యూజిలాండ్.. భారత్‌తో జరిగే చివరి రెండు వన్డేలకు రెండు మార్పులు చేసింది. ఆల్‌రౌండర్ జిమ్మీ నీషమ్, లెగ్ స్పిన్నర్ టాడ్ ఆస్లీని జట్టులోకి తీసుకొచ్చింది. బ్రాస్‌వెల్, ఇష్ సోధీ స్థానాల్లో వీళ్లకు చోటు కల్పించింది. మోకాలి గాయంతో గతేడాది నవంబర్‌లో పాకిస్థాన్‌తో సిరీస్‌కు దూరమైన ఆస్లీ పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నట్లు న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. స్వదేశంలో లంకతో జరిగిన సిరీస్‌లో ఆడిన నీషమ్ తొడ కండరాల గాయానికి గురయ్యాడు. ఫామ్‌లో లేని ఓపెనర్లు గప్టిల్, మున్రోపై సెలెక్టర్లు మరోసారి నమ్మకం ఉంచారు.

జట్టు: విలియమ్సన్ (కెప్టెన్), ఆస్లీ, బౌల్ట్, గ్రాండ్‌హోమీ, ఫెర్గుసన్, గప్టిల్, హెన్రీ, లాథమ్, మున్రో, నీషమ్, నికోలస్, సాంట్నర్, సౌతీ, టేలర్.

స్కోరు బోర్డు

న్యూజిలాండ్: గప్టిల్ (సి) కార్తీక్ (బి) భువనేశ్వర్ 13, మున్రో (సి) రోహిత్ (బి) షమీ 7, విలియమ్సన్ (సి) పాండ్యా (బి) చాహల్ 28, టేలర్ (సి) కార్తీక్ (బి) షమీ 93, లాథమ్ (సి) రాయుడు (బి) చాహల్ 51, నికోలస్ (సి) కార్తీక్ (బి) పాండ్యా 6, సాంట్నర్ (సి) కార్తీక్ (బి) పాండ్యా 3, బ్రాస్‌వెల్ రనౌట్ 15, సోధీ (సి) కోహ్లీ (బి) షమీ 12, బౌల్ట్ (సి) షమీ (బి) భువనేశ్వర్ 2, ఫెర్గుసన్ నాటౌట్ 2, **ఎక్స్‌ట్రాలు:** 11, **మొత్తం:** 49 ఓవర్లలో 243 ఆలౌట్. **వికెట్లపతనం:** 1-10, 2-26, 3-59, 4-178, 5-181, 6-198, 7-222, 8-239, 9-239, 10-243. **బౌలింగ్:** భువనేశ్వర్ 10-1-46-2, షమీ 9-0-41-3, చాహల్ 9-0-51-2, పాండ్యా 10-0-45-2, కుల్దీప్ 8-0-39-0, జాదవ్ 3-0-17-0.

భారత్: రోహిత్ (స్టంప్) లాథమ్ (బి) సాంట్నర్ 62, ధవన్ (సి) టేలర్ (బి) బౌల్ట్ 28, కోహ్లీ (సి) నికోలస్ (బి) బౌల్ట్ 60, రాయుడు నాటౌట్ 40, కార్తీక్ నాటౌట్ 38, **ఎక్స్‌ట్రాలు:** 17, **మొత్తం:** 43 ఓవర్లలో 245/3. **వికెట్లపతనం:** 1-39, 2-152, 3-168. **బౌలింగ్:** బౌల్ట్ 10-1-40-2, బ్రాస్‌వెల్ 6-0-49-0, ఫెర్గుసన్ 10-1-57-0, సాంట్నర్ 10-0-45-1, సోధీ 7-0-53-0.

క్రీడల హబ్ హైదరాబాద్ : శాట్స్ చైర్మన్



శేరిలింగంపల్లి: క్రీడలకు హైదరాబాద్ నగరం హబ్‌గా మారిందని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(శాట్స్) చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం గచ్చిబౌలీలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో 9వ జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడారంగానికి మంచి ఆదరణ లభిస్తుందని అన్నారు. క్రీడాకారులకు చేయూతనందించి వారిని ప్రోత్సహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈనెల 28 నుంచి 30వ తేది వరకు తైక్వాండో చాంపియన్‌షిప్ కొనసాగుతుందని రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు ముఠా శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ ప్రాంతాల క్రీడాకారులు పాల్గొన్నారు.

సిరీస్‌పై మిథాలీసేన గురి

మౌంట్ మాంగనుయి: భారత మహిళల జట్టు వన్డే సిరీస్‌పై గురి పెట్టింది. మంగళవారం న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్‌లో విజయంతో మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను సొంతం చేసుకోవాలన్న పట్టుదలతో ఉన్నది. దీని ద్వారా ఐసీసీ మహిళల చాంపియన్‌షిప్‌లో తమ స్థానాన్ని మరింత మెరుగుపర్చుకోవాలన్న ప్రయత్నంలో ఉన్నది. మొదటి వన్డేలో సమిష్టి ప్రదర్శన కనబరిచిన మిథాలీసేన..అదే జోరును కొనసాగిస్తూ కివీస్‌ను ఓడించేందుకు పక్కా ప్రణాళికతో సిద్ధమైంది. స్మృతి మందన మరోమారు బ్యాటు ఝులిపిస్తే..న్యూజిలాండ్ బౌలర్లు చేతులెత్తేయడం ఖాయంగా కనిపిస్తున్నది. మరోవైపు సొంతగడ్డపై పరిస్థితులను అనుకూలంగా మలుచుకోవాల్సింది పోయి..ప్రత్యర్థికి దీటైన పోటీనివ్వడంలో విఫలమైంది. సిరీస్‌లో నిలువాలంటే గెలిచి తీరాల్సిన పరిస్థితిలో ఉన్న కివీస్ పుంజుకునేందుకు ప్రయత్నించే అవకాశముంది.

భారత్, స్పెయిన్ మ్యాచ్ డ్రా

ముర్సియా(స్పెయిన్): భారత మహిళల హాకీ జట్టు పుంజుకుంది. సోమవారం ఆతిథ్య స్పెయిన్‌తో జరిగిన రెండో మ్యాచ్‌ను టీమ్ఇండియా 1-1తో డ్రా చేసుకుంది. తొలి మ్యాచ్ ఓటమి నుంచి తేరుకున్న భారత్..మలి మ్యాచ్‌లో స్పెయిన్‌కు దీటైన పోటీనిచ్చింది. హోరీహోరీగా సాగిన మ్యాచ్‌లో టీమ్ఇండియా తరపున గుర్జిత్‌కౌర్(43ని) గోల్ చేయగా, మారియా టోస్ట్(49ని) స్పెయిన్‌కు ఏకైక గోల్ అందించింది.

'అథ్లెటిక్స్' చాంప్ ఆదిలాబాద్

ముగిసిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు



నిజామాబాద్ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా చాంపియన్‌గా నిలిచింది. జిల్లా కేంద్రం నాగారంలోని రాజారాం స్టేడియంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీలు సోమవారం అట్టహాసంగా ముగిశాయి. అండర్-10, 12, 14, 18 వయో పరిమితుల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో శిక్షణ పొందుతున్న వారితో పాటు గ్రామీణ ప్రాంత క్రీడాకారులు ఈ టోర్నీలో ప్రతిభ చాటారు. అంతర్జాతీయ ప్రమాణాలతో హైజంప్, హర్డిల్స్, రిలే వంటి వివిధ ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లు క్రీడాభిమానులను కనువిందు చేశాయి. అత్యధిక పతకాలు సాధించిన ఆదిలాబాద్ 102 పాయింట్ల ఆధిక్యంతో ఓవరాల్ చాంపియన్‌షిప్‌తో నంబర్‌వన్ స్థానంలో నిలిచింది. అండర్-10 బాలుర విభాగంలో నాగర్‌కర్నూల్ 16 పాయింట్లతో టీమ్ చాంపియన్‌షిప్ సాధించింది. అండర్-12 విభాగంలో 33 పాయింట్లతో ఆదిలాబాద్, అండర్-14లో 16 పాయింట్లతో హైదరాబాద్, అండర్-10 బాలికల విభాగంలో 36 పాయింట్ల ఆధిక్యంతో ఆదిలాబాద్ టీం చాంపియన్‌షిప్ సాధించాయి. రాష్ట్ర వ్యాప్తంగా 27 జిల్లాల నుంచి పాల్గొన్న ఈ క్రీడాపోటీల్లో విజేతలకు టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు, ప్రశంసా పత్రాలు, ట్రోఫీలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రాష్ట్రం ఏర్పడిన తర్వాత క్రీడలకు మహర్దశ వచ్చిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బీఈ స్టాలిన్ జోన్స్, ప్రధాన కార్యదర్శి సారంగపాణి, టోర్నీ పరిశీలకుడు వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా సంఘం అధ్యక్షుడు రత్నాకర్, ఉపాధ్యక్షులు వైఆర్ డేవిడ్, మార్టిన్, ప్రధాన కార్యదర్శి రాజగౌడ్, టీఎన్‌జీవోస్ జిల్లా కార్యదర్శి అమృత్ కుమార్, క్రీడాకారులు, కోచ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రంజీ ఫైనల్లో సౌరాష్ట్ర

కర్ణాటకపై ఐదు వికెట్ల తేడాతో విజయం



బెంగళూరు: రంజీ ట్రోఫీలో సౌరాష్ట్ర ఫైనల్లోకి దూసుకెళ్లింది. తుదిపోరులో నిలువడం సౌరాష్ట్రకు ఇది మూడోసారి. కర్ణాటకతో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో సౌరాష్ట్ర 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వచ్చే నెల 3న మొదలయ్యే ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ విదర్భతో సౌరాష్ట్ర తలపడుతుంది. కర్ణాటక నిర్దేశించిన 279 పరుగుల లక్ష్యం కోసం ఓవర్‌నైట్ స్కోరు 224/3తో ఆఖరి రోజు ఆట కొనసాగించిన సౌరాష్ట్ర 5 వికెట్లు కోల్పోయి 282 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ చతేశ్వర్ పుజార(266 బంతుల్లో 131 నాటౌట్, 17ఫోర్లు), షెల్డన్ జాక్సన్(217 బంతుల్లో 100, 15ఫోర్లు) సెంచరీలతో సౌరాష్ట్ర అలవోకగా విజయ్నానందుకుంది. వీరిద్దరు కర్ణాటక బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ జట్టుకు చిర్మసరణీయ గెలుపు కట్టబెట్టారు. ముఖ్యంగా సూపర్ ఫామ్ మీదున్న పుజార చూడచక్కని షాట్లతో అలరించాడు. 32 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న ఈ సౌరాష్ట్ర స్టార్ బ్యాట్స్‌మన్..కర్ణాటక బౌలర్లకు కొరకరాని కొయ్యగా తయారయ్యాడు. మరోవైపు జాక్సన్ కూడా చెలరేగడంతో కర్ణాటక బౌలర్లు చేష్టలుడిగిపోయారు. వీరిని విడగొట్టేందుకు ఎన్ని రకాలుగా ప్రయత్నించినా లాభం లేకపోయింది. చివరకు జాక్సన్‌ను క్లీన్‌బౌల్డ్ చేయడం ద్వారా వినయ్‌కుమార్ ఈ జోడీని విడగొట్టాడు. దీంతో నాలుగో వికెట్‌కు 214 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత వచ్చిన వాస్వవదా(12) కూడా స్వల్ప స్కోరుకే వెనుదిరిగినా.. మన్కడ్(7 నాటౌట్)తో కలిసి పుజార జట్టును గెలుపు తీరాలకు చేర్చాడు. వినయ్‌కుమార్(3/75)కు మూడు వికెట్లు దక్కగా, మిథున్, మోరె ఒక్కో వికెట్ తీశారు. అజేయ సెంచరీతో జట్టును గెలిపించిన పుజారకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

బడ్జెట్‌కు ముందు బిగిసిన బేర్స్ పట్టు

- సెన్సెక్స్ 369 పాయింట్లు పతనం
- ఆటో, బ్యాంకింగ్ షేర్లకు భారీ నష్టాలు
- 52 వారాల కనీస స్థాయికి 361 షేర్లు
- కరిగిపోయిన రూ. 1.8 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద



స్టాక్ మార్కెట్ భారీగా పతనమైంది. తాత్కాలిక బడ్జెట్టే అయినప్పటికీ కొన్ని ప్రజాకర్షక చర్యలను ప్రవేశపెడుతారన్న అంచనాలతో సెంటిమెంట్ నెగటివ్‌గా మారింది. సెన్సెక్స్ 368.84 పాయింట్లు నష్టపోయి 35,657 వద్ద ముగిసింది. నిఫ్టీ 119 పాయింట్లు నష్టపోయి 10,662 వద్ద నిలిచింది. బ్యాంకింగ్, ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లలో భారీగా అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. అంతర్జాతీయ మార్కెట్లు కూడా బలహీనంగా ట్రేడ్ అవుతుండటంతో మన మార్కెట్ కూడా స్వల్ప నష్టంతో ప్రారంభమై మధ్యాహ్నానికి భారీ నష్టానికి గురైంది. 50 రోజుల చలన సగటుకు దిగువన, అలాగే క్రితం స్వింగ్ కనీస స్థాయిని చేజార్చుకుని ముగియడం వల్ల మార్కెట్ బేరిష్ ట్రెండ్‌లోకి మారిపోయింది. మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాల్లో ఆశ్చర్యార్థాలు లేకపోవడం, ఆటో కంపెనీల ఫలితాలు నిరాశజనకంగా ఉండటంతో అమ్మకాలు ఒక్కసారిగా పెరిగాయి. సోమవారం పతనంలో రూ. 1.8 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద కరిగిపోయింది. బడ్జెట్ ప్రతిపాదనల రిస్క్‌లకు దూరంగా ఉండాలని ఇన్వెస్టర్లు భావిస్తున్నట్టు మార్కెట్ వర్గాలు తెలిపాయి. ఇన్నాళ్లుగా స్థిరంగా ట్రేడ్ అవుతున్న బ్యాంకింగ్, ఆర్థిక సేవల కంపెనీల షేర్లు కూడా భారీ నష్టాలకు లోనయ్యాయి. దేశీయ ప్రతికూలాంశాలకు తోడు అంతర్జాతీయంగా అమెరికా-చైనా వాణిజ్య విబేధాలు మార్కెట్ల మూడ్‌ను దెబ్బతీస్తున్నాయి. అమెరికా-చైనా వాణిజ్య చర్చలకుతోడు అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ సమావేశం మధ్య గ్లోబల్ మార్కెట్లన్నీ నష్టల్లోనే ట్రేడ్ అయ్యాయి. సోమవారం పతనంలో మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ షేర్లకు భారీ నష్టాలు వాటిల్లాయి. ఫార్మా ఇండెక్స్ 2.55 శాతం, ఆర్థిక సేవల రంగ ఇండెక్స్ 1.89 శాతం, బ్యాంక్ నిఫ్టీ 1.70 శాతం, ఆటో 1.41 శాతం, ఎఫ్ఎంసీజీ 1.24 శాతం, మెటల్ 1.06 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్-100 ఇండెక్స్ 2.10 శాతం, స్మాల్‌క్యాప్-100 ఇండెక్స్ 1.76 శాతం చొప్పున నష్టపోయాయి. మీడియా 8.37 శాతం లాభపడగా, ఐటీ ఇండెక్స్ 0.54 శాతం లాభపడింది. ఎన్ఎస్ఈలో మొత్తం 1,478 షేర్లు నష్టాలపాలవ్వగా, 351 షేర్లు మాత్రమే లాభంతో గట్టెక్కాయి. కేవలం నాలుగు షేర్లే 52 వారాల కొత్త గరిష్ఠ స్థాయిని నమోదు చేయగా, 361 షేర్లు 52 వారాల కనీస స్థాయిని నమోదు చేశాయి. నిఫ్టీలోనూ 36 షేర్లు నష్టపోగా, కేవలం 14 షేర్లు లాభంతో ముగిశాయి. జీ ఎంటర్‌టెయిన్‌మెంట్ షేర్ 15.73 శాతం లాభపడింది. అలాగే భారతీ ఇన్‌ఫ్రాటెల్ 2.39 శాతం, టీసీఎస్ 2.04 శాతం, కోల్ ఇండియా 2.01 శాతం, ఎల్ అండ్ టీ 1.29 శాతం చొప్పున లాభపడ్డాయి. కాగా, అదానీ పోర్ట్స్ 12.53 శాతం, ఇండియాబుల్స్ హౌజింగ్ 6.51 శాతం, బజాజ్ ఫైనాన్స్ 5.45 శాతం, యెస్ బ్యాంక్ 5.28 శాతం, బజాజ్ ఫిన్ సర్వ్ 4.30 శాతం చొప్పున నష్టపోయాయి. ఎఫ్ఐఐలు రూ. 223.44 కోట్లు, డీఐఐలు రూ. 92.32 కోట్ల మేర కొనుగోళ్లు జరిపారు.

బడ్జెట్‌లో ఓటర్లకు వల

ఇటీవలి రాష్ట్రాల ఎన్నికల ఫలితాలతో కంగుతిన్న బీజేపీ • రైతులు, మధ్యతరగతికి ఊరటనిచ్చే ప్రకటనలు • మళ్లీ అధికారంలోకి రావాలంటే తప్పదంటున్న బీజేపీ నాయకులు

ఆదాయం లేకుండా రాయితీలు శ్రేయస్కరం కాదంటున్న విశ్లేషకులు • ప్రజాకర్షక పథకాలతో ఆర్థిక వ్యవస్థకు చేటు • ద్రవ్యలోటు లక్ష్యాలపై రేటింగ్ ఏజెన్సీల హెచ్చరిక

ఎలాగైనా మళ్లీ అధికారంలోకి రావాలన్న తపనకొద్దీ బీజేపీ ఆధ్వర్యంలోని ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వం.. రాబోయే తాత్కాలిక బడ్జెట్లో ప్రజాకర్షక ప్రకటనలు చేయడానికి సిద్ధమవుతోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోగల మధ్యతరగతి వర్గాలకు ఊరటనిచ్చే చర్యలు, పన్ను రాయితీలు ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తోంది. బడ్జెట్ రూపకల్పనలో కీలకపాత్రను పోషిస్తున్న ఆర్థిక శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. మరో నాలుగైదు నెలల్లో జరుగనున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని దాదాపుగా పూర్తిస్థాయి బడ్జెట్‌నే ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్నది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన బీజేపీకి లోక్‌సభ ఎన్నికలు సవాలుగా మారాయి. వ్యవసాయాదాయాలు తగ్గిపోయి, ప్రభుత్వ విధానాలు ఉపాధి కల్పనకు ఊతం ఇవ్వడం లేదన్న అభిప్రాయాల నేపథ్యంలో ఈ వర్గాలను మెప్పించేలా బడ్జెట్‌ను తయారు చేయాలని ప్రధాని మోదీ స్పష్టమైన ఆదేశాలిచ్చినట్టు తెలుస్తోంది. అయితే ప్రజాకర్షక విధానాలకు పెద్దపీట వేస్తే కార్పొరేట్ పన్ను రాయితీలు, బడ్జెట్ లోటు తగ్గించే చర్యలు వంటి ముఖ్యమైన ఆర్థిక సంస్కరణలు తెరవెనక్కి వెళ్తాయన్న ఆందోళన వ్యక్తం అవుతున్నది.

పూర్తిస్థాయి బడ్జెట్?

సాధారణ ఎన్నికలకు ముందు వస్తున్న బడ్జెట్‌ను.. ఎలాంటి చట్ట సవరణలకు అవసరంలేని, కేవలం ఎన్నికల ఫలితాలు వచ్చి కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ప్రభుత్వ ఆదాయ, వ్యయ అవసరాలను తీర్చేందుకు మాత్రమే ప్రవేశపెట్టడం అనవాయితీ. అందుకే మధ్యంతర బడ్జెట్ అంటారు. అయితే ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రవేశపెట్టబోయే బడ్జెట్ పూర్తిస్థాయి బడ్జెట్‌కు ఏమాత్రం తీసిపోని విధంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతులకు, గ్రామీణ రంగాలకు, మధ్యతరగతి వర్గాలకు ప్రకటించాలనుకుంటున్న రాయితీలపై వెనుకకు తగ్గరాదంటూ బీజేపీ నాయకులు అభిప్రాయపడుతున్నారు. సాధారణ బడ్జెట్‌లో మాదిరిగానే అన్ని రకాల ప్రతిపాదనలను చేయాలంటూ బీజేపీ వర్గాలు ఒత్తిడి చేస్తున్నాయి. మధ్యతరగతి, వేతన జీవులకు ఆదాయ పన్ను రాయితీలను ప్రకటించడం కష్టమే కనుక బీజేపీ దృష్టిలో ఉన్న ప్రాధాన్యతా రంగాలకు రాయితీలు ప్రకటించాల్సిందేనని కొంతమంది నాయకులు అభిప్రాయపడుతున్నారు. బడ్జెట్ ఏదైనా సరే అది పూర్తిస్థాయి బడ్జెట్టేనని, వచ్చే బడ్జెట్‌ను కూడా పూర్తిస్థాయి బడ్జెట్ మాదిరిగానే ప్రవేశపెట్టాలంటూ ఓ సీనియర్ బీజేపీ నాయకుడు అన్నారు. తిరిగి అధికారంలోకి రావాలనుకుంటే వ్యాపార, ఉన్నతాదాయ వర్గాల్లో ఉన్న తమ ఓటు బ్యాంకును కాపాడుకోవడంతో పాటు దళితులు, గిరిజనులు, బీసీలను ఆకర్షించే విధంగా ఆర్థిక విధాన నిర్ణయాలను ప్రకటించాలని బీజేపీ నేతలు ఇప్పటికే ప్రధానికి విన్నవించుకున్నారు. మరోవైపు ఎన్నికలయ్యే వరకు వచ్చే మూడు నెలలకు సంబంధించిన కేటాయింపులు మినహా రాబోయే బడ్జెట్‌లో ఎలాంటి ప్రజాకర్షక విధానాలను ప్రకటించినా.. ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకుపడేందుకు ప్రతిపక్షాలన్నీ సిద్ధమవుతున్నాయి.



అరుణ్ జైట్లీ అమెరికాలో వైద్య చికిత్సను పొందుతున్న నేపథ్యంలో తాత్కాలిక ఆర్థిక మంత్రి పియూష్ గోయల్ ఫిబ్రవరి ఒకటో తేదీన పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. పన్ను వసూళ్లు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు 3.5 శాతానికి పెరిగే అవకాశాలున్నట్టు ఇప్పటికే అధికార వర్గాలు వెల్లడించాయి. గత బడ్జెట్‌లో నిర్దేశించుకున్న 3.3 శాతం ద్రవ్యలోటు లక్ష్యాన్ని చేరుకోలేకపోవడంతో వచ్చే ఏడాదికి లక్ష్యాన్ని పెంచుకునే దిశలో ప్రతిపాదనలు ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. అయితే మార్చి నెలలో ప్రభుత్వ వ్యయాలను తగ్గించడం ద్వారా ద్రవ్యలోటు కొంతలోకొంత అదుపు చేయాలన్న ప్రయత్నంలో ఆర్థిక శాఖ అధికారులున్నట్టు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఎన్నికలకు ముందు వ్యయాలకుగాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తన నిధులను ప్రభుత్వానికి బదలాయించాలన్న అంశంపై కూడా ఒత్తిడి పెంచే అవకాశాలున్నాయి. ఈ అంశంపైనే ఊర్జిత్ పటేల్ ఆర్బీఐ గవర్నర్ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. వ్యాపార, పారిశ్రామిక వర్గాల నుంచి వచ్చిన పన్ను రాయితీల వినతులన్నింటినీ పక్కనపెట్టి సంస్కరణలను పట్టించుకోకపోవచ్చునన్న అభిప్రాయాలూ వ్యక్తం అవుతున్నాయి. కార్పొరేట్ పన్నును 30 నుంచి 25 శాతానికి తగ్గిస్తామంటూ మూడేండ్ల క్రితం ఇచ్చిన హామీని ఇంకా నెరవేర్చకపోవడంపై ఇప్పటికే పారిశ్రామిక వర్గాలు అసంతృప్తిగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా కార్పొరేట్ పన్ను తగ్గుతుండగా, భారత్‌లో మాత్రమే అధికంగా ఉందని డెలాయిట్‌కు చెందిన రోహింగ్టన్ సిద్వా అభిప్రాయపడ్డారు. వ్యవసాయ రంగానికి ఇచ్చే ప్యాకేజీనే లక్ష కోట్ల రూపాయలను అధిగమించవచ్చునని అంచనా. ఇతర వ్యయాలను అదుపు చేయకుండా వ్యవసాయ రంగానికి ప్యాకేజిని ప్రకటిస్తే ద్రవ్యలోటు భారీగా పెరిగిపోయే అవకాశం ఉందని రేటింగ్ ఏజెన్సీలు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశాయి. రెవెన్యూ పెంపునకు చర్యలు తీసుకోకుండా ఇలాంటి ప్రజాకర్షక విధానాలు ప్రతిపాదిస్తే ద్రవ్య స్థిరీకరణ లక్ష్యాలను చేరుకోలేమని రేటింగ్ ఏజెన్సీలు స్పష్టం చేశాయి.

ఏటా 7 శాతం పైగా ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్నప్పటికీ ఉద్యోగాల కల్పన ఆశించిన స్థాయిలో జరుగలేదన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇటీవలి రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు దాని ఫలితమేనన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. దేశీయ యువతకు అవసరమైన ఉపాధి అవకాశాలను కల్పించాలంటే కనీసం రెండు శాతం అధికంగా జీడీపీ వృద్ధి చెందాల్సి ఉంటుందని రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ ఇటీవల అభిప్రాయపడ్డారు.

ఎంఎస్‌ఎంఈలకు రుణాలివ్వండి

వ్యవసాయ, హౌజింగ్ రంగాలకు ఆర్థిక భరోసాను కల్పించండి

ప్రభుత్వ రంగ బ్యాంకర్లతో కేంద్ర తాత్కాలిక ఆర్థిక మంత్రి పియూష్ గోయల్



న్యూఢిల్లీ, జనవరి 28: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లకు రుణాల మంజూరును వేగవంతం చేయాలని ప్రభుత్వ రంగ బ్యాంకులకు కేంద్ర తాత్కాలిక ఆర్థిక శాఖ మంత్రి పియూష్ గోయల్ సూచించారు. వ్యవసాయ, హౌజింగ్ రంగాలకూ ఆర్థిక చేయూతనందించాలని కోరారు. సోమవారం ఇక్కడ ప్రభుత్వ రంగ బ్యాంకుల అధిపతులతో గోయల్ సమావేశమయ్యారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ దివాలా చట్టం (ఐబీసీ) అమలుతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19) గడిచిన మూడు త్రైమాసికాల్లో (ఏప్రిల్-డిసెంబర్) రూ. లక్ష కోట్లకుపైగా మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) వసూలయ్యాయని అన్నారు. రాబోయే రోజుల్లో ఐబీసీతో మరిన్ని లాభాలుంటాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అనారోగ్యం కారణంగా అరుణ్ జైట్లీ అమెరికాలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో గోయల్ గతవారం తాత్కాలికంగా ఆర్థిక మంత్రిత్వ శాఖ బాధ్యతల్ని స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తొలిసారి ఆర్థిక మంత్రి హోదాలో ప్రభుత్వ బ్యాంకర్లతో భేటీ అయిన గోయల్.. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిశ్రమకు అండగా నిలువాలని సూచించారు.

బ్యాంకర్లతో ఆర్బీఐ గవర్నర్ భేటీ

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ కూడా సోమవారం ప్రభుత్వ రంగ బ్యాంకుల సీఈవోలతో సమావేశమయ్యారు. ఎన్నికల వేళ వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న కేంద్ర మధ్యంతర బడ్జెట్‌కు ముందు జరిగిన ఈ వరుస భేటీలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. వచ్చే నెల 7న ద్వైమాసిక ద్రవ్యవిధాన పరపతి సమీక్ష సైతం ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో బ్యాంకింగ్ రంగం నుంచి ఆర్బీఐ ఏం ఆశిస్తున్నదో బ్యాంకర్లకు దాస్ తెలియజేశారు. అలాగే బ్యాంకింగ్ రంగంలో నెలకొన్న పరిస్థితులనూ అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు సమావేశం అనంతరం దాస్ విలేఖరులతో మాట్లాడుతూ వెల్లడించారు. ద్రవ్యకొరత, రుణలభ్యత లేమి సమస్యలతో సతమతమవుతున్న బ్యాంకింగ్ రంగ ఆర్థిక పరిస్థితి ఇప్పుడు ఎలా? ఉందన్నదానిపై గవర్నర్ దాస్ ఆరా తీసినట్లు తెలుస్తున్నది. ఇదిలావుంటే ఆర్బీఐ చేపడుతున్న చర్యలతో నిరుడు మార్చి ఆఖరు నాటికి ఎన్‌పీఏలు రూ.23,000 కోట్లకుపైగా తగ్గడం కొంతలో కొంత ఊరటగా నిలుస్తున్నది. కాగా, గత నెల డిసెంబర్‌లో ఊర్జిత్ పటేల్ రాజీనామాతో ఆర్బీఐ కొత్త గవర్నర్‌గా వచ్చిన దాస్‌కు రాబోయేదే తొలి ద్రవ్యసమీక్ష కానున్నది.

వడ్డీరేట్లు తగ్గొచ్చు?

వచ్చే ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ కీలక వడ్డీరేట్లను తగ్గించవచ్చన్న అంచనాలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. డిసెంబర్‌లో అటు టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం, ఇటు వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ఈ అభిప్రాయాలు విస్తృతంగా వ్యక్తమవుతున్నాయి. హోల్‌సేల్ ద్రవ్యోల్బణం 8 నెలల కనిష్ఠాన్ని తాకుతూ 3.80 శాతానికి, రిటైల్ ద్రవ్యోల్బణం 18 నెలల కనిష్ఠానికి చేరి 2.19 శాతానికి దిగివచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ద్రవ్యోల్బణం ఆధారంగానే ద్రవ్యసమీక్షలు జరిపే ఆర్బీఐ.. ఈసారి రెపో, రివర్స్ రెపో వడ్డీరేట్లను కిందకు తెస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

దేశంలో టాటానే గొప్ప బ్రాండ్

అంతర్జాతీయ జాబితాలో ఏకైక భారతీయ సంస్థ

19.5 బిలియన్ డాలర్లకు బ్రాండ్ విలువ.. ఈ ఏడాదికిగాను 86వ స్థానం

ముంబై, జనవరి 28: ఉప్పు నుంచి ఉక్కు వరకు, ఆటో రంగం నుంచి విమానయానం వరకు అన్నింటా విస్తరించిన టాటానే.. భారత్‌లో అత్యంత విలువైన బ్రాండ్ అని ఓ అంతర్జాతీయ నివేదిక స్పష్టం చేసింది. టాప్-100 గ్లోబల్ బ్రాండ్స్ జాబితాలో చోటు దక్కించుకున్న ఏకైన భారతీయ సంస్థ కూడా టాటా గ్రూపే కావడం గమనార్హం. గతంతో పోల్చితే 37 శాతం ఎగబాకి టాటా బ్రాండ్ వాల్యూ 19.5 బిలియన్ డాలర్లకు చేరుకున్నదని లండన్‌కు చెందిన బ్రాండ్ ఫైనాన్స్ కన్సల్టెన్సీ తెలిపింది. ఈ క్రమంలోనే 2018లో 104వ స్థానంలో ఉన్న టాటా గ్రూప్ బ్రాండ్ విలువ.. 2019లో 86వ స్థానానికి ఎగిసిందని బ్రాండ్ ఫైనాన్స్ సీఈవో డేవిడ్ హైగ్ పేర్కొన్నారు. తాజా ర్యాంకులపై టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ ఆనందం వ్యక్తం చేశారు.

చైనా గ్రూప్ చేతికి సింగపూర్, థాయిలాండ్ టాటా స్టీల్ సంస్థలు

సింగపూర్, థాయిలాండ్‌ల్లోని టాటా స్టీల్ సంస్థల్లో 70 శాతం చొప్పున వాటాలను చైనాకు చెందిన హెచ్‌బీఐఎస్ గ్రూప్ దక్కించుకున్నది. ప్రాధాన్యం లేని మార్కెట్ల నుంచి క్రమేణా వైదొలుగుతూ, వేగంగా వృద్ధిచెందుతున్న దేశీయ మార్కెట్‌లో విస్తరించాలన్న వ్యూహాత్మక ప్రణాళికలో భాగంగానే ఈ వాటాలను అమ్మేసింది. సింగపూర్‌లోని నాట్‌స్టీల్ హోల్డింగ్స్, థాయ్‌లాండ్‌లోని టాటా స్టీల్‌లో 70 శాతం చొప్పున వాటాలను చైనాలోని రెండో అతిపెద్ద అలాయ్ తయారీదారు హెచ్‌బీఐఎస్ గ్రూప్‌నకు దాదాపు 480 మిలియన్ డాలర్లకు విక్రయిస్తూ టాటా గ్రూప్ ఒప్పందాలు కుదుర్చుకున్నది.

నేటి నుంచి ఛాలెట్ హోటల్స్ ఐపీవో

ముంబై, జనవరి 28: రూ. 1,641 కోట్ల నిధులను సమీకరించేందుకుగాను ఛాలెట్ హోటల్స్ ఐపీవో మంగళవారం నుంచి ప్రైమరీ మార్కెట్‌లోకి ప్రవేశించనుంది. మొత్తం 2.47 కోట్ల షేర్లను రూ. 275 -280 శ్రేణిలో జారీ చేయనున్నారు. ఇన్వెస్టర్లు కనీసంగా 53 షేర్లకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. రుణాలను తిరిగి చెల్లించేందుకు, అలాగే కార్పొరేట్ అవసరాల కోసం ఈ నిధులను వినియోగించనున్నట్టు ఛాలెట్ హోటల్స్ తెలిపింది. ప్రస్తుతం ఐదు హోటల్స్‌తో మొత్తం 2,328 రూమ్స్‌తో సేవలందిస్తున్నది.

హైదరాబాద్‌లో జావా షోరూమ్‌లు

మార్చి నుంచి బైక్‌ల డెలివరీ.. తెలంగాణలో 9 షోరూమ్‌లు



హైదరాబాద్, జనవరి 28: జావా మోటార్ సైకిల్స్ విక్రయానికి హైదరాబాద్‌లో మూడు షోరూమ్‌లు అందుబాటులోకి వచ్చాయి. తెలంగాణలో మొత్తం 9 షోరూమ్‌లను ప్రారంభించనున్నట్టు జావా మోటర్ సైకిల్స్‌ను తయారు చేస్తున్న క్లాసిక్ లెజెండ్స్ సహ వ్యవస్థాపకుడు అనుపమ్ థరేజా తెలిపారు. దేశ్యవ్యాప్తంగా మొత్తం 105 షోరూమ్‌లను 86 నగరాల్లో మార్చి నెలలోగా ప్రారంభిస్తామని, అందులో భాగంగానే ప్రస్తుతానికి 26 షోరూమ్‌లను ప్రారంభించినట్టు తెలిపారు. ఇప్పటికే జావా బైక్‌లకు అనూహ్య స్పందన లభిస్తున్నదని, అక్టోబర్ నెల వరకు బుకింగ్స్ జరిగినట్టు చెప్పిన ఆయన మార్చి నుంచి బైక్‌ల డెలివరీలు ప్రారంభిస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్‌లలో సోమవారం షోరూమ్‌లను ఆయన ప్రారంభించారు. ఇప్పటివరకు జరిగిన బుకింగ్స్‌లో హైదరాబాద్ టాప్-5 నగరాల్లో ఒకటిగా ఉందన్నారు. ఇక మధ్యప్రదేశ్‌లోని పితంపూర్‌లోని యూనిట్ ఏటా ఐదు లక్షల బైక్‌లను తయారు చేయగల సామర్థ్యంలో పనిచేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతానికి దేశీయ మార్కెట్లో మూడు బైక్‌లను బీఎస్-6 నిబంధనలకు అనుగుణంగా తయారు చేస్తున్నామని, ఏడాదిలోగా పూర్తిగా ఎగుమతుల మార్కెట్ కోసం బీఎస్‌ఏ బైక్‌ల ఉత్పత్తిని ప్రారంభించనున్నట్టు తెలిపారు.

బీవోబీ కొత్త సేవింగ్స్ స్కీంలు



హైదరాబాద్, జనవరి 28: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ).. మహిళలు, వృద్ధుల కోసం రెండు కొత్త సేవింగ్స్ బ్యాంక్ స్కీంలను ప్రారంభించింది. బరోడా మహిళా శక్తి సేవింగ్స్ అకౌంట్, బరోడా సీనియర్ సిటిజన్ ప్రివిలేజ్ సేవింగ్స్ అకౌంట్‌ల పేరుతో వీటిని పరిచయం చేసింది. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో బీవోబీ తెలియజేసింది. కాగా, బరోడా సమృద్ధి డిపాజిట్ స్కీం పేరుతో 444 రోజులకుగాను ఓ ఫిక్స్‌డ్ డిపాజిట్‌నూ ప్రకటించింది. అత్యధికంగా 7.15 శాతం వడ్డీని ఇస్తామని స్పష్టం చేసింది. వృద్ధులకు అదనంగా మరో 0.50 శాతం వడ్డీరేటు ప్రయోజనం దక్కుతుందని వివరించింది.

సైనిక సంక్షేమానికి ఎస్‌బీఐ విరాళం



హైదరాబాద్, జనవరి 28: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐకి చెందిన తెలంగాణ సర్కిల్ ఉద్యోగులు సైనిక సంక్షేమ నిధికి 14 లక్షల 4,350 రూపాయలను విరాళంగా ప్రకటించారు. సోమవారం రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌ను కలిసిన ఎస్‌బీఐ తెలంగాణ సర్కిల్ మేనేజ్‌మెంట్ కమిటీ.. ఈ మేరకు చెక్కును అందజేసింది. తమ జీతాల్లో నుంచి ఉద్యోగులు ఈ విరాళాన్ని ఇచ్చినట్లు బ్యాంక్ పేర్కొన్నది. కాగా, గవర్నర్‌ను కలిసినవారిలో తెలంగాణ సర్కిల్ అధిపతి సీజీఎం స్వామినాథన్ జే, జీఎంలు యూఎన్ఎన్ మైయా, వీ రమేశ్, డీజీఎం కేవీ బంగార్రాజు, పీఆర్వో హన్మంతరావు ఉన్నారు. సైనిక సంక్షేమ బోర్డు డైరెక్టర్ రమేశ్ కూడా ఉన్నారు.

రెండింతలైన కెనరా బ్యాంక్ లాభం

న్యూఢిల్లీ, జనవరి 28: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో కెనరా బ్యాంక్ నికర లాభం రెండింతలై రూ. 317.52 కోట్లకు చేరుకుంది. కాగా, మొత్తం ఆదాయం రూ. 12,341.09 కోట్ల నుంచి రూ. 13,513.35 కోట్లకు పెరిగింది. స్థూల ఎన్‌పీఏలు కూడా 10.25 శాతానికి తగ్గిపోయాయి. నికర ఎన్‌పీఏలు 6.78 శాతం నుంచి 6.37 శాతానికి దిగాయి. నికర నిరర్థక ఆస్తులు రూ. 26,591.07 కోట్లు ఉన్నట్టు బ్యాంక్ తెలిపింది. ఎన్‌పీఏలకు రూ. 1,977.34 కోట్ల కేటాయింపులు జరిపినట్టు చెప్పింది. కాగా, ఉద్యోగులు ఇస్తున్న ఈఎస్‌పీఎస్ ఆఫర్ 134 శాతం ఓవర్ సబ్‌స్క్రైబ్ అయినట్టు వెల్లడించింది.

ఎంబీబీఎస్ సెకండ్ ఇయర్ పరీక్ష రద్దు

■ రెండు సెట్ల ప్రశ్నాపత్రాల పంపిణీతో గందరగోళం

పోచమ్మమైదాన్ (వరంగల్): వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ పరిధిలో సోమవారం ప్రారంభమైన ఎంబీబీఎస్ సెకండ్ ఇయర్ పరీక్షల్లో గందరగోళం నెలకొన్నది. ఫస్ట్ పేపర్ కోసం వర్సిటీ పరిధిలోని అన్ని మెడికల్ కాలేజీలకు ఒకే సెట్ పేపర్‌ను ఆన్‌లైన్‌లో పంపిణీ చేయాల్సి ఉండగా, సాంకేతిక కారణాల వల్ల రెండు సెట్లు పంపించారు. పొరబాటును గుర్తించిన అధికారులు.. వెంటనే పరీక్షను రద్దుచేశారు. తిరిగి ఫిబ్రవరి 12న నిర్వహిస్తామని ప్రకటించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి వర్సిటీ అధికారులు నాలుగైదు పరీక్ష పేపర్ల సెట్‌లు తయారుచేసి సిద్ధంగా ఉంచుతారు. పరీక్ష రోజు ఒక సెట్‌ను ఎంపిక చేసి 10 నిమిషాల ముందు ఆన్‌లైన్‌లో అన్ని కాలేజీలకు పంపుతారు. షెడ్యూల్ ప్రకారం సోమవారం ఎంబీబీఎస్ సెకండ్‌ఇయర్ ఫార్మాకాలజీ సబ్జెక్టు ఫస్టు పేపర్‌కు మొదటిసెట్‌ను ఎంపికచేసి ఆన్‌లైన్‌లో కాలేజీల ప్రిన్సిపాళ్లకు పంపించారు. అయితే కొన్ని కాలేజీలకు రెండో సెట్‌ను పంపించారు. విద్యార్థులు వేర్వేరు ప్రశ్నపత్రాలు రాస్తుండటాన్ని అధికారులతోపాటు సిట్టింగ్ స్క్వాడ్ గుర్తించింది. సాంకేతిక కారణాల వల్ల ఇలా జరిగిందని నిర్ధారించారు. విద్యార్థులు గందరగోళానికి గురికాకుండా ఉండేందుకుగానూ సోమవారం జరిగిన పరీక్షను రద్దు చేసినట్టు ప్రకటించారు. తిరిగి ఫిబ్రవరి 12న నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు.

కేసులన్నీ ఏపీ హైకోర్టుకు తరలించండి

■ హైకోర్టుకు ఏపీ బార్ అసోసియేషన్ లేఖ

■ పూర్తిస్థాయి ధర్మాసనానికి బదిలీచేసిన న్యాయస్థానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన రిట్ అప్పీళ్లు, రివ్యూ పిటిషన్లు, కంటెంప్ట్ కేసుల పూర్తి రికార్డులను అమరావతిలోని ఆ రాష్ట్ర హైకోర్టుకు బదిలీచేయాలని.. ఈ రికార్డులన్నీ ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులోనే కొనసాగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ బార్ అసోసియేషన్ రాసిన లేఖను హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. సోమవారం దీనిపై విచారణ చేపట్టిన కోర్టు.. ఈ అంశాన్ని పూర్తిస్థాయి ధర్మాసనానికి బదిలీచేస్తూ ఆదేశాలు జారీచేసింది. కేంద్ర న్యాయశాఖ, తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్, తెలంగాణ బార్ అసోసియేషన్, తెలంగాణ, ఏపీ న్యాయశాఖలు తదితరులను పార్టీలుగా చేర్చింది. కాగా, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 40 (3) ప్రకారం దాఖలుపడ్డ అధికారాలకు అనుగుణంగా తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆ రికార్డులను ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని, లేదంటే రికార్డులన్నీ అక్కడే కొనసాగుతాయని ఏపీ బార్ తెలిపింది. ఏపీకి సంబంధించిన కేసుల్లో న్యాయస్థానం ఎదుట హాజరయ్యే న్యాయవాదులందరూ అమరావతికి తరలివెళ్లినందున.. ఆ కేసులు తెలంగాణ హైకోర్టులో ఉంటే కక్షిదారులకు ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నది.

'దోస్త్' నోటిఫికేషన్‌కు ముందే అఫిలియేషన్లు

■ దోస్త్ అడ్మిషన్ల కమిటీ నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)-2019 నోటిఫికేషన్‌ను ఏప్రిల్ నెలాఖరులోగా విడుదల చేయాలని దోస్త్ అడ్మిషన్ల కమిటీ భావిస్తున్నది. అంతకుముందే అన్ని ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు అఫిలియేషన్(అనుబంధ గుర్తింపు) ప్రక్రియ పూర్తిచేయాలని నిర్ణయించింది. అఫిలియేషన్ ఇచ్చేందుకు అన్ని కాలేజీల్లో తనిఖీలు నిర్వహించాలని వర్సిటీ అధికారులకు సూచించింది. సోమవారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో దోస్త్ అడ్మిషన్ల కమిటీ సమావేశమైంది. నోటిఫికేషన్, అఫిలియేషన్ తదితర అంశాలపై చర్చించింది. అన్ని వర్సిటీల పరిధిలోని అఫిలియేషన్ పొందిన ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లోనే 2019-20 అడ్మిషన్లు చేపట్టాలని నిర్ణయించింది. ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో నాణ్యమైన విద్యావిధానం కోసం అఫిలియేషన్ నిబంధనలు పాటించాల్సిందేనని, ఈ విషయంలో రాజీపడొద్దని వైస్ చాన్స్‌లర్లు, రిజిస్ట్రార్లకు దోస్త్ కమిటీ స్పష్టంచేసింది. నాసిరకమైన డిగ్రీ కాలేజీలకు అఫిలియేషన్లను నిరాకరించాలని సూచించింది. మూడేండ్ల నుంచి 25 శాతం కన్నా తక్కువ అడ్మిషన్లు పొందిన ప్రైవేటు డిగ్రీ కాలేజీలు రాష్ట్రంలో దాదాపు 400 వరకు ఉన్నట్టు సమాచారం. ఆయా కాలేజీల్లో ఈసారి నుంచి అడ్మిషన్లు జరుగకపోవచ్చని, 25 శాతం కన్నా తక్కువగా అడ్మిషన్లు నమోదైన డిమాండ్‌లేని కోర్సులను సైతం మూసేయాలని దోస్త్ కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. అధిక డిమాండ్ ఉన్న హోటల్ మేనేజ్‌మెంట్, హాస్పిటాలిటీ, బీఎస్సీ నర్సింగ్ వంటి కోర్సులను పెట్టేలా కాలేజీల యాజమాన్యాలతో సంప్రదింపులు జరుపాలని సూచించారు.



2017 జనవరి 28న లండన్‌లో జరిగిన తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్డమ్ (టాక్) ఆవిర్భావ సభకు హాజరై ఇప్పటివరకు సంస్థకు సహాయ సహకారాలు అందిస్తున్న తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డిని టాక్ రెండో వార్షికోత్సవం సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి సత్కరిస్తున్న టాక్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం



సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్, రిటైర్డ్ కల్నల్ రమేశ్‌కుమార్



సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని ఆవిష్కరిస్తున్న హోంమంత్రి మహమూద్‌అలీ. చిత్రంలో మండలిలో ప్రభుత్వ విప్ పీ సుధాకర్‌రెడ్డి, పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, భాషా సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు



ప్రొగ్రెసివ్ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న హోంమంత్రి మహమూద్‌అలీ. చిత్రంలో ఎమ్మెల్సీలు జనార్దన్‌రెడ్డి, పూల రవీందర్, సంఘం నాయకులు ఉన్నారు

బస్టాండ్లలో సోలార్ ప్లాంట్లు

■ అధికారులతో సమీక్షించిన ఆర్టీసీ ఈడీ పురుషోత్తం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆర్టీసీని ఆర్థికంగా బలోపేతం చేసే దిశలో భాగం పలు టీఎస్‌ఆర్టీసీ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా బస్‌స్టేషన్లు, బస్టాండ్లలో సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణశక్తి అభివృద్ధి సంస్థ (టీఎస్‌ఆర్‌ఈడీసీవో) సహకారంతో కార్వీ, వార్స్, సన్ సంస్థలు సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ఆర్టీసీతో ఒప్పందం చేసుకున్నాయి. సోలార్ ప్లాంట్ల పనులు తీరుపై టీఎస్‌ఆర్టీసీ ఈడీ(రెవెన్యూ, ఐటీ) పురుషోత్తం నాయక్ సోమవారం ఆర్టీసీ అధికారులు, సోలార్ కంపెనీల ప్రతినిధులతో బస్‌భవన్‌లో సమీక్ష జరిపారు. 4,458 కిలోవాట్ల సామర్థ్యంతో కూడిన ప్లాంట్లను నెలకొల్పడంతో ఏటా రూ.2.25 కోట్ల మేరకు ఆదా అవుతుందన్నారు.

మినీ థియేటర్లపై ఆర్టీసీ అధ్యయనం

■ విజయవాడలో సందర్శన.. త్వరలో లక్నోకు బృందం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బస్టాండ్లు, బస్‌స్టేషన్ల వద్ద మినీ థియేటర్లు ఏర్పాటుచేస్తే సంస్థకు ఎలా ఆదాయం సమకూరుతుందనే అంశంపై టీఎస్ ఆర్టీసీ అధికారుల బృందం అధ్యయనం చేస్తున్నది. ఏపీ విజయవాడలోని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో ఏపీఎస్ ఆర్టీసీ నిర్మించిన మినీ థియేటర్‌ను సందర్శించిన బృందం.. సోమవారం ఆర్టీసీ ఎండీ సునీల్‌శర్మకు నివేదికను అందించింది. టీఎస్ ఆర్టీసీ కూడా సంస్థ ఖాళీస్థలాలు, బస్‌స్టేషన్లలో మినీ థియేటర్ల నిర్మాణాలు చేపట్టవచ్చునని నివేదికలో పొందుపర్చింది. లక్నోలో పబ్లిక్, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) స్కీం ద్వారా నడుస్తున్న బస్‌స్టేషన్‌ను సైతం బృందం సందర్శిస్తుందని టీఎస్ ఆర్టీసీ ఎండీ సునీల్‌శర్మ తెలిపారు. అనంతరం సంస్థకు ఆర్థికంగా ప్రయోజనం కలిగేలా నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలే కీలకం

■ వ్యవసాయ వర్సిటీ విస్తరణ సంచాలకుడు రాజిరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయం గిట్టుబాటు కావటంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కీలకపాత్ర పోషిస్తాయని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఎస్‌ఏయూ) విస్తరణ సంచాలకుడు డాక్టర్ డీ రాజిరెడ్డి అన్నారు. ప్రస్తుతం పంటల ఉత్పత్తి, ఉత్పాదకతలు బాగా పెరిగాయని పేర్కొన్నారు. సోమవారం వర్సిటీ విస్తరణ విద్యాసంస్థ సెమినార్‌హాల్‌లో వ్యవసాయ విశ్వవిద్యాలయం, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టీఐఎస్‌ఎస్)లు సంయుక్తంగా 'పీపుల్ సెంట్రిక్ డెవలప్‌మెంట్' అంశంపై రెండురోజులపాటు నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. శాస్త్రవేత్తలు, పరిశోధకులు.. అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లపై దృష్టిపెట్టాలని సూచించారు. హైదరాబాద్ తర్వాత జగిత్యాల, పాలెంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డైరెక్టర్ లక్ష్మణ్ చెప్పారు. రైతులకు వ్యవసాయంతోపాటు ఇతర జీవనోపాధి మార్గాల్లో ప్రవేశం అవసరమని టీఐఎస్‌ఎస్ ప్రోగ్రామ్ డైరెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

సమయపాలన, భద్రతకు ప్రాధాన్యం

■ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్సీఆర్ జీఎం ఆర్‌కే కులశ్రేష్ట

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భద్రతకు సంబంధించిన విధివిధానాలను పాటిస్తూ రైళ్ల నిర్వహణ చేపట్టాలని దక్షిణ మధ్యరైల్వే జనరల్ మేనేజర్ ఆర్‌కే కులశ్రేష్ట అధికారులకు సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి



రైళ్ల నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. సోమవారం సికింద్రాబాద్ రైల్‌నిలయంలో ఎస్సీఆర్ జోన్‌లోని ఆరుగురు డీఆర్‌ఎంలు, ఉన్నతాధికారులతో భద్రత, సమయపాలనపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద భద్రతను పటిష్ఠంచేసే చర్యలను సాధ్యమైనంత త్వరగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ జాన్‌థామస్, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ శివప్రసాద్, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ మధుసూదన్‌రావు, ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వయిజర్ బ్రజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష మధురమైనది

■ భాషా సంస్కృతులపై చర్చకు వేదిక 'పరస్పర'

■ తెలంగాణ ప్రభుత్వం చొరువ శుభపరిణామం

■ గుజరాతీ కవి దిలీప్ మనూభాయ్ ఝువేరి ప్రశంస

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: తెలుగు భాష గొప్పది.. మధురమైనదని గుజరాతీ కవి, అనువాదకుడు, నాటకరచయిత, ఫిజీషియన్ దిలీప్ మనూభాయ్‌ఝువేరి ప్రశంసించారు. తెలంగాణ భాషాసాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో తొలిసారిగా ఏర్పాటుచేసిన 'పరస్పర' కార్యక్రమంలో భాగంగా ఝువేరితో పలువురు సాహితీవేత్తల ముఖాముఖిని రవీంద్రభారతిలో సోమవారం నిర్వహించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, కార్యదర్శి ఏనుగు నర్సింహారెడ్డి, తెలంగాణ భాషాసాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, సీఎం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, విశ్రాంత ఆచార్యులు డాక్టర్ ఎన్ గోపి జ్యోతిప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ ప్రచురించిన 'నయాసాల్, గ్రీన్ గార్లాండ్, ఆకుపచ్చ పొద్దుపొడుపు, హార్వెస్ట్' మొదలైన పుస్తకాలను ఝువేరికి అందజేశారు. ఈ సందర్భంగా కవి ఝువేరి మాట్లాడుతూ తెలుగు నమ్రతగల భాషని, వేల ఏండ్ల చరిత్ర తెలుగు భాషదని చెప్పారు. గుజరాతీ భాషకు మూడు నుంచి నాలుగు వందల ఏండ్ల చరిత్ర మాత్రమే ఉన్నదని తెలిపారు. ఒక్కో ప్రాంతానికి ఒక భాష ప్రత్యేకత తీసుకొస్తుందని పేర్కొన్నారు. భాషా సంస్కృతుల గొప్పదనాన్ని చాటడానికి ఇంత మంచి వేదికను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటుచేయడం శుభపరిణామమని కొనియాడారు. అనంతరం రామాయణ, భారతాల్లోని పంక్తులను, వివిధభాషల్లో రాసిన కవితలను వినిపించారు. పలు కవితలకు సవివరంగా అర్థం చెప్పగా, సభికులు కరతాళధ్వనులతో అభినందించారు.





సోమవారం రవీంద్రభారతిలో 'పరస్పర' కార్యక్రమంలో మాట్లాడుతున్న గుజరాతీ కవి దిలీప్ మనూభాయ్‌ఝువేరి. ఝువేరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, తెలంగాణ భాషాసాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, సీఎం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, విశ్రాంత ఆచార్యులు డాక్టర్ ఎన్ గోపి

ముఖాముఖిలో భాగంగా సాహితీవేత్తలు సంధించిన ప్రశ్నలకు ఛలోక్తులతో ఆయన ఇచ్చిన సమాధానాలు అలరించాయి. కవి ఝువేరికి నందిని సిధారెడ్డి పోచంపల్లి శాలువా కప్పి సన్మానించారు. అంతకుముందు సిధారెడ్డి మాట్లాడుతూ సాహితీ సమావేశాలపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి 'పరస్పర' నిదర్శనమని చెప్పారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌కు ఝువేరి వచ్చివెళ్తున్నారనే విషయాన్ని ప్రభుత్వ పెద్దలకు తెలుపడంతో, వెంటనే 'పరస్పర'కు శ్రీకారం చుట్టారని వివరించారు. ఒక భాష, మరో భాష శక్తి,స్వరూపాలను తెలుసుకునేందుకు, సాహితీ సంపదను పెంచుకునేందుకు ఇదొక అద్భుతమైన అవకాశమని పేర్కొన్నారు.

సాహితీ ప్రక్రియలపై సాధనకు వీలు

దేశంలో ప్రఖ్యాతి గాంచిన 22 భాషలతో 'పరస్పర'లో మమేకమవడంతో సాహితీపరంగా ఏ స్థితిలో ఉన్నామో తెలుసుకునే అవకాశం ఉంటుందని, సాహితీ ప్రక్రియలపై సాధన చేసేందుకు వీలుంటుందని తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ చెప్పారు. అక్షరం వ్యక్తిని నిర్దేశిస్తే.. వ్యక్తి అక్షర సామ్రాజ్యానికి కట్టుదిట్టమైన పునాది వేస్తాడని, ఆ నేపథ్యం నుంచే 'పరస్పర' పునాది వేసుకున్నదని తెలిపారు. దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ విభిన్న సంస్కృతుల సంగమ క్షేత్రమని, దానికి అనుబంధంగా భాషా సాంస్కృతికశాఖను తీర్చిదిద్దిన తీరు అమోఘమన్నారు. ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ మహాత్ముడు పుట్టిన గుజరాత్‌లో మానవీయ విలువలను కవితాధోరణిలో ఝువేరి వివరించడం అభినందనీయమన్నారు. ఝువేరి గ్లోబల్ పోయెట్. అగ్రశ్రేణి గుజరాతీ, ప్రపంచస్థాయి కవి అని ఆచార్య ఎన్ గోపీ కొనియాడారు. వృత్తిపరంగా ఆయన జనరల్ ఫిజీషియన్ అని, హిందీ, ఇంగ్లిష్, మరాఠీ, మళయాళీ, గుజరాతీ, బెంగాలీ, కొరియన్, చైనీస్, ఐరిష్ భాషల పుస్తకాలను అనుదించారని వివరించారు. ఆయన గొప్ప మానవతామూర్తి అని, పలు దేశాల్లో పయనించి అనేక అవార్డులను సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు.

పంటకాలనీల్లో సమితులకు బాధ్యత

■ వ్యవసాయాధికారులు, రైతుల మధ్య కీలకపాత్ర

■ రైతు సమన్వయ సమితి సభ్యులకు వేతనాలు

■ త్వరలో మార్గదర్శకాల రూపకల్పన

■ మరింత పకడ్బందీగా సభ్యుల నియామకం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతుల ఆదాయం రెట్టింపు చేయడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా రాష్ట్రంలో పంట కాలనీల ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తును వేగవంతంచేసింది. ఏప్రిల్ నుంచి ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్న పంటకాలనీల ఏర్పాటులో రైతు సమన్వయ సమితులను క్రియాశీలకంగా చేయాలని సర్కారు యోచిస్తున్నది. రైతుబంధు, రైతుబీమా పథకాలు విజయవంతం కావడంలో వ్యవసాయ అధికారులతోపాటు రైతు సమన్వయ సమితుల పాత్రను ప్రభుత్వం గుర్తించింది. పంటకాలనీల ఏర్పాటులో కూడా వాటి సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంతోపాటు సభ్యులు క్రియాశీలకంగా వ్యవహరించేలా చూడాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో రైతు సమన్వయ సమితులను మరింత బలోపేతం చేయాలని ఆయన నిర్ణయించారు. సభ్యులకు గౌరవ వేతనం ఇవ్వడంతోపాటు విధులకు సంబంధించి నిర్దిష్టమైన మార్గదర్శకాలు సిద్ధంచేయాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు అప్పటి వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి.. సంబంధితశాఖల అధికారులతో పలుమార్లు సమావేశమై ప్రాథమిక నివేదికను అందజేశారు. దీనిపై త్వరలోనే ముఖ్యమంత్రి తుది నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం. రైతు సమన్వయ సభ్యులందరికీ వ్యవసాయంపై పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి, వారి సేవలు రైతులకు అందేలా ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తున్నది. పంటకాలనీల ఏర్పాటుపై పంటలు, రైతుల వివరాల సేకరణకు వ్యవసాయశాఖ త్వరలో సర్వే చేపట్టనుంది. సర్వేలో వ్యవసాయ విస్తరణ అధికారులకు రైతు సమన్వయ సమితి సభ్యులు సహాయం చేయనున్నారు. గ్రామాలు, మండలాలవారీగా వ్యవసాయ, ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని రైతులవారీగా, సర్వేనంబర్లు, పంటలవారీగా సేకరించి జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అందించే నివేదికలో తమ వంతు సహాయం అందించనున్నారు. వచ్చే వానకాలం నుంచే పైలెట్ ప్రాజెక్టు కింద పంట కాలనీలను ప్రారంభించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవడంతో సర్వేలో రైతు సమన్వయ సమితుల సభ్యులు సహాయం చేయనున్నారు.

రైతు శ్రేయస్సే లక్ష్యంగా నియామకాలు

రైతు సమన్వయ సమితుల్లో సభ్యుల నియామకం మరింత పకడ్బందీగా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం గ్రామ, మండల, జిల్లాస్థాయి రైతు సమన్వయ సమితుల్లో 1.64 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీరిలో కొందరు వివిధ కారణాలతో తప్పుకోవడం, మరికొందరు ఇటీవల సర్పంచులుగా, వార్డుసభ్యులుగా ఎన్నికయ్యారు. రాజకీయాలకు అతీతంగా, రైతు శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని పనిచేసేవారినే సభ్యులుగా నియమించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. రైతులకు సేవ చేయాలనే తపన, వ్యవసాయం చేసేవారినే సభ్యులుగా నియమించాలనేది సీఎం కేసీఆర్ ఉద్దేశమని, అందుకు అనుగుణంగానే త్వరలో రైతు సమన్వయ సమితులను పునర్వ్యవస్థీకరించనున్నట్టు పేర్కొన్నారు.

పంటలసాగుపై రైతులకు అవగాహన

రైతులందరూ ఒకే రకమైన పంటలు సాగు చేయకుండా రైతు సమన్వయ సమితి సభ్యులు అవగాహన కల్పించనున్నారు. వాతావరణ పరిస్థితులు, వనరులను గుర్తించి వాటికి అనుకూలంగా డిమాండ్ ఉన్న పంట రకాలను సాగుచేసేలా రైతులను ప్రోత్సహించనున్నారు. నేల స్వభావాన్నిబట్టి వ్యవసాయ విస్తరణాధికారుల సహాయంతో ఏ రకమైన పంటసాగుచేస్తే రైతులకు లాభాలు వచ్చే అవకాశం ఉందో వివరిస్తారు. పంట సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు లభించేలా రైతు సమన్వయ సమితి సభ్యులు రైతులకు సలహాలు ఇవ్వనున్నారు. పంట ఉత్పత్తులను మార్కెట్లకు తీసుకెళ్లడం, గిట్టుబాటు ధర అందేలా సభ్యులు చూడనున్నారు.

బీజేపీకి ప్రియాంక భయం: వీహెచ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశ రాజకీయాల్లోకి గాంధీవంశానికి చెందిన ప్రియాంకాగాంధీ రావడంతో బీజేపీకి ఓటమి భయం పట్టుకున్నదని కాంగ్రెస్ సీనియర్ నేత వీ హనుమంతరావు విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ రాహుల్ ఫెయిల్ అయ్యా డు.. అందుకే ప్రియాంక గాంధీ రాజకీయాల్లోకి వచ్చిందని చెప్తున్న బీజేపీ నేతలకు ఆమె పేరు చెబితేనే వణుకు వస్తుందన్నారు. బీజేపీ నేత సుబ్రహ్మణ్యస్వామి ప్రియాంకకు బైపోలార్డ్ డిజార్డర్ అనే వ్యాధి ఉందని చెప్పారని, ఇలాంటి వ్యాధి ఉంటే మంచిదేనని, కోపం, చురుకుదనం, వెనువెంటనే నిర్ణయాలు తీసుకోవడం వంటి లక్షణాలు ఉంటాయని తెలుసుకోవాలని తెలిపారు.

బాబూ.. మీ కులపోల్లే గొప్పోళ్లా!

■ పద్మ అవార్డులు, ప్రాజెక్టులపై వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఎద్దేవా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు పరిపాలన కుల రాజకీయాలకు, స్వార్థ ఎజెండాకు పెద్దపీట వేసేలా ఉంటున్నదని వైసీపీ ఎంపీ, పార్టీ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి ఎద్దేవాచేశారు. ఈ మేరకు సోమవారం ఆయన వరుస ట్వీట్లు చేశారు. 'తెలంగాణ ప్రభుత్వం అర్హత ఆధారంగా గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి, అంతర్జాతీయ ఫుట్‌బాల్ లెజెండ్ సునీల్ ఛెత్రీలకు పద్మశ్రీ ఇవ్వాలని కోరింది. ఇక్కడేమో మీ సామాజికవర్గానికి చెందిన ద్రోణవల్లి హారిక, యడ్లపల్లి వెంకటేశ్వర్‌రావును రికమండ్ చేశారు. వీళ్లు తప్ప ప్రతిభావంతులు కనిపించడం లేదా సారూ?' అని ప్రశ్నించారు. 'కాళేశ్వరం ప్రాజెక్టును తెలంగాణ 90 శాతం పూర్తిచేసింది. 2014 కంటే ముందే పోలవరం ప్రాజెక్టుకు అన్ని అనుమతులు వచ్చి పనులు మొదలైనా సాగదీస్తున్నారెందుకు చంద్రబాబు గారు? మీ దోపిడీకి ప్రాజెక్టును పాడి ఆవులా మార్చుకున్నారే కానీ, ఆయకట్టుకు నీరివ్వాలనే ఆలోచన చేశారా?' అని నిలదీశారు.

పాన్, ఆధార్ తప్పనిసరి

■ ఇంజినీరింగ్ ఫీజుల ఖరారుకు సిబ్బంది వివరాలివ్వాలి: టీఏఎఫ్‌ఆర్సీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ ఇతర వృత్తి విద్యాకాలేజీల్లో పనిచేసే బోధన, బోధనేతర సిబ్బంది ఆధార్‌కార్డు, పాన్‌కార్డును తప్పనిసరిగా సమర్పించాలని తెలంగాణ అడ్మిషన్ ఫీజు రెగ్యులేషన్ కమిటీ (టీఏఎఫ్‌ఆర్సీ) ఆదేశాల్లో పేర్కొన్నది. వచ్చే మూడేండ్ల ట్యూషన్ ఫీజుల సమీక్ష కోసం యాజమాన్యాల నుంచి దరఖాస్తులు స్వీకరించడం మొదలుపెట్టిన టీఏఎఫ్‌ఆర్సీ.. సంబంధించిన మార్గదర్శకాలను తాజాగా విడుదలచేసింది. 2016-17 నుంచి కాలేజీలకు సంబంధించి ఆదాయ వ్యయాలను గుర్తింపు పొందిన ఆడిటర్ ధ్రువీకరించిన నివేదికలను దాఖలుచేయాలని సూచించింది. కాలేజీల ఆదాయ వ్యయాలు, సిబ్బంది జీతభత్యాలు వంటి చెల్లింపుల ఆధారాలను టీఏఎఫ్‌ఆర్సీ స్వీకరిస్తున్నది. వీటిని ఆన్‌లైన్‌లో తనిఖీ చేయనున్నారు. కాలేజీ నియమించుకున్న ఆడిటర్ పాన్‌కార్డు, మొబైల్ నంబర్, మెయిల్ ఐడీని స్వీకరిస్తున్నారు.

సహాయ కేంద్రం ఏర్పాటు

ట్యూషన్ ఫీజుల సమీక్ష కోసం అనుమానాల నివృత్తికి 040-23331120 ఫోన్‌నంబర్‌తో సహాయకేంద్రాన్ని, కాలేజీల వివరాల అప్‌లోడ్‌కు టీఏఎఫ్‌ఆర్సీ వెబ్‌సైట్‌లో డ్యాష్‌బోర్డు ఏర్పాటుచేశారు. ఫీజుల సమీక్ష కోసం టీఏఎఫ్‌ఆర్సీకి చెల్లించాల్సిన ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి. దరఖాస్తుల స్వీకరణకు ఫిబ్రవరి 21 వరకు గడువు విధించారు. ప్రైవేటు ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎల్‌ఎల్‌బీ, బీఈడీ వంటి వృత్తి విద్యాకాలేజీల్లో ప్రవేశాల పేరుతో క్యాపిటేషన్ ఫీజులను వసూలు చేయడాన్ని టీఏఎఫ్‌ఆర్సీ నిషేధించింది. అయినా వసూలుచేస్తే కాలేజీలపై చర్యలు తీసుకుంటామన్నారు. వివరాల కోసం http://tafrconline.telangana. gov.in పోర్టల్‌ను సంప్రదించాల్సి ఉన్నది.

బెర్లిన్‌లో సంక్రాంతి, గణతంత్ర సంబురాలు



బెర్లిన్‌లో టీఏజీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబురాల్లో పాల్గొన్న తెలుగువారు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ జర్మనీ (టీఏజీ) ఆధ్వర్యంలో బెర్లిన్ నగరంలో సంక్రాంతి, గణతంత్ర సంబురాలు ఘనంగా నిర్వహించారు. తెలుగు మాట్లాడేవారు పెద్దసంఖ్యలో హాజరయిన ఈ కార్యక్రమంలో.. సంక్రాంతి పండుగ ప్రత్యేకతపై పెయింటిగ్ పోటీలతోపాటు పలు పోటీలు నిర్వహించి గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా టీఏజీ అధ్యక్షుడు డాక్టర్ చలిగంటి రఘు మాట్లాడుతూ.. వ్యవసాయం ఆవశ్యకతను గుర్తెరిగిన తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు.. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారంటూ కితాబునిచ్చారు.

బొంతతో పెండ్లి!

'గంతకు తగ్గ బొంత' అన్న మాట ఊరికే అనలేదు. నిత్యం కప్పుకునే బొంతతో ప్రేమలో పడిందో మహిళ. త్వరలో అంగరంగ వైభవంగా ఆ బొంతను పెండ్లాడేందుకు సిద్ధమవుతున్నది.



మీరు విన్నది నిజమే! నిత్యం కప్పుకునే బొంతతో ఒకావిడ ప్రేమలో పడింది. కొన్ని రోజుల్లో ఆ బొంతను పెండ్లి కూడా చేసుకోబోతున్నది. ఇంగ్లాండ్‌లోని ఎక్సెటర్‌కు చెందిన 49 యేండ్ల పస్కేల్ సెల్లిక్ అనే మహిళ ఇప్పుడు అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నది. రోజూ తనకు వెచ్చదనాన్నిచ్చే బొంతను పెండ్లాడబోతున్నానంటూ తన బంధుమిత్రులను ఆహ్వానిస్తున్నది. ప్రేమ ఎప్పుడు ఎక్కడ పుడుతుందో తెలీదు. దాని గురించి ఎవరూ చెప్పలేరు. కొంతమంది పెంపుడు జంతువుల ప్రేమలో పడుతారు. మరికొంతమంది మొక్కలను ప్రాణంగా ప్రేమిస్తారు. ఈమె మాత్రం బొంతతో ప్రేమలో పడడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. బొంతను ముట్టుకుంటే తనకు ఎంతో రొమాంటిక్‌గా ఉంటుందని చెబుతున్నది సెల్లిక్. ఎంతో హాయినిచ్చే ఈ బొంత ఏకాంతాన్ని దూరం చేస్తుందట. పస్కేల్ తన పెండ్లి రోజున వధువు ధరించే రొటీన్ డ్రెస్‌కు బదులు నైట్ గౌన్ ధరిస్తానని తెలిపింది. ఎక్సెటర్‌లోని రౌగ్మోంట్ గార్డెన్స్‌లో ఫిబ్రవరి 10న మధ్యాహ్నం 2 గంటలకు ఆమె పెండ్లి వేడుక జరుగనుందట. ఈ పెండ్లికి అందరూ ఆహ్వానితులే!

నమస్తే తెలంగాణ
జిందగీ
మంగళవారం 29 జనవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



1977లో.. ఒక ఊరి సినిమా కథ!

వాస్తవికాంశాలు కథా వస్తువులైతే ఆ సినిమాలో జీవితం కనిపిస్తుంది. ప్రజల జీవన విధానాలే ప్రతిబింబిస్తాయి. కొన్నిసార్లు ప్రజలే పాత్రధారులవుతారు. ప్రజా సముదాయమే.. ఆవాస ఆవరణలే.. చిత్రసన్నివేశాలకు వేదికవుతాయి. అలాంటి సినిమాయే 'ఒక ఊరి కథ'. ఇంతకూ ఆ సినిమా ఏ ఊర్లో జరిగింది? ఎందుకు జరిగింది? పాత్రధారులైన ప్రజలెవరు? తెలుసుకుందామా.. రండీ.. ఓసారి ఆ ఊరికి వెళ్లొద్దాం.

బెంగాలీ దర్శకుడు మృణాళ్‌సేన్ ఇటీవల మరణించారు. సినిమా ద్వారా సామాజిక వాస్తవాన్ని కళాత్మకంగా ప్రతిబింబింపజేయడం ఆయన శైలి. ఇందు కోసం ప్రజల జీవనస్థితిగతులే ఇతివృత్తాలుగా ఎంచుకొని గొప్ప సినిమాలు రూపొందించారు. అలాంటి సినిమాల్లో ఒకటి 'ఒక ఊరి కథ'. ఈ సినిమా ఎన్నో సామాజిక సినిమాలకు ప్రేరణగా నిలిచింది. అది 1977వ సంవత్సరం.. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం చీదేడ్ ఒక పల్లెటూరు. చుట్టూ కొండలు.. అందమైన అటవీ ప్రాంతం.. చెరువులు.. కుంటలతో తళతళా మెరిసిపోయేది కానీ ఆ ఫలాలు ప్రజలకు అందేవి కావు. రోజూ పస్తులుండేవారు. భూస్వాములు ఏది చెప్తే అదే వినాలి. వాళ్లు ఇంత పడేస్తేనే ప్రజల గుడిసెలో గంజో.. గట్కనో కనిపించేది. కానీ ప్రతీ పనిలో ప్రజల శ్రమ.. చెమట.. రక్తం ఉండేది.

చీదేడ్ సినిమా సెట్: ఊళ్లో పెద్ద భూస్వామి భద్రారెడ్డి. సినిమాలో ఆ పాత్ర పోషించింది చీదేడ్ సమీప గ్రామమైన గడ్డమల్లయ్యగూడెం భూస్వామి భద్రారెడ్డి. గ్రామంలో రైతుకూలీ వెంకయ్యగా ఎంవీ వాసుదేవరావు నటించాడు. ఆయన కొడుకు కిష్టయ్యగా జీ నారాయణరావు నటించాడు. కిష్టయ్య భార్యగా నటి మమతా శంకర్ నటించింది. ఆమె పాత్ర పేరు నీలమ్మ. ఏఆర్ కృష్ణ.. ప్రదీప్‌కుమార్ ఇతర పాత్రల్లో నటించారు. వీరు మినహా మిగిలిన సహాయ నటులుగా.. కీలక పాత్రధారులుగా చీదేడ్ గ్రామస్తులు నటించడం విశేషం. సినిమా షూటింగ్ 90 శాతం ఈ గ్రామంలోనే జరిగింది.

ఎంట్రీసీన్ (ఊరగంట గుట్ట): పేర్లుపడి సినిమా మొదలవ్వగానే.. గుడిసెలో నుంచి బయటకొచ్చిన వెంకయ్య గోడకు వీపువాల్చి కూర్చుంటాడు. డొక్కలో ఏదో పిసుకుతున్నట్లు అనిపిస్తుండటంతో చుట్ట అంటించుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఇంట్లో నుంచి ఒకటే అరుపులు.. 'అయ్యా.. ఓ అయ్యా.. ఇయ్యాలేం చేద్దామయ్యా?' అని కిష్టయ్య తండ్రిని అడుగుతాడు. వెంకయ్యకు ఆకలితో కూడిన కోపం తన్నుకొస్తుంది. 'హాఁ.. ఏంటీ? నిన్నేం చేశాం' అంటాడు. 'నిన్నా..? ఉపాసం ఉన్నాం కదా?' అంటాడు కిష్టయ్య. 'హా.. ఐతే ఇయ్యాల కూడా అదే ఉందాం' అని బాధతో అంటాడు వెంకయ్య. ఈ గుడిసె గ్రామంలోని ఊరగుంట కట్టకు సమీపంలో ఉండేది. ఇప్పుడు ఆ ప్రాంతంలో పెద్ద ఇండ్లు అయ్యాయి.

సీన్ 1 ఊరెంక బోడు

కూలీలంతా కలిసి 'ఊరెంక బోడు'కు మట్టి పోస్తుంటారు. జమీందార్ భద్రయ్య కూలీలపై కోపంగా ఉన్నాడు. పని సరిగ్గా చేయడం లేదని షేర్‌దార్ (భూస్వామి దగ్గర పద్దులు చూసుకునే వ్యక్తి) నారాయణ్‌జీపై కోపం అవుతాడు. అనవసరంగా దొరతో తిట్లుతిన్నాననే కోపంతో కట్టపై నుంచి నడుచుకుంటూ వస్తుంటాడు. ఇంతలో ఓ చెట్టు చాటు నుంచి చుట్ట పొగలు వస్తుంటాయి. ఇది చూసిన షేర్‌దార్.. 'ఏయ్.. ఎవడ్రా అది? బైటికి రా.. లేకపోతే చంపేస్తా' అని బెదిరిస్తాడు. చేతులు కట్టుకొని.. ముఖం నేలకేసుకొని వణుక్కుంటూ వస్తాడు కిష్టయ్య. 'హమ్మా.. కిష్టిగా.. నీకు కూలీ డబ్బులు ఇస్తే చూడురా ఇగ' అని కిష్టయ్య పేరు రాస్కోమని గుమస్తాకు చెప్పుకుంటూ వెళ్తాడు షేర్‌దార్.

సీన్ 2 భద్రారెడ్డి గడి

వారం గడిచింది. విషయం దొరదాకా వెళ్లింది. షేర్‌దార్ గుస్సా మీదున్నడు. గడ్డమల్లయ్యగూడెం గడి దగ్గర కూలీ పైసలు ఇస్తున్నాడు షేర్‌దార్. కూలీలంతా ఎప్పుడెప్పుడు తమను పిలుస్తారా అని ఆకలితో ఎదురుచూస్తున్నారు. మల్లయ్యా.. రంగమ్మా.. అంటూ అందరి పేర్లు పిలిచి కూలీ ఇస్తున్నారు. వెంకయ్య.. ఆయన కొడుకు కిష్టయ్య ఇద్దరే మిగిలారు. 'అరేయ్.. ఈ ఎంకనికి.. వాని కొడుక్కి సగం కూలీ ఇవ్వండ్రా' అని సహాయకుని పాత్రలో నటించిన చీదేడ్‌వాసి సౌడమోని ముకుందంకు హుకూం జారీచేస్తాడు షేర్‌దార్. 'అయ్యా.. అయ్యా.. తప్పయిందయ్యా.. క్షమించండయ్యా' అని కాళ్లు పట్టుకున్నా.. తన్నేసి వెళ్లాడు కానీ.. కనికరించలేదు.

సీన్ 3 చింతకాయల నర్సింహ గుడిసె

కూలీ చేసినా.. పైకం వచ్చినా అవే ఆకలి కేకలు. కొడుకు పెండ్లీడుకొచ్చిండు. ఓ ఇంటివాడిని చేయాలని వెంకయ్య ఆలోచన. కానీ పెండ్లాన్నెలా పోషించాలి అనే దగ్గర ఆగిపోతాడు. అయినా తప్పదు కదా అని నీలమ్మతో పెండ్లి జరిపిస్తాడు. నీలమ్మ పాత్రలో మమతాశంకర్ నటించారు. పెండ్లిచూపులు చింతకాయల నర్సింహ గుడిసెలో అవుతాయి. పెండ్లి చూపుల నాడు చుట్టాలకు మోర సాయన్న ఇంటికాడ కల్లు దావత్ ఇస్తాడు వెంకయ్య. కల్లు నిషాలో.. 'తాగినోడు తాగిపాయె.. తిన్నోడు లేచిపాయె' అని సరదాగా కల్లు సోపతిగా నటించిన తోడె అడివయ్యతో అంటాడు వెంకయ్య.





మమతా శంకర్ పిడికెల కోసం వెళ్లిన ఇల్లు

సీన్ 4 రాచకొండ

పెండ్లిపిల్ల ఇల్లు రంగాపూర్‌లో. గ్రామస్తులంతా రంగాపూర్ ఎడ్లబండ్ల మీద వెళ్లి.. అక్కడి నుంచి రాచకొండ వెళ్తారు. రాచకొండ పట్టణంలోని రాతి తోరణాలే కల్యాణ మండపాలుగా రూపొందించి అంగరంగ వైభవంగా పెండ్లి చేస్తారు. పెండ్లి తర్వాత 'ఎలుగుబండ బోడు' ఒక రొమాన్స్ సీన్ ఉంటుంది. పెండ్లయితే అయ్యిందిగానీ దమ్మిడి ఆదాయం లేని పరిస్థితి. చేస్తే జమీందార్ దగ్గర కూలీ చేయాలి. లేకపోతే పస్తులుండాలి. కానీ పెండ్లాన్నెట్లా పోషించాలి అనే ఆలోచనతో కిష్టయ్య గడ్డమల్లయ్యగూడెంలోని ఓ మామిడి తోటలో మామిడి కాయల దొంగతనం చేస్తాడు.


సీన్ 5 బొడ్రాయి

దొంగతనం చేశాడన్న నెపంతో భద్రారెడ్డి బొడ్రాయి కాడికి పిలిపించి కిష్టయ్యకు శిక్ష వేయాల్సిందిగా ఆదేశిస్తాడు. తెలంగాణ సాయుధపోరాటంలో కీలకంగా పనిచేసిన కాచం కృష్ణమూర్తి తీర్పు చెప్పే పెద్దమనిషి పాత్రలో నటించారు. ఎంత శిక్షించినా కిష్టయ్య నేరం ఒప్పుకోడు. దీంతో వెంకయ్య ఆవేదనతో.. 'గోచీ పోయింది. గొంగడీ పోయింది. ఇప్పుడేం చేస్తారో చేసుకోండ్రి' అంటూ జమీందార్ తీర్పుకు ఎదురు ప్రశ్నిస్తాడు. దీంతో ప్రజల్లో ఆందోళన మొదలైంది. జమీందారులో అలజడి మొదలైంది.

సీన్ 6 కటికె కాశీబాయి ఇల్లు

కిష్టయ్య గింజల కోసం వెళ్తాడు. భర్త వచ్చేసరికి పిడికెలన్నా తీసుకొద్దామని నీలమ్మ కటికె కాశీబాయి ఇంటికి వెళ్లింది. అయితే ఆమె మీద కూడా దొంగతనం ఆరోపణ వస్తుంది. పంచాయితీ పెడతారు. బోటమీది ఎల్లమ్మ, గునుకుల ఆగమ్మ, డబ్బీకార్ జంగమ్మలు నీలమ్మకు బాసటగా నిలిచి 'నీకేంకాదు పిల్లా.. మేం చూసుకుంటం పో' అని సముదాయించి పంపిస్తారు. ఇదంతా తెలిసిన వెంకయ్య మరింత ఆవేదనకు గురవుతాడు. 'పేద ప్రజలు ఎద్దులేక చేసి చేసి చస్తారు. మోసగాడు ప్రజలనెంతో మేసి మేసి బలుస్తాడు' అంటాడు కొడుకుతో.

క్లైమాక్స్ సీన్ (లోయపల్లి దొరసాని మర్రి): మేకబాయి, రామాకుంట, అబ్జర్వేటరీ, పెద్దబాయి మోట్లు, బజారు రోలు, పెద్ద పలుగు, ఎల్లబండ బోడుల్లో మిగతా సీన్లు తీశారు. కొద్దిరోజుల తర్వాత.. నీలమ్మ నిండు గర్భిణి. కానీ పేదరికం. కనీసం తినడానికి కూడా తిండి లేదు. వైద్య సౌకర్యం లేదు. జమీందార్ ఆదేశిస్తేనే ఏదైనా. దిక్కుతోచని స్థితిలో లోయపల్లి దొరసాని మర్రి కాడ మంత్రసాని దగ్గరకు తీసుకెళ్తారు. మంత్రసాని చేయాల్సిందంతా చేయగా బిడ్డ పుడతాడు. కానీ నీలమ్మ చనిపోతుంది. సినిమా శుభం కార్డు పడుతుంది.



చాయ్ రుచి చూపించారు:

మృణాళ్‌సేన్ మా ఊరికి చాయ్ రుచి చూపించారు. అప్పటిదాకా మా ఊళ్లో వాళ్లకు చాయ్ అలవాటు లేదు. నా పెండ్లయిన 15 రోజులకే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది.



మోర యాదయ్య

మా నానమ్మ నటించింది:


'ఒక ఊరికథ'లో మా నానమ్మ నటించింది. మేం ఈ సినిమా చూశాం. పిడికెల కోసం మమతాశంకర్ మా ఇంటికొస్తుంది. అదే ఇంట్లో ఇప్పటికీ ఉంటున్నాం. మాకు చాలా ఆనందంగా ఉంది.



డబ్బీకార్ అన్నపూర్ణ

దీపక్ థియేటర్లో:

సినిమా మొత్తం మా ఊర్లోనే తీశారు. ఒకసారైతే చీకట్లో కందీలు పట్టుకొని అబ్జర్వేటరీలో షూటింగ్ చేశారు. వారం రోజుల పాటు మా ఊరి ప్రజలకు దీపక్ థియేటర్లో ఫ్రీ షోలు వేశారు.



బొడ్రమోని శంకరయ్య

సందేశం: సాయుధ పోరాటం ముగిసిన తర్వాత తెలంగాణలో ప్రజల జీవన స్థితిగతులు ఎలా ఉన్నాయో తెలుపడానికి మృణాళ్‌సేన్ చీదేడ్ గ్రామ కథను ఇతివృత్తంగా తీసుకున్నారు. భూమికోసం.. భుక్తి కోసం.. బానిసత్వ విముక్తి కోసం ప్రజలు ఇంకా పోరాటం చేశారనే దానికి ఇది ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

... దాయి శ్రీశైలం

వెంటిలేటర్ శుభ్రత



- కిటికీకి ఉన్న గ్లాస్, చెక్క పేనల్‌ను జాగ్రత్తగా తొలిగించండి. అక్కడ ఉన్న మెష్‌ను వాక్యూం క్లీనర్‌తో మొదటగా శుభ్రపరుచాలి. తరువాత కాటన్‌బట్టతో తుడువాలి.
- కిటికీకి స్లైడింగ్ పద్ధతి ఉంటే స్లైడ్స్ జాగ్రత్తగా తీసి సబ్బునీటితో తుడువాలి. పొడిబట్టతో ఒకసారి తుడిచి మరల స్లైడింగ్‌ను బిగించండి.
- వెంటిలేటర్‌లోని చిన్నపాటి స్థలాలు, సీలలు ఉంటే పాత టూత్ బ్రష్‌ను ఉపయోగించి శుభ్రపరచాలి. వెంటిలేషన్ ఫ్రేమ్‌ను వాక్యూమ్ క్లీనర్‌తో తుడువాలి.
- వెంటిలేషన్ ఏదైనా గొట్టానికి అనుసంధానించబడితే, వాక్యూమ్ క్లీనర్ దానిని పూర్తిగా లాగేయగలదు. చెత్తను పూర్తిగా తీసి దానికి 50 నిమిషాలు తెరచి ఉంచండి. అందులో ఎలుకలు వంటివి ఏమైనా డ్యామేజ్ చేశాయేమో పరిశీలించండి.

ఉద్యోగం వదిలి.. వ్యవసాయానికి కదిలి..



వ్యవసాయంలో పెరుగుతున్న మందుల వాడకంతో ఆకుకూరల నుంచి ప్రతీ ఒక్కటీ కల్తీగా మారుతున్నది. దీంతో రోగాల బారిన పడుతున్నారు ప్రజలు. ఈ కల్తీ ప్రపంచంలో హైడ్రోపోనిక్ ఆకుకూరలు విక్రయిస్తున్నారు ముంబైకి చెందిన జాషు, సకినా రాజ్‌కొత్వాల.

మంచి ఉద్యోగం. నెలకు వేలల్లో చేతికందే జీతం. కానీ ఏదో తెలియని వెలితి వారిని వెంటాడింది. రోజూసాగే రొటీన్ లైఫ్‌కి స్వస్తి పలికారు. ఉద్యోగం చేయగా, మిగిలిన సమయంలోనే ఏదైనా చేయాలనున్నారు. బుర్రకు పదునుపెట్టారు. దీంతో పాండిచ్చేరిలోని అవురోవల్లిలో క్రిమిసంహారక మందులు ఉపయోగించకుండా పండ్లు, పూలు, తృణధాన్యాలు, పప్పు గింజలు 25 సంవత్సరాలుగా పండిస్తున్న కృష్ణ గురించి తెలిసి ఆ ఫామ్‌ను సందర్శించారు ఇద్దరు స్నేహితులు. ప్రస్తుతం తింటున్న ఆకుకూరలు మందులు ఉపయోగిస్తుండడంతో చిన్నచిన్న ఆరోగ్య సమస్యలు రావడం గుర్తించారు. (హైడ్రోపోనిక్) క్రిమిసంహారక మందులు, మట్టిని వాడకుండా ఆకుకూరలు పండించాలని నిర్ణయించుకున్నారు. దీంతో అండూరిలో ఇండస్ట్రియల్ ఫామ్‌లో వెయ్యి చదరపు అడుగుల గదిలో సుమారు 7రకాల 1000 మొక్కలతో మూడునెలలు కష్టపడి ఒక న్యాచురల్ ఫామ్‌ను ఏర్పాటు చేశారు. ఆకుకూరలకు పెరుగుతున్న డిమాండ్‌ను బట్టి మట్టి లేకుండా కేవలం నీటి ద్వారా ఆకుకూరలు పెంచే విధంగా ఈ ఫామ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఆకుకూరలలో న్యూట్రిషన్ లెవెల్స్ ఎక్కువగా ఉండడంతో పాటు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. దీంతో ముంబైవాసులు హైడ్రోపోనిక్ ఫుడ్‌పై ఆసక్తి చూపుతున్నారు. ఆర్డర్ చేసిన కొద్ది సమయంలోనే వీటిని డోర్ డెలివరీ ఇస్తున్నారీ స్నేహితులు. దీంతో నెలవారీ సబ్‌స్క్రిప్షన్లు తీసుకొని మరీ ఈ ఆకుకూరలు ఇంటికి తెప్పిస్తున్నారు. ఇలా ఒక సబ్‌స్క్రిప్షన్ తీసుకొని మరీ ఇంటికి ఆకుకూరలు తెప్పించుకోవడం ఎక్కడా లేదు. జాషు, సకినా ఉద్యోగాన్ని వదిలి మరీ ఈ రంగంలోకి వచ్చి.. విజయతీరాన్ని చేరారు.

జుట్టు సంరక్షణ మన చేతుల్లోనే



- డాండ్రఫ్ సమస్య అధికంగా ఉన్నవారు కొబ్బరినూనె, వేపనూనెను కలిపి జుట్టు కుదుళ్లకు బాగా పట్టించాలి. 20 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడగాలి. దీంతో జుట్టుకు తగిన పోషణ అందడంతో పాటు వెంట్రుకలు మెత్తగా తయారవుతాయి. ఒత్తుగా పెరుగుతాయి.
- కొబ్బరినూనెలో నిమ్మకాయ పిండి గోరువెచ్చగా చేసి మాడుకు పట్టించి అరగంట తర్వాత కడిగేయాలి. వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే క్రమంగా చుండ్రు సమస్య పూర్తిగా తగ్గిపోతుంది.
- కొందరు తలస్నానం చేసిన తర్వాత జుట్టు పూర్తిగా ఆరకముందే హెయిర్ డ్రయర్లు ఉపయోగిస్తారు. ఇలా చేయడం వల్ల జుట్టు క్రమంగా బలహీనపడుతుంది.
- పుల్లటి పెరుగును తలకు పట్టించి గంట సేపయ్యాక కడిగేయాలి. ఇలా చేయడం వల్ల పెరుగులోని యాంటీ ఫంగల్ గుణాలు చుండ్రుపై పోరాడతాయి. జుట్టుకు తగిన బలాన్ని ఇస్తాయి.

II.
నమస్తే తెలంగాణ
జీవనరేఖ
[కరీంనగర్]
మంగళవారం 29 జనవరి 2019



క్యాన్సర్ ఒక మహమ్మారి.. కానీ నియంత్రించలేని వ్యాధేమీ కాదు. అయినా క్యాన్సర్ మరణాలు పెరుగుతూనే ఉన్నాయి. కారణం.. వ్యాధి పట్ల అవగాహన లేకపోవడం. ప్రాథమిక లక్షణాలు తెలిసినా నిర్లక్ష్యం చేయడం. **ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం.** క్యాన్సర్ అంటే ఏంటి? దానిని ఎలా అరికట్టాలి? చికిత్స ఏంటి? అసలు క్యాన్సర్ రాకుండా ఉండాలంటే ఏం చేయాలి? తెలుసుకుందాం.

క్యాన్సర్‌ను జయించడమెలా?

తొలిదశలోనే లక్షణాలను గుర్తిస్తే క్యాన్సర్‌ను అంతమొందించవచ్చు. ఎముకలు, కాలేయం, ఊపిరితిత్తులు ఇలా ఏ అవయవమూ దానికి అతీతం కాదు. అలా విస్తరిస్తూ లింఫ్ నాళాలు, రక్తం ద్వారా ఏ భాగానికైనా పాకుతుంది. మిగతా అవయవాలకు పాకితే దానిని లేటుదశ అంటారు. ఈ దశకు చేరుకోకుండా చికిత్స తీసుకుంటే క్యాన్సర్‌ను అదుపుచేయవచ్చు.



2019 థీమ్

క్యాన్సర్‌పై ఆరోగ్య సంస్థలు.. ప్రభుత్వాలు.. స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పిస్తున్నప్పటికీ దానిని అందుకోలేకపోతున్నారు ప్రజలు. ప్రతీయేటా యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ (యూఐసీసీ) ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాలు.. వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కల్పించి దానిని అంతమొందించాలన్నదే ఈ సంస్థ లక్ష్యం. ప్రతీయేటా ఒక థీమ్ ఉంటుంది. ఈసారి థీమ్.. I Am and I Will. కనీసం వారు సూచించే నిర్దేశకాలనైనా పాటిస్తే ఎంతో కొంత అవగాహన కలుగుతుంది.

ఏది క్యాన్సర్?

శరీరంలోని ఏదైనా అవయవం వ్యాధికారక వైరస్ బారిన పడి రోజురోజుకూ నశిస్తుంది. చాలాసార్లు తొలిదశలో లక్షణాలు అంతగా కనిపించవు. వచ్చిన అవయవాన్ని బట్టి దీని నిర్ధారణ పరీక్షలు కూడా వేర్వేరుగా ఉంటాయి. అన్ని క్యాన్సర్లనూ ఒకే రకం పరీక్షతో తెలుసుకోవడం అసాధ్యం. క్యాన్సర్ అంటువ్యాధి కానేకాదు. కానీ గర్భాశయ ముఖ్యద్వార క్యాన్సర్‌కు కారణమయ్యే హెచ్‌పీవీ వైరస్ శృంగారం.. రక్తమార్పిడిల ద్వారా సోకే ప్రమాదం ఉంది. ఇది వంశపారంపర్యంగా వచ్చే అవకాశం లేకపోయినా కొన్ని సందర్భాల్లో మాత్రం దగ్గరి సంబంధీకులకు రొమ్ము, థైరాయిడ్, పెద్దపేగు, పాంక్రియాస్ క్యాన్సర్లు ఉంటే ఆ కుటుంబసభ్యుల్లో వచ్చే ప్రమాదం ఉంది. క్యాన్సర్ అసలు భాగం నుంచి ఇతర భాగాలకూ వ్యాపించి, చికిత్సకు లొంగకుండా తయారుకావచ్చు కాబట్టి అవగాహనే ఆరోగ్య రక్షగా భావించాలి.

క్యాన్సర్‌కు కారణాలు

ప్రధానమైంది ఆధునిక జీవనశైలి. మద్యం, పొగతాగడం, ఆహారపదార్థాల్లో రంగులు, రసాయనాలు వాడటం, హార్మోన్లు అధికంగా వాడటం, అధిక బరువు, నీటి, వాతావరణ కాలుష్యాలు, క్రిమిసంహారకాలు, చికిత్సలో భాగంగా లేదా ప్రమాదవశాత్తు రేడియేషన్‌కు గురికావడం, తరచూ వేధించే ఇన్ఫెక్షన్లు.. ఇవన్నీ క్యాన్సర్‌కు కారకాలు. ఉదాహరణకు జర్మనీలో వెవెల్స్‌ఫ్లెతే అనే పల్లె ఉంది. అక్కడ మూడు న్యూక్లియర్ పవర్ ప్లాంట్లు, ఒక నౌకాశ్రయం ఉన్నాయి. అక్కడి నుంచి వెలువడే రేడియోధార్మికతతోనూ, నౌకాశ్రయంలో కంటెయినర్లకు వేసే రంగులలోని గాఢమైన రసాయనాలతో ఆ గ్రామంలోని ప్రతి ఇద్దరిలో ఒకరు క్యాన్సర్‌కు గురవుతున్నారు.

రాకుండా వ్యాక్సిన్ లేదా?

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు కారణం ఖచ్చితంగా హెచ్‌పీవీ వైరస్ అని తెలుసుకాబట్టి ఇవి రాకుండా వ్యాక్సిన్ ఉంది. 9 ఏళ్ళ నుంచి పెండ్లికాని అమ్మాయిలందరూ ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలి. అండాశయం, గొంతు క్యాన్సర్ రాకుండా కూడా ఈ వ్యాక్సిన్ పనిచేయవచ్చు. 40 ఏండ్ల వరకు స్త్రీలు ఈ వ్యాక్సిన్ వేయించుకోవచ్చు. హెపటైటిస్ సి వైరస్ తరుచూ రూపాంతరం చెందుతూ ఉండటం వల్ల ఆ వైరస్‌తో వచ్చే లివర్ క్యాన్సర్‌కు ఇంకా టీకాను కనుక్కోలేకపోయారు.

క్యాన్సర్ సోకితే మరణమేనా?

మనిషి ప్రవర్తనలో తేడా ఉన్నట్లే క్యాన్సర్ కణం ఒక్కొక్కరిలో ఒక్కోలా ప్రవర్తిస్తూ ఉంటుంది. క్యాన్సర్‌ను జయించటం అనే విషయం దానిని కనుగొన్న దశ.. దానికి పాకే గుణం ఉందా లేదా ఒక్క ప్రాంతానికే పరిమితం అయిందా అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. సర్జరీ, మందులు, థెరపీలు కూడా ఆ విషయాల మీదే ఆధారపడి ఉంటాయి. క్యాన్సర్‌ను జయించటంలో, త్వరగా గుర్తించడంతో పాటు ఆ గడ్డ స్టేజ్, గ్రేడింగ్ కూడా చాలా ముఖ్యం.

ఏ వయసులో వస్తుంది?

కాన్సర్‌కు వయోభేదం లేదు. అయితే చిన్నపిల్లల్లో వచ్చే క్యాన్సర్స్ చాలా వరకు పూర్తిగా నయం చేయగలిగినవే. వయస్సు పెరిగేకొద్ది క్యాన్సర్స్ వచ్చే అవకాశం చాలా ఎక్కువ. వయస్సులో ఉన్నప్పుడు వచ్చే క్యాన్సర్స్ తీవ్రత చాలా ఎక్కువ. అందుకే క్యాన్సర్ ట్రీట్‌మెంట్ కూడా వయస్సును బట్టి నిర్ధారిస్తారు. క్యాన్సర్ కణాలమీదే పని చేసే కీమోథెరపీ, రేడియోథెరపీలతో పాటు ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో చేసే కీహోల్ సర్జరీలు కూడా నేడు క్యాన్సర్ చికిత్సకు చేయగలుగుతున్నారు. సర్జరీ చేసి రేడియో, కీమో, హార్మోన్ థెరపీ వంటివి ఇచ్చినా లేక థెరపీల తర్వాత సర్జరీ చేసినా ట్రీట్‌మెంట్ అంతటితో అయిపోయింది అనుకోవడానికి లేదు. క్రమం తప్పకుండా చెకప్‌లు చేసుకోవాలి.

పరీక్షలు ఏంటి?

క్యాన్సర్ కణం శరీరంలో ఎక్కడుందో ముందుగానే తెలుసుకోవడం కష్టం. ఏ అవయవానికి వచ్చిందని అనుమానం ఉంటే ఆ అవయవానికి సంబంధించిన పరీక్షలు వేర్వేరుగా ఉంటాయి. వీటిలో బయాప్సీ, యఫ్‌యన్‌ఏ టెస్ట్, బ్లడ్ మార్కర్స్, ఎక్స్-రే, సీటీ స్కాన్, యంఆర్ఐ, పీఈటీ స్కాన్ వంటివి అవసరాన్ని బట్టి చేస్తారు. అయితే సర్వైకల్ క్యాన్సర్‌ను పాప్‌స్మియర్ ద్వారా ముందుగా గుర్తించవచ్చు.



లక్షణాలు


రొమ్ములో గడ్డలు, విడవకుండా దగ్గు, గొంతు బొంగురు పోవడం, ఆకలి, బరువు తగ్గడం, మానని పుండు, కొత్తగా మచ్చ, అంతకు మునుపే ఉన్న మచ్చ/పులిపిరి కాయలో మార్పులు, వాంతులు, అజీర్ణం, కడుపు ఉబ్బరం, తగ్గని జ్వరం వంటి సాధారణ లక్షణాలు ఉంటే డాక్టర్‌ను సంప్రదించాలి. ఇవి కాకుండా ఇంకా కొన్ని కచ్చితమైన లక్షణాలు ఉన్నాయి. అవేంటో తెలుసుకుందాం.

తలనొప్పి : ఉదయం లేవగానే తలభారం, తీవ్రమైన నొప్పి, వాంతులు కావడం, వికారం లాంటి లక్షణాలు బ్రెయిన్ ట్యూమర్‌కు సంకేతం కావచ్చు.

దగ్గు, ఆయాసం : గొంతులో నస, ఆగని దగ్గు, కళ్లె/తెమడలో రక్తం, ఆయాసం వంటివి లంగ్ క్యాన్సర్ లక్షణాలు కావచ్చు.

మచ్చలు : చర్మం మీద ఊదారంగు మచ్చలు, తేలికగా కమిలిపోవడం వంటివి బ్లడ్‌క్యాన్సర్‌ను హెచ్చరించేవి. గోళ్లలో మార్పులు, ముందుకు వంగి ఉండటం లివర్ / లంగ్ క్యాన్సర్లకు సూచన కావచ్చు.

డాక్టర్ చిగురుపాటి మోహనవంశీ
సర్జికల్ ఆంకాలజిస్ట్
ఒమెగా హాస్పిటల్స్




నలుగురిలో ఒకరికి పీసీఓఎస్ సమస్య

పాలిసిస్టిక్ ఓవేరియన్ సిండ్రోమ్ (పీసీఓఎస్) నిశ్శబ్ద ప్రమాదం కలిగిస్తున్నది. ప్రపంచ వ్యాప్తంగా కోటి మంది మహిళలు ఈ సమస్యతో బాధపడుతున్నారని చెప్తున్నారు నిపుణులు.



మహిళల్లో రుతుచక్రాన్ని, సంతానోత్పత్తిని, హార్మోన్లను ప్రభావితం చేసే పీసీఓఎస్ రోజు రోజుకూ పెరిగిపోతున్నదని అమెరికన్ పరిశోధకులు చెబుతున్నారు. ప్రతి నలుగురిలో ఒక్కరికి ఈ సమస్య ఉంటున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సమస్య వల్ల మేల్ హార్మోన్స్ స్థాయిలు అధికంగా ఉండి ఆండ్రోజన్ అండాల అభివృద్ధిని దెబ్బతీస్తాయట. కొంతమందిలో సర్వైకల్ స్రావాలు చిక్కగా మారి వీర్యకణాలు ఈదుతూ బీజవాహికల్లోకి ప్రవేశించడాన్ని అడ్డుకుంటాయట. కాబట్టి హార్మోన్ల అసమతుల్యతను నియంత్రణలో పెట్టుకోవాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

వేపుడు చేప తింటే మరణమే!



మీకు మాంసాహారం అంటే ఇష్టమా? వేయించిన చేపలు.. చికెన్‌లను లొట్టలేసుకొని తింటారా? అయితే అప్రమత్తంగా ఉండాల్సిందే.

వేయించిన చేప ముక్కలు.. చికెన్ తినడం వల్ల త్వరగా మరణిస్తారని నిపుణులు చెప్తున్నారు. లోవా యూనివర్సిటీ పరిశోధకులు 50-79 సంవత్సరాల వయసున్న సుమారు 107,000 మంది మహిళలను పరిశీలించారు. వారు తినే ఆహారం.. జీవితకాలం అంశాలను పరిగనలోకి తీసుకున్నారు. వేపుడు మాంసాహారం ప్రాణానికి ముప్పు కలిగిస్తుందని లోవా యూనివర్సిటీ ప్రతినిధులు చెప్పారు. వేయించిన చేప.. చికెన్ రెగ్యులర్‌గా తీసుకునే పోస్ట్ మోనోపాజల్ మహిళల్లో 13% మరణించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు.

అతి వ్యాయామంతో వంధ్యత్వం

**అతి ఏదైనా అనర్థమే.
ప్రతీది ఒక లెక్క ప్రకారం చేస్తే ఏ సమస్యా ఉండదు.
వ్యాయామం కూడా అలాంటిదే.
వ్యాయామం శరీరానికి.. ఆరోగ్యానికి అత్యవసరం.
కానీ.. 'అతి అవసరం' కాదనే విషయం తెలుసుకుంటే సంతానోత్పత్తి సమస్యలు ఏర్పడవు.**

ఎవరైనా వ్యాయామం చేయమంటారు కానీ.. ఆలోచించి చేయండి అని చెప్పడం ఎవరికైనా ఆశ్చర్యం కలిగించే విషయమే. కానీ ఇది వాస్తవం. అతిగా తింటే అజీర్తి అయినట్లు.. అతిగా వ్యాయామం చేస్తే అది శరీరానికి ముప్పే. దీని నుంచి ఎలా బయటపడాలి? ఆరోగ్యవంతమైన జీవితం కోసం.. సంతానం సాఫల్యం కావడం కోసం ఎలా వ్యాయామం చేయాలి అనే విషయాలు తెలుసుకుందాం.

సిఫారసు చేసినంతనే..

శరీరానికి వ్యాయామం అనేది ఒక వరం లాంటిది. దానివల్ల శరీరానికి ఎన్నో లాభాలున్నాయి. కానీ ఆధునిక జీవన విధానంలో రోజూ జిమ్‌కు వెళ్లి వ్యాయామం చేసే సమయం చాలామందికి ఉండడం లేదు. దీనివల్ల శరీరానికి ఇప్పుడు కాకపోయినా భవిష్యత్‌లో చాలా నష్టాలు జరుగుతాయి. ఇది గ్రహించినవాళ్లు ముందు జాగ్రత్తగా విపరీత వ్యాయామం చేస్తున్నారు. కానీ అతి వ్యాయామం మహిళలకు హానికరం అనే విషయం తెలుసుకోవాలి. సిఫార్సు చేసినదానికన్నా ఎక్కువ వ్యాయామం చేస్తే స్త్రీలలోనే కాదు.. పురుషుల్లో కూడా వంధ్యత్వం ఏర్పడుతుంది.

క్రమపద్ధతిలో వ్యాయామం

వ్యాయామం ఆరోగ్యానికి మంచిది. దానిని ఒక లెక్క ప్రకారం చేయాలి. సమయం దొరికింది కదా అని ఎడాపెడా కాకుండా క్రమపద్ధతితో వ్యాయామం చేస్తే శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. అవేంటంటే..

గుండె స్థితి మెరుగు పడుతుంది

మనం చేసే శారీరక శ్రమపైనే గుండె స్థితి ఆధారపడి ఉంటుంది. వ్యాయామం చేసేవారితో పోలిస్తే చెయ్యనివారిలోనే గుండె సమస్యలు ఉన్నట్లు తేలింది.

మంచి నిద్ర పడుతుంది

వ్యాయామం చేస్తే రాత్రిపూట మంచి నిద్ర పడుతుందని అధ్యయనాలలో తేలింది. వ్యాయామం వల్ల పగటిపూట కండరాలు బిగుసుకొని రాత్రిపూట మంచి నిద్ర పట్టేందుకు సహకరిస్తుంది.

శక్తి అధికమవుతుంది

మనందరికీ ఉన్న అపోహ ఏమిటంటే వ్యాయామం చెయ్యడం వల్ల శక్తి నశిస్తుందని. కానీ దానికి పూర్తి వ్యతిరేక క్రియ శరీరంలో జరుగుతుంది. వ్యాయామం చెయ్యడం వల్ల ఒక ప్రత్యేక హార్మోన్ శరీరంలోకి విడుదలవుతుంది.



ఇవీ అనర్థాలు!



రుతుక్రమ లేమి

ఆడవారిలో ఎమినోర్హియా (రుతుక్రమ లేమి) అనేది సహజం. సాధారణ స్త్రీకీ మూడు నెలల కన్నా ఎక్కువ సమయం పాటు రుతుక్రమం రాకపోతే ఈ సమస్య వస్తుంది. ఒక రోజులో 3-4 వ్యాయామ సెషన్లు చేయడం వల్ల శరీరానికి కావలసిన కేలరీలు అందక ఈ స్థితి ఏర్పడుతుంది.



లైంగిక కోరికలు తగ్గిపోవడం

శరీరానికి సరిపడా కేలరీలు అతి వ్యాయామం వల్ల తగ్గిపోతాయి. కానీ ఇవి స్త్రీలలో లేనిపోని సమస్యలను సృష్టిస్తాయి. ముఖ్యంగా లైంగికసమస్యలు ఏర్పడతాయి, కోరికలు తగ్గిపోతాయి. ఫలితంగా వంధ్యత్వం ఏర్పడుతుంది.



ఈస్ట్రోజన్ మార్పులు

వంధ్యత్వం ఏర్పడటంలో ఊబకాయం కూడా ముఖ్య పాత్ర పోషిస్తుంది. చాలామంది ఊబకాయ స్త్రీలు కొంతబరువు తగ్గాలని అతిగా వ్యాయామం చేస్తుంటారు. దీనివల్ల ఈస్ట్రోజన్ స్థాయి పెరిగిపోతుంది. అండం విడుదలవదు. రుతుక్రమ సమస్యలు ఏర్పడతాయి. తద్వారా వంధ్యత్వం ఏర్పడుతుంది. కొంతమంది యుక్తవయసులో ఉన్నవారికి ఈస్ట్రోజన్ స్థాయి తక్కువుంటుంది. దీని వల్ల కూడా గర్భధారణ సమస్యలు తలెత్తుతాయి.



వీర్యకణ కౌంట్ తగ్గిపోవడం

పురుషులు అతిగా వ్యాయామం చేయడం వల్ల వీర్యకణ కౌంట్ తగ్గిపోతుంది. శరీరాన్ని తగిన ఆకృతిలో ఉంచుకోవడానికి పురుషులు అతిగా వ్యాయామం చేస్తుంటారు. కొందరైతే ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటారు. వీటివల్ల వీర్యకణ కౌంట్ తగ్గి వంధ్యత్వం ఏర్పడుతుంది. టెస్టోస్టిరాన్ ఉత్పత్తి ఎక్కువై ఇతర హార్మోన్లపై కూడా చెడు ప్రభావం పడి సంతానోత్పత్తి సమస్యలు వస్తాయి. పొగతాగడం, మద్యపానం వల్ల కూడా సంతానోత్పత్తి మందగిస్తుంది.



డాక్టర్ స్వాతి చౌరాసియ
ఐవీఎఫ్ నిపుణురాలు
ఇందిర ఐవీఎఫ్ హాస్పిటల్, హైదరాబాద్

జింక్ ఎంత అవసరం?



శరీరంలోని లోహ పరిమాణం కూడా ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా జింక్. సరైన మోతాదులో ఇది లేకపోతే ఏమవుతుందో తెలుసా?

శరీరం తనకు తానుగా జింక్‌ను ఉత్పత్తి చేసుకోలేదు. కాబట్టి తగిన మోతాదులో ఆహార పదార్థాల రూపంలో జింక్‌ను తీసుకోవాలి. రోజుకు కనీసం 50 మిల్లీగ్రాముల జింక్ తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చు. మోతాదు ఎక్కువైతే అసలుకే మోసం వస్తుంది. ఈ రోజుల్లో ఎక్కువగా తీసుకుంటున్నవాళ్లు తక్కువ కాబట్టి అది పక్కనపెట్టేద్దాం. తక్కువగా తీసుకునేవారు మాత్రం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. మోతాదుకు మించి తక్కువ జింక్ తీసుకుంటే ప్రొస్టేట్‌వాపు.. క్యాన్సర్ ముప్పు తప్పవు. సాధారణంగా ఎక్కువమందిలో హైపర్‌టెన్షన్ సమస్యలు వస్తున్నాయి. చిక్కుళ్లు.. గింజ ధాన్యాలు.. పీతలు.. పుట్టగొడుగులు.. పెరుగు.. పాలకూర.. నువ్వులు.. గుమ్మడి గింజల్లో పుష్కలమైన జింక్ లభిస్తుంది. కాబట్టి వాటిని తినడం అలవాటు చేసుకోండి.

వంటకు ఏ నూనె వాడుతున్నారు?

నూనె లేకుండా వంటలు చేయలేం. అలా అని ఏ నూనె పడితే అది వాడితే దుష్ప్రభావాలు ఉంటాయి. అయితే మరి ఏ నూనె వాడాలి?



వేరుశనగ నూనెను వంటలకు ప్రిఫర్ చేస్తున్నారు వైద్యులు. దీంట్లో రెస్వెట్రాల్.. పోలీ ఫెనాల్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయట. ఇవి ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా నయం చేస్తాయి. వేరుశనగ నూనెలో ఉన్న శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ కణాలను నశింపజేస్తాయి. 'ఈ' విటమిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది చర్మాన్ని సంరక్షించేందుకు ఉపయోగపడుతుంది. రెస్వెట్రాల్ యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. వైరల్ వ్యాధులు కూడా దరిచేరవు. కాబట్టి వంటనూనెగా వేరుశనగ నూనె వాడటం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

సుడోకు

డైలీ సుడోకు 50 సమాధానం

2	1	3	6	8	4	7	9	5
4	8	9	7	3	5	6	1	2
5	6	7	9	1	2	8	3	4
1	2	8	4	5	6	9	7	3
3	4	6	1	9	7	2	5	8
9	7	5	3	2	8	1	4	6
7	9	2	5	6	3	4	8	1
6	5	1	8	4	9	3	2	7
8	3	4	2	7	1	5	6	9

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -51

1	3		2					9
4		8						
			1		8			
2								3
				7	2			8
		9			4		7	
		7		2		5	9	
9		4						
5		6			7		1	

ట్వీట్

మహ్మద్ కైఫ్
@MohammadKaif





19 యేండ్ల క్రితం.. సరిగ్గా ఇదే రోజు కొలంబోలో ఓ అద్భుతం జరిగింది. ఓ కల నిజం అయింది. అండర్ 19 వరల్డ్‌కప్‌ని మొదటి సారి గెలిచాము. జీవితంలో మరిచిపోలేని గొప్ప జ్ఞాపకమిది.

కైఫ్‌ని ట్విట్టర్‌లో ఫాలో అవుతున్నవారి సంఖ్య
9,44,412

కామన్‌మ్యాన్ వాయిస్

వారసత్వం అంటే.. డబ్బు, హోదా, పలుకుబడి, ఆస్తులు కాదు. వారసత్వం అంటే సుగుణాలు.
-Vanaja Srinivas

ఓడిపోయిన కాంగ్రెస్ ముఖ్యమంత్రులంతా సైలెంట్ అయిపోతే ఎట్ల? ఎంపీ ఎలక్షన్లు వస్తున్నాయి. మళ్లా స్టార్ట్ చేయండి.
-Thirmal Reddy Sunkari

అత్యద్భుతమైన విషయం ఏంటంటే.. ఇండియాలో గవర్నమెంట్ జాబుల్లో లంచాల ద్వారా కోట్లు సంపాదించి, రిటైర్‌మెంట్ తర్వాత అమెరికాలో ఉన్న కొడుకుల దగ్గరికెళ్లి, ఇండియాలో ఉన్న సమస్యల గురించి ఫేస్‌బుక్‌లో విచారం, సంభ్రమాశ్చర్యాలు వ్యక్తం చేయడం.
-Aryan Krishna

వైరల్ వీడియో



పేరు పాతది. కంటెంట్ కొత్తగా ఉన్నది. సూర్యకాంతం.. నిహారిక కొణిదెల నటిస్తున్న చిత్రం పేరు. ఈ చిత్ర టీజర్ యూట్యూబ్‌లో విడుదలై రోజుకు పదిలక్షల వ్యూస్ చొప్పున దూసుకెళ్తున్నది.

Suryakantam Teaser – Niharika, Rahul Vijay | Pranith Bramandapally | Nirvana Cinemas
Total views : 2,279,447+
Published on Jan 25, 2019

నమస్తే తెలంగాణ
శాస్త్ర
[కరీంనగర్]
మంగళవారం 29 జనవరి 2019

సుచరిత



కాగితం, కార్డ్‌బోర్డ్, లోహ రేకు, వస్త్రం, తాడు, వైరు వంటివే కాదు, ఆఖరకు తలవెంట్రుకలను సైతం కత్తిరించడానికి అద్భుతంగా ఉపయోగపడే సాధనం కత్తెర. ఇది వేల సంవత్సరాల చరిత్రను కలిగి వుండడమేకాక అనేక డిజైన్లతో ఇవాళ్టికి వినూత్న రూపురేఖలను సంతరించుకున్నది. వస్తువు మందం, తీరునుబట్టి కత్తెరల పదును ఆధారపడి ఉంటుంది. పశ్చిమాసియాకు చెందిన అతిపురాతన ప్రదేశం మెసపొటోమియాలో సుమారు 3- 4 వేల సంవత్సరాల కిందటే 'స్ప్రింగ్ సిజర్స్'గా పిలిచే ప్రాచీన కత్తెరలను వాడినట్లు తెలుస్తున్నది. టర్కీ దేశానికి చెందిన ట్రాబ్జోన్ నగరంలో నివాసముండే రోమన్లు క్రీ.శ. 2వ శతాబ్దంలో కత్తెరలను వాడారు. అప్పట్లో ఈజిప్టియన్ శైలిలో తయారయ్యే కత్తెరల చివరన కుక్క, పిల్లి బొమ్మలు వుండేవి. 16వ శతాబ్దం వరకూ యూరప్‌లో 'స్ప్రింగ్ సిజర్'లు వాడారు. ఒక దిశగా ఇరుసును తిప్పినట్లుండే కత్తెరల (pivoted) ను అప్పట్లోనే కంచు లేదా ఇనుముతో చేసేవారు. కాలం గడుస్తున్నకొద్దీ అవి వివిధ రూపాలు, నాణ్యతతో ప్రపంచ వ్యాప్తమయ్యాయి.

ఎవరేమన్నారు?



సమాజం అభివృద్ధి చెందకుండా కేవలం సాంకేతిక పరమైన ప్రగతినే సాధిస్తూ పోతే కాలక్రమంలో మానవుల్లో అసంతృప్తి, దారిద్రం వాటంతటవే పెంపొందుతాయి.

- మైఖేల్ హారింగ్టన్

ఎలాగంటే?



ఆకాశంలోని మేఘాలు కొన్ని తెల్లగా, మరికొన్ని నల్లగా లేదా ఎర్రగానూ కనిపిస్తుంటాయి. మబ్బులకు ఈ రంగులు ఎలా కలుగుతాయన్నది సామాన్యులకు ఒకింత అర్థం కాదు. సూర్యరశ్మి కారణంగానే వాతావరణంలో ఏ రంగులైనా ఉద్భవించేది. సూర్య కిరణాలు మేఘాలు వంటి వస్తువుపై ప్రసరించినప్పుడు కొన్ని పరావర్తనం చెందితే, మరికొన్ని చెందవు. సూర్యరశ్మిని పూర్తిగా పరావర్తనం చెందించిన వస్తువులు తెల్లగా కనిపిస్తే, ఏ రంగు కిరణాలనూ పరావర్తనం చెందించనివి నల్లగా కనిపిస్తాయి. ఇలా మేఘాలు సూర్యరశ్మిలోని ఏ రంగు కిరణాలను వెదజల్లితే అవి ఆ రంగులో కనిపిస్తాయన్నమాట.

ఆధునిక పోకడ

తెలివైన బంతి



మన చేతి పిడికిలి పట్టు సామర్థ్యాన్ని కొలిచే 'తెలివైన బంతి'ని నిపుణులు అభివృద్ధి పరిచారు. కండర శక్తిని పెంచుకోవడానికి ఇదెంతో ఉపయోగపడుతుందని వారు అంటున్నారు.

చిన్న పిడికిలే కదాని నిర్లక్ష్యం చేయడానికి వీల్లేదు. ఎందుకంటే, అది ఒంట్లోని శక్తిని సూచిస్తుంది. రోజు వారీగా అనేక బరువులను మోయడానికి మన చేతి పిడికిళ్లే ఆధారం. ఈ క్రమంలో దాని సామర్థ్యాన్ని గుర్తెరిగి మెదలడం వల్ల మేలు జరుగుతుందని పరిశోధకులు అంటున్నారు. 'స్క్వెగ్' (Squegg) పేరుతో అమెరికాలో వెలుగులోకి వచ్చిన స్మార్ట్ 'స్క్వీజ్ బాల్' (squeeze ball) పనితనానికి, తెలివితేటలకు తక్కువేమీ లేదు. దీనిలోని 'ప్రెషర్ సెన్సర్లు' పిడికిలి పట్టులోని బిగువును, అదీ ఎన్నిసార్లు బిగించిందీ కొలుస్తుంది. 'బ్లూ టూత్ మాడ్యూల్'తో ఆ సమాచారాన్ని చక్కగా మన స్మార్ట్‌ఫోన్‌కు చేరవేస్తుంది. అది పౌండ్లలో లేదా కేజీలలో ప్రదర్శితమవుతుంది. దీని తాలూకు ప్రత్యేక యాప్ ద్వారా 'బిగింపు సామర్థ్యపు నిర్మాణ విధానాన్ని' కూడా సమయానుకూలంగా తెలుసుకోవచ్చునని, తద్వారా వర్కవుట్స్‌ను రూపొందించుకోవచ్చునని నిపుణులు అంటున్నారు.



చూడడానికి అందమైన సబ్బు బిల్లలా కనిపించే ఈ సొగసైన పరికరం 66 గ్రాముల బరువుతో జల నిరోధక (వాటర్ రెసిస్టెంట్) గుణాన్ని కలిగి ఉంటుంది. దీని లిథియమ్ బ్యాటరీని 2 గంటలపాటు చార్జింగ్ చేసుకొని వాడుకొంటే సుమారు 80 గంటల పాటు 'స్క్వెగ్' పనిచేస్తుంది. ప్రస్తుతానికి రెండు రంగుల్లో లభ్యమవుతున్న ఈ ఎలక్ట్రానిక్ పరికరం వెల రిటైల్ మార్కెట్లో సుమారు 39 అమెరికన్ డాలర్లుగా నిర్ణయించారు.

పనితనం




'జిపిఎస్' (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) ఆధునిక వైజ్ఞానిక అద్భుతాలలో ఒకటి. దీని పనితనం సామాన్యులకు అంతుబట్టదు. ఈ వ్యవస్థ పూర్తిగా కృత్రిమ ఉపగ్రహాల (సాటిలైట్స్)తోనే పనిచేస్తుంది. నిజానికి దీనికి ఇంటర్నెట్‌తో కానీ, సెల్ టవర్లతోకానీ సంబంధం లేదు. 'జిపిఎస్' పరికరాన్ని ఆన్ చేయగానే నేరుగా సాటిలైట్స్ నుంచి అప్పటి సమయం, స్థితి సంకేతాలు అందుతై. వెళ్లాల్సిన దూరాన్ని చేరుకోవడానికి పట్టే సమయాన్ని కూడా రిసీవర్‌కు లెక్కించి చెబుతుంది. మొత్తం 24 సాటిలైట్స్, భూమి మీది కేంద్రాల సమ్మేళనంతో ప్రపంచ వ్యాప్తంగా 'రేడియో నేవిగేషన్ సిస్టమ్' ఏర్పడింది. అమెరికా రక్షణ విభాగం (డిఓడి : డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్) నిధులతో రూపొందిన ఈ జిపిఎస్ తొలుత ఆ సంస్థ నియంత్రణల కోసమే ఉద్దేశించినా, ఇవాళ్టికి ప్రపంచవ్యాప్తంగా అనేక పౌరసేవలకు వినియోగిస్తున్నారు. వాహనం (వ్యక్తి) ఎక్కడున్నదీ కచ్చితంగా తెలియజేస్తుంది. సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్‌తోకానీ, ప్రత్యేక పరికరాలతోకానీ, స్థిరంగా కానీ, సులభంగా తీసుకుపోదగ్గ విధంగా (పోర్టెబుల్)గానీ జిపిఎస్ ట్రాకింగ్ సిస్టమ్‌ను అమర్చుకోవచ్చు.

విశ్వదర్శనం

నక్షత్రాంతర సీమలోకి అడుగిడిన వోయేజర్-2

మహాయానం

ఇన్నాళ్లూ గ్రహాంతర యానాలకే పరిమితమైన మనిషి మేధోసాంకేతికత ఇప్పుడు మరో కీలక ముందడుగు వేసింది. ఇటీవలే సూర్యమండల ఆవరణ (హేలియోస్ఫియర్)ను దాటేసిన 'వోయేజర్-2' నక్షత్రాంతర సీమలోకి అడుగిడిన 'రెండో మానవనిర్మిత వ్యోమనౌక'గా చరిత్ర సృష్టించింది. ఈ రికార్డును 'వోయేజర్-1' (తొలి వ్యోమనౌక) ఆరేళ్ల కిందటే (2012లోనే) అధిగమించినా అందులో అతిముఖ్యమైన 'పిఎల్ఎస్' (PLS: Plasma Science Experiment) పరికరం పాడైపోయింది. కానీ, 'వోయేజర్-2'లో ఇది విజయవంతంగా పనిచేస్తుండడంతో అంతటి సుదూర ప్రదేశంలో సౌరపవన ప్రభావ తీరుతెన్నులను తెలుసుకొనే అవకాశం శాస్త్రవేత్తలకు లభించనుంది.



ఇప్పుడు శాస్త్రవేత్తల ఆశలన్నీ 'వోయేజర్-2'పైనే ఉన్నాయి. కారణం, 2012లో 'వోయేజర్-1' హేలియోస్ఫియర్‌ను దాటేసినా అది ఆ ప్రాంతంలోకి ప్రవేశించిన సమయం, ప్రదేశం ఇప్పటి 'వోయేజర్-2'కి భిన్నమైనవి. 'పిఎల్ఎస్' పరికరం పనిచేయని కారణంగా 'వోయేజర్-1' నుంచి ఏ సమాచారమూ భూమికి చేరలేదు. మరోవైపు మరో డీప్ స్పేస్‌ప్రోబ్ 'పయొనీర్-10'కూడా హేలియోస్ఫియర్‌ను చేరినా విద్యుత్ పరికరాల లోపాలవల్ల దాని నుంచీ సమాచార సంకేతాలు 2003కల్లా నిలిచిపోయాయి. 'వోయేజర్-2' విషయంలో అలా కాకుండా 'పిఎల్ఎస్' చక్కగా పనిచేస్తున్నది. దీనితోపాటు ఈ వ్యోమనౌక తన ప్రయాణమార్గంలో యురేనస్, నెప్ట్యూన్‌లను సైతం చేరుకొని, వాటికి చెందిన కీలక సమాచారాన్ని శాస్త్రవేత్తలకు ఇదివరకే చేరవేసింది కూడా. యురేనస్, నెప్ట్యూన్ సుదూర హిమ భారీగ్రహాలను సందర్శించిన వ్యోమనౌకగా కూడా 'వోయేజర్-2' రికార్డు సృష్టించింది.

'హేలియోస్ఫియర్' (heliosphere) సూర్య వ్యవస్థ చుట్టూ ఏర్పడిన ఒక మహాబుడగ వంటి ప్రదేశం. ఇక్కడి దాకా ఒక మానవనిర్మిత వ్యోమనౌక చేరుకోవడమంటేనే మనిషి సాధించిన మహాద్భుతాలలో ఒకటి. అది మన అంచనాకు అందనంత దూరం. 'వోయేజర్-2' స్పేస్‌ప్రోబ్ భూమినుంచి ఇప్పటికి ప్రయాణించిన దూరం సుమారు 1100 కోట్ల మైళ్లకు పైనే. ఇప్పటికి మానవాళికి ఈ వ్యోమనౌకదే విజయవంతమైన మహాయానం. నేటికి ఇందుకు పట్టిన కాలం 41 సంవత్సరాల 5 నెలల 8 రోజులు. సూర్యకుటుంబంలోని అన్ని గ్రహాలనూ దాటేసిన తర్వాత కూడా సూర్యుని పవనాల ప్రభావం హేలియోస్ఫియర్ పొడుగునా వలయం వలె ఆవరించి ఉంది. 'వోయేజర్-2' 2018 నవంబర్ 5న ఈ సరిహద్దును దాటేసి, నక్షత్రాంతర సీమలోకి అడుగుపెట్టినట్టు 'నాసా' అధికారికంగా ప్రకటించింది. ఇవాళ్టికి విజయవంతంగా తన సమాచార ప్రవంతిని 'వోయేజర్-2' భూమికి చేరవేస్తూనే ఉన్నది.

మన సౌరకుటుంబం పరిధి సుమారు 100 ఎయు (అస్ట్రానమికల్ యూనిట్)లుగా చెప్తారు. (సూర్యునికి-భూమికి మధ్య ఉన్న దూరం 1 ఎయుకు సమానం. ఈ లెక్కన శని గ్రహం 9 ఎయు, హేలియోస్ఫియర్ 100 ఎయుల దూరంలో ఉన్నాయి). ప్లూటో గ్రహహోదాలో లేదు కనుక నెప్ట్యూన్ తర్వాతి క్యూపర్ బెల్ట్ 30-50 ఎయులు, హేలియోస్ఫియర్ 80-100 ఎయులుగా ఉన్నట్టు అంచనా. ఆఖరి భారీ హిమగ్రహమైన నెప్ట్యూన్ వరకున్న పరిధిలోని సూర్యుని గురుత్వపవన శక్తిని అధిగమించడమే ఒక గొప్ప. అయితే, ఈ ఘనతను ఇప్పటికి 5 వ్యోమనౌకలు (వోయేజర్ 1, (ప్రయోగం: 1977), పయొనీర్- 10 (ప్రయోగం: 1972), వోయేజర్-2 (ప్రయోగం: 1977) , పయొనీర్-11 (ప్రయోగం: 1973), న్యూ హారిజన్స్ (ప్రయోగం: 2006) సాధించగా, వీటిలో ఇప్పటికి 'వోయేజర్-1' అత్యధిక దూరాన్ని (144 ఎయు) చేరింది. 'పయొనీర్ 10'- 123 ఎయు, 'వోయేజర్ 2'- 119 ఎయు, 'పయొనీర్ 11'- 101 ఎయు, 'న్యూ హారిజన్స్'- 43 ఎయు దూరాలలో ఉన్నాయి. అన్నింటికంటే, 'వోయేజర్-2'నే ఇప్పటికీ విజయవంతంగా పనిచేస్తున్నది.

భూమినుండి ఎంతో సుదూరంలో ఉన్న మన సౌరకుటుంబంలోని గ్రహాల అధ్యయనమే ప్రధాన లక్ష్యంగా 1977 ఆగస్టు 20న అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' (నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్) 'వోయేజర్- 2'ను ప్రయోగించింది. 'వోయేజర్ ప్రోగ్రామ్'లో భాగమైన ఈ రెండో వ్యోమనౌక ప్రయోగించిన 2 వారాల తర్వాత (1977 సెప్టెంబర్ 5న) మొదటి వోయేజర్‌ను అంతరిక్షంలోకి పంపారు. ఐతే, వోయేజర్-1, వోయేజర్-2ల ప్రయాణ మార్గాలను శాస్త్రవేత్తలు వేర్వేరుగా నిర్దేశించారు. సౌరకుటుంబానికి చెందిన ఆఖరి గ్రహాలైన యురెనస్, నెప్ట్యూన్‌ల సందర్శనను 'వోయేజర్-2'కే కేటాయించారు. రెండో దానికంటే ఒకటోదాని వేగం ఎక్కువేకాక మార్గం కూడా వేరు. కాబట్టే, అది దానికన్నా ఎక్కువ దూరంలోనే ఉన్నది. అయినప్పటికీ, దాని ప్రధాన లక్ష్యాన్ని అది చేరుకోనట్టే లెక్క. ఎందుకంటే, అందులోని పిఎల్ఎస్ పరికరం పనిచేయడం లేదు కాబట్టి. ఈ దృష్ట్యా, శాస్త్రవేత్తల ఆశలన్నీ ఇప్పుడు 'వోయేజర్-2'పైనే ఉన్నాయి. ఐతే, వోయేజర్ ప్రాజెక్ట్‌కన్నా ముందే 1972లోనే నాసా ప్రయోగించిన 'పయొనీర్-10' సౌరకుటుంబ పరిధిని దాటేసినా, 2003లోనే దాని నుంచి రావాల్సిన రేడియో ట్రాన్స్‌మిటర్‌కు విద్యుచ్ఛక్తి సరఫరా నిలిచిపోవడంతో ప్రయోగ ఫలితాలు అనుకున్న స్థాయిలో అందడం లేదు.

అయిదేళ్ల కాలపరిమితితో కూడిన కార్యక్రమంగా ప్రారంభమైన వోయేజర్ మిషన్ ఇప్పటికి నలభై ఒక్క ఏండ్లు దాటి తన మహా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నది. 'నాసా'కు చెందిన 'డీప్ స్పేస్ నెట్‌వర్క్'తో ఇది సంబంధాన్ని కొనసాగిస్తున్నట్టు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నక్షత్రాంతర రోదసిలో జీవద్రవ్య (ప్లాస్మా) ఉష్ణోగ్రత, సాంద్రతల కొలతలను తొలిసారిగా వారు 'వోయేజర్-2' ద్వారా అందుకోబోతున్నారు. జెపిఎల్ (జెట్ ప్రొపల్షన్ లాబొరేటరీ) ద్వారా నిర్మితమైన 'వోయేజర్-2' తన కార్యకలాపాలను కనీసం 2020 వరకూ కొనసాగించే శక్తి, సామర్థ్యాలను కలిగి ఉన్నట్టు వారు చెబుతున్నారు. 2034 వరకు ప్రయాణించగల ఇంధనం కూడా అందులో ఉన్నదని వారు తెలిపారు.

'స్వర్ణ కవచ' సందేశం చేరేనా?

వోయేజర్ వ్యోమనౌకలు రెండింట్లోనూ బంగారు కవచంతో చేసిన సందేశ ఆడియో-వీడియో డిస్కులను ఉంచారు. వీటితోపాటు నక్షత్రాంతర సీమల్లోకి వెళ్లిన పయొనీర్ ప్రోబ్స్, మరి కొన్నేళ్లలో వెళ్లనున్న న్యూ హారిజన్స్‌ల నుంచి భూమికి సమాచార ప్రవంతి వస్తున్నా లేదా రాకపోయినా వాటి ప్రయాణాలు మాత్రం ఇంధనం ఉన్నంత కాలం అలా నిరంతరం కొనసాగుతూనే ఉంటాయి. విశ్వంలోని ఇతర గ్రహవ్యవస్థలకు చెందిన మేధోజీవుల దృష్టికి కానీ ఒకవేళ ఇవి వస్తే వాటిలోని డిస్కులలో పొందుపరిచిన సమాచారాన్ని వారు అందుకోగలుగుతారు. భూమ్మీది జీవరూపాలు, శబ్దాలు (చంటిబిడ్డ ఏడుపు, తిమింగలం అరుపులు), సంగీత ధ్వనులు వంటివి వాటిలోని స్వర్ణ కవచ డిస్కులలో పొందుపరిచారు. ఇవి ఎప్పటికైనా మనవంటి మేధోజీవులకు చేరకపోతాయా అన్నదే శాస్త్రవేత్తల ఆశ.



'వోయేజర్-2' 1979లో గురుగ్రహాన్ని, 1981లో శనిని, 1986లో యురెనస్‌ను, 1989లో నెప్ట్యూన్‌ను చేరుకున్నది. గురుగ్రహమ్మీది 'గ్రేట్ రెడ్‌స్పాట్' (మహా ఎరుపు మచ్చ) ప్రదేశంలోని సంక్లిష్ట తుపాను అపసవ్య దిశలో తిరుగుతున్నదని, శని ఉష్ణోగ్రత మైనస్ 203 డిగ్రీల సెల్సియస్‌గా ఉందని 'వోయేజర్-2' ద్వారానే తేటతెల్లమైంది. ఇక, యురెనస్‌కు చెందిన అంతదాక తెలియని 11 చందమామల్ని (సహజ ఉపగ్రహాలు) ఈ వ్యోమనౌక ద్వారానే తెలుసుకోగలిగాం. ఈ గ్రహంపై ఒక రోజు కాలం 17 గంటల 14 నిమిషాలుగా ఉన్నట్టూ తెలిసింది. అప్పటికి తెలియని రెండు యురెనస్ వలయాలనూ, నెప్ట్యూన్ వలయాలు, 6 చందమామలు, గ్రేట్ డార్క్ స్పాట్ (పెద్ద నల్ల మచ్చ) సమాచారాన్నీ ఇదే అందించింది.

దోర్బల బాలశేఖరశర్మ

పృథ్వీశాస్త్రం

నీలి అగ్నిపర్వతం!



ఇండోనేషియాలోని 'కవాహ్ ఐజెన్'ను 'నీలి అగ్నిపర్వతం'గా పిలుస్తారు. దీని నుండి వచ్చే లావా ప్రవాహాలు నీలాల రంగులో మెరుస్తుంటాయి. దీనికిగల కారణాన్ని శాస్త్రవేత్తలు వెల్లడించారు.

ప్రపంచంలోనే అతి అరుదైన, అత్యంత ఎత్తులోని, అత్యధిక రసాయనతుల్య అగ్నిపర్వత బిలపు మడుగును కలిగి వున్న 'కవాహ్ ఐజెన్' (Kawah Ijen) అగ్నిపర్వతపు లావా ప్రవాహాలు నీలం రంగులో వుండడానికి అక్కడి భూగర్భంలో జరుగుతున్న అనూహ్య మార్పులే కారణమని శాస్త్రవేత్తలు అంటున్నారు. నీలాల జ్వాలలు గాలిలోకి ఎగుస్తుండడం వల్ల అగ్నిపర్వతం నుంచి మంచులావా విడుదలవుతున్న దృగ్విషయం ఆవిష్కృతమవుతున్నదని వారు తెలిపారు. ఈ అగ్నిపర్వత పగుళ్ల నుంచి వస్తున్న వాయువులు అత్యధిక పీడనం, ఉష్ణోగ్రతలతో గాలితో కలుస్తుండడంతో మంటలు చెలరేగుతున్నాయని, ఈ జ్వాలలు సుమారు 16 అడుగుల ఎత్తుకు ఎగుస్తున్నాయని వారు వివరించారు. 'వీటిలోని కొన్ని వాయువులు ద్రవ గంధకం (liquid sulpher) గా మారుతున్నది. ఇది లోతట్టు ప్రాంతానికి ప్రవహిస్తుండడంతో దానిని నీలి లావాలా భ్రమపడుతున్నారని' పారిస్‌కు చెందిన ఛాయాచిత్రకారుడు ఆలివియర్ గ్రూనెవాల్డ్ అన్నారు. ఆయన ఇక్కడ కొన్నేళ్లపాటు గడిపి ఈ అగ్నిపర్వతం తీరుతెన్నులపై వార్తాచిత్రాన్ని రూపొందించారు. ఐతే, ఒక అగ్నిపర్వతం వద్ద ఇంత పెద్ద మొత్తంలో ద్రవగంధకం విడుదలవడమే అరుదైన విషయమని భూగర్భశాస్త్రవేత్త సింథియా వెర్నర్ అన్నారు. ఆమెరికా, జియోలజికల్ సర్వేలోని అలాస్కా వాల్కెనో అబ్జర్వేటరీలో ఆమె పరిశోధకురాలుగా ఉన్నారు.

పురాజంతు శాస్త్రం

ఆదిమ జంతువు ఆనవాళ్లు

సుమారు 600 మిలియన్ ఏండ్ల కిందటి శిలల్లో అతిప్రాచీన జంతువు శిలాజాలను శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. ఇది 'కాంబ్ జెల్లీ ఫిష్' లక్షణాలను పోలి ఉన్నట్టు వారంటున్నారు.



పురాతన అవశేషాలకు పేరెన్నికగన్న చైనాలోని డోషంట్యో ఫార్మేషన్ (Doushantuo Formation) నుండి సేకరించిన ఒక బరమా (డ్రిల్)కు చెందిన ఓ ప్రధాన పరికరంపై కనుగొన్న శిలాజం అతిప్రాచీన కాలానికి చెందిన గుండ్రటి చుక్క వంటి (blob-like) ముంజచేప (జెల్లీ ఫిష్)కు చెందినదై ఉందని శాస్త్రవేత్తలు తాజాగా ప్రకటించారు. భూమి మీది అతిప్రాచీన (541 మిలియన్ ఏండ్ల కిందటి) జంతువు శిలాజంగా ఇప్పటికి భావిస్తున్న 'డికిన్‌సోనియా' (Dickinsonia) కంటే కూడా ఇది 40 మిలియన్ సంవత్సరాలు పాతదని వారన్నారు. ఇంకా పేరు పెట్టని ఈ కొత్త ఆదిమ జంతువు 0.7 మి.మీ. చుట్టుకొలతను కలిగి ఉందని, దీని ఆకారం ముంజచేపను పోలి ఉందని వుహాన్ నగరంలోని చైనా యూనివర్సిటీ ఆఫ్ జియోసైన్స్ పరిశోధకురాలు డా|| ఝొంబింగ్ షీ తెలిపారు. దీనికి స్పర్శకాలు, కణజాలం, నాడీకణాలు, బీజగ్రంథులు, శ్లేష్మపొరలు, వెంట్రుకల నిర్మాణాల వంటి గుంపులు ఉన్నట్టుగా తేలిందని ఆమె చెప్పారు. ఐతే, ఈ శిలాజ లక్షణాలన్నీ కాంబ్ జెల్లీని పోలి ఉన్నాయని, ఇది జెల్లీ ఫిష్‌కన్నా కూడా పురాతనమైందని షీ పేర్కొన్నారు.

నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం —

ఇండియన్ ఆర్మీలో ఎస్ఎస్‌సీ ఆఫీసర్లు



ఇండియన్ ఆర్మీ (ఐఏ) షార్ట్ సర్వీస్ కమిషన్ ద్వారా టెక్నికల్ విభాగంలో ఖాళీగా ఉన్న ఆఫీసర్ పోస్టుల భర్తీకి అవివాహిత పురుష, మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.


- షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్ (టెక్నికల్)
- **మొత్తం ఖాళీలు:** 191 (పురుషులు-175, మహిళలు-24)
- **బ్రాంచీల వారీగా ఖాళీలు:** సివిల్-50, మెకానికల్-17, ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్-24, ఏరోనాటికల్/బాలిస్టిక్స్/ఏవియానిక్స్-12, కంప్యూటర్ సైన్స్ & ఇంజినీరింగ్/కంప్యూటర్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్-47, ఎలక్ట్రానిక్స్ & టెలి కమ్యూనికేషన్/టెలికమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్, శాటిలైట్ కమ్యూనికేషన్-25, ఎలక్ట్రానిక్స్/ఆప్టో ఎలక్ట్రానిక్స్/ఫైబర్ ఆప్టిక్స్/మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ మైక్రోవేవ్-8, ప్రొడక్షన్ ఇంజినీరింగ్-3, ఆర్కిటెక్చర్/బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ-3 ఖాళీలు ఉన్నాయి.
- **అర్హత:** సంబంధిత విభాగాల్లో బీఈ/బీటెక్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలు రాస్తున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు అక్టోబర్ 1 లోపు ఉత్తీర్ణులు కావాలి.
- **వయస్సు:** 2019 అక్టోబర్ 7 నాటికి 20 నుంచి 27 ఏండ్ల మధ్య ఉండాలి (1992 అక్టోబర్ 2 నుంచి 1999 అక్టోబర్ 1 మధ్య జన్మించి ఉండాలి)
- నిర్దేశిత శారీరక ప్రమాణాలను నిబంధనలకు అనుగుణంగా ఉండాలి. అభ్యర్థులు కనీసం 157.5 సెం,మీ ఉండాలి. ఎత్తుకు తగ్గ బరువు ఉండాలి.

విడోస్ ఆఫ్ డిఫెన్స్ అభ్యర్థులకు మాత్రమే

- ఎస్ఎస్‌సీ (ఉమెన్) -2 ఖాళీలు (నాన్ టెక్నికల్-1, టెక్నికల్-1)
- **అర్హత:** నాన్ టెక్నికల్‌కు ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, టెక్నికల్‌కు ఏదైనా బ్రాంచీలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2019 అక్టోబర్ 7 నాటికి 35 ఏండ్లకు మించరాదు.
- **పే & అలవెన్సులు:** ట్రెయినింగ్‌లో నెలకు రూ.56,100/- జీతం ఉంటుంది. శిక్షణ పూర్తయ్యాక లెఫ్టినెంట్ హోదాలో పే బ్యాండ్ రూ.56,100-1,77,500/- జీతం చెల్లిస్తారు. వీటికి అదనంగా గ్రూప్ ఇన్సూరెన్స్, ఇతర సౌకర్యాలు ఉంటాయి.
- **శిక్షణ:** ఆఫీసర్ ట్రెయినింగ్ అకాడమీ చెన్నైలో 2019 అక్టోబర్ నుంచి 49 వారాల శిక్షణ ఉంటుంది. కోర్సును విజయవంతంగా పూర్తి చేసినవారికి ఆర్మీలో ఉద్యోగం కల్పిస్తారు.
- **ఎంపిక:** సర్వీస్ సెలక్షన్ బోర్డ్ (ఎస్ఎస్‌బీ), ఇంటర్వ్యూ/టెస్ట్ ద్వారా
- ఎస్ఎస్‌బీ అర్హత కలిగిన అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి, రెండు దశల్లో ఇంటర్వ్యూ /టెస్ట్‌లను నిర్వహిస్తుంది.
- **ఇంటర్వ్యూ నిర్వహించే ప్రదేశం:** ఎస్ఎస్‌బీ సైకలాజికల్ టెస్ట్, గ్రూప్ టెస్ట్, ఇంటర్వ్యూ/ టెస్ట్‌లను వరుసగా ఐదురోజులపాటు అలహాబాద్, భోపాల్, బెంగళూరు, కపుర్తలా (పంజాబ్)లో నిర్వహిస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **రిజిస్ట్రేషన్ చివరితేదీ:** ఫిబ్రవరి 21
- **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

ఎయిమ్స్‌లో సీనియర్ రెసిడెంట్లు

రాయ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఖాళీగా ఉన్న సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



- **మొత్తం ఖాళీలు:** 141
- **విభాగాలు:** అనాటమీ, బయోకెమిస్ట్రీ, కార్డియాలజీ, డెంటిస్ట్రీ, డెర్మటాలజీ, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, మైక్రోబయాలజీ, నెఫ్రాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, పీడియాట్రిక్స్, ఫిజియాలజీ, పల్మనరీ మెడిసిన్, రేడియోడయాగ్నసిస్, యూరాలజీ తదితర విభాగాలు
- **పోస్టు పేరు:** సీనియర్ రెసిడెంట్
- **అర్హతలు:** గుర్తింపు పొందిన యునివర్సిటీ నుంచి సంబంధిత విభాగంలో పీజీ మెడికల్ డిగ్రీ/ డిప్లొమా, ఎండీఎస్ ఉత్తీర్ణతతోపాటు అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 37 ఏండ్లకు మించరాదు.
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఇంటర్వ్యూ తేదీ:** ఫిబ్రవరి 7,8
- **చివరితేదీ:** ఫిబ్రవరి 5
- **వెబ్‌సైట్:** www.aiimsraipur.edu.in

నిమ్స్‌లో ప్రొఫెసర్లు

హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.



- ప్రొఫెసర్ (మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ అండ్ క్లినికల్ హెమటాలజీ)
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (బయోకెమిస్ట్రీ, మెడికల్ అంకాలజీ, రుమటాలజీ, వాస్క్యులర్ సర్జరీ
- **అర్హతలు:** ఎంబీబీఎస్‌తోపాటు సంబంధిత విభాగాల్లో డీఎం/ఎంసీహెచ్, డీఎన్‌బీ, ఎండీలో ఉత్తీర్ణత. టీచింగ్/రిసెర్చ్ రంగంలో అనుభవం ఉండాలి.
- **పే స్కేల్:** ప్రొఫెసర్ పోస్టులకు రూ.51,600+ గ్రేడ్ పే రూ.10,500+ ఇతర అలవెన్స్‌లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు రూ. 30,000 + గ్రేడ్ పే రూ. 8,000 + ఇతర అలవెన్స్‌లు
- **అప్లికేషన్ ఫీజు:** రూ.500/-
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చిరునామా:** ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్, నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, పంజాగుట్ట
- **చివరితేదీ:** ఫిబ్రవరి 6
- **వెబ్‌సైట్:** www.nims.edu.in

ఓపెల్‌లో ఖాళీలు

వడోదరలోని ఓఎన్‌జీసీ పెట్రో ఆడిషన్స్ లిమిటెడ్ (ఓపెల్)లో ఖాళీగా ఉన్న ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- **మొత్తం పోస్టులు:** 31
- **టెక్నికల్ పోస్టులు:** పాలిమర్ ఆపరేషన్స్-6, యుటిలిటీస్ అండ్ ఆఫ్‌సైట్స్-2, సెంట్రల్ టెక్నికల్ సర్వీసెస్-1, ఆపరేషన్స్ కంట్రోల్ గ్రూప్-1, ఫైర్-2, మెకానికల్ మెయింటెనెన్స్-1, సివిల్-1
- **బిజినెస్ సపోర్ట్ పోస్టులు:** ఫైనాన్స్-4, మెటీరియల్స్ మేనేజ్‌మెంట్-3, ఎస్ఏపీ-3, హ్యూమన్ రిసోర్స్-4, లీగల్-1
- **అర్హత:** సంస్థ నిబంధనల ప్రకారం
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 10
- **వెబ్‌సైట్:** www.opalindia.in

డీపీఆర్‌లో జేఆర్ఎఫ్

రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్- డైరెక్టరేట్ ఆఫ్ పౌల్ట్రీ రిసెర్చ్ (డీపీఆర్) జేఆర్ఎఫ్ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

- జూనియర్ రిసెర్చ్ ఫెలో
- **అర్హత:** మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీ:** ఫిబ్రవరి 19
- **వెబ్‌సైట్:** www.pdonpoultry.org

నమస్తే తెలంగాణ
చిత్రం
[కరీంనగర్]
మంగళవారం 29 జనవరి 2019


బాక్సాఫీస్ క్రికెట్ మంత్రం

భారతీయులకు క్రికెట్ కేవలం ఒక క్రీడ కాదు. ఓ మతంలాంటిది. ఆ సేతుహిమాచలం క్రికెట్‌ను తమకు ప్రీతిపాత్రమైన ఆటగా భావిస్తారు. పోరాట స్ఫూర్తి, దేశాభిమానానికి ప్రతీకలుగా క్రికెటర్లను ఆరాధ్యులుగా భావించే యువత ఎందరో ఉంటారు. వచ్చే మార్చిలో ఐపీఎల్, జూన్‌లో క్రికెట్ ప్రపంచకప్ సంరంభం మొదలుకానున్నాయి. అంతకు ముందే వెండితెరను క్రికెట్ మేనియా ఆవహించింది. 70ఎం.ఎం. మైదానంపై ఫోర్లు, సిక్సర్ల మోతమోగనుంది. మన కథానాయకులు క్రికెట్ మైదానంలో సెంచరీలతో వీరవిహారం చేయడానికి సిద్ధమవుతున్నారు. క్రికెట్ నేపథ్య కథలు వడివడిగా వెండితెర దృశ్యమానం అవుతున్నాయి. 'ధోని' బయోపిక్ స్ఫూర్తితో మరి కొందరి ప్రముఖ క్రికెటర్ల జీవితగాథలు వెండితెరపై కొలువుతీరనున్నాయి. మొత్తంగా సిల్వర్‌స్క్రీన్ క్రికెట్ శోభతో కళ కళలాడడానికి సిద్ధమవుతున్నది..

నాని కథానాయకుడిగా నటిస్తున్న 'జెర్సీ' చిత్రం ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. ఇందులో నాని అర్జున్ అనే క్రికెటర్ పాత్రలో నటిస్తున్నారు. గౌతమ్ తిన్ననూరి ('మళ్లీరావా' ఫేమ్) దర్శకుడు. ఇటీవలే విడుదలైన ఫస్ట్‌లుక్, టీజర్ అందరి దృష్టిని ఆకట్టుకుంది. 36ఏళ్ల వయసులో క్రికెట్‌లో తన కలల్ని సాకారం చేసుకోవడానికి అర్జున్ అనే యువకుడి ప్రయాణమే ఈ చిత్ర ఇతివృత్తం. నిజ జీవిత సంఘటనల స్ఫూర్తితో కాల్పనిక అంశాల్ని మేళవించి దర్శకుడు గౌతమ్ తిన్ననూరి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. క్రికెట్‌లో లక్ష్యసాధనకు, ప్రేమలో గెలుపునకు మధ్య భావోద్వేగభరిత సంఘర్షణ నేపథ్యంలో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు తెలిసింది. సాధారణంగా 36ఏళ్ల వయసులో క్రికెట్ నుంచి రిటైర్ అవుతుంటారు. కానీ ఈ సినిమాలో అదే వయసులో అర్జున్ ఎలాంటి ఘనత సాధించాడన్నదే ఆసక్తికరంగా ఉంటుందని చిత్ర బృందం చెబుతున్నది. టీజర్‌లో నాని క్రికెటర్ పాత్రలో చక్కగా ఒదిగిపోయారని ప్రశంసలు లభిస్తున్నాయి. క్రికెటర్ పాత్ర కోసం నాని ప్రత్యేకశిక్షణ తీసుకున్నారు. బ్యాటింగ్, బౌలింగ్‌లలో మెళుకువలను నేర్చుకున్న తర్వాతే సినిమా చిత్రీకరణలో అడుగుపెట్టారు. 1996–97 రంజీ ట్రోఫీ క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా కథ నడుస్తుంది. ఏప్రిల్‌లో ఈ చిత్రం ప్రేక్షకులముందుకురానుంది.


'జెర్సీ' చిత్రంలో నాని

వివాహానంతరం నాగచైతన్య–సమంత దంపతులు తొలిసారి కలిసి నటిస్తున్న చిత్రం 'మజిలీ'. ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ జంట జీవన గమనంలో ఎదురయ్యే అనుకోని పరిణామాలు..తమ మధ్య తలెత్తిన అపార్థాలు, అపోహల్ని అధిగమించి తమ బంధాన్ని ఎలా ఫలవంతం చేసుకున్నారన్నదే ఈ చిత్ర కథాంశమని సమాచారం. ఈ సినిమాలోని ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో నాగచైతన్య క్రికెటర్‌గా కనిపించనున్నారు. క్రికెట్ బ్యాట్ పట్టుకొని విజయదరహాసం చేస్తున్న నాగచైతన్య స్టిల్‌ను ఇటీవల విడుదల చేశారు. ఈ సినిమాలో దివ్యాంశ కౌశిక్ మరో నాయికగా నటిస్తున్నది. ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో క్రికెట్ నేపథ్యం కథలో కీలకంగా ఉంటుందని చిత్ర బృందం చెబుతున్నది. శివ నిర్వాణ ('నిన్ను కోరి' ఫేమ్) దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకురానుంది.


'మజిలీ' చిత్రంలో దివ్యాంశ కౌశిక్, నాగచైతన్య

'గీత గోవిందం' అపూర్వ విజయం తర్వాత విజయ్ దేవరకొండ–రష్మిక మందన్న జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'డియర్ కామ్రేడ్'. భరత్ కమ్మ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నది. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ వైద్య విద్యార్థిగా నటిస్తుండగా, రష్మిక మందన్న తెలంగాణ మహిళా క్రికెటర్ పాత్రలో కనిపించనుంది. తన పాత్రలోని పరిపూర్ణత కోసం రష్మిక మందన్న క్రికెట్‌లో ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నదట. పాత్రలో సహజంగా కనిపించడానికి బ్యాటింగ్‌లోని ప్రాథమికాంశాల్ని సాధన చేస్తున్నదట.ఈ సినిమాలో ఆమె మహిళా క్రికెటర్ శైలిలో షార్ట్‌హెయిర్‌తో కనిపించనుంది. ఓ మెడికల్ స్టూడెంట్‌కు, మహిళా క్రికెటర్‌కు మధ్య ప్రణయగాథగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నది. వేసవిలో ప్రేక్షకులముందుకు రానుంది.


రష్మిక మందన్న

భారత మహిళా దిగ్గజ క్రికెటర్ మిథాలిరాజ్ జీవిత చరిత్రను సినిమాగా తీయబోతున్నారు. హైదరాబాద్‌కు చెందిన మిథాలి రాజ్‌ను 'మహిళా టెండూల్కర్'గా అభివర్ణిస్తారు. అత్యధిక పరుగులు సాధించిన అంతర్జాతీయ మహిళా క్రికెటర్‌గా ఆమె చరిత్ర సృష్టించింది. ఆమె స్ఫూర్తిదాయక జీవితాన్ని వెండితెరపై ఆవిష్కరించడానికి ప్రఖ్యాత బాలీవుడ్ నిర్మాణ సంస్థ వయాకామ్ 18 మోషన్ పిక్చర్స్ సన్నాహాలు చేస్తున్నది. మిథాలి రాజ్ పాత్ర కోసం తాప్సీ, ప్రియాంకచోప్రా పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.


తాప్సీ

ఇటీవల తమిళంలో విడుదలైన 'కణ' చిత్రం విమర్శకుల్ని మెప్పించింది. సత్యరాజ్, ఐశ్వర్యరాజేష్, దర్శన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని క్రికెట్ నేపథ్యంలో తెరకెక్కించారు. అరుణ్ రాజా కామరాజ్ దర్శకుడు. తమిళ హీరో శివకార్తికేయన్ నిర్మించారు. క్రికెట్‌ను ఎంతగానో ఇష్టపడే ఓ తండ్రి తన కూతురు అంతర్జాతీయ క్రికెటర్‌గా ఎదగాలని కోరుకుంటాడు. తాను కన్న కలల్ని కుమార్తెలో సాకారం చేసుకోవాలని తపిస్తాడు. అందుకు అతను ఏం చేశాడన్నదే చిత్ర కథ. క్రికెటర్ పాత్రలో ఐశ్వర్యరాజేష్ అద్భుతమైన నటనను కనబరచింది. ఆమె అభినయానికి సర్వత్రా ప్రశంసలు లభించాయి. స్ఫూర్తివంతమైన కథాంశంతో రూపొందిన ఈ సినిమా రీమేక్ హక్కుల కోసం దక్షిణాదిలో తీవ్రమైన పోటీ ఉందని తెలుస్తున్నది.


ఐశ్వర్యారాజేష్


రణవీర్‌సింగ్, కపిల్‌దేవ్

1983 జూన్ 25న తొలిసారి క్రికెట్ ప్రపంచకప్‌ను గెలుచుకొని విశ్వ విజేతగా ఆవిర్భవించింది భారత్. హర్యానా హరికేన్ కపిల్‌దేవ్ సారథ్యంలోని భారత జట్టు సాధించిన ఈ అపూర్వ విజయం దేశ క్రికెట్ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోయింది. ఆనాడు అనామక జట్టుగా బరిలోకి దిగిన భారత బృందం హేమాహేమీలతో కూడిన వెస్టిండీస్‌ను మట్టికరిపించి సరికొత్త చరిత్రను సృష్టించింది. భారత్ సాధించిన ఆ మహత్తర విజయం '83' పేరుతో వెండితెర దృశ్యమానం కానుంది. కపిల్‌దేవ్ పాత్రలో బాలీవుడ్ అగ్ర కథానాయకుడు రణవీర్‌సింగ్ నటించబోతున్నారు. కబీర్‌ఖాన్ దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలో ఈ చిత్రం సెట్స్‌మీదకు వెళ్లనుంది. ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కించబోతున్న ఈ సినిమా కోసం రణవీర్‌సింగ్ ప్రొఫెషనల్ క్రికెట్ కోచింగ్ తీసుకుంటున్నారు. 83 భారత క్రికెట్ బృందంలోని సభ్యుడైన బల్విందర్ సింగ్ సంధు సారథ్యంలో రణవీర్‌సింగ్ కఠోర సాధన చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఓ ఫొటోను రణవీర్‌సింగ్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో విడుదల చేశారు. ఈ చిత్రాన్ని 1983 ప్రపంచకప్ జరిగిన ఇంగ్లాండ్‌లోని రియల్ లొకేషన్లలో తెరకెక్కించబోతున్నారు. ప్రపంచ ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలో క్లైమాక్స్ ఘట్టాలకు రూపకల్పన చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. అప్పటి టీమ్‌లో పాపులర్ అయిన కృష్ణమాచారి శ్రీకాంత్, వెంగ్‌సర్కార్, రవిశాస్త్రి, మోహిందర్ అమర్‌నాథ్ పాత్రల్లో వివిధ భాషల్లోని యువ కథానాయకుల్ని తీసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

వినోదాల ప్రేమాయణం


తనిష్క్‌రెడ్డి, మేఘ్లాముక్త

తనిష్క్‌రెడ్డి, మేఘ్లాముక్తా జంటగా నటిస్తున్న చిత్రం 'సకలకళావల్లభుడు'. శివగణేష్ దర్శకుడు. ఫిబ్రవరి 1న ప్రేక్షకులముందుకురానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది. నాయకానాయికల పాత్ర చిత్రణ నవ్యపంథాలో ఉంటుంది. పృథ్వీ, జీవా కామెడీ ప్రధానాకర్షణగా నిలుస్తుంది. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకుల్ని మెప్పించే అంశాలుంటాయి' అన్నారు. 'ఆద్యంతం వినోదాత్మకంగా సాగే చిత్రమిది. కథ, కథనాలు ఉత్కంఠగా సాగుతాయి. తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుంది' అని నిర్మాతలు తెలిపారు. సమర్పణ: బీరం సుధాకర్‌రెడ్డి, నిర్మాతలు: అనిల్, త్రినాథ్, కిషోర్, శ్రీకాంత్.

రామ్‌తో రొమాన్స్

సవ్యసాచి', 'మిస్టర్ మజ్ను' సినిమాల్లో గ్లామర్ తళుకులతో ఆకట్టుకున్నది బాలీవుడ్ సొగసరి నిధి అగర్వాల్. తాజాగా ఆమె తెలుగులో మరో చక్కటి అవకాశాన్ని సొంతం చేసుకున్నది. హీరో రామ్‌తో రొమాన్స్ చేయనున్నది. రామ్ కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. ఈ సినిమాలో నిధి అగర్వాల్‌ను కథానాయికగా ఎంపిక చేసినట్లు చిత్రబృందం సోమవారం అధికారికంగా ప్రకటించింది. 'ఇస్మార్ట్ కుటుంబంలోకి నిధికి స్వాగతం' అని ట్విట్టర్ ద్వారా ఛార్మి పేర్కొన్నారు. నిధి అగర్వాల్ త్వరలో ఈ సినిమా చిత్రీకరణలో పాల్గొననున్నది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా చిత్రీకరణ ఇటీవల ప్రారంభమైంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో హీరో రామ్‌పై పోరాట ఘట్టాలను చిత్రీకరిస్తున్నారు. పూరి జగన్నాథ్, ఛార్మి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మే నెలలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.


నిధి అగర్వాల్


రకుల్‌ప్రీత్‌సింగ్

కాలమే నాకు గురువు

తెలుగు, తమిళం అంటూ సినిమాల్ని విడదీసి చూడటం నాకు నచ్చదు. భాషా భేదాలు మినహా సినిమా ఎక్కడైనా ఒక్కటే' అని అంటోంది రకుల్‌ప్రీత్‌సింగ్. బాలీవుడ్‌తో పాటు తమిళంలో అరడజనుకుపైగా సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నది ఈ సొగసరి. కథ, పాత్రలను అనుసరించే భిన్నభాషల్లో తన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నానని చెబుతున్నది రకుల్‌ప్రీత్‌సింగ్. ఆమె మాట్లాడుతూ 'కథానాయికగా అరంగేట్రం చేసిన సమయంలో స్కూల్, కాలేజ్ డేస్‌లో చూసిన చిత్రాలు మినహా సినీరంగం, నటన గురించి నాకు ఏ విధమైన అవగాహన లేదు. కథలు ఎలా వినాలో, ఎలాంటి పాత్రలు సరిపోతాయో అర్థం అయ్యేది కాదు. కాలమే నాకో గురువుగా నిలిచింది. నాలో పరిణతిని తీసుకొచ్చింది. సుదీర్ఘ ప్రయాణంలోప్రతి సినిమా కొత్త పాఠాలను, అనుభవాలను నేర్పించాయి. అవన్నీ నిరంతరం నాలో స్ఫూర్తిని నింపుతూ ముందుకు నడిపిస్తున్నాయి. తెలుగు, తమిళం, హిందీ అనే భేదాల కంటే కథ, పాత్రల పరంగా వైవిధ్యతకే నేను ఎక్కువగా ప్రాముఖ్యతనిస్తాను. మంచి పాత్రలు గుర్తింపును తీసుకొచ్చి నటిగా నన్ను నిలబెడతాయని నమ్ముతాను' అని తెలిపింది. ప్రస్తుతం రకుల్‌ప్రీత్‌సింగ్ తమిళంలో 'ఎన్‌జీకే', 'దేవ్', హిందీలో 'దే దే ప్యార్ దే', 'మర్జావాన్'తో పాటు మరో రెండు సినిమాల్లో నటిస్తున్నది.